# ఆషామాషీ - 2

(తెలుగువారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్లు)

రావూరు వెంకట సత్యనారాయణ రావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 206

*కౌముది మాసపత్రికలో*

*జనవరి 2016 సంచిక నుంచి జూన్ 2020 సంచిక వరకూ వచ్చిన*

# ఆషామాషీ

ముఖచిత్రం: బాలి

## (దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

### (8 ఫిబ్రవరి 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**దేశంలో హాస్యం** అంటే అపహాస్యం ఎక్కువైపోయింది. అపహాస్యానికి అసందర్భాలు, ఆర్భాటాలు, ఆలంబనవుతాయి. హాస్యానికి సంస్కారపూరితమైన సునిశిత విమర్శ ఆలంబన. నిజమే.. అపహాస్యం పెచ్చుపెరిగిపోయినమాట.

***తమాషా నాట్యాలు - తైతక్కలు***

చాలామంది ప్రబుద్ధులు తాము అపహాస్యం పాలవుతున్నామని తెలిసికూడా ఆ విషయం పట్టించుకోరు. దానిచుట్టూ స్వార్థమనే పరదాలు చుట్టి తమచుట్టూ ప్రాపకం, అధికారం, దర్పమనే జలతారు తెరలు దించుకుని తమాషా నాట్యం చేస్తూ ఉంటారు. వాటినే తైతక్కలంటారు.

తిని కూర్చోలేక, తీరి మనుగడ సాగించలేక చాలామంది అపహాస్యానికిపాలవుతూ ఉంటారు. ఇలాటివారు అన్ని రంగాలలో అవతరిస్తూ  ఉంటారు. ఎక్కడనుంచో అక్కడ నుంచి వారి నెత్తిన ఇన్ని అక్షింతలు పడుతూ ఉంటాయి. ఆ తల తనది కాదన్నట్లు - తిరిగి అదే విధంగా వారు బయలుదేరుతూ ఉండాలి. అదోరకం కర్మ.

కొందరు బయటికి బయలుదేరారంటే చాలు. ఇంటికి మామూలుగా తిరిగి రారు. జుట్టు దులుపుకుంటూ, గుండెలు రాచుకుంటూ రావలసిందే "ఎందుకొొచ్చిన గొడవయ్యా.. సంబంధంలేని విషయాలలో తల దూరుస్తావు? చేసేది తప్పని తెలిసికూడా అలా తప్పెట భుజాన వేసుకుని బయలుదేరతావు" అంటే వింటారా? సలహా చెప్పేవాళ్ళను చవటల క్రింద జమకట్టి, విసుగుతో వారిని వెనక్కు నెట్టి తన ప్రతాపం వెలగబెట్టడానికి బయలుదేరుతూ ఉంటారిలాంటివారు. శృంగభంగమైనా - సూదిమొన గ్రుచ్చుకున్నంత బాధ అయినా పడకుండా సూటిగా తమ దారిన తాము పోతూ ఉంటారు. 'ఆ బ్రతుకు అంతే' అనిపించుకుంటారు.

మా ఊళ్ళో ఒక బ్రాహ్మణుడుండేవాడు. ప్రొద్దునలేచి స్నానం చేసి, సంధ్యావందనం చేసుకుని వచ్చి ఎవరి అరుగుమీదో కూర్చునేవాడు. ఆయన భార్య చెరువుకి స్నానానికి వెడుతూ, "ఇంటికి వస్తారా! పిల్లవాడు ఏడుస్తున్నాడు" అని ఏదో నెపం మీద పిలుచుకు వెళ్ళాలని ప్రయత్నించేది. "ఏడిస్తే ఏడవనీ నేనిప్పుడే రాను" అని ఆయన అక్కడే కూర్చునేవాడు.

మధ్యాహ్నం పన్నెండుగంటలయ్యే లోపల దారినిపొయ్యేవాణ్ణి ఎవణ్నో పిలిచి ఒకణ్ణి హేళన చెయ్యాలి. వాడు ఎదురుతిరిగి గట్టిగా తిట్టాలి. అవసరమైతే ఒక చెంపకాయ కొట్టాలి. అప్పుడుగాని భోజనానికి వెళ్ళడం పడేదికాదు. అవతలవాణ్ణి తిడుతూ అపోసనం పట్టడం జరిగేది. ఆవిడ ఎంతబాగా వంటచేసినా ఆవిణ్ణి దుమ్మెత్తిపోస్తూ గాని తినడం పడేదికాదా భూసురోత్తముడికి.

***శృంగభంగానికి రంగస్థలం...***

ఆ గ్రామంలో ఎంతో అపహాస్యం పాలయిపోయాడు. ప్రతివాడూ ఆయన్ని చూచి తప్పుకొనేవారు. ఎదురొస్తే బెదిరిపోయేవారు. ఆయన అదంతా తనకు గల ప్రతిష్ట అనుకునేవాడు. ప్రతిరోజూ ఒక ఇంటి అరుగు ఆయన శృంగభంగానికి రంగస్థలమయ్యేది.

అలా రోజుకి ఒకరి చేతికి అక్షింతల పళ్ళెం అందించి - తలవంచి నిలబడి, వాటితో నింపుకోవడం, దులుపుకుంటూ ఇంటికి పోవడం ఆయన జీవిత క్రమంగా మారిపోయింది. మానవతనే మరచిన మహనీయుడు.

చాలామంది హోదాలలో ఉండి, న్యాయంగా కాలం గడిపితే బాగుండదని ఏవో అన్యాయాలు చేస్తూ, మానవతను మరచి వ్యవహరిస్తూ - అశేష జనం చేత అక్షింతలు వేయించుకుంటారు. ఆ దుబ్బుజుట్టు ఎన్నింటినైనా భరిస్తుంది. ఆ దిబ్బ ముఖం ఎంత అపహాస్యాన్నయినా సహిస్తుంది.

చెయ్యరాని పనులు చెయ్యడం వల్ల, అక్కర లేని ప్రసక్తిలోకి దిగడంవల్లా, ఆర్భాటాలకు పోవడంవల్లా, శక్తిని మించిన పనులు తలపెట్టడంవల్లా, పరులను వంచించడానికి ప్రయత్నించడం వల్లా - నరులు అపహాస్యంపాలు అవుతూ ఉంటారు.

మునిసిపాలిటీ ఎన్నికలలో పాల్గొని ముప్పతిప్పలకు లోనై చివరకు గెలుపు సాధించలేకపోయిన ఒక వ్యక్తి ఏకాఏకిని అసెంబ్లీకి దరఖాస్తు పడేసి, ఏడాది సంసారపు ఖర్చులకు సరిపోయే డబ్బు ఢిల్లీలో గుమ్మరించి రావడానికి సాహసించాడంటే - అక్షింతలు నెత్తిన వేసుకుని చక్కా వచ్చాడంటే అపహాస్యంకాక ఏమవుతుంది?

***మాడున పసుపు అలాగే ఉంది***

ఇలా అక్షింతలు వేయించుకున్న పెద్దమనిషి ఒకాయన మొన్న మా ఇంటికి వచ్చాడు. బియ్యపు గింజలు జారిపోయినా మాడున పసుపు ఇంకా అలాగే ఉంది. వచ్చినప్పటినుంచీ తన విషాదగాథ వర్ణించడం ప్రారంభించాడు. తాను అభ్యర్థిగా నిలవాలనుకున్నాడట. కాంగ్రెసు టిక్కెట్టుమీద ఖద్దరు చిన్నప్పటి నుంచీ ధరించటం ఒక్కటి తప్ప వేరే అర్హత ఏమీ ఉన్నట్లు లేదు. కాకపోతే ఏ పురుషుణ్ణి పలకరించినా దేశభక్తి పుక్కిలింతలుగదా! దేశాన్ని బాగుచెయ్యాలనే ఆకాంక్ష అపరిమితంకదా! తక్కినవాళ్ళ కంటే తను పదింతలు గొప్పవాణ్ణనే భావం ఉండటం సర్వసామాన్యంగదా!

అన్నింటినీ మించి దేశమాత చేతులు జాచి "నాయనా! వినాయకరావూ నన్నిలా వదిలి ఊరుకున్నావా! నువ్వు తలుచుకుంటే నన్ను ఉద్ధరించడం ఒక గొప్పా వినాయకరావూ ! అమ్మమీద ఎందుకింత ఉదాసీనత వహించావు. నే చేసిన తప్పేమిటి పుత్రరత్నమా. కోపం వద్దు. రా తండ్రీ నన్ను ఉద్ధరించు. నన్ను సేవించు. నీ అంతటివాడు అలా దూరంగా ఉంటే నాకెంత విచారంగా ఉంటుందో యోచించు" అని పిలుస్తున్నట్లు ప్రతివాడూ ఈ రోజుల్లో కలలు కంటూనే ఉంటాడాయె.

***వయస్సుకాదు.. ప్రజా శ్రేయస్సు ముఖ్యం.***

ఇలాటి అర్హతలతోనే పైన చెప్పిన పెద్ద మనిషి పోటీకి నిలవాలని దరఖాస్తు పెట్టారు. ఖద్దరు టోపీ, పల్లెవాటులతో ఢిల్లీకి చేరాడు. చెయ్యవలసినవాళ్ళందరి దర్శనం చేశాడు. తన స్వీయ ప్రణాళికలో గల ప్రగతి పథాన్ని వారికి తెలియపరిచాడు. "వయస్సు పాటించకండి - ప్రజాశ్రేయస్సు దృష్ట్యా నా అర్జీ చిత్తగించండి" అని చెప్పుకున్నాడు.

కానీ, ఆయనలోగల ప్రతిభను గుర్తించే శక్తి వారికి లేకపోయినట్లుంది. "మీమీద మాకెంతో గౌరవం ఉంది. కానీ, సీటు ఖాళీలేదు. బయట నుంచే భారతమాతను సేవించండి" అన్నారట.

ఆయనగారికి ఎంతో చిన్నతనం వేసింది. విన్నపం ఆలకించలేకపోయారే అన్న కోపం వచ్చింది. తను పట్టుకు వెళ్ళిన ప్రణాళికను జాగ్రత్తగా వెనుకకు తెచ్చుకున్నాడు. తన స్వగ్రామం చేరబోతూ ఇక్కడ మకాం వేశాడు.

"ప్రణాళికను పాదుకులుగా మోసుకువచ్చాను వెనక్కు. దీన్ని దగ్గర ఉంచుకుని మా ఊరునే నంది గ్రామం చేసుకుని, దేశ సేవచేస్తాను. కనీసం మా గ్రామాన్నయినా రామరాజ్యం చేస్తాను. ఇదీ నా శపథం. నన్ను ఎన్నుకుంటే అందరి వద్దకు ఓట్ల కోసం నేను వెళ్ళవలసి వచ్చేది. ఇప్పుడు సలహాలకు అందరూ నా దగ్గరకే వస్తారు. ఓట్లకు నిలబడటమంటే స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోవడమే" అని మనస్సుకు సమాధానం చెప్పుకున్నాడు.

*సీటు ఇస్తే అసెంబ్లీలో చోటు ఖాయం.*

కాని, ప్రాణం ఒప్పక ఆ రాత్రంతా కూర్చుని ఒక అప్పీలు వ్రాశారు. తెల్లారి టైపు చేయించారు. రెండు మూడు రూపాయలు పెట్టి రిజిష్టరు పోష్టులో పంపించారు. అక్కడికి గానీ కసితీరలేదాయనకు. "చెయ్యాల్సింది చేశాం. వస్తా.. వారం రోజుల్లో గ్రిరున తిరిగి రావాలి సీటు. సీటు వస్తే అసెంబ్లీలో చోటు వచ్చినట్లే. మన పేరు చెపితో పిచ్చినోట్లు ఎక్కడ పడితే అక్కడే ఆ సంగతి హైకమాండుకు తెలియదు" అన్నాడు అతిగర్వంగా.

ఆ మధ్యాహ్నం బయలుదేరి వెళ్ళాడు! స్వగ్రామానికి ఇలా ఎంతమంది అసలు విషయాలు ఆలోచించకుండా సీట్లకోసం ఎగబడుతున్నారో? అనవసరంగా అపహాస్యం పాలవుతున్నారో? ఈ ఎన్నికల తిరణాలలో చాలామంది గుండెలు సన్నికల్లురాళ్ళుగా మారిపోతాయి పాపం.

(9 సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**జీవితాలు ఎలాగో** అలా దొర్లిపోతూ ఉంటాయి. వాటిని ఆపడం ఎవరితరం? సుఖపడనివ్వండి, అపకీర్తి సంపాదించనివ్వండి. బాధ్యతలు నెత్తిమీద కూర్చోనివ్వండి. తరిగిపోనివ్వండి. రోజులు జరిగిపోతూనే వుంటాయి. తెలియకుండా ఆయువులో కొంతభాగం త్రుంచుకు పోతూనే వుంటాయి.

ఎవరి అనుభవం వారిది. ఎవరి ఆవేదన వారిది. సూర్యభగవానుడు ఉదయించాడు గదా... ఇంత కమ్మటి కాఫీ త్రాగి, ఆ చిరువెచ్చగాలిలో, కొంచెంసేపు పచార్లు చేద్దామంటే అవసరాలు వచ్చి చెవి దగ్గర కందిరీగల్లాగా మ్రోగుతాయి. ఖంగారు పెట్టేస్తాయి. మరింత పెద్ద సమస్యల కొండముచ్చులు వచ్చి బుర్ర గోకుతున్నట్లు గుడ్లు పీకడానికి ప్రయత్నిస్తున్నట్లు వుంటుంది. ఇంకేం అనుభవిస్తాడా ప్రకృతిని!?

*కందిరీగలు చెవి దగ్గర వ్రాలలేవు.*

అయినా కొందరు, ఈనాటి పరిస్థితులను, తమ సమస్యలను ఎంతమాత్రం లెక్కచెయ్యని స్థితప్రజ్ఞులున్నారు. వారి మనస్సులు కదలవు - కరగవు. ఏ కందిరీగా చెవి దగ్గర వ్రాలడానికి సాహసించదు. ఎన్ని కొండముచ్చులు వచ్చినా ఆయన మెదడు బరికేందుకు సాహసించవు.

మొన్న ఒక మిత్రుడు వచ్చాడు మా యింటికి. సాయంత్రంపూట వరండాలో కూర్చున్నాడు మాట్లాడుతూ. మంచి గాలి వీస్తోంది. ఇస్త్రీ బట్టలు కట్టుకుని ఠీవిగా కూర్చుని కులుకుతున్నాడు. నేను లోపలనుంచి వచ్చి కాఫీ ఇచ్చి "ఏమిటంత సంతోషంగా వున్నావు?" అన్నాను.

అతడు తనను గూర్చి కొంచెం సేపు వర్ణించుకున్నాడు. వాతావరణాన్ని వర్ణించాడు. ఇలాటి సమయంలో "నాకింకా పెళ్ళిచేయవలసిన ఆడపిల్లలు లేరుగదా - ఉంటే ఇంత సంతోషంగా వుండకలిగేవాణ్ణా! అనిపించింది. వెనుక ఆడపిల్ల పెళ్ళి చేశామంటే అదివేరు. మూడెకరాలూ అమ్మి ముచ్చటగా చేసివేశాం. ఇప్పుడెలా? కొమ్ములు విరిగిన మ్రోడుదగ్గిర తుమ్మెద సంగీతాలేం వినిపిస్తాయి. ఆడపిల్ల పెళ్ళి సమస్య లేకపోవడం మాట తలిస్తే ఏదో సత్కారం జరిగినట్లుగా వుంటుంది." అన్నాడు.

"నువ్వు చెప్పింది నిజమే. ఆడపిల్లల పెళ్ళిళ్ళ సమస్యలు అంత కష్టంగానూ వున్నాయి. సత్కారం చేస్తున్నట్లే వుంటుంది - ఆ సమస్యనుంచి వొడ్డునపడ్డవాళ్ళకు. అయిదారుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసిన తండ్రికి ఈరోజుల్లో నోబెల్ బహుమతి ఇచ్చినా సరిపోదు. అంత గౌరవం కల్పించవలసిందే" అన్నాను.

"ఆ ఛాన్సు నాకు లేదు. నేను కన్నది ఒక్క ఆడపిల్లే" అన్నాడాయన.

***ముగ్గురు పెళ్ళీడు పిల్లలు - మౌనవ్రతం***

ఈ మిత్రుడు పొందే సంతోషం నిజమైన సంతోషమే. అలా వొడ్డున పడ్డ వాళ్ళందరూ ధన్యులే. ముగ్గురు నలుగురు పెళ్ళి ఈడు వచ్చి ఇంట్లో సిద్ధంగా వున్నా - ఏమీ చింతలేనట్లు నిద్రపోయేవారు కొందరున్నారు.

మా బంధువుల్లో ఒకాయనకు ఇరవై అయిదు వసంతాలు దాటిన కుమార్తె వుంది. ఇంచుమించుగా జీవిత వసంతం దాటిపోయినట్లే. అయినా ఆ విషయం గురించి ఆలోచించడు. తనకేవో ఇతర సమస్యలు చాలా వున్నాయని జాబితా చదువుతూ వుంటాడు. సలహాలు అడుగుతూ వుంటాడు. వాటి విషయంలో కొంత చింతాక్రాంతడవుతూ వుంటాడు. ఆడపిల్ల పెళ్ళిమాట మాత్రం ఆయన ఏ సమయంలోనూ పొరపాటున కూడా ఎత్తడు.

ఎవరైనా పూర్వకాలపు వాళ్ళు వూరుకోలేక" అమ్మాయికి ఎక్కడైనా సంబంధాలు చూస్తున్నారా?" అని ప్రశ్నించినపుడు మాత్రం. "చూడటమంటూ పెద్ద పనేంలేదు. ఏదో ఒకటి చూసి ఈ సంవత్సరం చేసేద్దామనే వుంది మూఢం వెళ్ళగానే - కలిసివస్తే అదో పెద్ద సమస్యకాదు లెండి" అంటాడు. ఎంతో ధీమాగా ఆ పెళ్ళివిషయం ఆయన ఎప్పుడూ ఆలోచించి అన్నీ సిద్ధంచేసినట్లు.

ఆయన కుమార్తె నాలుగువత్సరాల వయస్సులో ఉండగా ఎవరింట్లోనన్నా పదేళ్ళ పిల్ల కనపడితే చాలు.. "ఏం? ఇంకా అలా కూర్చున్నారు. ఎక్కడైనా సంబంధం చూశారా? వెతికేటప్పటికి ఇంకోరెండేళ్ళు పట్టదూ.. ప్రారంభించండి అన్వేషణ. చేసేది చెయ్యక తప్పదు. మరి అనవసరంగా దూషణలపాలు కావడం దేనికి? " అని అడగని సలహాలు చెప్పిపోతూ వుండేవాడు.

***అల్లుళ్ళ తరపున అడ్వకేటు***

పదిహేనేళ్ళు దాటిన పిల్లలున్న యింటికి వెళ్ళినప్పుడు "ఏమండీ మీ కమలకు పెళ్ళిచెయ్యరా? ఎన్నాళ్ళుంచుతారిలా? ఒకళ్ళ యింటికి పంపించడం ఇష్టంలేదా? పోతే ఇల్లరికం తెప్పించుకోండి అల్లుణ్ణి. ఇదేం బాగుండలా!" అని సలహాలు చెప్పిపోతూ వుండేవాడు, ఇంటింటికి తిరిగి అల్లుళ్ళ తరపున వకాల్తా పుచ్చుకున్న అడ్వకేటులాగా.

తన స్వంత విషయం వచ్చేసరికి సందేశాలన్నిటికీ స్వస్తిచెప్పి తన ఆడపిల్లను మొగపిల్లవాడుగా భావించి, అలాకాళ్ళు విరిగిన అజంతా చిత్రంలాగా వుండిపోతున్నాడా పెద్దమనిషి. కొంచెం ఆధ్యాత్మిక భాషలోకి పోతే స్థితప్రజ్ఞుడు.. మాములు భాషలోకి పోతే - బండమనిషి.

***'ఈవిణ్ణి సిస్టర్ నివేదిత చేస్తారుగా!'***

ఆ ఇంటికి వెళ్ళివచ్చేవారందరూ ఆ అమ్మాయిని చూసి "తండ్రిగారీవిణ్ణి సిస్టర్ నివేదితగా తయారుచేయడానికి పూనుకున్నాడల్లేవుంది. అనుబంధాలు తెంచాలని చూస్తున్నప్పుడింకా సంబంధాలు వెతకడం దేనికి?" - అనడంకూడా వింటూ వుంటాం. అయినా ఆయనగారు తొణకరు. పోజు మాత్రం మార్చడా మహానుభావుడు.

కూతురు పెళ్ళి విషయం ఆయన దివ్యచిత్తానికి తేవడానికి ఆయనగారి అర్ధాంగికి కూడా భయమే. ఎప్పుడైనా నోరు తెరిచి అడిగితే "పదిమాట్లు ఆమాట ఎత్తబోకు. అమ్మాయి మనస్సు చెడిపోతుంది వింటే" అని మందలిస్తూ వుంటాడట. ఆయనగారు - అంతవరకూ ఆ అమ్మాయి మనస్సు చెడిపోకుండా ఫ్రిజిడేర్‌లో పెట్టిన వస్తువులాగా చక్కగా వున్నచోట్లు.

***వయస్సొచ్చిన పిల్లలున్నా వానా వల్లప్పలు తప్పవు***

ఈయనగారేమిటి? ఇద్దరు, ముగ్గురు ఆడపిల్లలు పెళ్ళిళ్ళకోసం సిద్ధంగా వున్న తల్లితండ్రులుకూడా ఆ మాట ఎత్తకుండా, ప్రణయగీతాలు పాడుకుంటూ కులాసా కబుర్లు చెపుతూ వుంటారు. - వాళ్ళ వయస్సింకా వానావల్లప్పల దశలోనే వున్నట్లూ - పిల్లలు అకాలంలో జన్మించి ప్రక్కగదిలో ఎక్కడో తోచక ఆడుకొంటున్నట్లూ.

రోజులు మారుతున్నా - సమస్యలు నెత్తిమీద ఎక్కి పిండికొడుతున్నా. తోటివాళ్ళను చూచి తమ ఆడ సంతానం సిగ్గుపడుతున్నా. ఆ తల్లిదండ్రులు మోజుల్లో పడేకాలం గడుపుతారేగానీ అల్లుళ్ళను వెతకడానికి అడుగుబయట పెట్టరు.

ముగ్గురు ఆడపిల్లలు పెళ్ళి ఈడుదాటి 'అలో లక్ష్మణా' అంటుడగా ఇంటికి పెద్ద అయిన అన్నగారు - ముగ్గురు భార్యల్ని చేసుకుని దశరథుడల్లే కులుకుతున్నాడుట. ఆయన నిర్లిప్తతకు నీరాజనాలందించాలి.

(10 సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"కళలకు చేసే మహోపకారం** ఏమిటయ్యా" అని ప్రశ్నిస్తే వాటి జోలికిపోకుండా వుండటమేనని జవాబు చెప్పారట. అంత పవిత్రమైనవి కళలు.

పరిపూర్ణత, ప్రతిభ - కళల విషయంలో సాధించవలసిన విజయాలు. అవి వ్యక్తికేకాదు, కథాలోకానికే విజయాలు. అందువల్ల వాటిని జాగ్రత్తగా కాపాడటం నేర్చినవారు నిజమైన కళా పోషకుల క్రింద జమ కట్టబడతారు.

దేశంలో కోట్లాదిమంది ప్రజలుండగా కొద్దిమందే కళాకారులుగా భాసించడమేమిటి? కొద్దిమందే గాయకులుగా నిలబడకలగడం దేనివల్ల? పరిపూర్ణతా, ప్రతిభా ఆ కొద్దిమందికే లభ్యమైంది గనుక - భగవంతుడు వారినిలా దీవించి పంపాడు గనుక.

***ఒక్క ఘంటసాల, ఒక్క బాలమురళీ***

అందుకని గాయకుల్ని ఏదేశం ఒక్కసారిగా చూడలేదు. మన సినిమా ప్రపంచంలో చెప్పుకోదగ్గ గాయకులు వేలాది పాటలు పాడినా విసుగు పుట్టని గాయకుడు - ఒక్క ఘంటసాలే వుండటమేమిటి మరి!. ఆంధ్రదేశంలో ఒక్క బాలమురళియే వుండటమేమిటి? ఆ పేరుగలవాళ్ళంతా పాటకచ్చేరీలు చేయవచ్చుగా!

స్త్రీలలో ఒక్క భానుమతి, ఒక్క సుశీల, ఒక్క గోపాలరత్నం లభించడమేమిటి? ప్రతివారికీ "రాల్ కరిగించు విమల గాంధర్వం" లభించదేం. సాంప్రదాయ గాయకులలో లలిత సంగీతంలో ఆరితేరిన వాళ్ళు ఏకొద్దిమందో వున్నారు. అందరినీ కలిపి ఆలోచించినా కోటికో నలుగురు అయిదుగురు గానసుధను అందించగలవారుంటారు. వారినే మనం పూజిస్తున్నాం. గౌరవిస్తున్నాం. సంగీతం కోసం వారి మీద ఆధారపడే వుంటున్నాం.

***ఒక్క లత, ఒక్క ముఖేష్, ఒక్క రఫీ, ఒక్క తలత్***

హిందీ ఫిలిం రంగంలో ఎందరో గాయకులు, గాయనీమణులు వున్నారు. కానీ ఒక్క లత, ఒక రఫీ, ఒక్క ముకేష్, ఒక్క తలత్ - మనల్ని ముగ్ధుల్ని చేయగలుగుతున్నారు. వారి సంగీతం కోసం మనం ఎంతో ఆశతో ఎదురు చూస్తూ వుంటాం.

దేశంలో సాంస్కృతిక సంపదలు సజీవంగా వుండాలంటే కళలన్నీ పరిపూర్ణమైన స్థితిలో పోషించబడాలి. తక్కినవారి గానాలు లెక్కలోకిరావు. "నీ సంగీతానికి నా సహనమే సరిపోయింది. తల అంతగా తిప్పినందుకు నీ తంబురా ఇలా పెట్టిపోవయ్యా గాయకోత్తమా" అన్నట్లు వుండవచ్చు.

"మీవారు పడుకోబోయే వేళ ప్రతిరాత్రీ అలా సంగీతం పాడతారు. మీకేమైనా హాయిగా వుంటుందా?" అని ఒక ఇల్లాలు ప్రక్క యింటి ఇల్లాల్ని అడిగిందట.

"నాకు మాత్రం హాయిగా వుంటుంది. తక్కినవాళ్ళ సంగతి నాకెందుకు? ఆయనగారు ఒకవేళ బద్ధకించినా నేను అరుగుమీద కూర్చుని కాస్సేపు రాగాలాపన చెయ్యండని బ్రతిమాలుతాను" అన్నదట. ఆ ఇల్లాలు.

"అలాగా! మీరు కోరికూడా పాడిస్తూ వుంటారా? అందులో రహస్యమేమిటో చెప్పండి. మేము కూడా తెలుసుకుంటాం. ఆయన పాట ఆపేదాకా మా ఇంట్లో పసిపిల్ల బాలాది ఎలాగూ నిద్ర మేల్కొంటున్నాం. కాలం వృధాగా పోతోందనుకుంటున్నాం. ఆ రహస్యం మాక్కూడా చెప్పండి. ఆ హాయి మేము కూడా అనుభవిస్తాం" అని ప్రక్క యింటి ఇల్లాలు అడిగిందట ఎంతో ఆత్రంగా.

***అలవాటయిన కంఠం కప్పలకంటే నయంకాదూ!***

"రహస్యం ఏమీలేదమ్మా.. అందరికీ తెలిసిన విషయమే. మన ఇళ్ళ వెనుకవున్న నీళ్ళగుంటలో కప్పలు బెకబెకలాడుతూవుంటాయి ఎప్పుడూ? రాత్రిళ్ళు ఆ శబ్దం మరీ ఎక్కువ. తక్కినప్పుడు భరించినా నిద్రవచ్చేటప్పుడు ఆ మోతను తల్లబద్ధలయినట్లుంటుంది. కునుకు పట్టదు. వానాకాలంలో ఈ బెడదా తప్పదు. అందుకని మావారిని కొంచెం సేపు పాడమని అడుగుతా. ఎరుగున్న గొంతు కనుక ఎలాగో అలా భరించకలుగుతున్నా. కప్పల బెకబెకలు వినిపించవు కనుక కాస్త కన్నుమూసి నిద్రపోతున్నా" అని చెప్పిందట.

మేమెరుగున్న ఒకరి ఇంట్లో రాత్రిపూట ఆ ఇల్లాలు జోలపాట ప్రారంభించేది. ఆ పిల్ల నిద్రపోవడం కోసం ఆవిడ చేసే ప్రయత్నంలో చుట్టుపట్ల నాలుగు ఇళ్ళలో వాళ్ళు మేలుకునేవారు. భర్త ఎంతో గిజగిజలాడిపోయేవాడు. "కొంచెం ఆపవే పుణ్యం వుంటుంది" అని బ్రతిమాలేవాడు.

"అదేమిటండీ పిల్లకు నిద్ర వస్తోంది. మధ్యలో ఆపమంటారేమిటి. చూడండి అయిదు నిముషాల్లో నిద్రపోతుంది" అనేది.

***నీ పాటకు నిద్రపోవడంలా... భయపడి..!***

"పిల్ల నీ పాటకు నిద్రపోతుందనడం కలలో వార్త. ఆ అరుపులకు అదిరి, బెదిరి, హడలిపోయి భయంతో నిద్రపోతుంది" అనేవాడాయన.

మేము మద్రాసులో వుండగా ఒక ఆంధ్ర మహిళ అక్కడగల సంగీత వాతావరణం చూచి తనుకూడా సంగీతం నేర్చుకోవాలని ఎంతో ముచ్చటపడింది. భర్తను వరమడిగింది. "నేను యింట్లో లేనప్పుడు నేర్చుకో పాఠాలు - అలా అయితే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు. ఆవిడ అక్కడికే సంతోషించింది. ప్రయివేటు మాష్టర్ని కుదుర్చుకుంది.

మంచి ప్రౌఢవయస్సు. నలుగురు పిల్లలు. ఒక్కడు బడికి వెళ్ళేవాడు. తక్కిన ముగ్గురు పిల్లికూనలల్లే ఇంట్లోనే తిరుగుతూ వుండేవాళ్ళు. మధ్యాహం ఒంటిగంటకు ప్రయివేటు.

గొంతు మంచిది. అభిలాష తక్కువలేదు. అందువల్ల త్వరలోనే కీర్తనల్లోకి వచ్చింది.

కానీ ఆవిడ అవస్థ ఇలా వుండేది.

"రామా సుజన జీవనా.. ఆ...ఆ..."

కుర్రాడు: "అమ్మా కాలికి దెబ్బ తగిలిందే! "

"ఎందుకు ఏడుస్తావు. గూట్లో టించర్ ఐడిన్ వుంది రాసుకో.

సుజన జీవనా - సుగుణ భూషణా అజనందిత శ్రిత చందన దశతురంగ.

***దశ తురంగమా..పరుప్పుకింద బిస్కెట్లున్నాయి.***

పిల్ల: "అమ్మా ఆకలవుతోందే కడుపులో మండిపోతోంది. "

"మండిపోతే పరుపుక్రింద బిస్కట్ పొట్లం వుంది. రెండు తిని మంచినీళ్ళు త్రాగు. మంచి పుష్టినిస్తాయి. రుచిగా వుంటాయి. ఇక నాకు అడ్డు రాకు.

చారునేత్రా శ్రీకళత్రా శ్రీ రమ్యగాత్రా..

పిల్లాడు: "అమ్మోయి చిట్టి చెల్లాయి లేచిందే "

"లేస్తే అక్కడ పాలసీసా వుంది త్రాగించు.

అదే వూరుకుంటుంది. నన్ను పాడుకోనీ."

ప్రయివేటు మాష్టారు "అమ్మా పాడబోయేది శాంతము లేక.."

ఇల్లాలు "అలాగే మాష్టారూ!"

సంగీతంలో ఎన్ని అవాంతరాలో చూడండి. అయినా అభిలాష అలాగే వుంటుంది. కమ్మటి పాటలో మధ్య మధ్య గందరగోళాలుంటే ఫలితమేం దక్కుతుంది.

రేడియోలో మొదట్లో పేర్కొన్న మహాగాయకుల గానాన్ని ఆస్వాదిస్తూ మధ్య మధ్య వర్తక ప్రకటనలు వింటుంటే కళాపోషణకు దోహదం చేసే ప్రభుత్వం...!

(11 ' సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**కొందరు మాట్లాడడంలో** చాలా పొదుపుగ మాట్లాడుతూ వుంటారు. అలాంటివారు మాట్లాడుతున్నప్పుడు పలుకే బంగారమా అన్నట్లుంటుంది.

"ఎక్కువుగా మాట్లాడడం వల్ల వచ్చే ప్రయోజనం ఏం వుంటుంది? మన భావం అవతలవాడికి అందించడమే కదా ముఖ్య ఉద్దేశ్యం. పైగా అవతలవారు ఒక చిన్న విషయాన్ని పెద్ద ఉపన్యాసంగా మార్చి చెప్పవలసిన స్థితిలో వుండరుగదా - అలా వున్నారనుకుని మనం మాట్లాడటం మనం చేసే అపచారమే అవుతుంది కదా!" అని ఒక వింతభాషి నిర్వచించాడు.

ఆయన భావాలతో ఏకీభవించకపోవడం కూడా అపచారమే అవుతుంది. మనకు మాటలమీద మక్కువ కొద్దీ ఎక్కువ మాట్లాడటమే కాని - భావాన్ని అందిస్తే మన పని అయిపోతుందన్నమాట సత్యమేగదా!

***సంజ్ఞలుచాలు సకలం గ్రహించడానికి***

ఎవరో అన్నట్లు అసలు మాట్లాడటం చాలా శ్రమతో కూడిన పని. సంజ్ఞలతో సకల భావాలూ వెలువరించవచ్చు. సంజ్ఞలు అద్భుతమైన సాంకేతికాలు. వాటిని ప్రదర్శించడం, అందుకోవడం కూడా చక్కటి కళే.

మూగవారు ఈ విధానానికి గురువులు. వారు పాపం మాట్లాడాలని తాపత్రయం కలవారైనా నోరు లేకపోవడం వల్ల - ఎన్నో సాంకేతికాలూ, సంజ్ఞలూ అలవాటు చేసుకోవలసి వస్తుంది. వారి స్థితిని చూస్తే జాలివేస్తుంది. నోరుండి పొదుపుగా వాడుకునేవారిని చూస్తే ఎంతో సంతోషం కలుగుతుంది.

"ఆయన మూడు ముక్కల మనిషి" అని కొందర్ని ప్రశంసిస్తూ వుంటారు. పై మాటకు చీట్లాటలో అభిలాష గలవాడనే అర్థం ఒకటి ఏర్పడింది గనుక కొంచెం మార్చి చెప్పడం అవసరమవుతోంది.

మితభాషులకు సంఘంలో ఎక్కువ గౌరవం వున్నదనే మాట సత్యం. ఇంకా కొంచెం మాట్లాడితే బాగుండుననిపిస్తుంది. అతిగ మాట్లాడేవారు చటుక్కున ఆపితే బాగుండును - మహోపకారం చేసినట్లవుతుందనిపిస్తుంది.

కొంచెం చనువుగలవారలా మాట్లాడుతున్నప్పుడు "అంత సొద దేనికి? అసలు విషయం చెప్పరాదూ" అని విసుక్కోవడం జరుగుతూ వుంటుంది. అవతలివారు తమ విసురులో ఇవతలవాళ్ళ విసుగు ఎంత మాత్రం గమనించరనేది కూడా మనం గమనించాలి.

అలా మాట్లాడేవారి విషయం అలావుంచి కొద్దిమాటలతో సరిపెట్టుకునే వారిలోగల చాకచక్యం కొంతవరకు పరిశీలిద్దాం.

***మీ యిష్టం.. మీకేం తోస్తే అది.. నాదేం వుంది?***

భర్త ఏదైనా విషయం తనంతట తాను తేల్చుకోలేక భార్యను సలహా అడుగుతాడనుకోండి. ఆవిడ ఒక్క ముక్కలో చెప్పేస్తుంది. "మీ యిష్టం" "మీకేం తోస్తే అది" "నాదేం వుంది" "అసలు నన్నడగాలేమిటి" - "ఇదేమి చిత్రం.. నాకేం తెలుసు" "మీదంతా సోద్యం - ఆ మాత్రం తెలియదేమిటి?" ఇత్యాదులు ఒక జాబితాలో చేరిన జవాబులు.

"ఇంకా నయం నన్నడగడమేమిటి?" "అంతదాన్నేమిటి నేను" - "అన్ని తెలివితేటలు నా దగ్గర ఎక్కడున్నాయి?"

"ఆ మాత్రం ఆలోచనే వుంటే ఇలా ఎందుకుంటాను?" - "మీకు పుణ్యం వుంటుంది. నామీద ఇలాంటివేమీ పెట్టకండి.. ఇలా బ్రతకనియ్యండి" - "ఇదో నాటకమేమిటి" "నా సలహా యిప్పుడు కావలసి వచ్చిందేమిటి ఎప్పుడూ లేనిది."

***భగవంతుడంత బుర్ర పెట్టలేదండీ***

"ఊరుకోండి ఎవరన్నా నవ్వుకుపోతారు"

"నన్ను పరీక్ష చేస్తున్నారేమిటి - నాతో సరసమేమిటి?" - "భగవంతుడు అంత బుర్ర పెట్టలేదండి" - ఇత్యాదులు కొంచెం ఉద్రేకంతో చెప్పే జవాబులక్రింద జమపడతాయి.

కొందరు పురుషులు ఇంటికి వచ్చి ఎంతో ఆప్యాయంగా "అది కాదే అసలేం జరిగిందంటే.." అని తన అనుభవాన్ని ఒకపావుగంటో, పది నిమిషాల్లో ఎంతో హృదయానికి హత్తుకునేట్లుగా భార్య సానుభూతికోసం తాపత్రయపడుతున్నట్లుగా చెప్పి ఆమె సమాధానం కోసం పుట్టెడు ఆశతో ఎదురు చూస్తారు.

ఆమెగారా విషయం అంతా శ్రద్ధగా వింటున్నట్లు అభినయించి అవతలనుంచి వచ్చే వాగ్ధాటి ఆగిపోయినదానికి గుర్తుగా "అలాగా అలా జరిగిందా!" అని ఒక్క ముక్క అని ఊరుకుంటారు. గుక్క తిప్పకుండా గుండెలో గాలిని అంత తోడిపోసిన వ్యక్తికి ఆ ఒక్క ముక్క ఏమంత సంతృప్తినిస్తుంది. మరో ముక్కను ఆమె పెదవులనుంచి ఎలాగైనా రప్పించాలనే కోరికతో "అలాగా అంటావేమిటి? అచ్చంగా అంతే జరిగింది. ఇంకా కొన్ని విషయాలు చెప్పలా నీకు ఎందుకొచ్చిందని" అంటాడు. అప్పుడు కూడా ఆమె నోటినుంచి "బాగుంది" అనే పసిడి తునకలాటి ఒక్క ముక్క బయటపడుతుంది.

అవతల వ్యక్తి చెప్పే విషయాన్ని బట్టి ఆమె మాటలు పెరగవు గాని, అదే మోతాదులో కొంచెం మారుతూ వుంటాయి. "అసలెందుకలా వెళ్ళారు?" - "మరీ విచిత్రంగా వుందే" - "మనకేం పనిలేదేమిటి?" "ఇంకా నయం అంతటితో వదిలాడు" - "ఏమిటో గొడవ మనకన్నీ ఇలాటివే వస్తాయి" - "లేకపోతే మీదగ్గరా వాడి బడాయి" - ఇత్యాదులు సమయానుకూలంగా సందర్భ శుద్ధిగా వాడుతూ వుంటాయి.

***పోనీ అలా అనకపోయావు బాగుండేది.***

మా బంధువుల్లో ఒకాయన వున్నాడు. ఆయన అతి మితభాషి. ఆవిడ అన్నివేళల్లో అనర్గళంగా మాట్లాడుతూ వుంటుంది. తొణకదు - బెణకదు. మాట్లాడుతూ మధ్య మధ్య పెద్దగా నవ్వుతూ వుంటుంది. ఆయనగారు ఆలోచించి ఆలోచించి ఒకసారి చిరునవ్వు నవ్వి "పోనీ అలా అనకపోయావు" అంటాడు.

ఆమాట అందుకుని "అలా ఎలా అనమంటారండి. నేనేం వెర్రిదాన్నా అంటూ మరో గంభీర ఆవృత్తం."

కొంతసేపటికి మళ్ళీ ఆయనగారు తెగించి "ఎవరీమాట అన్నది? మిసెస్ చలపతా?" అంటాడు. "అయ్యో రామా! ఆవిడేనండి. అక్కడ వుండటానికి అందరూ వున్నారు. మిసెస్ సుబ్బరామయ్యా, మిసెస్ రామనాధం, మిసెస్ భానోజీరావు, మిసెస్ జంబులింగం, మిసెస్ ఆర్తనాధ, మిసెస్ డి.కె.యం.టి రావు అందరూ వున్నారు. అందరూ వూరుకున్నారు. మిసెస్ చలపతే అలా కల్పించుకుని మాట్లాడింది" అంటుందామె.

"ఆవిడది కొంచెం లూజు ఠంగ్" అని ఆయన మందహాసం చేస్తాడు. ఆవిడ గుణం తన భర్త అంత తేలిగ్గా కనిపెట్టినందుకావిడ ఎంతో మురిసిపోతుంది. పాపమాయన ఎందరి "టంగ్"ల విషయమన్నా ఎత్తుతాడుగాని, ఆవిడ "టంగ్" సంగతి మాత్రం పొరపాటునన్నా ఎత్తాడు. అంత ధైర్యంవుంటే ఎప్పుడో కత్తిరించి పారేసి వుండేవాడు.

***ఊరంతా వచ్చినా ఊకొట్టేవారు రాలేదు.***

కొందరు ప్రతిమాటకు ఊరికే "వూ"లు కొట్టి ఎంత సంభాషణన్నా తేలిగ్గా నడిపించగలరు... ఎదుటివారు. "ఊ" అంటుంటే చెప్పేవారి మనస్సు ఉయ్యాల్లా వూగిపోతూ వుంటుంది. ఆ ఉత్సాహం ఇక చెప్పక్కర్లేదు.

మా చిన్నతనంలో మా ఊర్లో రాత్రిపూట కొందరు తమాషా తమాషా కథలు చెపుతుండేవారు. గ్రామంలో స్త్రీ పురుషులు ఎందరో చేరేవారు. కథ రెండు మూడు గంటలు సాగేది. కథ చెప్పేవారు ముందుగా "ఊ" కొట్టేవారిని ఎన్నుకునేవారు. దాని మీద నుంచే కాబోలు "ఊరందరూ వచ్చినా వూ కొట్టేవాడు రాలేదు" అనే శాస్త్రం వచ్చింది.

**(15' సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఉపన్యాసాలివ్వడంలో** కూడా ఎంతో హాస్యం కనిపిస్తుది. అసలు హాస్యం ఎక్కడ వుందంటే మాట్లాడే విషయంలో రవంత ప్రవేశం కూడా లేకుండా ఎంతో తెలిసినవాళ్ళలాగా మాట్లాడడానికి ప్రయత్నించడం.

ఫలానివారు ఫలాని విషయం మీద మాట్లాడతారని ప్రకటించబడినప్పుడే కొంచెం హాస్యం తొణికిసలాడుతుంది. "ఇదేమిటి ఈయనగారిని వరించారు. ఇంతకన్నా మంచివారెవరూ దొరకలా!" అనడం జరుగుతుంది. "ఆ! ఆ ఉపన్యాసం వినేదేమిటి?" అని చప్పరించడం కూడా మామూలుగానే జరిగే సంగతే.

***ఉపన్యాసం బాగుండదని టీ పార్టీ పోగొట్టుకుంటామా!***

నేను బందరులో ఉండగా ఇలాంటి ఉపన్యాసాలకు వెళ్ళవలసివస్తే కొంచెం నేను కడుగు వేస్తూనే ఉండేవాణ్ణి. వెంటనే మా మల్లినాథసూరిగారు అందుకుని "నీకా ఉపన్యాసం నచ్చకపోతే వినబోకు. అంతమాత్రంతో వచ్చిన నష్టమేమీ లేదు. అంతేగాని ఉపన్యాసం సరిగా వుండదని చక్కటి టీపార్టీ పోగొట్టుకుంటామా? అందులో బందరు స్వీట్సు.. పద పద" అని ఉత్తరీయం భుజాన వేసి బయలుదేర తీయించేవారు.

కొందరు ఉపన్యాసం విని యివతలకు వచ్చిన తర్వాత "అదేమిటి అలా మాట్లాడాడు, నీకేం తెలుసు కూర్చోవయ్యా అనేవాళ్ళు ఒక్కరూ లేకపోయారు సభలో. పైగా అలా అక్కరలేని విషయాలన్నీ మాట్లాడుతూ అవసరంగా రొమ్ము విరుచుకుంటాడేం. వినేవాళ్ళకు బుర్రలు లేవనా? సారస్వత ప్రపంచం వట్టి తొర్రక్రింద మారిపోయిందనా!"

అలాటి వారికి ఏం జవాబు చెపుతాం? "ఏదో ఆయనకు తెలిసింది చెప్పాడు. పనికి వస్తే తీసుకునేది లేకపోతే అక్కడే వదిలి తిరిగి చక్కా వచ్చేది. మనకేం నష్టం?" అంటామనుకోండి.

***అసహజమైన ఉపన్యాసాలు వింటుంటే బుర్రకందుతుంది***

"మీరు చెప్పే సంజాయిషి చాలా బాగుంది. నష్టమేమిటంటారేమిటి? ఇష్టంలేని ఉపన్యాసాలూ, సరియైన, సహజమైన ధోరణిలో లేని ఉపన్యాసాలూ వింటూంటే బుర్ర ఎలా కందిపోతుందో తెలుసా? ఎక్కువసేపు వింటే పాప్పర లేచిపోతుందోయి పాప్పర. చప్పరించి చక్కారావడంతో సరిపోతుందనుకున్నావా? మాట్లాడేదంతా నిజమనీ, నిక్షేపంలాగా ఉన్నదనీ ఎవడు ఒప్పుకుంటాడండి? ఒప్పుకోడు. నేనసలు ఒప్పుకోను" అని గట్టిగా వాదనకు దిగుతాడా పెద్ద మనిషి.

ఎలాగో అలా మనస్సు సరిపెట్టుకుని ఉపన్యాసం విని ఎంతో గౌరవంతో బయటకు వస్తామనుకోండి. ఏం లాభం. ఇలాంటి ప్రబుద్ధులు బయలుదేరి అవతలవాళ్ళకు లభించే ప్రసిద్ధిని చెడగొట్టడానికి ప్రయత్నిస్తుంటే అందులో ఆ వాగ్యుద్ధమంతా మనతో చేస్తుంటే ఎలా తట్టుకునేది?

ఉపన్యాసాల్ని సుమారుగా రకాల క్రింద విభజించవచ్చును.

1. ప్రశంసల ఉపన్యాసాలు
2. వీడ్కోలు ఉపన్యాసాలు
3. షష్టిపూర్తి ఉపన్యాసాలు
4. సన్మానాల ఉపన్యాసాలు
5. బదిలీ ఉపన్యాసాలు
6. వార్షికోత్సవ ఉపన్యాసాలు
7. ప్రారంభోత్సవ ఉపన్యాసాలు.
8. శతదినోత్సవాలు
9. సదస్సులు
10. రాజకీయోపన్యాసాలు.
11. మందలి ఉపన్యాసాలు.
12. అసోసియేషన్ ఉపన్యాసాలు.
13. యూనియన్ ఉపన్యాసాలు
14. శంకుస్థాపన ఉపన్యాసాలు
15. విశ్వమానవ సౌభ్రాతృ ఉపన్యాసాలు
16. ఎన్నికల ప్రచారోపన్యాసాలు
17. విదేశ సంచార వీడ్కోలు ఉపన్యాసాలు.

18. లలితకళల ఉపన్యాసాలు

19. రేడియో ఉపన్యాసాలు

20. రోడ్డుమూల ఉపన్యాసాలు.

ఇలా ఇంకా కొన్నిటిని పేర్కొనవచ్చును. మొత్తం మీద చాలారకం ఉపన్యాసాలు ఈ పైన పేర్కొన్నవాటికి సంబంధించినవై వుంటాయి. వీటిలో ఆసక్తి కలవారు దేశంలో చాలామంది వుంటారు. వారికి భగవంతుడు మంచి శక్తిని కూడా ప్రసాదించడం ఒక మహద్భాగ్యంగా భావించవచ్చు.

***అన్నిటికంటె విలువైనది ప్రశంసావేదిక***

మొదటి తరగతికి చెందిన ప్రశంసల ఉపన్యాసాలను గురించి ఆలోచిద్దాం. అన్నింటికంటే విలువైనదీ, తేలికయినదీ, ఈ ఉపన్యాస వేదిక. ఒకరిని ప్రశంసించాలనే భావం కలగడమే గొప్ప అదృష్టం. అలాంటిది దానికోసం ఒక సభను ఏర్పాటు చేయడం అంతకన్న గొప్ప విశేషం.

ఇందులో ఇంకో తమాషా ఏమిటంటే కొందరు కొన్ని రకాల వారినే ప్రశంసించడానికి పూనుకుంటారు. వారికోసం విరాళాలు విరివిగా సమకూరుస్తారు. వారు వ్రాయించే సన్మాన పత్రాల సంఖ్య ఇంచుమించుగా ఒక దస్తా వుంటుంది. మెడలోవేసే దండల సంఖ్య పదులూ, పాతికలమీద వుంటుంది. ఆ రోజు ఆడవాళ్ళు ముచ్చటకు తల్లో పెట్టుకోడానికి ఎక్కువ గులాబీపువ్వులుగాని, రెండు చామంతి పువ్వులుగాని దొరకవంటే ఆశ్చర్యం వుండదు.

అన్ని వర్గాలనుంచి ఉపన్యాసకులను ఆహ్వానిస్తారు. చూశారా ఎంతమంది వచ్చారో 'క్రాస్ సెక్షన్' అని చెపుతారు. నిజానికి అంత కష్టపడి ఖర్చుపెట్టి ఒకరిని స్తుతిస్తుంటే, వారిని గురించి కొంచెంసేపు మాట్లాడడానికేం, వినడానికేం? అనిపిస్తుంది. పైగా తినడానికి కూడా మంచి ఏర్పాట్లు చేస్తారు.

ఈ సందర్భంలో ఒక చిన్న సంఘటన జ్ఞాపకం వచ్చింది. సన్మానాలు చేయించుకునేవారిలో కొందరు ఖర్చు తామే భరించడమనే ఆచారం ఉంది. ఇది మంచిదే. కీర్తి తను సంపాదిస్తున్నప్పుడు ఆ మాత్రం ఖర్చు భరించడంలో తప్పేం వుంటుంది.

ఒక పెద్దమనిషి ఖర్చు భరించి సన్మానం చేయించుకుంటున్నాడట. ఒక ఉపన్యాసకుడు ప్రశంసించి కూర్చున్నాడుట. రెండో ఆయన మరింత గొప్పగా పొగుడుతున్నాడుట. ఉద్రేకంలో చేతులు వూగించి వేస్తున్నాడుట. ఆయనగారికి పొడుం అలవాటుంది. పొడుంకాయ చేత్తో పుచ్చుకుని ఉపన్యసించడం, అదిజారి బల్లక్రిందనో, కుర్చీ క్రిందనో పడిందట.

***ఇంత ఖర్చుపెట్టినవాణ్ణి పొడుంకాయ కొనలేనూ.***

ఆయనగారు హఠాత్తుగా ఉపన్యాసం ఆపివేసి పొడుంకాయ వెతుక్కోవడం ప్రారంభించాడట. సన్మానితునకు చిరాకు పుట్టుకు వచ్చింది. కొంచెంసేపు చూశాడు. ఉపన్యాసకుడు అంత మంచి పట్టులో వదలడం ఏమీ బాగుండలేదనుకున్నాడు. వెంటనే ఇలా అన్నాడుట.

"ఏమిటండీ. ముష్టి పొడుంకాయకోసం అంత చక్కని ఉపన్యాసం ఆపివేశారు. నాకిక్కడ ఉక్క పెట్టేస్తుంది. ఇంత ఖర్చు భరించనవాణ్ణి ఆ పొడుంకాయ ఖరీదు ఇచ్చుకొలేనూ, కావాలంటే రెండు కొనిస్తాను, కానివ్వండి, ఉపన్యాసం. ప్రవాహానికి అనవసరంగా అడ్డువేశారు" అని...

ప్రశంసలకు సంబంధించిన ఉపన్యాసాలు అన్నిటిలో తేలిక. ముఖ్య అతిధిని అంతవాడు ఇంతవాడు అని పొగడడంలో అట్టే ఇబ్బందిలేదు. మాటలు కూడా ఎక్కువ వెతుక్కోనక్కరలేదు.

*ఏ పువ్వు అందితే అది విసరడం.*

అవైనా ఒక ఆర్డరులో ఉండవలసిన అవసరం లేదు. ఏ పొగడ్తకు ఆ పొగడ్త ఒక ప్రత్యేకమైన పువ్వులాంటిది గనుక వెనుకా ముందులు చూడకుండా గిరాటు వెయ్యవచ్చు. పువ్వులకంటే చక్కగా అవతలి వ్యక్తి వదనం వికసిస్తుంది.

ఇలాంటి సమయంలో వాడే వాక్యాలు కొన్ని రెడీమేడ్‌గా వుంటాయి. "ఆయన్ని గురించి మాట్లాడే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నిజానికి వారి కీర్తిని గురించి తెలియజేసే ప్రతిభ నాలో లేదు. అయినా ఒక్క మాటమాత్రం ఘంటాపథంగా చెప్పగలను. వారు యింతకంటే గొప్ప సన్మానానికి అర్హులు. మనం చేసేది చాలా స్వల్పం అనేది నేను రూఢిగా చెప్పగలను. వారిని ఫలనా వారితో పోల్చవచ్చు." (ఇక్కడ జ్ఞాపకం వచ్చిన ఏ పేరైనా ఉపయోగించవచ్చు. సమంజసంగా ఉందా లేదా అనే మీమాంస అక్కరలేదు. హెచ్చుతగ్గులు తర్వాత ఆలోచించుకోవచ్చు.)

ఇవి నల్లేరు మీద నడక ఉపన్యాసాలు. వీటిలో పాల్గొనడం చాలా సంతోష హేతువు.

(21 ' సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పూర్వపు రోజులే మంచివి** - "ఇప్పటికాలంలో ఏం బలం వుంది? ఏం అనుభవముంది? జీవితాలు తమాషాగా గడవడమేగాని" అన్నాడు మొన్న ఒక ముసలాయన మాట్లాడుతూ ఆయనగారి కంటే పది పదిహేను సంవత్సరాలు తక్కువ వయస్సులో వున్న మరో ఆయన వెంటనే అందుకుని "తమాషాగా గడపడమంటారేమిటండి.. భలే హుషారుగా గడిచిపోతోంది. అసలు ప్రొద్దెలా కూకుతోందో తెలియడం లేదు ఎలా తెల్లారుతోందో అంతకన్నా తెలియలేదు. భలే కాలం. బ్రతకవలసిన కాలం. నా మటుకు నేనెంతో గర్విస్తున్నాను" అన్నాడు - అంతులేని ఉత్సాహంతో అంచులు తాకిన ఉద్రేకంతో.

*పరగడుపుతో పరగణా అంతా షికారు.*

"ఏం ఉషారయ్యా. ఉషారూ! మాటల్లో చెప్పుకుంటే అయిందేమిటి? బ్రతుకులో వుండాలి మజా! పుర్వకాలం వాళ్ళల్లో ఎంత బలం వుండేది. పరగడుపున లేచి పచ్చి మంచినీళ్ళన్నా త్రాగకుండా రివ్వున తిరుగుతూ ఒక పరగణా అంతా పాలించి చక్కా వచ్చేవారు. ఉస్సో, అనే వారా, అస్సో అనేవారా!. ఇప్పటి వాళ్ళను కాఫీ త్రాకకుండా ఫర్లాంగు నడవమను తెలుస్తుంది - అసలు పక్కమీదనుంచి లేవమనండి చూద్దాం. ముగ్గురు కలిసి రెక్క పట్టుకోవాలి." అన్నాడాయన.

"లేవలేక కాదయ్యా మహానుభావా! ఈ యుగంలో వాళ్ళకు అసలు రాత్రి పగళ్ళ వ్యత్యాసం ఎక్కువ లేదు. అవసరమైతే అహోరాత్రాలూ మేలుకుంటారు. పూర్వకాలంలో ఒక్క జారులూ, చోరులూ మాత్రమే మేలుకో కలిగేవారట. ఇప్పుడు సగం మంది జనాభా మేలుకునే వుంటున్నారు. లేకపోతే రైళ్ళు, విమానాలు, ఫ్యాక్టరీలు, క్లబ్బులు, సినిమాలు, హోటళ్ళు - ఇవన్నీ నిరంతరం ఎలా పనిచెయ్యకలుగుతున్నాయి?"

"ప్రొద్దుటపూట కొంచెం ఆలస్యంగా లేచినందుకు ఆక్షేపించక్కరలేదండీ. కావాలంటే గంతేసి లేవగలం. ఎంత దూరమైనా వెళ్ళగలం. కానీ సరి అయిన కారణం వుండాలి. తెల్లవారు ఝామున రైలు దగ్గిరి మిత్రుణ్ణి కలుసుకోవాలనుకోండి. ఎగిరి అక్కడ పడగలం అవసరమైతే షేవ్ చేసుకుని, సూటు వేసుకుని, -"

*ఎనిమిదింటిదాకా మధుర స్వప్నాలు కనడం*

"అంతేగాని అనవసరంగా పరుగెత్తడాలు, అక్కరలేని వాళ్ళను కలుసుకోవడాలు, కడుపులో ఆకలి మాట ఆలోచించకుండా, రోడ్లన్నీ కదను త్రొక్కిరావడాలు - ఇవన్నీ ఈ కాలానికి సంబంధించినవి కావు. మధుర స్వప్నాలు కంటూ ఎనిందింటిదాకా నిద్రపోవడం - మనస్సును సరిచేసుకుని లేచి - ఇంత త్రాగి, ఇంత తిని చింతలేని జీవితం గడపడం వింతలలో కొన్ని గురించి ఆలోచిస్తూ, సినిమా పాటలు వింటూ, దేవతలలాగా కాలం గడిపే అవకాశం ఈ కాలం వారికి వుంది.

"దీన్ని దేవతాంశ క్రింద జమకట్టవచ్చు. పాతకాలాన్ని గురించి ఏదో చెపుతావెందుకు. ఒక్క విషయం ఆలోచించు. పూర్వకాలంలో వారికి "ఇంత ఫ్రెష్ గడ్డాలుండేవా? భీకర ఆకారాలు. ప్రతివాడికి ఒక మూరెను పిచ్చుక గూడంత గడ్డం. అసభ్యం.. అసభ్యం" అని కేకలు పెట్టాడాయన.

మొదటగా సంభాషణ ప్రారంభించిన పెద్దమనిషి తన వాదాన్ని పొడిగించాలని ప్రయత్నించడు. కానీ రెండవ వ్యక్తి ధాటి ఎక్కువగా వుంది. పైగా ఆయన చెప్పే మాటల్లో ఎదిరించడానికి ఎంత మాత్రం అవకాశం కల్పించడంలా.

కాలం మారింది. పరిస్థితులు మారుతున్నాయి. రెండెడ్ల బండి యుగం నుంచి జంబూ విమానాల యుగం వచ్చింది. ఏ కుర్రాణ్ణి పలకరించినా 'నేను కొంచెం పెద్దవాణ్ణయిన తర్వాత "ఇంఫాలా" కారు కొంటా చూడండి. ఇంట్లో వాళ్ళందర్ని ఎక్కించుకుని తిప్పుతా.' అని సగర్వంగా చెపుతున్నాడు. ఉత్సాహం అంత గొప్పగా వుంటుంది. అది కాలంలోగల బలం అనడంలో తప్పేం వుంది.

కాలం చేసేపని కొత్తదనాన్ని తీసుకురావడమే. ధర్మాలు పాతవి వున్నా మర్మాలు మారక తప్పదు. మనస్సులు ఒకటిగా వున్నా మంతనాలు మారడంలోనే అందం వుంది. ఈ యుగంలో 'మనస్సుకు' ఎక్కువ ప్రాధాన్యం వచ్చింది. కొన్ని మంచి మనస్సులు చేరి మతాన్ని కల్పించుకుంటున్నాయి - ఈ కాలంలో వితరణ స్వరూపాలు కూడా మారిపోతున్నాయి - ఏది మారినా, మతం మంగళప్రదంగా వుండాలి. ఇలాంటి నిర్వచనాలు కూడా చాలా వినవస్తున్నాయి. వింటున్నాం. వీటికి తగిన స్వప్నాలు కంటున్నాం.

*"నా కంటితో చూసిందే నే నమ్ముతా"*

"నా కంటితో చూసిందే నమ్ముతాను. తక్కిన వాటిమీద నాకు నమ్మకం లేదు. నమ్మకపోతే వచ్చే నష్టం లేదు" అన్నది మొన్న ఒక కంబందళాయతాక్షి -

"విన్నవాటిని నమ్మవన్నమాట. అయితే నీకు చాలా తీరిక లభిస్తుంది జీవితంలో - అసలు మనస్సు చాలా స్వచ్ఛంగా వుంటుంది" అన్నాను.

"అవునండీ అనవసర విషయాలన్నీ నమ్మి మనస్సు "లంబర్ రూమ్" చేసుకోవడం నాకిష్టంలేదు. దాన్ని క్లీన్‌గా "డ్రాయింగ్ రూమ్"లాగా వుంచుకోవడమే నా అభిలాష - వెనుకటి వన్నీ నమ్మడమేమిటి? " అన్నదామె.

"పోనీ నిన్నేమీ బాధపెట్టని వెనుకటి సత్యాలనన్నా అంగీకరిస్తారా!. అవికూడా అక్కరలేదంటారా?" అన్నాను.

"ఎందుకొచ్చిన గొడవండి - వాటిని అంగీకరించడంవల్ల వచ్చే లాభమేమిటి? ముందు కాలాన్ని గురించి ఆలోచించవలసిన అవసరమెంతైనా వుంది"

*నిన్న మొన్నలు లేవు నేటికి నేడే జీవితం*

"అసలు నా వుద్దేశ్యంలో నిన్న మొన్నలు అనే వాటిని - తొలగించి వేయాలని వుంది. ఎందుకొచ్చిన రభస. హాయిగా వుండక" అన్నది.

ఇది కూడా గొప్ప వేదాంతమే. వెనకటి విషయాలు తలుచుకోవడం వల్ల వేదన తప్ప మరొకటి కనిపించదు. తలచుకుని మాత్రం వాటన్నిటినీ సర్దుకు రాగలమా? సర్వం సుందరంగా తయారు చేశామనే గర్వం ప్రకటించగలమా! ఒక పెద్ద మనిషి చాలాకాలం క్రింద ఇలాంటి వేదాంతమే అవలంభించాడు.

"పాత నాకు అక్కర్లేదు. నిజానికి వెనకటి విషయాలు నాకేం జ్ఞాపకం వుండవు. వాటిని గురించి ఎవరూ ప్రస్తావించకండి. ప్రస్తుతాన్ని గురించి ముచ్చటించండి. మురుస్తూ మాట్లాడుకుందాం" అనేవాడు.

అది విన్నవాళ్ళు "సరే ఆయన ఇష్టం ఆయనది. మనమేం చేస్తాం" అని వూరుకున్నారు. కానీ ఆయనకు అప్పు పెట్టినవాళ్ళు - అందులో చేబదుళ్ళు ఇచ్చినవాళ్ళు చెప్పలేనంత గాభరాపడ్డారు - "అన్నీ మరిచిపోతే పోయారు. మా అప్పు సంగతి మాత్రం జ్ఞాపకం వుంచుకోండి. మీకు పుణ్యం వుంటుంది" అని బ్రతిమాలారు. కానీ ఆయనగారు తన పట్టుదల వదలలేదు - ఒక్క పద్దు జమ కట్టలేదు.

*నిత్యసమస్యలు గుండెల్లో సరిగమలు*

మొత్తానికి పైన చెప్పిన ఆమె పద్ధతి బాగానే వుండేట్లుంది. వెనుకటికి తలుచుకోవడం కాలం వృధా చేసుకోవడం తప్ప, వచ్చేదేమీ వుండటంలేదు. ఈరోజు చాకిరీకి ఈరోజే సరిపోవడం లేదు. ఇంకా తీరికగా కూర్చుని త్రేపుతూ వెనకటి విషయాలు జ్ఞాపకం చేసుకోవడానికీ, అవసరాన్ని బట్టి చింతంచడానికి, లేదా సంతోషించడానికి తీరిక ఎక్కడిది?

ఏరోజు సమస్యలు ఆ రోజే గుండెల్లో సరిగమలు వాయిస్తున్నాయి. ఆ స్వరంలో కంఠం కలవక గగ్గోలు పడుతున్నాం. అపశృతితోనే సూర్యభగవానుడు అస్తమిస్తున్నాడు.

**(2` ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**జంటనగరాలలో** నివసించే ప్రజలకు వారి నిత్యజీవితంలో నగరానికి సంబంధించిన అనేక ఉపమానాలు దొర్లుతూ వుంటాయి. అవి నిజానికి ఇతరులకు అంతగా అర్థం కాకపోయినా, అక్కడి వారికెంతో చక్కగా అతుకుతాయి.

మొన్న ఒకాయన భోజనం చేస్తూ, మజ్జిగదాకా వచ్చి కేకపెట్టాడు. ఆవిడ మజ్జిగ చిలకరిస్తూ, ఆడబడుచుతోనో, ఎవరితోనో, మాట్లాడుతూ "వస్తున్నా" అంది. ఆ యజమాని కంచంలో వదిలేసిన కూరముక్కలన్నీ తిన్నాడు. అప్పటికీ మజ్జిగ రాలేదు.

అప్పుడన్నాడు: "మజ్జిగ దగ్గిరి కొచ్చేటప్పటికి రైలుబండి సికింద్రాబాద్ వచ్చి ఆగిపోయినట్లు ఆగిపోతుంది వడ్డన. మజ్జిగ మెతుకులు రెండు నోట్లో వేసుకుని లేచిపోవడమేగదా అనిపిస్తుంది. కానీ ఆ కాస్తకే ఆలస్యం.

కొందరు ప్రయాణికులు నాంపల్లి ఎప్పటికి చేరతామోననుకుంటూ, సికింద్రాబాద్‌లోనే దిగిపోతూ వుంటారు. మజ్జిగ మానేసి నేనూ అలాగే లేచిపోవాలనుకుంటా.. " ఇంతలో 'తెస్తున్నా' అనే కేక వినపడుతుంది.

***కంచంలో మజ్జిగ - ఖైరతాబాద్ స్టేషన్***

"కేకలతో ఏం లాభం? కాసిని కంచంలో పోస్తే - ఖైరతాబాద్ చేరినట్లన్నా అవుతుంది" అంటాడాయన. ఈ సంభాషణ రైల్లో ప్రయాణం చేసి, సికింద్రాబాదు స్టేషనులో ఆవలిస్తూ కూర్చునేవాళ్ళకు బాగా అర్థం అవుతుంది.

మా బంధువుల్లో ఒకరింటికి పగలల్లా ఎవరో ఇద్దరు ముగ్గురు ఇల్లాళ్ళు వచ్చి సాయింత్రం అయిదుగంటలదాకా కాలక్షేపం చేసి వెడుతూంటారు. ఈ యింటి యజమానురాలు వారికేదో బోధించి పంపుతూ వుటుంది.

ఇటీవల రాత్రి భోజనాలైన తరువాత కూడా దగ్గరలో వున్న ఇల్లాళ్ళు వచ్చి వరండాలో కూర్చుని కబుర్లు చెప్పడం ప్రారంభించారు. ఆ ఇంటి యజమానురాలు తప్పనిసరిగా వెళ్ళి వాళ్ళతో మాటాడటం జరుగుతోంది.

ఒకరోజున పదిగంటలదాకా వారితో మాట్లాడి పంపి, కుర్చీలన్నీ లోపల వేసుకుంటుందా గృహిణి. భర్త లోపలనుంచి వచ్చి "రాత్రి కళాశాలకూడా స్థాపించావు? బాగానే వుంది. ప్రిన్సిపాల్ కం ప్యూన్ పదవి నిర్వహిస్తున్నావన్నమాట? ఇవ్వాళ బజారు ధరల్ని గురించి నువ్విచ్చిన లెక్చర్ బాగుంది" అన్నాడు.

"ఏదోలెండి డిగ్రీలు లేని ప్రొఫెసర్లు - గ్రాంటులు లేని కాలేజీలు... మీ దయవల్ల బిల్డింగ్ ఫ్రీ" అన్నదామె నవ్వుతూ.

ఒక యువకుడు మిత్రుణ్ణి కలుసుకుని, "ఏం బ్రదర్? మొన్న మీ నాన్నగారు చెప్పారు ఆయన తెచ్చిన సంబంధం వద్దన్నావట. నువ్వెవరినో ప్రేమిస్తున్నావట. ఎంతదూరం వచ్చింది కథ" అని అడిగాడు.

దానికి ఆ మిత్రుడు వెంటనే ఇలా అన్నాడు" "అప్పుడే ఎక్కడరా బ్రదర్? ఆలోచన మాత్రం వచ్చింది. ఇంకా ఫలక్‌నామ్‌కూ, తిరుమలగిరికీ మధ్య వున్నంత దూరం వుంది.

***జేబులో చెయ్యి - కుందేటి చెవ్వు***

"ఉభయులం ముందుకు నడిచి పోవాలి. ఏ పబ్లిక్ పార్కు దగ్గర్లో కలుసుకోవాలి. అప్పుడుగానీ అసలు సంగతి తేలదు. ఆడపిల్లలతో వ్యవహారాలు వారి అనుగ్రహాల మీద ఆధారపడి వుంటాయిగదా?" అన్నాడు. షర్టు జేబులోకి చేతివ్రేళ్ళు నాలుగూ పోనిచ్చి బయటవున్న బొటన వ్రేలును కుందేటి చెవ్వులాగా ఆడిస్తూ.

"అసలా అమ్మాయిని గురించి నీ అభిప్రాయమేమిటి? ఆమెలో ప్రత్యేకతలేమైనా వున్నాయా?" అని మిత్రుడు ప్రశ్నించాడు.

"ఆమెను అర్థంచేసుకోవాలంటే చాలా ఉన్నత స్థాయిలో చూడాలి. రాత్రిపూట నౌబత్‌పహాడ్ ఎక్కి హుస్సేన్‌సాగర్ అందం చూచినట్లు, చూడాలి. సామాన్య దృష్టితో ఆ అందాలు, ఆ ఠీవిని దర్శించడం కష్టం" అన్నాడా ప్రేమికుడు.

"అందం మాట సరే? ఆవిడతో కాపురం ఎలా వుంటుందని నీ ఊహ?" అని ప్రశ్నించాడు మిత్రుడు.

"కాపరానికేం... రాత్రిపూట వెన్నెల్లో టాంక్‌బండ్ మీద స్కూటర్‌లాగా పరుగెత్తుతుంది" అని ఆ ప్రేమికుడు ఎంతో సంబరపడ్డాడు.

మొన్న ఒక ఇంటికి వెళ్ళాను. ఆ ఇంటి యజమాని భార్యను పిలిచి కాఫీ తెమ్మన్నాడు. ఒక పావుగంట తర్వాత ఉడకొపెట్టి వున్న కాఫీ తెచ్చి ఇచ్చింది. తర్వాత ఆవిడ వీణ తీసుకుని తలుపు వెనుకగా కూర్చుని "నగుమోము" పాట ప్రారంభించింది. ఆ గానంలో మేమిద్దరం మాట్లాడుకోవడం అసంభవమని గ్రహించి మౌనంగా కూర్చున్నాం.

***రవీంద్రభారతిలో - రాగసుధ***

ఒక అరగంట ఆమె గానరసం వలకబోసి, అలసిపోయినట్లుగా ఆగింది కొంచెంసేపు.

అప్పుడా యజమాని ఆవిణ్ణి పిలిచి "ఇలా ఒక్కొక్కరికీ నీ పాట మాధుర్యం తెలియజేయడం కష్టం. రెండు నెలలు కొంచెం ఆగు మిత్రులందర్నీ పిలిచి రవీంద్రభారతిలో పాటకచేరీ ఏర్పాటు చేస్తాను ఒక్కసారిగా అభినందనల వర్షం కురుస్తుంది. కావాలంటే ఒక చీఫ్‌గెస్టును కూడా పిలుస్తాను. తలుపు చాటు పాటలతో ఏం సంతృప్తి కలుగుతుంది?" అన్నాడు.

"ఆ పిలిచేది ఏ మంత్రిగారినో పిలవండి. ఫోటోలన్నా తీస్తారు" అన్నదామె.

"అలాగే... అలాగే" అని ఆయన నా వంక చూచి, "బాణీలన్నారుగా? ఈమెగారు ఈమని వెంకటశాస్త్రిగారి ఏకలవ్య శిష్యురాలు. ఏమనుకున్నారు?" అన్నాడు.

"నేనేమీ అనుకోలేదు. రవీంద్రభారతిలో కచేరీ ఏర్పాటు చేస్తారన్నారుగా అప్పుడు తప్పకుండా వస్తాను. తమరు కార్డు పంపడం మరచిపోకండి" అన్నాను ఆ వీణాధరి గానానికి భర్త ఆశయాలకూ సంతోషిస్తూ తిరిగివచ్చాను.

మొన్నటి ఆదివారం సుడిగుండాల సినిమా చూడాలని వెళ్ళాను. అక్కడ ఎంతోమంది స్త్రీలు క్యూలో నిలబడి వున్నారు. ఎరుగున్నవారిద్దరు దగ్గరగా నుంచోటం తటస్థించింది. వారు సంభాషణల్లోకి దిగారు. అందులో ఒకామె అంటోంది: "నీకేమమ్మా అదృష్టవంతురాలవు సైఫాబాద్ పుట్టిల్లు, సైదాబాద్ అత్తవారిల్లూ.." అని.

"ఇక్కడ బస్సులు దొరకటం ఎంత కష్టం. సైదాబాద్ వెళ్ళేలోపల బయటివూళ్ళ బస్సు లెక్కి అరవైమైళ్ళు వెళ్ళవచ్చు. కాకపోతే వూళ్ళో పుట్టిల్లని ఆశ. పోనంటే ఒకటి వుంది గనుక అందులోనే మాతృ, పితృ ధ్యాన, గానం చేస్తూ వుంటాను. టెలివిజన్ వస్తే అమ్మను చూస్తూ అన్నిపనులూ చేసుకోవచ్చు" అన్నదామె.

### *మూసీ తీరం - ప్రేమికుల కాశీ*

జంటనగరాలలో యువకులు కొందరు ఆదివారం నాడు అన్ని ప్రాంతాలకూ వెళ్ళి వస్తూంటారు ఇప్పుడు స్కూటర్లు కూడా వచ్చాయి కనుక, ప్రయాణాలు జంటలుగా చేసే అవకాశం వచ్చింది.

అందులో ఒక యువకుడీ గీతం వ్రాసి ఒక అమ్మాయికి పంపాడట -

నింబోలీ అడ్డలోన
నిరుడనగా నిన్నుచూస్తి,
బడే సావిడి ప్రక్క సందులో
పలకరించాలని చూచి -
భయమేసి పారిపోతి...
నయాపూల్ వంతెనమీద
నవ్వుతూ నీ వెదురొస్తే
కోపం రువ్వుతూ పోయావెందుకూ?
కాలేజీకి వచ్చిపోయే
కళ్ళతో నిన్ను వెతికి..
జపం చేస్తున్నానింతకాలం!
ఈ యాచనలింకెంతకాలం?

ఈ భాగ్యనగరంలో ప్రణయగానాలు వెలువడటంలో ఆశ్చర్యంలేదు. ప్రణయంలో నుంచి వెలువడిన గతమిది. మూసీ కల్పించిన గాథనుంచీ వుదయించిందీ హైదరాబాదు.

మూసీనది ప్రేమికులకు కాశీవంటిదంటే ఆశ్చర్యం లేదు.

**(4' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

"**మూడుముళ్ళూ పడేదాకానే** మోహాలూ, మోజులూ, పోజులూ - ఆ తర్వాత నిజస్వరుపాలూ బయటపడతాయి. కొంతకాలానికి నిలువుగుడ్లు కూడా!" అని ఒకాయన దాంపత్యాలను గురించి దరహంగా విమర్శించాడు.

నిజమే ఆయనగారు చెప్పింది. క్రొత్తలో వున్న పోజులూ, మోజులూ ఎన్నాళ్ళుంటాయి? పళ్ళ బిగింపుతో కొద్ది రోజులు గడిపినా తర్వాత "నేను నలకూబరుణ్ణికాదు - పట్టి నారాయణయణరావుని, కుబేరుణ్ణి కాదు - కుటుంబరావుని, మన్మధుణ్ణికాదు - సొట్టముక్కు మాధవరావును" అని చెప్పకోక తప్పదు.

జీవితమంతా హోదాగా, ఠీవిగా బ్రతకాలంటే ఎంతకష్టం? ఎంత ధనవంతుడికైనా, రూపవంతుడికైనా సాధ్యం కానిపని. పదహారు రోజుల పండుగదాకా పట్టువస్త్రాలు ధరించి, ఆరకుండా సెంట్లు పూసిన పురుషుడు. ఆ మర్నాటినుంచే పట్లుకు బదులు మధ్య కుట్లూ, అడ్డకుట్లూ వేసిన చొక్కాలు ధరించక తప్పదు.

***<u>అరచేతులలో సీసా భజన</u>***

సెంట్లు మాట మరిచిపోయి కొబ్బరినూనె కొంచెం తలకు రాసుకోవాలంటే, సీసా తిరగేసి అరచేతిలో పదిమాట్లు కొట్టి, పడ్డదాంతోనే సంతృప్తి చెందక తప్పదు.

"పంచభక్ష పరమాన్నాలతో తను నిత్యం విందులారగిస్తున్నట్టు అభినయించిన సుందరుడు. ఆ పూట కూర ఏమిటో తెలియక కొట్టుకునే స్థితిరాక తప్పదు. చూశావా! లోకంలో తమాషాలలో ఇది ఒకటి. క్రొత్తలో అలా నటించడం సర్దాకోసం ఆ నాలుగు రోజులు కొంచెం హుందాగా వుండడం కోసం అది ఒక చిన్న నాటకం" అని చెబుతూ వుంటారు పెద్దలు.

చేసేది సంసారం. ఎన్ని చిరాకులు, ఎన్ని పరాకులు వచ్చిపడతాయి? ఖర్చులు భరించలేక ఎన్నిసార్లు మూర్ఛపడుతూ వుండాలి. ఓపిక తరిగిపోతున్నకొద్దీ కాపరం అంటే ఎలాటి విసుగుపుడుతుంది?

వీటివల్ల పలకరింపుల్లో వుండే నవ్వుల గిలకరింతలు అదృశ్యమై, సంభాషణలలో వుండే బాణీలు మారిపోయి, చూపుల్లో వుండే తీసి, వాపిరి చచ్చి, వెరితనం బయటపడి, 'కో' అనగానే కురంగంలాగే ఎగిరి హుషారు నశించి, కూర్చున్న చోటునుంచి కదలలేని నిస్సారస్థితి ఏర్పడి అభిరుచులు తరిగి ఆశలు హెచ్చయి బాధలు మాయమై, బడాయిలు బయటపడి గాంభీర్యం స్థానంలో డాంబిక, దర్జాస్థానంలో దర్పం రూపొంది - దాంపత్య జీవనాలు బొమ్మ తిరగేసినట్లు బొరుసు బయటపడ్డట్లు అయిపోతూ వుంటాయి.

***<u>అందమైన భార్య - అదృష్టం.</u>***

మా బంధువుల్లో ఒకాయన మా బంధువుల్లో ఏమిటి అందరి బంధువుల్లో ఇలాటివారు వుంటారు - వున్నారు. ఆయనకు అదృష్టవశాత్తూ ఒక ఎర్రటిపిల్ల లభించింది. ఆయన రంగుకు వ్యతిరేకమైన రంగు లభించిందని ఎంతో ఉప్పొంగిపోయాడు. "అందమైన భార్యను సంపాదించావు అబ్బాయి?" అని ఎవరైనా వీపు మీద తడితే, ఆయన అదోరకం పోజు పెట్టేవాడు.

మన పిల్లవాడు ఎలాటివాడినా భార్య మాత్రం ఎర్రగా వుండాలనే భ్రాంతి ఒకటి ఏర్పడుతుంది. అతగాడికే కాకుండా అతని తల్లిదండ్రులక్కూడా అదే వ్యామోహం. నల్ల కార్బన్ పేపర్ లాంటి ఒక చెల్లయ్యతో నలభైఏళ్ళు కాపురం చేసిన ఒక ఇల్లాలు తన కూతురికి ఎర్రటివాడు, విశాలనేత్రాలవాడు, విన్నూత్నభావాలవాడు కావాలనే కోర్కె బయలుదేరింది. ఆరేళ్ళనుంచీ అన్వేషిస్తూనే వుంది.

ఎర్రటి అమ్మాయిని చేసుకున్నాడని పైన చెప్పిన యువకుడు - క్రొత్తలో ఆ అమ్మాయిని కుసుమకోమలీ, మందగమనా, చంద్రవదనా, బింబాధరీ అని ఎన్నో పేర్లతో పిలుస్తూ వుండేవాడు. ఆవిడ నడుస్తుంటే పాదాలు యెక్కడ కందిపోతాయోనని అరచేతులు పరచాలని ప్రాకులాడుతూ వుండేవాడు.

ఆవిణ్ణి అందరి ఇళ్ళకూ వెంటవేసుకు వెళ్ళి ఒక గంటసేపు సౌందర్య ప్రదర్శనలు - సారీ ఉచిత సౌందర్య ప్రదర్శనలిస్తూ వుండేవాడు.

"నీ భార్యకేమయ్యా అప్సరసలాగా వుంది. అదృష్టవంతుడవు" అన్న తర్వాతగాని అక్కడనుంచి లేచేవాడు కాదు.

ఎవరైనా తనతో మాట్లాడడానికి వస్తే వరండాలో కూర్చునివుండి ఆవిణ్ణి కాఫీతెమ్మనీ, వక్కపొడి తెమ్మనీ, దాహం కాకపోయినా మంచి నీళ్ళు తెమ్మనీ అనేకమాట్లు పిలుస్తూ వుండేవాడు. వచ్చినవాళ్ళు ఏమీ అనకపోతే చివరకు ఆయనే తెగించి "నా భార్య ఈవిడ. లభించింది చివరికి" అని నీరసంగా మాట్లాడేవాడు.

***ఆ ఎర్రమ్మాయి భర్త ఆయనే***

"ఆవిడకేమండీ చాలా బాగుంది. మంచి దాంపత్యం.. మీ అదృష్టం మంచిది" అనేదాకా అవతల వాళ్ళను వదిలేవాడు కాదు. నిజంగా ఆ రోజుల్లో ఆయన ఆనందం వెర్రితలలు వేసినట్లనిపించేది. అవునుమరి వెనుకటికి ఒక శాస్త్రం వుందిగా - ఆ ఎగిరి గంతులు వేసే వాడెవడురా అంటే - ఎర్రపిల్ల మొగుడు అని.

చాలాకాలం తర్వాత నిరుడు కాబోలు వారిని చూడడం తటస్థించింది ఒక పెళ్ళిలో. వాళ్ళను చూడగానే వెనుక ఆయన పడ్డ మోజులన్నీ జ్ఞాపకం వచ్చాయి. మళ్ళీ ఆ ప్రబంధ భాషంతా వినిపిస్తాడు కాబోలుననుకున్నా.

కానీ ఆ అధ్యాయం ముగిసిపోయింది. క్రొత్త అధ్యాయం ప్రారంభించాడు. ప్రబంధ శైలి మార్చి పైశాచిక శైలితో పడ్డాడు. ఆవిణ్ణి చూపించి "వట్టి మొద్దండీ! బుర్రలేదసలు యేం చేస్తుందో తెలియదు. ఏమి చెప్పినా అర్థంకాదసలు. దీనికంటే మా పనిమనిషి నయం. చెప్పింది అర్థం చేసుకుంటుంది?" అన్నాడు.

నాకు కొంచెం అనుమానం వేసింది. ఇతగాడికేమైనా మతి చెడిందా ఈ మధ్య అని. తర్వాత మెల్లగా ఆవిణ్ణి అడిగాను. ఆవిడ అన్నది పెద్దలు మీరే అర్థం చేసుకోవాలి. నేనేది చెప్పినా తప్పేగా అని. దాన్ని బట్టి మతికేం మతి బాగానే వుంది. శ్రుతి తప్పింది అనిపించింది.

***లంబోదరుడికి - బింబాధరి:***

ఒకనాడు బింబాధరి అని వర్ణించిన ఆ లంబోదరుడిపుడు - "కుంభకర్ణుడి చెల్లెలు నిద్రలో కూర్చుని కూడా నిద్రపోతుంది సార్" అన్నాడు.

"బలహీనత ఏర్పడిందేమో" అన్నాను.

"బలహీనతకాదు. దీని బొంద. శుభ్రంగా తింటుంది. దాంట్లో టోకరాలేదు. తిని వుసూరుమంటుంది. దిక్కుమాలిన మేళం అన్నాడు.

"తిట్టకండి. విషయమేమిటో అడిగి తెలుసుకోండి. లాలించి, పాలించడం మీవంతు అన్నారు."

"ఏం లాలిస్తామండి. ఒక ప్రక్క దీనిగోలపడలేక చస్తుంటే పలకరించడానికే బాధగా వుంటే ఇంకా పాలించడమేమిటి?" వట్టి పాపిష్టిమేళం.

"తిట్లతో ఆడవాళ్ళని రొష్టుపెట్టకూడదు. వాళ్ళు అశక్తులు. ఎదురుచెప్పే హక్కులేనివాళ్ళు చిక్కుల్లో పడ్డ సంసారాల్లో కూడా కుక్కిన పేనుల్లా వుంటారు" అన్నాను.

"ఏమిటోనండి! సంసారం సంగతి ఇప్పుడు తెలిసి వస్తోంది. ఎన్నిమాట్లు చెంపలు వేసుకుని మాత్రం ఏం లాభం?" అన్నాడాయన.

"అందగత్తెలని మీరు మొదట్లో పొగిడేవారు జ్ఞాపకం వుందా?" అన్నాను.

"అందం చూచినంతమాత్రం యెన్నాళ్ళు గంతులు వేస్తాం" అన్నాడాయన.

అందం విలువకూడా అలా తగ్గిపోతుంది కొన్నాళ్ళకు. ప్రీతిలేని కంటికి యెదుటివాళ్ళు భూతాలుగా కనిపిస్తారు. అందులో భార్యాలంటే అతి చులకన. ఆత్మలో మేల్కొంటాయి కనుకనా?

(7' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఈ సంసారం చెయ్యడంకంటే** సన్యాసం పుచ్చుకోవడం ఎంతో నయం" అని చాలామంది గృహస్థులు విసుక్కుంటూ వుండటం పరిపాటి. భగవంతుని కొలిచి తరించాలనే కోర్కెతో కన్న సంసారంలో కష్టాలు పడలేక సన్యాసం పుచ్చుకునేవారి సంఖ్యే ఎక్కువ వుంటుందని పెద్దలు చెపుతూ వుంటారు.

అయితే ఈ తరగతికి చెందిన వాళ్ళందరూ సామాన్యంగా బావాజీలుగా తయారవుతూ వుంటారు. "కోపం వచ్చిన మర్నాడు గోల్కొండ మఠంలో వుందా? తెలిసిందా?" అని మా బంధువు ఒకాయన భార్యను రోజూ బెదిరిస్తూవుండేవాడు.

మా చిన్నతనంలో పెంటపాడు మఠాన్ని గురించికూడా ఎంతో చెప్పుకునేవారు. "కాస్త వంట ఆలస్యమైతే మావారు పెంటపాడు వెడతానంటారేం ఖర్మమో. అక్కడ ఏకతార మ్రోగిస్తూ కూర్చుంటారుట. ఎవరొచ్చి వచ్చిన కూరలతో పది గంటలకే వడ్డించిపోతారో? " అనేది ఒక ఇల్లాలు.

***తూర్పు నుంచి వస్తూంది లక్ష్మి***

ఈ బావాజీలు ఎక్కువగా "సకినాలు" చెపుతూ తిరుగుతూ వుండేవారు. "వచ్చే సంవత్సరం మీకు ధనలాభం వుంది. తూర్పు దిక్కునుంచి వచ్చి కలుస్తుంది మీకు లక్ష్మి" అని చెప్పేవారు. పై సంవత్సరం వచ్చినా అదే జ్యోతిష్యం అయితే తూర్పు పోయి ఏ పడమరో వచ్చేది.

"ఈ ఏడే వస్తుందని చెప్పావుగా బావాజీ! ఏమి కలసిరాలేదేం" అని ప్రశ్నిస్తే "మీరు లక్ష్మిని సరిగా ఆహ్వానించలేదు. అందువల్ల ఆగ్రహం వచ్చింది. ఒక్క తాయెత్తు కడతాను. కీడు తొలిగిపోతుంది. రెండు శేర్ల బియ్యం, దోసెడు పెసరపప్పు, ఏదైనా కాయగూర, రూపాయి పావలా తెచ్చుకోండి. మీకు శుభం కలుగుతుంది. లక్ష్మి వచ్చిన తర్వాత బావాజీకి ఒక పట్టువస్త్రం, పదిరూపాయలూ ఇవ్వండి" చాలు అని చెప్పేవాడు.

చాలామంది ఆ మాటలు నమ్మి అడిగిన వన్నీ యిచ్చి తాయెత్తు తీసుకునేవారు. బావాజీ ఆ తండులాలతో అన్నం వండుకుని ఆ రూపాయి పావలాతో పత్రి కొనుక్కుని హాయిగా కాలం గడిపేవాడు.

ఈ రోజుల్లో బావాజీల సంఖ్య తగ్గినట్లు కనిపిస్తుంది. ఆ వేషధారణ వల్ల పోషణ సరిగా జరగకపోవడమే కారనం కావచ్చు. పోతే సన్యాస ఆశ్రమాలు పుచ్చుకునే మహనీయులు కొందరున్నారు. వారి పరువు పోగొట్టడానికా అన్నట్టు కొందరు "చౌకరకం యతీశ్వరులు"గా కూడా వుంటూ వుంటారు.

***తనపట్ల చిమ్మెట - పరాయిచోట పట్టుపురుగు***

ప్రక్క ఇంటావిణ్ణి ఏదో అని అల్లరై వాళ్ళు జాతకం తిరగవేయడానికి బయలుదేరి ఒకాయన పారిపోయి 'యతి'గా మారాడని ఒక కథ చెపుతూ వుండేవాడు మా పెద్దనాన్నగారు. తనపట్ల చిమ్మెటగా నిలిచిన భార్య పరాయివానివద్ద పట్టుపురుగుగా మారిందని తెలిసి కొందరు యోగులుగా మారిన ఘట్టాలు వున్నాయి.

ముందు ఆలోచన లేకుండా పదిమంది సంతానాన్ని కని తర్వాత వారి పెట్టుపోతలకు చిట్టెడు నూకలు దొరక్క చివికిన గుండెలు చేతపట్టుకుని ఆశ్రమం పుచ్చుకున్న బుద్ధిమంతులు కొందరుంటారు.

ఏమైనా ఈతిబాధలవల్ల ఇంట్లో నిలవలేక ఇంత వుప్పురంగు వస్త్రాలను పట్టించి బయలుదేరినవారు పడటానికి యతుల జాబితాలోపడ్డా, వారికి తగిన భక్తివైరాగ్యాలు మృగ్యం. వీరందరూ పుట్టగతులు లేవని భయపడినవారే గానీ భగవంతుని పాదం పట్టి మోక్షప్రాప్తికి అటమటించే సర్వసంగ పరిత్యాగులు మాత్రం కాదు.

ఒకాయన ఉద్యోగం దొరక్క అతి దీనస్థితిలో వున్నాడు. ఏదైనా వుపాయం చెప్పమని ఒక పెద్ద మనిషి దగ్గరికి వెళ్లాడు. ఆయన క్షణమైనా ఆలోచించకుండా ఇలా చెప్పాడుట. "ఈ బుష్ కోట్ వేషంతో లాభం లేదు, కాషాయ వస్త్రం ధరించు. రెండు అంగుళాలు గడ్డం పెంచు. ఒక్క రుద్రాక్షమాల మెడలో వేసుకో. ఇక చూసుకో నీ సంపాదన. ఏడాదిలో దేవుడికో గుడి, నీకో మేడకూడా కట్టించుకోవచ్చు. "

ఇందులో కొంత సత్యం లేకపోలేదు. ఇటీవల ఒక దొంగ భక్తుడు ఒక మహానగరంలో చేరి తను దేవదూతనని సమస్త కార్యాలు సాధించగలననీ చెప్పాడు. ఇంకేవుంది జనం గుంపులు గుంపులుగా వచ్చిపడ్డారంట. అనేకమంది కానుకలు తెచ్చి సమర్పించారట.

ఎప్పుడూ బయటికి వెళ్ళని స్త్రీలు కూడా ఏదో ఒక కోర్కె మనస్సులో పెట్టుకుని ఆయన దర్శనానికి వెళ్ళారట. కానుకలు గ్రుమ్మరించిరట. చివరికి తేలింది ఆయన చెప్పిందేదీ కాలేదని. ఆయనలో ఏ విధమయిన శక్తిలేదని ఈ విషయమాభక్తుని చెవినిపడిందే తరువాయి ఆయన పారిపోయాడట.

***విషయం తేలేసరికి లక్ష సంపాదన***

ఆయనగారిని పట్టుకుని శిక్షిద్దామనుకున్నవారి పాచికలేమీ పారలేదుగానీ అప్పటికే ఆయన ఒక లక్ష రూపాయలు సంపాదించి వెంట తీసుకుపోవడం మాత్రం జరిగిందట. అంతా విచారపడ్డారట. ఒక ముసలి పండితుడు మాత్రం "ఆయన భగవంతుణ్ణి నమ్ముకుని వచ్చాడు. ఆయనకు మేలు జరిగింది. మనం నరుణ్ణి నమ్ముకున్నాం. మనకిలా శాస్తి జరిగింది" అని వ్యాఖ్యానించాడట.

మా చిన్నతనంలో మా వూరికి స్వాములవారు వచ్చారు. ఆయనగారికి వేడినీళ్ళంటే ఎంతో యిష్టం. ప్రతిపూటా పదికాగుల నీళ్ళన్నా పోసుకునేవాడు. తెల్లవారేటప్పటికి వూళ్ళోనుంచి పదికాగులు వచ్చి పడేవి. కాగుక్రింద మంట పెడితే ఎంతో పుణ్యమని స్త్రీలు వచ్చి పడేవారు.

అలా మంటపెట్టడానికి తగువులాడుకోవలసి వచ్చేది. "ఒక్క పుల్ల నన్నుకూడా వెయ్యనియ్యండి పొయిలో. ఒక్కసారి విసరనివ్వండి" అని బ్రతిమాలడం జరుగుతూవుండేది. అలాటి అవకాశం దొరక్కపోతే వారు వేరే పొయ్యి అంటించి, మరో కాగుతో నీళ్ళు పెట్టేవారు.

నీళ్ళు నూతిలోనుంచి తోడుకురావడానికి, వేడినీళ్ళు తొలపడానికి, ముంచి అందించడానికి పోటీలు పడేవారు. స్వాములవారు వచ్చి "తగువులాడకండి. మీరు కాచిన నీళ్ళన్నీ పోసుకుంటా కాగులన్నీ ఖాళీచేస్తా"నని అభయమిచ్చేవారు. ఇచ్చి ఒక ఎత్తుపీట మీద కూర్చుని నీళ్ళు గ్రుమ్మరించమని సిగ్నల్ ఇచ్చేవారు.

ఎంత వేడిగా పోసినా `ఇంకావేడి`, అనేవారు. ఆ మెదడు ఎంత గట్టిదో చెప్పలేం. అసలది మాడా! మాడుపట్టా! బోర్లించిన రాగితట్టా! అనిపించేది.

***వేడినీళ్ళతో వైకుంఠప్రాప్తి.***

మా ప్రాంతంలో ఆయన్ని "వేడినీళ్ళస్వాములు"వారు అనేవారు. రెండుపూటలా అలా స్నానం చేసి, వేళకు 'భిక్ష' చేసి హాయిగా నిద్రపోయేవారు. ఆయనకు నిద్రాభంగం కాకుండా శిష్యులు కాపలా కాసేవారు. "స్వాములవారింకా నిద్రపోతున్నారా?" అని ఎవరైనా అంటే 'అది నిద్రగాదండీ యోగ సమాధి' అని చెప్పేవారు శిష్యులు.

మా బంధువుల్లో ఒకాయన కోపం వచ్చినప్పుడల్లా ఒక కొల్లాయికట్టుకుని దొడ్లో చెట్టుక్రింద కూర్చునేవాడు. వానవచ్చినా లేచేవాడు కాదు. "ఇదేమిటి ఇక్కడ కూర్చున్నారు?" అంటే -

"నేను తెల్లారగట్ట నాలుగింటికి ఆశ్రమం పుచ్చుకున్నాను. ఇక ఇంట్లోకిరాను. పాలు వగైరాలు ఇక్కడికేతెండి - ఏ వూరు వెడదామా! పీఠం ఎక్కడ స్థాపిద్దామా? అనే ఆలోచన తేలలేదు. అందాకా ఇక్కడే వుంటాను. మీరు ఇదివరకటిలాగా 'నాన్నా, బాబాయి, మామయ్యా' అని పిలవకండి. స్వామీ అనండి" అని చెప్పేవాడు.

**(6 ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"ఈ కాలంలో** కుహనా భక్తుల సంఖ్య ఎక్కువైంది. అసలు భక్తులెవరో, కానిదెవరో గుర్తించడం కష్టంగా వుంది" అన్నాను ఒక మిత్రునితో.

"అసలు భక్తులు మనకెక్కడ కనిపిస్తారండీ!? వారు ధ్యానంలో మునిగి ఎక్కడో కూర్చుంటారు. భగవంతునిలో ఎలా లీనమవుదావా? అని తాపత్రయపడుతూ వుంటారుగాని - తక్కిన గొడవలు వారికేమీ పట్టవు. నేను భక్తుణ్ణర్రోయి... నన్ను కలుసుకోండర్రోయి.. నా మహిమలు విని తరించండర్రోయి. నేను భగవంతునితో ప్రతినిత్యం వైర్‌లెస్‌లో మాట్లాడుతానర్రోయి.. విష్ణులోకంలోనుంచి మా ఇంటికి టెలివిజన్ వుందర్రోయి. ఆయన అప్పుడప్పుడు సర్దాగా నా దగ్గిరకు వచ్చి మాట్లాడి పోతుంటాడర్రోయి. అంటూ వారేమీ బొబ్బలు పెట్టరు. అసలు వారి ఎడ్రసులే ఎవరికీ తెలియనియ్యరు. కుహనా భక్తులు చేసే గందరగోళం మాత్రం ఇంతా అంతా కాదు" అన్నాడాయన.

***భగవంతుడితో ఏమైనా పనుందా?***

వీరిలో కొందరు "విష్ణుమూర్తితో మీకేమైనా పనివుంటే నాతో చెప్పండి. ఈసారి కలుసుకొన్నప్పుడు ఆయన చెవిలో వేసి చేయించి వేస్తాను. మనం చెపితే ఆయన కాదనడు. ఇంతవరకు లేదు. ఎన్ని పనులు చేయించానాయినగారిచేత? "

పైగా ఆయనే చెపుతూ వుంటారు "పాపం, ప్రజలు నానా అవస్థలు పడుతూ వుంటారు. వారి కష్టాలు తీర్చాలని నాకెంతో కోరికవుంటోంది. చాలామంది డైరెక్టుగా నాతో చెప్పుకోడానికి భయపడతారు - అసలు చెప్పుకోవడం వారికి తెలియదు కూడా. కనుక నీకు తెలిసినవాళ్ళతో ఇంటర్వ్యూ చేసి నాకు రిపోర్టు చేస్తూ వుండు. వారి కష్టాలు తొలగించివేద్దాం" అంటాడని కొందరు భక్తులు చెపుతూ వుంటారు.

ఇలాటి కుహనా భక్తుల సంఖ్య పెరిగిపోతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. చేతనైతే ఆయన నామం ప్రచారం చెయ్యాలి. మహిమలు వర్ణించాలి, పరుల దృష్టి ఆయనవైపు మళ్ళించాలి. అంతేగాని తమకాయన 'ఇంటిమేట్ ఫ్రెండ్' అని ఏ మంత్రిపుంగవుణ్ణి గురించో చెప్పినట్లు చెపితే ఏం బాగుంటుంది?

ఒకవేళ భగవత్ దర్శనం అవుతుందనుకోండి. అలాంటివారు ఆ తన్మయత్వంలో పడిపోయి తాదాత్మ్యం పొందడానికి ప్రయత్నిస్తారుగాని తమ పలుకుబడిని గురించి పదిమందితో చెప్పుకోవాలని ప్రయత్నిస్తారా?

అసలా మహానుభావుడు అంత తేలికగా కనిపిస్తాడా? కనిపించిన తర్వాత జీవులు మామూలు మానవులుగా ఈ భూమిమీద నిలుస్తారా? తమమీద పుట్టలు మొలిచేదాకా ధ్యానంలో మునిగిన వారికిగాని కనిపించని మహానుభావుడు.

***వైకుంఠానికి ఉయ్యాల మార్గం.***

ఏ మడత కుర్చీలోనో పడుకుని సిగరెట్టు కాల్చేవాళ్ళకూ - ప్రక్క యింటి వాళ్ళతో పోట్లాడేవాళ్ళకూ, అఫిడవిట్ మీద సంతకాలు చేసివచ్చి నిద్రపోయేవారికి, మదమాత్సర్యాలు చంపుకోలేక, భూమినంతా ఏలుదామని, అందమైన వాళ్ళందర్నీ వరిద్దామనీ, అందరి బ్యాంకు ఎక్కౌంట్లూ తమ పేర మార్పించుకొందామనీ, ఆ సొమ్ముతో వైకుంఠానికీ, తనకూ మధ్య ఒక వుయ్యాల మార్గం వేసుకుందామని వుబలాటపడేవారికీ హఠాత్తుగా కనిపించి, కనికరించి వరాలిచ్చిపోతాడా?

భగవంతుని దర్శనమంటే ఒక కథ జ్ఞాపకం వచ్చింది. వెనుకటి ఒక వూళ్ళోకి భక్తుడొకాయన వచ్చాడుట. ఆయన కేవలం కృష్ణభక్తుడట. అందరికీ కృష్ణ దర్శనంచేయిస్తానని వాగ్దానం చేశాడట ఆడా, మగా అందరూ నమ్మారుట.

ప్రతిదినం ఆయనగారికి కావలసిన సపర్యలన్నీ చేస్తున్నారు. ఆయన తన్మయత్వంతో నృత్యం చేస్తూంటే, ప్రజలు కూడా వీధి మధ్యలో చేరి నృత్యాలు చేస్తూండేవారుట. ఆయన మధ్య మధ్యలో "అడుగో అడుగో యదునందునుడు.. అడుగో, అడుగో శిఖిపించమౌళి" అని కేకలు పెట్టేవాడుట.

ఇంకేం వుంది కృష్ణుడు మన దార్లోకి రానేవచ్చాడు. ఆయనకు కనిపించినవాడు మనకు కనిపించడా? అన్న ఆనందంతో మరింత ఎగిరిగంతులు వేసేవారుట. ఈ భక్తబృందంలో స్త్రీలు కూడా పురుషులతోపాటు సమాన సంఖ్యలో వున్నారుట. చాలా నెలలపాటు ఈ నృత్యకేళిన జరుగుతోందిట.

***ఎందుకమ్మా అలా ఎగురుతావు?***

ఇలా వుండగా ఒక రోజున భగవంతుని మీద విశ్వాసంగల ఒక సనాతనుడా వూరు వచ్చాడట. భక్తుల నృత్యం చూశాడుట. నలభై యేళ్ళ వయస్సుగల ఒక స్థూలకాయురాల బరువు భారాలన్నీ మరచిపోయి అదేపనిగా ఎగురుతోందిట. ఆ నృత్యం అయిపోయిన తర్వాత సనాతనుడు ఆ స్థూలకాయిరాల్నే పిలిచి "ఎందుకమ్మా అలా ఎగిరావు? " అని అడిగాడు.

"భగవంతుని దర్శనం అయితే ఎగరక ఏం చేస్తాం?" అన్నదిట.

"మరి భగవంతుడు నీకు కనిపించాడా?" అని ప్రశ్న.

ఆవిడ కొంచెం తత్తరపడింది "నాకు కనిపించలేదుగాని, నా ప్రక్కన నృత్యం చేసిన ఆవిడకూ కనిపించాడు" అన్నదిట.

"ఆవిడక్కనిపిస్తే నువ్వెగరడం దేనికి? " అని సనాతుని ప్రశ్న.

"ఏమో మరి. ఎగరాలనిపించింది" అన్నదట ఆమె. ఆ సనాతనుడంతటితో వూరుకోక ప్రక్క ఎగిరిన ఆమెను కలుసుకుని "ఏమమ్మా! భగవంతుడు నీకు కనిపించాడా?" అని అడిగాడట.

ఆవిడ ఒక నిముషం తేరిపార చూచి - "నాక్కనిపించకపోతే ఏం? మా గురువుగారికి కనిపిస్తారు రోజూ. అందుకని మేమూ నృత్యం చేస్తాం" అందిట.

***కనిపించిన తర్వాత ఎగరవమ్మ.***

"అంత తొందరెందుకమ్మా! నీకూ కనిపించిన తర్వాత ఎగరవచ్చుగా? " అని ప్రశ్న.

"బాగుంది. మా గురువుగార్ని ఒక్కరినే ఎగరమంటే ఏం మర్యాద? " అందిట ఆమె చిరుకోపంతో.

"ఆయనతో మీరందరూ ఎందుకమ్మా! స్త్రీలు గదా! ఇళ్ళలో దేవుణ్ణి పెట్టుకుని పూజించండి అది మంచిది. దయవుంచి ఎగరడం మానివెయ్యండి" అన్నాడట సనాతనుడు.

"పదినెలలనుంచీ ఎగురుతున్నాం ఎలా మానెయ్యడం? ఎలా తోస్తూంది? గురువుగారిని చూచినా, తలచుకున్నా తెలియకుండానే ఎగిరిపోతాం" అన్నదట ఆమె.

"వద్దుతల్లీ అలా ఎగిరినంత మాత్రాన ఆ భగవానుడు దర్శనమివ్వడు. చిత్తశుద్ధితో పూజించాలి. జీవితం ధన్యం చేసుకోవాలి" అని సనాతనుడు బోధించాడుట. అక్కడే ఒక వారం రోజులు మకాం వేశాడుట.

క్రమక్రమంగా ఆ భక్తుల గంతులు తగ్గిపోయాయట. ఒక్కడే గంతులు వేయలేక ఆ గురువు మరో వూరు వెళ్ళిపోయాడుట.

విచిత్ర భక్తులకు చెందిన వినోదాలు కొన్నిటిని ఇంకోసారి....

**(22 ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఈ సంవత్సరం** ఎక్కడ చూసినా అనావృష్టి పరిస్థితులేర్పడినాయి. శ్రావణ, భాద్రపదాలలో అతి జోరుగా కురిసే వర్షాలు ఈ సంవత్సరం అప్పుడో జల్లు, అక్కడో జల్లు కురుస్తూ, నేల మెత్తపడనీయకుండా విత్తనాలు పెరక్కుండా చేస్తున్నాయి.

రైతులు వర్షం వర్షం అంటూ వరుణదేవుని ప్రార్థిస్తున్నారొక్కరీతిగా. ప్రభుత్వం అనావృష్టిని గురించి ఆందోళన పడుతోంది. అనుకున్నట్లుగా వర్షాలు కురిసి పంటలు పండినప్పుడేగా ఎందరెన్ని గంతులు వేసినా?

దేశంలో పాపం పెరిగితే వర్షాలు సకాలంలో కురవకుండా బాధ పెడతాయని మనవాళ్ళ కొక విశ్వాసం వుంది. ఇప్పటివారికది మూఢవిశ్వాసంగా కనిపించవచ్చు.

పరిపాలకులలో ధర్మం లేకపోతే కూడా అనావృష్టి ఏర్పడుతుందనీ, దానివల్ల కరువు కాటకాలేర్పడి, ఆ రాజ్యానికి గల పరువు ప్రతిష్టలు పోగొడుతుందని కూడా మనకు కొన్ని నమ్మకాలుండేవి.

***మంత్రీ! వర్షాల లెక్క చెప్పు.***

నమ్మకాలేమిటి - పూర్వకాలంలో రాజులు మంత్రులను పిలిపించి, "నెలకు ఆరు వర్షాలు కురుస్తున్నాయా? పాడిపంటలు సమృద్ధిగా వున్నాయా? ప్రజలు రోగపీడితులు కాకుండా క్షేమంగా వున్నారా?" అని ప్రశ్నించేవారు. సమాధానం సరిగా వస్తే సంతృప్తి చెంది, తర్వాత తక్కిన రాజకీయాలలోకి దిగేవారు వర్షానికి అంత ప్రాముఖ్యత వుంది మరి.

వర్షాలకు సంబంధించిన 'మూఢనమ్మకాలు' మన దేశంలో చాలా వున్నాయి కప్పను వూళ్ళో వూరేగించి, పసుపు జల్లుతూ వుంటే వాన కురుస్తుందనేది ఒక నమ్మకం.

**కప్పతల్లీ నీళ్ళాడే**
**కడవల నీళ్ళు కావాలి**
**కప్పతల్లి నీళ్ళాడే**
**గొప్పగ వానలు కురవాలి**

అంటూ పాటలు పాడుతూ వుంటారు.

వానలు కురవకపోతే వరుణదేవుని ప్రార్థనలు జరుపుతూ వుంటారు. ప్రజలు భగవంతుణ్ణి మరచి తిరుగుతున్నప్పుడు యమధర్మరాజు కోపగించి ఇంద్ర, వరుణులను పిలిచి భూలోకంలో అనావృష్టి కల్పించమని అడుగుతాడట. ప్రజలలో భక్తితత్పరత ఏర్పడితే తప్ప వానలు కురిపించవద్దంటాడట.

కొన్ని ప్రాంతాలలో అందుకని ఇంద్రుని ప్రార్థించడం కూడా ఆచారం వుంది. ఒక ఆబోతును అచ్చుపోసి వదిలితే వర్షం పడుతుందనే ఆచారం కొన్ని ప్రాంతాలలో వుంది. బీదలకు అన్నదానం జరిగితే వర్షాలు పడతాయనే అభిలాషతో కొందరలా దానాలు చేస్తారుట.

అనావృష్టి సందర్భంలో దుర్భిక్ష మేర్పడుతుంది గనుక అన్నదానాలెలా సాధ్యమా అనిపించవచ్చు. వున్నదాంట్లోనే దానం.. తినబోయేది దానం చెయ్యడంలోనే గొప్ప ఫలితాలున్నాయంటారు పెద్దలు.

***పార్వతీదేవి - మేఘప్రార్థన***

కొన్ని ప్రాంతాలలో పరమశివుణ్ణి ప్రార్థిస్తారు వర్షాలకోసం. ఫాలనేత్రుని దయతో మేఘపూజలేర్పడి, వర్షాలు పడతాయని వీరి విశ్వాసం. శివుడు గరళం మింగి ఆ వేడి భరించలేక వెర్రివాడై తిరుగుతున్నప్పుడు పార్వతీమాత భర్త బాధ చూచి సహించలేక మేఘాలను ప్రార్థించిందట వర్షాలు కురిపించమని.

**ఓ నవనీరద మేఘమాలా?**
**దిగిరావా! దిగిరావా!**
**విషపానముచే వేదన చెందెడు**
**నా పతి తాపము బాపగ**
**దయగొని దిగిరావా!**
**వో నవనీరద మేఘమాలా!**

అని ఆ ఇల్లాలు ఎలుగెత్తి నీలపయోద మాలికలను ప్రార్థించింది. చివరకు గంగవచ్చి శివుని శిరస్సును చేరితేగానీ ఆ తాపం అణగలేదు. మరి మేఘదేవుని ప్రార్థన పార్వతి అంతటి మహా మాతకు కూడా తప్పలేదు.

కొన్ని ప్రాంతాలలోవారికి విఘ్నేశ్వర్డు వర్షాన్నిస్తాడనీ, పంటలు పండిస్తాడనీ, విశ్వాసం వుంది మరో విచిత్ర మేమంటే 'గోండాలు' భీమసేనుణ్ణి వర్షాధిపతిగా తలచి కొలుస్తూ వుంటారు భీమసేనుడేమిటి? అని ఆశ్చర్యంగా తోచవచ్చు. గోండాలకు వరుణుని పేరు చెబితే వాడెవడు అని ప్రశ్నిస్తారు.

కొన్ని పాశ్చాత్య దేశాలలో వర్షం కొసం నగ్న నృత్యాలు చేస్తారుట. ఆ తాపానికి తట్టుకోలేక అలా చేయడం ప్రారంభించి, అదేమిటంటే, వర్షంకోసం అని వంకపెట్టి వుంటారు.

ఈ కాలంలో ఋష్యశృంగులు లేరు. ఉంటే వారిని అనావృష్టి ప్రాంతాలకు తక్షణం తీసుకుపోయి, వర్షాలు కురిపిస్తూ వుండేవారేమో. ఆయనగారికి ఎన్ని గౌరవ బిరుదులు లభించేవో?

***వర్షం కోసం ముసలమ్మల నృత్యం.***

మెసపాటోమియాలో ముసలమ్మల చేతిలో దివిటీలిచ్చి వీధులలో నృత్యం చేయిస్తారట. ఆ దృశ్యం చూడడానికి జనం గుంపులుగా జేరతారట. అలా వారు గంతులు వేస్తే తప్పకుండా చినుకులు పడతాయని వారి నమ్మకం. ముసలమ్మలకు మెయిలు దండు బెదిరి కుంభవృష్టి కురిపిస్తుందా?

మెక్సికో ప్రాంతాలలో వర్షాలు రాకపోతే గ్రామస్తులు ఆ కారణం వైరాలు పెట్టుకుని ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకుంటారట. అలా కొన్నాళ్ళు పనులన్నీ మానుకుని తిట్టుకోడంతో ప్రొద్దులు గడుపుతారట తిట్టుకుంటే మబ్బులెలా కదిలి గంగ కురిపిస్తాయో తెలియదు.

వర్షాలు కురిపించటానికి వివిధప్రాంతాలలో విచిత్రమైన ఆచారాలున్నాయి. ఉత్తర హిందూస్థాన్‌లో అనావృష్టి సంభవిస్తే గ్రామంలో వున్న స్త్రీలు పొలాలకు వెడతారట. ఇద్దరు నగ్న సుందరులను నాగలికి ఎడ్లు కట్టినట్లు కట్టి మరో నగ్నసుందరిచేత మేడిపట్టించి భూమి దున్నిస్తారనీ, సుభాష్ రేలే అనే రచయిత పేర్కొన్నాడు.

ఇలా విచిత్రాలు ఇంకెన్నో వున్నాయి. సామాన్యంగా ప్రజలనుకునే విషయం దేశంలో ధర్మం, సత్యం, భక్తి లోపించడం వల్లనేనని ఆ భావంతోనే ప్రార్థనలు జరుపుతూ వుంటారు. పూర్వకాలంలో నరసింహమెహతా, తాన్‌సేన్ వంటి మహాత్ముడు గానం చేస్తే వర్షం కురిసేదట.

మూగజీవులు గోవులు, మోరలెత్తి ఆకాశం వంక చూచి మౌన ప్రార్థనలు చేస్తాయనీ, వాటి బాధ గమనించి వరుణుడు వర్షం కురిపిస్తాడనీ కొందరంటారు.

***ఆంధ్రదేశానికి దిష్టికొట్టింది.***

ప్రస్తుతం మన ఆంధ్రరాష్ట్రంలో కూడా అనావృష్టి ఏర్పడింది. ఏమిటీ ఘోరమని ఆలోచిస్తున్నారందరూ. ఈ ఏడు పంటలు సమృద్ధిగా పండినాయి. వచ్చే సంవత్సరం గతేమిటని విచారిస్తున్నారు.

నిజానికి మన రాష్ట్రానికి దిష్టి ఎక్కువయింది, రొష్టుకూడా తప్పడంలేదు. 'భారతదేశపు ధాన్యరాశి' అని 'అన్నపూర్ణ' అనీ అన్ని రాష్ట్రాలవారూ చెప్పుకోడం, ఎక్కడ తండులాలు తక్కువైనా ఆంధ్రరాష్ట్రం దాచుకుని కూర్చుంది ధాన్యమంతాననీ, గొడవ చేయడం, నాగార్జున సాగర్ వాళ్ళకెందుకు దక్కాలి? అన్ని చుప్పనాతి తనం పడటం ఇన్నికారణాలవల్ల మన రాష్ట్రానికి దిష్టికొట్టింది.

దీనికేమిటి ఉపాయం? ఎన్ని వాగన్లు తరలిస్తే తగ్గుతుంది? దీనికంటే మంచి వుపాయం దిష్టి తియ్యడం! పది లారీల ఉప్పు ఆంధ్ర సరిహద్దులో త్రిప్పి తెచ్చి బంగాళాఖాతంలో పోస్తే దిష్టితగ్గి అనావృష్టి పరిస్థితి తప్పిపోతుందేమో.

**(24' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మూడుముళ్ళు..** అనే మాటను ఇదివరలో ముచ్చటగా వాడుతూ వుండేవారు.

"ఎదుగుతున్న ఆడపిల్లను చూచి, మూడు ముళ్ళూ పడేదాకానే ఈ ముద్దూ పురిపెం. తర్వాత ఆవిడ అక్కడ - మనం ఇక్కడా. కన్ను పొడుచుకుంటేగానీ కనిపించదు" అనుకుంటూ వుండేవారు.

పుట్టింట్లో పకపకలాడుతూ, పల్టీలు కొడుతూ వుండే ఆడపిల్లల్ని గురించి మాట్లాడేటప్పుడు పెద్దవాళ్ళు అంటూ వుంటారు. "ఈ కొద్దిరోజులే ఏం ఎగిరి గంతులు వేసినా! ఆ మూడు ముళ్ళు పడితే అంతా మూగవాళ్ళయిపోతారు" అని.

"ముద్దు పెట్టలేని వాడు మూడు ముళ్ళూ ఎందుకు వెయ్యడం? ఆ మూడు ముళ్ళతో పంచప్రాణాలు లాక్కుంటాడు." అని కొందరు వ్యాఖ్యానిస్తూ వుంటారు.

***భుక్తిముడి, భక్తిముడి - ముక్తిముడి***

అసలా మూడు ముళ్ళకూ అర్ధమేమిటి? ''భక్తి, భుక్తికీ, ముక్తికీ బాధ్యుడనని చెప్పడమేగా! ఈ ముళ్ళకు అగ్నిదేవుడు సాక్షి. అష్టదిక్పతులూ సాక్షి. ముడేసి తప్పించుకొన్నవాడిని యమదూతలు పడేసి లాక్కుపోతారు'' అని పండితులు వ్యాఖ్యానించడం కద్దు.

సంసార బాధ్యత సరిగా పట్టించుకోకుండా తప్పించుకుని తిరిగే యువకుల్ని చూచినప్పుడు పెద్దలు సలహా చెపుతూ వుంటారు - ''ఒక పిల్లను చూచి వీడిచేత మూడు ముళ్ళూ వేయించండి. ముంగితనం అంతా పోయి రంగా! పాండు రంగా! ఎలా నడుపుతానో ఈ సంసారం. తెల్లవారు ఝూమున లేచి నీ అభంగాలు పాడుకుంటూ బెంగలేకుండా చెయ్యి సంసారం విషయంలో అని మ్రొక్కుకుంటూ వుంటాడు'' అని.

మా వూళ్ళో ఒక ఇల్లాలు చెరువు దగ్గిర స్నానానికి వచ్చి - నీటిలో తను మునక్కుండా బిందె ముంచకుండా రెండు గంటలు నిలబడి వుండేది. ప్రతిరోజూ ఆవిడ చెప్పే వాక్యాలలో వెయ్యడానికి మూడుముళ్ళూ వేశాడు. కానీ ఒక్క ముడి వేసిన బాధ్యతన్నా పైన వేసుకోవడం లేదు. తక్కిన ముళ్ళు వూరుకోలేక వేసినవే. అనేది తప్పకుండా వుండేది.

***పెండికట్లు కట్టినట్లు కట్టాడు.***

కొందరు గయ్యాళి భార్యలు భర్తల్ని తలచుకుని బడబడా మాట్లాడుతూ ''పెళ్ళిరోజున ఒళ్ళు తెలియక పెండికట్లు కట్టినట్లు మెడకు కట్టాడే సూత్రం. ఈడొచ్చినవాడే గదా - సూత్ర బంధనలోగల నిబంధనలెరుగడా? అనుకున్నాం. కానీ ఆ ముళ్ళతోనే భార్యకు మోక్షం వస్తుందనుకున్నాడు గావన్ను. మళ్ళీ వాటిమాటే పట్టించుకోవడం మానేశాడు'' అంటూ మెత్తని ధూళి ఆయన శిరస్సున జల్లించి పోస్తూ వుంటారు.

ఈ రోజుల్లో మూడు ముళ్ళు పడటమనేది పెద్ద క్రతువుగా పరిణమించింది. ''సంసారాలలో ముద్దుగా పెంచాం. బుద్దులు చెప్పించాం. పుణ్యవ్రతాలు చేయించాం కాళ్ళు కడిగి మీకు అందించదలిచాం? మూడు ముళ్ళూ వేసి మురుస్తూ తీసుకు వెళ్ళండి'' అంటే కళ్ళెర్రచేసి ''కానుకలేం ఇస్తావో చెప్పవేం? ఒక స్కూటర్ నాకివ్వాలి. ఒక హీటర్ మీ అమ్మాయికివ్వాలి. ఒక రేడియోగ్రాం నాకివ్వాలి. ఒక గ్యాస్ స్టవ్ మీ అమ్మాయికివ్వాలి. ఒక టేప్ రికార్డర్ నాకివ్వాలి. ఒక గ్రైండర్ మిషన్ మీ అమ్మాయికివ్వాలి. ఒక బ్రయిస్ కూలర్ నాకివాలి. ఒక ఎయిర్‌కూలర్ మీ అమ్మాయికివ్వాలి. ఆధీనం తప్పిన మా అమ్మ అన్ని పుణ్యక్షేత్రాలు తిరిగేందుకు ఎయిర్ టికెట్ కొని ఇవ్వాలి. పెద్దమనుషులు కాని చెల్లెళ్ళిద్దరున్నారు. వారు చదివినంతకాలం మీరే స్వయంగా స్కాలర్‌షిప్‌లివ్వాలి. '' అంటూ ఒక జాబితా అందచేస్తారు.

***అమ్మాయి మెడకు మూడు - నా మెడకు ముప్పయి***

ఇలాటి కోరికలన్నీ విన్న ఒక తండ్రి ''మా అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళూ నా మెడకు ముప్పయి ముళ్ళూనా?'' అని వెర్రిమొహం పెట్టాడుట.

పూర్వకాలంలో మూడు ముళ్ళూ పడ్డ పిల్లను, ముద్దుగా అత్తవారింటికి పంపుతుంటే అందరి కన్నీళ్ళూ వాగులయ్యేవి. ఈ రోజుల్లో ఆడపిల్ల పుట్టినప్పటి నుంచీ కళ్ళు సెలయేళ్ళుగా మారిపోతున్నాయి. ఎన్ని కానుకలివ్వాలో, ఎలాటివాడొస్తాడో, పిల్ల ఏమైపోతుందోనన్న భయం ఏర్పడుతోంది.

సంసారాలు సక్రమంగా సాగడంలేదని తెలుసుకొన్నప్పుడల్లా తల్లితండ్రుల హృదయాలు ఉల్లిపొరల్లాగా వూడిపోతున్నాయి. ఇటీవల ఒక గృహస్తు పిల్ల పెళ్ళిచేయడానికి ఎంతో ప్రయత్నించి విఫలుడయ్యాడట చివరకు ఎవడో ఒకణ్ణి నామ్‌కేవాస్తే నాధుణ్ణి కుదుర్చుకు వచ్చారు.

''ఇదేమిటి నాన్నగారూ, ఈయనెక్కడ దొరికాడు? ఎలా పెళ్ళాడేది?'' అని కుమార్తె ప్రశ్నించిందిట.

"ఏం చెయ్యమంటావమ్మా.. ఎంతో వెతికాను. ఎక్కడా సరి అయినవాడు కుదరలేదు. ఎంతకాలం వుంచనమ్మా నిన్నిలా మెళ్ళో మూడుముళ్ళూ పడాలిగదా?" అన్నాడు తండ్రి.

***మూడుముళ్ళకు బదులు ఒక్కముడి.***

"బయటివాడెవడో వచ్చి మూడు ముళ్ళు వేయడంం దేనికి నాన్నగారూ! నే నొక్కముడి వేసుకుంటే సరిపోతుందిగా మీకు శ్రమ" తప్పుతుంది అన్నదట కుమార్తె.

కానీ వాళ్ళచేత కంఠానికి ఉచ్చులు బిగింపచేసుకుని జీవితమంతా నరకయాతన పడటమెందుకని చాలామంది ఈడొచ్చిన పిల్లలు కీడెంచి, అఘాయిత్యాలకు దిగడం కూడా జరుగుతోంది.

బాగా వయసు వచ్చిందాకా పెళ్ళి చేయకుండా ఇంట్లో వుంచి, ఇల్లు కాలుతుండగా నుయ్యి త్రవ్వే ప్రయత్నాలు జరపడం పరిపాటి అయిపోయింది ఈరోజుల్లో. "కుర్రవాడి వివరాలు, వంశమర్యాదలు, రాబడిపోబడులు విచారించండి కొంచెం. జీవిత బంధంగాదా ఇది మరి " అని భార్య అంటే -

"ముందు మూడుముళ్ళూ పడనీ తర్వాత ఆలోచిద్దాం. నువ్వు చెప్పిన ప్రకారం పెళ్ళి చెయ్యాలంటే పిల్లకు ఎనిమిదో ఏటే అన్వేషణ ప్రారంభించాల్సింది" అని భర్త సమాధానం.

"ముళ్ళు పడగానే సరిటండీ పిల్ల తర్వాత కడగళ్ళలో పడదూ ఇంత ఆలస్యం ఎలాగూ అయింది గనుక మారాం ముళ్ళు లేని సంసారంలో పడితే కొంత నయం" అని భార్య.

"మారాం ముళ్ళో ఏమో ఎలా తెలుస్తుందే ఏ కుర్రవాణ్ణి చూచినా ఎంతో ఎత్తునుంచి మాట్లాడుతున్నారు. కాస్త పలకరిస్తే పరవళ్ళు తొక్కుతున్నారు. ఆడపిల్లల్ని కన్నవాళ్ళు గుండెలు జీలగబెళ్ళు అయిపోతున్నాయి" అని ఆయన దీనాలాపం.

***మనసులు ముళ్ళు పడటమే 'మహిమ'***

మొన్న ఒక యువకునికి చాలాకాలానికి సంబంధం కుదిరింది. లగ్నం సమయంలో మూడుముళ్ళూ వేసి ఆపకుండా ఏడెనిమిది ముళ్ళు వేసి పారేశాడు. "అక్కడ వున్నవాళ్ళు మూడు చాలయ్యా! అంతకన్నా ఎక్కువ వెయ్యకూడదు" అన్నారు.

"మీకేం తెలుసు ఉండండి. ఈ రోజుల్లో మూడు ముళ్ళ ఫోర్సు చాలడం లేదు. మళ్ళీ మళ్ళీ వేస్తామా ఏమన్నానా? పది ముళ్ళన్నా వేస్తేగానీ బాధ్యత తెలియదు. నేను సంసారం అందరి మల్లే చెయ్యదలచుకున్నా" అని నవ్వుతూ సమాధానం చెప్పాడు.

మనసులు ముళ్ళు వేసుకుంటే మంగళసూత్రం ముళ్ళు ఎలా వేసినా ఫర్వాలేదు. ఆ మనసులు ముళ్ళు పడనంత వరకు, తాళి బొట్టు కట్టడం ఎగతాళి అవుతుంది గాని - వలపుల పాళీ ఎలా అవుతుంది.

**(27 ' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"వినాయక చవితి** వచ్చింది. ఈ సంవత్సరం బియ్యం కొంచెం దొరుకుతున్నాయి. పప్పుల ధరలు కొంచెం తగ్గినాయి. కొంచెం పెద్ద సైజే ఉండ్రాళ్ళు చేసి, ఇంత పప్పు వండి నైవేద్యం పెట్టి నాలికమీద వేసుకుందాం" అని అందరూ ఉబలాటపడ్డారు.

అదేం విచిత్రమో? కథ అంతా తారుమారైంది. బియ్యం ధర పెరిగింది. పప్పులు పెరుగుతున్నాయి. ఓ మూల పడివుండే చింతపండుక్కూడా సిరి హెచ్చింది. మళ్ళీ అన్ని వస్తువులూ 'వెలయాలి చిలిపి చూపులు' చూస్తున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ముందు అవి అలా మోళీ కట్టి వయ్యారం ఒలకపోస్తుంటే ఇంకా పండగేమిటి? ఉండ్రాళ్ళేమిటి?

చింతపండు ఎక్కువగా పండేచోట వరదలొచ్చాయనీ, అందువల్ల దిగుమతి తగ్గి ధర పెరిగిందనీ దుకాణదారులు చెపుతున్నారు. దిగుమతి తగ్గడం కాదూ - ఏమీ కాదు. వరద వచ్చిందని తెలియగానే టోకు వర్తకులు తమ వద్ద వున్న సరుకుని నిర్బంధించి 'చింతపండు వ్యామోహం' కల్పించారని కొందరంటున్నారు.

***దాచడం - ధరలు పెంచడం.***

ఎవరు దాస్తున్నారో, ఎక్కడ దాస్తున్నారో, ఎందుకు దాస్తున్నారో? ఇవన్నీ ఆలోచించేదెవరు? మనకు తెలిసేదల్లా ధర పెరగడమే. దేశంలో అనావృష్టి ఏర్పడిందని పత్రికలలో చదవగానే ధాన్యం దాచివెయ్యడం ధరలు పెంచివెయ్యడం ప్రారంభమైందంటున్నారు.

"ఆగస్టులోనే ఇంత గాబరా పడుతున్నారు మీరు అక్టోబరు, నవంబరు నెలల్లో చూడండి తమాషా?" అని కొందరు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పండగలేమిటి? పబ్బాలేమిటి?

***గణపతి బొమ్మతో విజ్ఞప్తి***

ఈ పరిస్థితులన్నిటినీ తలచుకుని మా ఇంట్లో నిరుడుకొన్న విఘ్నేశ్వరుని బొమ్మ ముందు నిలచి ఏమంటావు? ఏనుగు దేవుడా నరులనుభవించే బాధలు నాన్నతో, అమ్మతో చెప్పావా? భూలోకంలో నీకోసం ఏదైనా ఒక 'ట్రస్టు' ఏర్పాటు చేయించేవారేమో? వారేగా నీకు వరమిచ్చింది ఇంటింటా పూజిస్తారని.

"పూజలకేం పూజలు సాగుతాయి. ఒక బొమ్మ, పాలవెల్లి, పత్రీ తెస్తాం. నీ పాటలు, పద్యాలు చదువుతాం. కైవత్తులు వెలిగిస్తాం. నైవేద్యం దగ్గరికొచ్చేటప్పటికే పళ్ళాల వంక చూడవలసి వస్తోంది" అని చెప్పాను.

ఆయన అప్పుడేం జవాబు చెబుతాడు? ఆయన వంక చూస్తే మాత్రం విన్నట్టుగానే తోచింది. నేను వచ్చేసి నిద్రపోయాను. తెల్లవారే చవితి. రాత్రి వంటిగంట వేళ. ఆయన కలలో కనిపించారు. వెంట ఒక వెయ్యి మూషికాలున్నాయి. ఆయనో పెద్ద సిల్కు లాల్చీ ధరించి, ప్రక్క జేబుల్లో చేతులు పెట్టుకుని నిలబడ్డాడు. కిరీటం లేదు. గిరజాల జుట్టు నున్నగా దువ్వారు.

ఆయన్ని చూడగానే ఇదేమిటి మూషికాలన్నిటినీ మీ వెంట పెట్టుకుని వచ్చారు? అన్నాను. ఆయన కొంచెం కోపంగా చూచి "ఏం? మీ నరులందరూ తలో సేనా ఏర్పాటు చేసుకోగాలేంది నేనే నా చేసుకోలేంది" అన్నారు.

నేనేం చేసుకోవద్దనడం లేదు. ఈ సేన కార్యక్రమమేమిటి? అన్నాను.

***నైవేద్యాలు లేవు - నీరాజనాలు హుళక్కి***

"అట్లా అడుగు చెపుతాను. దేశంలో దొంగ నిల్వలు చేసేవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. వారినెవరూ అరికట్టలేకుండా వున్నారు. అందువల్ల నరులు వస్తువులు దొరక్క నానా అవస్థలూ పడుతున్నారు, పండగలు లేవు పబ్బాలు లేవు. దేవతలకు నైవేద్యాలు లేవు నీరాజనాలు హుళక్కి. ధర్మాలు తారుమారై పోతున్నాయి.

అందుకని దొంగనిల్వలెక్కడెక్కడ వున్నాయో కనిపెట్టి సంచులుంటే తెగగొట్టి, వీలైనన్ని ధాన్యాలు భక్షించి, కొన్నిటిని చెడగొట్టి ఆ కుటిల వ్యాపారులను శిక్షించడమే మా సేన ఆశయం" అన్నారాయన.

"కొద్దో గొప్పో నష్టపరిచినంత మాత్రాన వారికి బుద్ధి వస్తుందా స్వామి. ఏదైనా కఠిన చర్యతీసుకోవాలిగాను?" అన్నాను.

"అంత తొందరపడతావేం? సేన కార్యక్రమం క్రమక్రమంగా పెరుగుతుంది. ఇనుపతాళాలు విరిచివేస్తారు. ఇనుపచువ్వలు నరికేస్తారు. ఇటీవల ఇంగ్లాండులోనో ఎక్కడో, తెల్లారేటప్పటికి మోటారు డైనమోతో కూడా ఇంజనంతా కొరికి ముక్కలు చెయ్యలా. వారిని కొందర్ని పిలిపిస్తున్నాం. ఇక్కడవారికి శిక్షణ ఇవ్వడం కోసం. మా మూషిక సేన ముందు ఏసేనా ఆగలేదు" అన్నారు గణపతి.

"మంచిపని తలపెట్టారు. దాపరికం వల్ల ధరలు పెరిగి నరులు బలహీనులైపోతున్నారు. మీ ఉద్యమం విజయవంతం కావాలి పార్వతీ తనయా" అన్నాను.

***మూషికసేన కార్యక్రమం***

"ధాన్యం పాడు చేయడమేకాదు. వాటిని దాచినవారిపైన యుద్ధం చేయడానికిక్కూడా మా మూషిక సేన పూనుకొంటోంది. దొంగ వ్యాపారస్తుల్ని నిద్రపోనియ్యవు. పరుపులు, మంచాలు కొరికిపారేస్తాయి. ఒక వంద మూషికాలు నిద్రపోయే ఆ వ్యాపారస్థుడి మీద ఎక్కి విడిచిపెడతాయి" అన్నారు ఆ ఏకదంతస్వామి.

"మరి తెల్లారితే చవితికదా! మీకు సరి అయిన ఉండ్రాళ్ళు అందడంలేదు గదా! మీరు ఎలా సరిపెట్టుకుంటున్నారు సామీ?" అన్నాను.

"ఏం చేస్తాం? కాలాన్నిబట్టి మనం కూడా మారాలి. ఉండ్రాళ్ళు గుండ్రాళ్ళలాగా వుండక్కరలేదు - గోలీలలాగే వున్నా చాలు భక్తి ప్రధానం అని నిశ్చయించుకున్నాను. నిరుటి చవితికి ఒక మధ్య తరగతి కుటుంబీకుడు అరడజను ఇడ్డెన్లు తెచ్చి వాటిని గుండ్రంగా పిసికి పది శెనగ బద్దలు అద్ది నైవేద్యం పెట్టాడు.

ఆవిరి మీద ఉడికిందే నాకు కావలసింది గనుక అవి స్వీకరించి ఆశీర్వదించాను. పూజా విధానం, ప్రార్థనా విధానం మార్పు చేయించాలి" అన్నాడా ముక్కంటి ముద్దుల తనయుడు.

"మరి దేశంలో అనేక 'ఇజాలు' బయలుదేరినాయికదా! మీరు భూలోకంలో ఏ ఇజం వ్యాప్తి చేయ తలచుకున్నారో కొంచెం వివరిస్తారా" అని ప్రశ్నించాను.

***'తిండిజం'ను గురించి ప్రచారం***

ఆయన కోపంతో తొండం పైకెత్తి అటూ, ఇటూ తీవ్రంగా విసిరి ఈ ఇజాలవల్ల నరజాతికి కలిగే లాభం ఏమీలేదు. అవన్నీ భేషజాలు. నేను భూ లోకంలో 'తిండిజం' ప్రచారం చెయ్యదలిచాను. ఈ 'ఇజం' తర్వాతనే అన్ని 'ఇజాలు హజాలూ'

మేము భూమాతతో రాయబారం జరుపుతాం. ఎక్కువ పండించమని? వరుణదేవునికి విజ్ఞప్తి చేస్తాం. సకాలంలో వర్షాలు కురిపించమని. రైతుతో చెప్తాం నువ్వే అసలైన రాజువని. పంటలు దాచేవాళ్ళను పట్టి బాధిస్తాం" అని ముందే చెప్పానుగా.

లోకంలో తిండి కొరత వుండకూడదు. ఎక్కడ పడితే అక్కడ ధాన్యం రాసులు కనిపించాలి. ప్రతివ్యక్తి సుష్టుగా తిని తేపుతావుండాళి. అప్పుడు ఇతర 'ఇజాలన్నీ' హజామత్ అవుతాయి. ఈ 'తాజాఇజం' వర్ధిల్లాలని ప్రచారం చెయ్యండి" మీరంతా అన్నారాయన.

ఇంతలో బయట పాలికేక వినిపించి మెలుకువ వచ్చింది. వీధిలో పువ్వులూ, పత్రీ, పాలవెల్లులూ అమ్ముతున్నారు. నేను కలను గురించి ఆలోచిస్తున్నాను. మా మనువడు వచ్చి "గణపతి బొమ్మ తేవాలి తాతయ్యా" అన్నాడు.

"అవును" అన్నాను ఆలోచిస్తూనే.

"ఏమిటి ప్రొద్దున్నే ఆలోచిస్తున్నారు?" అన్నాడు మనుమడు.

"తిండిజం" బాబూ అన్నాను.

**(31' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**తిరుపతి వేంకటేశ్వర** ప్రభువును గురించి ఏడుకొండల వైభవాన్ని గురించీ ప్రసంగం వచ్చినప్పుడు కొందరు "ఆ కొండ ఎక్కి ఆ స్వామికి మ్రొక్కే ప్రాప్తం ఇంతవరకు కలగలేదు. జీవితంలో ఏం పాపం చేసుకున్నామో" అని విచారపడుతూ ఉంటారు.

సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తుండగా చూడడానికి వచ్చినవాళ్ళు కొందరు "రెండేళ్ళనుంచి ప్రయత్నం. ఇంతవరకు వ్రతం చేసే అవకాశం కుదరలేదు. ఎప్పుడు ప్రాప్తమో ఏమిటో" అని దిగులు పడుతూ ఉంటారు.

***కళ్ళూ కాళ్ళూ ఉండగానే కాశీ.***

పూర్వకాలం వాళ్ళు "కళ్ళూ, కాళ్ళూ సరిగ్గా వుండగా వెళ్ళి కాశీ విశ్వనాధుణ్ణి దర్శించే ప్రాప్తం వుందో లేదో ఈ ఘటానికి" అని నైరాశ్యంలో పడుతూ వుండేవారు.

కొందరు ముసలమ్మలు వీధిని పోయేవారిని పలకరించి, నిలబెట్టి "ఇట్లా మొండికట్టెలాగా వీధిలో నిలబడటమేగాని, మనుమణ్ణి ఎత్తుకుని ముద్దులాడుతూ నిలిచే ప్రాప్తం ఇంతవరకు కలగలేదమ్మా! కోడలంటే కొడుకుని కంటుందనుకున్నాం గాని ఎక్కడేసిన గొంగళి అక్కడేనని ఎవరనుకుంటారు చెప్పమ్మా! "

"పెళ్ళాడేముందు నీళ్ళాడతావా? లేదా? అని ప్రశ్నించి చేసుకుంటామా? అందరి కోడళ్ళతో పాటేననుకున్నాం. వచ్చిన ఏడాదికల్లా వసారాలో జోలపాట వినిపిస్తుందనుకున్నాం. మాకా ప్రాప్తంలేదు. తల్లి ప్రాప్తం లేదు. ముందునుంచే మురిసినందుకు ప్రాయశ్చిత్తమైంది" అని ఎదురు బాదుకొంటుందావిడ.

***పనసకాయ ప్రాప్తం ప్రక్కింటికే.***

ఈ ప్రాప్తాలు భక్తినుంచి ముక్తివరకూ సంతానం నుంచి సుతవస్తువలవరకూ ఉంటాయి. "ప్రక్క ఇంటాయన సంతకెళ్ళి కుండంత పనసకాయ కొనుక్కు చక్కా వచ్చాడు. బారెడు ప్రొద్దెక్కగానే మా వాడు ఇడ్లెన్ను తిని, ఇట్లా, అట్లా తిరిగి, స్నానం చేసి, కాఫీ త్రాగి, కాసేపావిడతో కబుర్లు చెప్పి వెళ్ళేసరికి ఒక్క పనసకాయ లేదుట సంతలో. కొందామనుకున్న రోజున కోర్కె ఎక్కువవుతుంది. ఏం లాభం? ప్రాప్తం వుండొద్దూ. బుద్ధిపుట్టిన వారానికి సిద్ధించింది కోరిక అన్నట్లుంటాయి. ప్రాప్తాలు లేకపోతే ప్రక్క ఇంటి కొచ్చిన పనస మన ఇంటికి రాకపోవడమేమిటి? ఆ వాసన మనకు కొట్టి మనం బాధపడటమేమిటి?" అని ఒకనాడొక ముసలమ్మ ఆవేదన పడటం విన్నాను.

మనసైన చీరకట్టుకుని, తలకు మల్లెపూలు చుట్టుకుని, అరుగుమీద స్థంభం పట్టుకుని, మాటిమాటికీ కాలితో కుచ్చెళ్ళు నెట్టుకుని పారిపోతుందనే భయం కలిగినట్టు పమిటను గట్టిగా మెలివేసిపట్టుకుని, మధ్య మధ్య గడియారం చెవిదగ్గర పెట్టుకుని, అంతవరకూ ఎలాగో తట్టుకున్న పడుచు ఇల్లాలు.

***సినిమా మొదటిరోజు ప్రాప్తం.***

"అబ్బే ఇక ఇవ్వాల్టికి సినిమా ప్రాప్తంలేదు. ఎంత చెప్పినా వేళకు కొంపకు రారాయే!. రోజూ అయిదింటికే సంప్రాప్తమయ్యే మనిషి ఇవ్వాళ ఆరున్నరదాకా దయచేయక పోవడమేమిటి? ఇంతకీ మొదటి రోజున సినిమా చూచే ప్రాప్తం లేదు" అని స్వగతం చెప్పడంలో తగినంత అభినయం గోచరిస్తుంది.

"రెండేళ్ళ మా అమ్మాయిని ఫిలిం కంపెనీల చుట్టూ తిప్పావు. ఒక్క వేషం దొరుకుతుందేమోనని. శీలం అనుమానంలో పడిందిగాని సినిమా వేషం ప్రాప్తించలేదు" అని ఒక "పెంపుడు తల్లి" చెంపలు బాదుకుంటూ ఏడ్చింది.

***తారల్ని చూచే ప్రాప్తం దక్కలేదు.***

ఇటీవల మా మిత్రుడొకడు షష్టిపూర్తి దగ్గరలో పడింది. వచ్చాడు నన్ను చూడటానికి కొంచెం సేపు మాట్లాడిన తర్వాత "నీతో ఒకమాట చెప్పాలనుకుంటాను. ఇంతవరకు సినిమాతారల్ని వెండి తెరమీదా, పోష్టర్లలో చూడటమేగానీ ముఖాముఖిని చూచే అవకాశం లభించలేదు. ఈ కోరిక ఇలాగే వుండిపోయింది. నిజానికి నువ్వు మద్రాసులో ఉండగా ఎలాగో అలా తీరుబడి చేసుకుని వచ్చి అందర్నీ చూద్దామనుకున్నా. కానీ ప్రాప్తం లేదు. ఎప్పుడు వద్దామన్నా పడలేదు" అన్నాడు.

"అప్పుడు రావలసింది. చాలామందిని చూసేవాడిని" అన్నాను.

"అయిపోయిందేదో అయిపోయింది. పోనీ ఇపుడు నువ్వొస్తానంటే బయలుదేరతా! రెండు రోజులు ముందు చెప్పుచాలు" అన్నాడు.

ఈ సందర్భంలో వెనుకటి వృత్తాంతమొకటి జ్ఞాపకం వచ్చింది. నేను మద్రాసులో వుండగా మా యింటికో బంధువు వచ్చాడు. సుమారు ఇరవై యేళ్ళుంటాయి. వచ్చిన ఉద్దేశ్యం సినిమా స్టార్సుని చూడాలని కాబోలు.

ఒకరోజు ఉదయం శ్రీ నాగేశ్వరరావు, శ్రీ దుక్కిపాటి మధుసూదనరావును చూడటానికి వచ్చారు. శ్రీ మధుసూదనరావు మేమున్న ఇంటి మేడమీద ఉన్నారు. శ్రీ నాగేశ్వరరావు తిరిగి వెడుతూ మా సావిట్లోకి వచ్చి మాట్లాడి వెళ్ళారు. ఆ సమయంలో మా యింటికి వచ్చిన కుర్రవాడు "బాత్‌రూమ్"లో ఉన్నాడు. బయటికి రాగానే ఇలా నాగేశ్వరరావు వచ్చి వెళ్ళాడని చెప్పారు. ముందు కొంచెం సేపు నన్ను లేదు. నేను నిజమే నని చెప్పాను.

ఇక ఆ కుర్రవాడు ఇంచుమించుగా మూర్ఛపోయాడు. సోఫాలో పడుకుని తల బాదుకున్నాడు.

"ఛీ....ఛీ... దిక్కుమాలినవాణ్ణి. సమయానికి స్నానానికెళ్ళావేమిటి? ఒక అరగంట ఆగిచేస్తే ఏం ముంచుకుపోయింది. ఆయన్ని చూడటం పడితే అయిదురోజులు స్నానం చెయ్యకపోతే మాత్రం మేం.

***ఏడు గంటలకే వెధవ స్నానం.***

"ఇంటికి వచ్చినా చూడక పోవడమేమిటి? అయ్యోయ్యో! నాకు ప్రాప్తం లేదు ఇంత దూరం వచ్చినందుకూ, ఆయన ఇంటికి వచ్చినందుకూ నేను చూస్తే ఎంతో బాగుండేది. ఏడుగంటలకే వెళ్ళాను వెధవస్నానానికి. నాకు ప్రాప్తిలేదు. లేదు" అని తల బాదుకున్నాడు.

***కపాల మృదంగ వాద్యం***

ఆయన బాధ చూడలేక "ఎందుకంత ఇదిగా తల బాదుకుంటావు. సాయంత్రం నేను తీసుకువెళ్ళి చూపిస్తాలే" అని బ్రతిమాలి ఆ కపాల మృదంగ వాద్యం ఆపించాను.

ఈ ప్రాప్తాలనేవి ప్రతివారి నోటివెంటా అనేక మాట్లు వినిపిస్తూ వుంటాయి. నల్లటి నారీమణితో కాపురం చేస్తున్న పురుషుడు "ఈ జన్మకికి ఎర్రపెళ్ళాం ప్రాప్తంలేదు" అని మధ్య మధ్య దిగులు పడుతూ వుంటాడు.

వెనుక హిందీ తార దేవికారాణి రష్యన్ కళాకారుడు రోలిక్‌ను వివాహమాడిందనే వార్త పత్రికలో పడగానే మా మల్లినాథ సూరి చదివి ఆ అదృష్టం రష్యన్ వ్యక్తికి ప్రాప్తించింది. ముప్పయికోట్ల భారతీయులలో ఒక్కడికి దక్కలేదు" అని ఎంతో విచారపడ్డాడు.

ప్రాప్తాల చరిత్ర అనంతం. అందుకని ఇక్కడితో ఆపివేస్తున్నాను.

**(8 ' అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఫోనులు నిజానికి** ఎంతో ఉపకారం చేస్తాయి. కాళ్ళతీతలు రిక్షా, టాక్సీ, వగైరా ఖర్చులు లేకుండా దూరంలో వున్న వాళ్ళతో మాట్లాడమనే సౌకర్యం కల్పించి ఎంతో హాయినిస్తాయి.

ఏదైనా పనివుండి ఫోను చేస్తామనుకోండి. అవునంటే సంతోషమే. కాదనడం సంభవించినా - ఏదో అనేస్తారు. వారి ముఖం మనం చూడనక్కరలేదు. మన ముఖంలో దిగులు వాళ్ళు చూడరు.

"ఏదో ఎరుగున్న వాడుగదా అని అడిగితే ముఖం మీదే కాదనేశాడు" అని తలుచుకు తలుచుకుని బాధపడటం వుండదు.

***మీరెవరు? ఎక్కడినుంచి మాట్లాడటం?***

ఈ ఫోనుల సంభాషణల్లోకూడా కొన్ని చిక్కులున్నాయి. అదేం తమాషో ఫోను తీసి ఫలానావారు వున్నారా? అంటే ఉన్నారూ లేరూ అని చెప్పరు. వెంటనే "మీరెవరు?" అంటారు. మనం అర్జీ క్రింద సంతకం చేసినట్లు పూర్తిపేరు చెప్పాలి. ఆ తర్వాత "ఎక్కడ నుంచి ఫోను చేస్తున్నారు?" అని ప్రశ్న.

"ఫలానా చోటినుంచి స్వామీ" అని చెప్పాలి.

ఇంతట్లోనే మరొకరు ఆ ఫోను తీసుకుని "ఇంతకూ మీకు కావలసిందెవరండీ?" అని ప్రశ్న.

"చెప్పాను కాదండీ! ఫలానావారు కావాలి" అని చెపుతాం.

"ఆయనలేరండి ఊరు వెళ్ళారు."

"ఊరు వెళ్ళారా!? ఎప్పుడు వస్తారో తెలుసా కొంచెం అర్జంటు పనివుంది వారితో."

"ఎప్పుడు వస్తారో తెలియదు" అని దభాలున ఫోను పెట్టేస్తారు.

కొందరు పాపం దయతలచి "బహుశః నాలుగురోజుల్లో రావచ్చు" అని చెపుతారు.

నాలుగురోజులైన తర్వాత మళ్ళా ఫోను చేస్తే "అవునండీ వూరు వెళ్ళారు. అయిదారు రోజుల్లో రావచ్చు" అంటారు. అడిగిన కొద్దీ గడువు పెరుగుతోందేమిట్రా పరమాత్మా! అని ఊరుకోవాలి. అంతకన్నా చేసేదేం వుంటుంది?

ఒక్కొక్కప్పుడు మళ్ళీ ఎప్పుడు పిలవాలో తోచక "చూడండి మా ఫోను నెంబరిస్తాం. కొంచెం వారు రాగానే ఫోను చెయ్యమంటారు" అని అడగడం జరుగుతుంది. ఫోన్ నెంబరు మాత్రం తీసుకుంటారు కానీ ఆరు నెలలు ఎదురు చూసినా వారు ఫోన్ చెయ్యడమంటూ ఉండదు.

***అరగంట ఆగి పిలవండి: ఇది లంచ్ టైం.***

ఇటీవల ఉద్యోగంలో ఉన్న ఒక మిత్రుడి ఇల్లు ఎక్కడో కనుక్కొని వాళ్ళ యింటికి వెళ్ళి చూసివద్దామని అయిదారుసార్లు ఆఫీసుకి ఫోను చేశాను. ఒకసారి అడిగితే మీటింగ్‌లో ఉన్నాడన్నారు. మరోసారి అడిగితే "లంచ్ తీసుకుంటున్నారు ఒక గంట ఆగి చెయ్యండి" అన్నారు. గంట ఆగి చేశాను. "రెస్టు తీసుకుంటున్నారు ఇంకో గంట ఆగి ఫోను చేస్తాను సరే - ఆయన ఆఫీసులో పని ఎప్పుడు చేస్తున్నాడు" అని అడుగుదామనిపించింది. కానీ ఉన్న మొహమాటం కాస్తా ఊడిపోతుందని ఊరుకొన్నాను చివరికి తెగించి ఆ పలుకుతున్న పెద్ద మనిషినే వారి యింటి ఎడ్రసు చెపుతావా? అన్నాను. "ఒక అరగంట ఆగి ఫోను చెయ్యండి అయ్యగారినడిగి చెపుతాను - ఇప్పుడెవరితోనో మాట్లాడుతున్నారు" అని గభాలున ఫోను పెట్టేశాడు.

చాలామంది మాత్రం "మీరెవరు?" అని అడగడం జరుగుతుంది. ఒకరోజు వరసగా ఆరుగురు ఇదే ప్రశ్న వేశారు.

"అవతల పెద్దమనిషి పలకవచ్చు. మరేం ప్రమాదం లేదు. నేను సామాన్యమైన మనిషినే. అయినా ఫోన్‌లో కరుస్తానా?" అనాల్సిన సందర్భం వచ్చింది.

***అమ్మగారి తాలూకేమోనని అడిగా!***

''అదికాదండి. అయ్యగారు ఈపూట ఎవరు ఫోను చేసినా వారికి కనెక్షన్ ఇవ్వవద్దు, లేరని చెప్పమన్నారు.'' అన్నాడు.

''మరి అంతకాడికి పేర్లు అడగడం, ఈ పరామర్శ దేనికి?'' అన్నాను.

''ఒకవేళ అమ్మగారు ఇంటిదగ్గర మంచి ఫోను చేస్తారేమో వారికి మాత్రం కనెక్షన్ ఇద్దామని'' అన్నాడు.

''అమ్మగారిది ఆడగొంతుక కాదుటయ్యా. మొగాళ్ళ పేర్లు అడుగుతావెందుకు? అన్నాను విసుగ్గా.

''అమ్మగారు ఒకప్పుడు డ్రైవర్ చేతా, ఒకప్పుడు నౌకరుచేతా, ఒకప్పుడు ఇంటికొచ్చిన చుట్టాల చేత ఫోను చేయిస్తూవుంటారు. అలాటప్పుడు మొగాళ్ళందరు లేరని చెప్పేస్తే తంటాకాదూ'' అన్నాడు పాపం.

ఫోను చేసేవాళ్ళ అవస్థలు చేసే వాళ్ళని అక్కడ జవానులు చెప్పేవాళ్ళ తిప్పలు వాళ్ళవి. ఫోనులోకూడా సరాసరి పలకరించే సదుపాయాలుండవు. అక్కడా తమాషా చెక్కింగ్లు ఉంటాయి. అవతల మధ్య మనిషి దొరకడం అనేది ఒకప్పుడు లాటరీ అవడం కూడా కద్దు.

***ఎప్పుడు ఫోను చేసినా బయటే వుంటాడు.***

కొందరికి ఫోను చేస్తే - ఎవరో అందుకుని ''ఇప్పుడే బయటికి వెళ్ళారు'' అనడం తరచు వింటూ వుంటాం. అలా వెళ్ళినప్పుడు ఫోను నెంబరు తీసుకుని మర్యాదకోసం మళ్ళీ పిలవడం వుండదు. ''ఎప్పుడు వస్తారు?'' అంటే తెలియదంటారు. ఒకేరోజున పదిమాట్లు పిలిచినా ఆయన ''బయటనే వుంటాడు గాని ఇంట్లో వుండడు.''

మనం ఫోను చేయతలచినప్పుడల్లా ''ఆయన్ని కొంచెం ఈసారి అయినా ఇంట్లో వుంచు భగవాన్'' అని ప్రార్థించవలసి వస్తూ వుంటుంది.

ఒక్కొక్కసారి ఫోను చేసి అవతల వ్యక్తి పలుకుతాడేమోనని ఆశతో ఎదురు చూస్తుంటే - ఎవరిదో సంభాషణ వినిపిస్తుంది. ఒకప్పుడు ఉరుదులో, ఒకప్పుడు హిందిలో, అరవంలో, మరాటీలో మనం ఫోను ఎత్తిన వేళావిశేషాన్ని బట్టి వినిపిస్తూ వుంటాయి.

***గ్యాస్‌కాల్‌లో విందు సంభాషణ.***

ఇటీవల ఒకరోజున ఇంట్లో గ్యాస్ అయిపోయి వంటకు ఇబ్బందిగా వుండి వారికి ఫోను చేశాను. నాకు హిందీలో వినిపించిన సంభాషణ.

''అలా ఆలోచించాల్సిన పనిలేదు. మీరు అంగీకరించాల్సిందే''

''అంగీకరించడానికి కాదు సోదరా! నాకు వున్న ఇబ్బందులు చెప్పానుగదా. కొంచెం ఆలకించి మీరు క్షమిస్తారని''

''ఫర్వాలేదు భాయి. పదిగంటలకల్లా మీకు భోజనం తయారుగా వుంటుంది. మీరు అరగంటలో వెళ్ళిపోవచ్చు తప్పదు. ''

''అలాగే మీ మాట ప్రకారమే వస్తాను. మిమ్మల్ని కాదనలేను. ''

''మంచిది. చాలా సంతోషం. ఎదురు చూస్తూ వుంటా''

వంట చేసుకోవడానికి గ్యాసు లేక అలా కూర్చున్న వాళ్ళకు విందుల సంభాషణ వినిపిస్తే ఎలా వుంటుంది? నాలుగుసార్లు పిలిచినా అసలు నెంబరు అందలేదు.

***ఫోనులక్కూడా దుర్ముహూర్తాలుంటాయి***

''అలుపు వచ్చి పడిపోయిన రోజున అత్తగారే దిక్కు'' అన్నట్లు కుంపటి వెతికి దొడ్లో చెట్టు కింద అక్కడక్కడా పడివున్న బొగ్గు ముక్కల్ని పువ్వుల్లాగా నీరుకు వచ్చి ముడి బియ్యాన్ని ముద్దల క్రింద మార్చుకున్నామనుకోండి.

తింటున్నంతసేపు ఫోనులో నిన్న విందు విషయమే జ్ఞాపకం వచ్చింది. ఎడ్రసు కూడా చెపితే పోయేది వాళ్ళు మేము కూడా వస్తున్నామని అక్కడికే ఫోను చేసి వెడితే పోయేది అనిపించింది.

ఫోనులక్కూడా దుర్ముహూర్తాలుంటాయల్లే వుంది. ఒక్కొక్కసారి అలా అనుకున్న పనులు కానియ్యవు.

(21 ' అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పండగ సంబరాలు** అనేకవిధాలుగా ఉంటాయి. నిజానికి ఎవరి సంబరం వారిది. పూర్వం పండుగలూ సంబరాలు కుటుంబానికంతకూ చెందినవిగా ఉండేవి. ఈ కాలంలో ఎవరి సంబరాలు వారివే.

కొందరికి సినిమా సంబరం, కొందరికి పొరుగింటి పెత్తనం సంబరం, కొందరికి పిండివంటల సంబరం, కొందరికి గుర్రుకొట్టి నిద్రపోవడం సంబరం, ఇలా రకరకాల సంబరాలు ఏర్పడినాయి.

కనుక పండుగనాడు ఒకచోట చేరి పదిమందీ సంతోషంగా కబుర్లు చెప్పుకోవడం, నవ్వుకోవడం, ఒక్క పంక్తిని కూర్చుని విందులారగించడం, తాంబూలం సేవిస్తూ శ్రుతి చేసిన తంబురాలలాగా చక్కని స్వరాలతో అన్యోన్యతలను ప్రదర్శించుకోవడంలన్నీ మృగ్యమైనాయి. ఎవరికి వారే.

షికారు వెళ్ళిన వాళ్ళు భోజనం ఒకసారి అయితే, సినిమాకి వెళ్ళినవాళ్ళు భోజనం మరోసారి, క్రికెట్‌కి వెళ్ళినవారి భోజనం ఒకసారి అయితే, పేకాటలో మునిగిన వారి భోజనం మరోసారి. నిజమే. ఎవరికి ఆనందం కల్పించే పరిస్థితి వారికి పండుగ.

మొన్న పండుగనాడు మా బంధువుల్లో ఒక అబ్బాయి సంబరం ఎంతో విచిత్రంగా జరిగింది. అతడు మంచి హాస్య ప్రవృత్తిగలవాడు. విచారంలో నవ్వగలడు. నాట్యం చెయ్యగలడు. బుర్ర వేడెక్కిపోతున్నప్పుడు బుర్రకథ కూడా చెప్పగలడు.

ఈ కళలన్నిటినీ ఒక్కమాటుగా ప్రదర్శించే అవకాశం ఆయనగారికి మొన్న సరస్వతీపూజనాడు లభించింది. అతగాడే తనలో నవ్వుకుంటూ ఉండటంవల్ల మేమందరం విచారపడుతూనే వినోదం అనుభవించడం జరిగింది. చివరికి అది సరదాగానే మారింది గనుక సరిపోయింది. ఇంతకీ జరిగిన తమాషా ఏమిటంటే అతగాడు ఉద్యోగంలో ప్రవేశించి, పదిరాళ్ళు వెనకేసుకుని - ఒక సైకిల్ కొనుక్కున్నాడు. అలా కొనుక్కోవడంవల్ల ఆ సైకిల్ ఏ కంపెనీదో కూడా మరిచిపోయి దానికి కష్టార్జితపు సైకిల్ అని పేరు పెట్టాడు.

అంతకుముందు కాలేజీలో చదివే రోజుల్లో వాళ్ళ నాన్నగారు సైకిల్ కొనిపెట్టారట. దాన్ని పిత్రార్జితపు సైకిల్స్ అని పిలిచేవాడట. దాన్ని తమ్ముళ్ళకు వదిలి కష్టార్జితపు సైకిల్‌మీద హైదరాబాద్ వీధుల్లో "చలో చలో సైకిల్" అంటూ ఎంతో హుషారుగా తిరగడం అలవాటు చేసుకున్నాడు.

"ఎవరైనా ఎదురైతే దిగి 'ఏమంటారు. నా సైకిల్ బాగుందంటారా? ఇది కష్టార్జితపు సైకిల్. స్వంతం అవడం వల్ల ఇంత హాయిగా వుంది. దీనిమీద వెడుతుంటే వేడిగాలి కూడా చల్లబడుతుంది. మనస్సుల్లో పిల్లన గ్రోవి వినిపిస్తుంది" అని చెప్పి ఎంతో ఆనందించేవాడు.

నిజానికి ఆయనగారు సైకిల్ మీద వెడుతున్నట్లు భావించేవాడుకాడు. పెళ్ళి కుమారుడు మల్లెపూల దండలు మెడనిండా వేసుకొని తెల్లగుర్రం మీద కళ్యాణమంటపానికి వెడుతున్నట్లుండేవాడు. ఎవరూ ఎదురురాకపోతే నోరులేని ఆ సైకిల్‌తోనే ఏవో సరసాలాడుతూ వుండేవాడు. సంతోషం పట్టలేక ఒకప్పుడు బ్రేకులు నొక్కి బెల్ కొడుతూ బాలెన్స్ చేసుకుంటూ, నవ్వుకుంటూ ఉండేవాడు.

అలాటి సైకిల్‌ని ఆయనగారు సరస్వతీ పూజరోజున ఒక మిత్రునికి అప్పగించాడు. సరదాగా తిరిగి వస్తాడు. తిరిగొచ్చి తన వాహనాన్ని గురించి ఎంతో ప్రస్తుతిస్తాడు - అదే ఆనందంలో. రాత్రి ఎనిమిదైయింది. మిత్రుడు రాలేదు. మా సైకిల్ నాధుని మనస్సు

కొంచెం వ్యాకులమైంది. ఇంతలో ఆయనగారికి ఫోన్ కాల్ వచ్చింది. వింటున్నాడు. ముఖంలో అయిదారు రంగులు మారాయి. గొంతుకలో ఎన్నో కూతలు - కొన్ని భయంకరమైనవి, కొన్ని ఆశ్చర్యకరమైనవి వినిపించినాయి. చివరకు చెయ్యి నుదురు మీదకు పోయింది వెంటనే 'అబ్బా' అని కేకవినిపించింది.

తర్వాత అడగ్గా అడగ్గా చెప్పాడు. మిత్రుడు వేసుకు వెళ్ళిన సైకిల్ పోలీస్ స్టేషనులో ఉన్నదనీ, అది దొంగసైకిల్ అని పట్టుకున్నారని. తన కష్టార్జితపు సైకిల్‌కి ఇంత ప్రమాదమా! పైగా పోలీసులు వచ్చి రుజువు చేసుకొమ్మన్నారట.

ఎలా? కొన్న రసీదు కోసం వెతకాలి? ఎక్కడుందో. కంపెనీ గుర్తు మాత్రం గుర్తుందా! కష్టార్జితపు సైకిల్ అనేదాన్ని పిలిచేది. చెమటోడ్చి కొన్న సైకిల్. ఆ చెమట మాత్రం ఎక్కడ వుంది. ఎప్పటికప్పుడు జేబురుమాల్‌కే అంకితమైంది. ఇలాంటి క్లిష్టపరిస్థితులు వస్తాయని ఏం తెలుసు? లేకపోతే సీసాల్లో పట్టి కాగితం అంటించి జాగ్రత్తగా దాచేవాడు. సైకిల్ పట్టుకున్నారని తెలియగానే ముచ్చెమటలు పట్టాయనుకోండి. వీటివల్ల ప్రయోజనం ఏం వుంటుంది?

తన సైకిల్ గదిలో పకపకలాడుతూ కనిపించే సైకిల్. రంగు మాయని సైకిల్. అసలా గంట ఎలాటిది? వీణలాగా వినిపిస్తుంది సీటు. సీటు కాదది చక్కని సీటు చక్రవర్తుల సింహాసనం దీని ముందు ఎందుకు పనికివస్తుంది? అలాంటి సైకిల్ పోలీస్ స్టేషనులో పడివుందా? అవును మహాపతివ్రత సీతాదేవికే తప్పలేదు. ఇలాంటి అగ్నిపరీక్ష.

"ఆవిడ ఆచూకీ చాలాకాలంవరకూ తెలియలేదు. నా సైకిల్ ఆచూకీ అరక్షణంలో తెలిసింది కనుక హనుమంతుడితో పనిలేదు. నేను హుటాహుటిని వెళ్ళగలను. వెంట లక్ష్మణుడుంటే చాలు" అంటూ ఆయనగారు బయలుదేరారు పోలీసు స్టేషనుకి.

ఎంత ధైర్యం సాహసాలు కల వ్యక్తి అయినా కొంచెం విచారం వుంటుందిగా! అందుకని ఆయనగారు ఒక కాలికి బూటు తొడుక్కుని, రెండోకాలు మాట మరచిపోయి

"పోయెనయె ఇపుడు నా సైకిల్.. ఆ పోవునపుడు ఆ బండి వయ్యారము ఆ మిత్రుని పరితాపము..

పరితాపము కాదది నా పాపము..

పోయెనయె ఇపుడు నా సైకిల్." - అనుకుంటు వెళ్ళిపోతుంటే పిలిచి రెండో బూటుమాట జ్ఞాపకం చేశాం. ఆయనగారు ఉన్న బూటు కూడా విప్పబోయి చటుక్కున ఆపి రెండోది కూడా తొడుక్కుంటూ ఈ మాత్రం దర్జాతో వెళ్ళకపోతే సైకిల్ నాదని ఎలా నమ్ముతారు? పాదచారిగా వెళ్ళే సమయంకాదు అంటూ వెళ్ళారు.

వెళ్ళి సైకిల్‌పై తనకుగల అనురాగాన్ని వర్ణించారట చాలాకాలం. "అనురాగం మమకారం ఎవరక్కావాలయ్యా!?" గుర్తులు చెప్పవయ్యా అన్నారుట అక్కడివారు.

"గుర్తు చెప్పాలా! పోయిన వాడిముఖం గుర్తుపట్టలేదా మీరు. అది తేలిక కాదుటయ్యా. మీకు అంతగా నమ్మకం లేకపోతే కుక్కని పిలవండి. వాసన పడుతుందేమో చూద్దాం" అని ఆయనగారు ఠీవిగా నిలబడ్డారట. ఎంత చెప్పినా "రేపు మీరు సైకిల్ కొన్న బిల్లు తీసుకురండి ఇస్తాం" అన్నారట. ఆయన విచారంతో యింటికి వచ్చారు.

ఆ రాత్రంతా సైకిల్ కలవరింతలు దానిమీద బుర్రకథ.

"మిత్రుడికిచ్చిన సైకిల్ గతి ఏమైందయ్యా? ఎదురుగా వచ్చారు.. పోలీసువారు (కంఠం మార్చి) సైకిల్ గట్టిగా పట్టుకున్నారు. (దీర్ఘం తీస్తూ) పట్టుకుని స్టేషనులో పెట్టినారయ్యో.. తందానతాన" - అంటున్నారు రాత్రి రెండుగంటలవేళ.

ఎలాగో తెల్లారింది. సైకిల్ వచ్చింది యింటికి. ఆయన సంబరం చూడాలి. పండగ సంబరం అంత గొప్ప సంబరం ఎవరూ అనుభవించి ఉండరు.

(22' అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

***కావాలి - కావాలి!***

ఎక్కడ విన్నా ఇదే మాట. ఉన్నవాడికీ కావాలి, లేనివాడికీ కావాలి. బుర్రలున్నవాళ్ళకూ ఏదో కావాలి. లేని వాళ్ళకీ కావాలి. సమాజానికి కావాలి. దేశానికీ కావాలి.

"చాలు. సంతృప్తిగా వున్నాను" అనుకునేవారు ఎక్కడా కనిపించడంలేదు. "నాకింకేం కావాలి - అన్నీ ఇచ్చాడు భగవంతుడు" అని సంతృప్తి ప్రకటించేవారెవరూ కనిపించడంలేదు.

ఒకవేళ భగవంతుడు ప్రత్యక్షమై ఎవరినన్నా "నీకేం కావాలో అడుగు - వరమిస్తా"నంటే - ఏం కోరతారో చెప్పలేం. అసలా కోరికలాయన తీర్చగలడో లేడో అంతకన్నా చెప్పలేం.

***వరదాత బిరుదు పోతుందేమో!***

ఆయన ఏ విధంగా తంటాలు పడ్డా కొందరి కోర్కెలు తీర్చడం అసంభవమేమోననిపిస్తుంది. ఎవరో ఒకర్ని అడిగి చూద్దాం - లేకపోతే మనకు 'వరదాత' అనే బిరుదు వుండదేమోననిపించి ఆ భగవంతుడు ఏ సిటీలోనో హఠాత్తుగా దిగి ఒక యింటికి వెళ్ళి "యజమానిని ఇలా పిలవండి ఒకసారి" అని కూర్చుంటాడనుకోండి.

యజమాని ఆ వచ్చిన పెద్దమనిషి తననేమి అడుగుతాడోననే భయంతో బయటికి రావడానికి హడలిపోవచ్చు. అప్పుడు భగవంతుడు "నేనయ్యా వచ్చింది వరదాతను. ఏదైనా వరమిచ్చి పోదామని వచ్చాను. నాకు విజిటింగ్ కార్డులు లేవు. అందుకని స్వయంగా పిలవవలసి వస్తోంది" అని సంజాయిషీ పూర్వకంగా చెప్పుకుంటాడనుకోండి.

***వరాలు ఎన్నని కోరను ఇక్కడే వుండండి.***

అప్పుడు యజమానికి అంతులేని సంతోషం కలగవచ్చు. ఒక్కొక్కప్పుడు ఉబ్బితబిబ్బయి - "మీ అంతవారు వచ్చారా చాలా సంతోషం. పైగా వరాలు అడగమంటున్నారా! ఎన్నని చెప్పను మహానుభావా నేను బ్రతికి వున్నంతకాలం. మీరు ఎదురుగా అలా నిలబడితే అవసరం వచ్చినప్పుడు ఆయా వరాలు అడుగుతూ వుంటాను స్వామీ! కనుక దయవుంచి నాకా వరమియ్యండి - మీరు ఎప్పుడూ ఇక్కడ వుండి నాకు కావలసిన సహాయం చేస్తానని" అంటారు.

వెనుకటికి నటీమణి శ్రీమతి భానుమతిగారన్నారు - "భగవంతుడు ఈ రోజుల్లో ప్రత్యక్షం కావడానికి చాలా భయపడుతున్నాడు. అలవాటు ప్రకారం అలా సాక్షాత్కరించి వరమేమి కావాలి? అని అంటే నువ్వు భక్తులకు దాసుడవే గనుక మా యింట్లో నౌకరుగా వుండిపో" అంటారని ఆయనకు భయం. తీరా వరమిస్తానన్న తర్వాత యిచ్చితీరాలి గనుక ఆయన వైకుంఠం వదిలి వారియింట పడివుండాల్సివస్తుందనే సందేహంతో ఆయన కనిపించకుండా వుండటమే మంచిదని భావించి వుంటారు - అని.

నిజమే భగవంతునిచేత చేయించుకోవలసిన పనులు అనేకం వున్నాయి అందరికీ. అందులో ఈ నాగరికతా ప్రపంచంలో సమస్యలకే కరువా! ఎన్నో వున్నాయి. అసలు నిజమాలోచిస్తే బగవంతుడు ఆయనగారికి వున్న సర్వశక్తులూ ఉపయోగించే ఒక్క సంసారానికి కావలసిన వసతులు ఏర్పరచి, పేరు నిలబెట్టుకోగలడా! చాలా అవస్థపడతాడు అలా ఒప్పుకుంటే.

*కాలింగ్‌బెల్ నొక్కగానే కనిపించాలి.*

సరే వచ్చి ఒక గృహస్థును ప్రశ్నించాడనుకొందాం. ఆయనగారు తటపటాయిస్తాడు ఏం అడగాలో తెలియక. ఆలోచించి, ఆలోచించి చివరకు - "ఎన్నని నిన్ను అడగను? రోజురోజుకూ క్రొత్త అవసరాలు వస్తున్నాయి - కనుక నాకు సర్వశక్తులూ ప్రసాదించగలిగితే ప్రసాదించు. లేదా కాలింగ్‌బెల్ నొక్కగానే గభాలున పరుగెత్తుకు వస్తానని వాగ్దానమన్నా చెయ్యి" అంటాడు.

ఇంకోరకం గృహస్థు అయితే తనకు వున్న అలవాటు ప్రకారం "ఉండండి. లోపలికి వెళ్ళి మా ఆడవాళ్ళను అడిగి వస్తాను" అంటాడు.

విషయం లోపలికి వెళ్ళిన తర్వాత ఆ గృహస్థు పెత్తనం నశించి పోవడం తథ్యం. లోపలనుంచి ఎలాంటి కోర్కెలు వస్తాయో చెప్పలేం. అవి ఆమె పరమైనవిగా వుంటాయి గాని పురుషపుంగవుని పరంగా గాని, అతని హోదాకు సంబంధించిగాని వుండటం అసంభవం.

*వెళ్ళివాళ్ళావిడను పంపమను*

ఒకప్పుడు ఆ గృహిణి - భగవంతుని వరాలడగడం వల్ల ఈ రోజుల్లో ఎక్కువ ప్రయోజనం లేదని గ్రహించి భర్తను పిలిచి "ఒక్క చిన్న పనిచెయ్యమనండి. ఆయన్ని సరాసరి యింటికి వెళ్ళివాళ్ళావిడను పంపమనండి. చెప్పుకునేదేమిటో ఆవిడగారితోనే చెప్పుకొంటాం. మధ్య ఈయన పెత్తనమేమిటి?" అనడం కూడా తటస్థపడవచ్చు.

భగవంతుడు తన బిరుదు నిలబెట్టుకోవాలన్న తాపత్రయంతో బయలుదేరితే బయలుదేరవచ్చుగాని - అలాంటి సందర్భాలలో కొంచెం దివ్యదృష్టి ప్రసాదించకపోతే మాత్రం దెబ్బతింటాడు. తప్పదు.

నేనేగదా లోక రక్షకుణ్ణి, అఖండ ప్రతిభావంతుణ్ణి, అనుపమ తేజోనిరాజమానుణ్ణి అనుకొంటూ వెళ్ళి ఒక గృహస్థుని పిలిచి "ఏం వరం కావాలి?" అని అడుగుతాడనుకోండి.

ఆ గృహస్థు బయటికి వచ్చి - "నువ్వా?భగవంతుడివా! అసలు నీలాటివాడొకడున్నాడని నాకు నమ్మకంలేదే నిన్ను వరాలేం అడగమన్నావు? ఏదో ఈ ప్రాంతంలో వాడికే ఈ పేరు పెట్టుకుని వచ్చి మోసం చెయ్యాలని చూస్తున్నావల్లే వుంది. ఈ తమాషాలు మనదగ్గిరసాగవు. తక్షణం బయటికి దయచెయ్యి" అనడం కూడా సంభవమే.

*నేనున్నానయ్యా.. ఎడ్రసు తీసుకోవయ్యా!*

"అలా అంటావేమిటయ్యా! నేను వున్నానయ్యా. నా ఎడ్రసు కావలిస్తే ఇస్తానయ్యా. పర్మనెంటు ఎడ్రసు వైకుంఠమయ్యా. వేరే ఫోనులు లేవయ్యా. ఏ భక్తుడి గుండె 'డయల్' చేసినా ఫోనుకాల్ నాకందుతుందయ్యా. అసలు ప్రతివారూ వారి ఆత్మశక్తితో వైర్‌లెస్‌లు పంపవచ్చుకూడా.

పూర్వం నేను ఎక్కడపడితే అక్కడ వుండేవాణ్ణి. సృష్టిలో నిండివుండే వాణ్ణి. కనుక పిలవగానే పలికేవాణ్ణి. కాని ప్రస్తుతం అలా వుండటం క్షేమం కాదని చిన్ని చిన్ని కాంప్‌లు ఎత్తేసి వెళ్ళి హెడ్ క్వార్టర్సులోనే వుంటున్నా. అప్పుడప్పుడు పాలకడలిలో సమ్మర్ క్యాంప్‌లు వేసేవాణ్ణి. ఈ యుగంలో అదీ భద్రంగా లేదని మానేశాను. నేను భగవంతున్నేనయ్యా కాస్త నమ్మవయ్యా.

వేదాలు, పురాణాలు, కావ్యాలు, గ్రంథాలు భగవద్గీతలు ఇవన్నీ వ్రాయించుకున్న దెందుకు. మీబోటి వారికి అనుమానాలొస్తాయనే" అని అనేక విధాలుగా ఆయనగారు నచ్చచెప్పుకోవలసి వస్తుంది.

*ద్విపాత్రాభినయం తప్పదు పాపం.*

ఎంత చెప్పినా 'ఫలానా ఆయన' అంటూ లేడని నమ్ముతున్నప్పుడు వాకిట్లోకి వచ్చిన పెద్ద మనిషిని ఆయనేనని నమ్మమంటే ఎలా సాధ్యమవుతుంది. ఎంత చెప్పినా వినకుండా విసిగిస్తాడనుకోండి. అప్పుడేం చెయ్యాలి ఆ గృహస్తు?

చివరకు కోపం వచ్చి "ఒకవేళ నువ్వంటూ వుంటే అలాటి నమ్మకం నీకువుంటే నాకు మాత్రం లేదు. ఇక నువ్వు లేకుండా పోవాలి. అదే నేను కోరే వరం" అంటాడనుకోండి.

అప్పుడేం చేస్తాడా వరదాత. "లేని వాళ్ళకు లేనట్లుగా" "ఉన్నవాళ్ళకు వున్నట్లు"గా ద్విపాత్రాభినయం సాగించాలి.

(29' అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**డబ్బుకోసం** పరుగులెత్తే మానవుణ్ణి ధర్మాలకోసం పరుగులెత్తమంటే ఎలా పరుగెత్తగలడు. తెల్లారిలేచినప్పటినుంచీ ప్రతి వ్యక్తీ కుడిచేత్తో సొమ్ము సంపాదించడం ఎడమ చేత్తో గిరాటు వెయ్యడం - ఈ పనిలోనే మునిగివుంటున్నాడు ఈ వేటలో అందినవాడు తింటున్నాడు. అందనివాడు పస్తుంటున్నాడు.

అంతమాత్రంచేత అందినవాడు 'అందనివాడి'కంటే గొప్పమాత్రం కాదు ఈ ఇద్దరినీ సమానంగా చూడవలసిన కళ్ళు చాలావరకు అంధత్వంలో పడ్డాయి. అలాటి వాళ్ళకు ప్రత్యేక నేత్ర చికిత్సలిప్పుడిప్పుడే ప్రారంభమైనాయి చాలా కళ్ళల్లో పొరలు తెగినాయి 'అసలుచూపు' అందుకో కలుగుతున్నారు చాలామంది.

ప్రభుత్వం 'సేవింగ్'ల ద్వారా సిరిని ఒక లెవెల్‌లోకి తేవడానికి ప్రయత్నిస్తుంది. కాని మనస్సుల్ని ఒక్క లెవెల్‌లోకి తేవడం అనే బాధ్యత మానవుల మీదనే వుంది.

"ఏది ఆలోచిస్తున్నా, ఏ ఫలితం కోసం తాపత్రయపడాలన్నా - ముందుగా ఆర్థికస్థితి అడ్డం వస్తుంది - అందువల్ల మనస్థితి బాగుండటంలేదు" అని ఒకరు నిర్వచించారు.

***మనశ్శాంతికి పునాది గృహశాంతి***

మనశ్శాంతికి ముందుగా గృహశాంతి ఏర్పడాలి. గృహశాంతి లభించకపోవడం వల్లనే పూర్వం చాలామంది జనస్థానాలు వదిలి వనస్థలులకు పరుగులు తీశారు. ఇప్పుడలా పరుగెత్తే త్యాగం ఎవరికి వుంది? కష్టభూయిష్టమైన సంసారంలో పడికొట్టుకుంటున్నారు చాలామంది.

"బతుకొక పడవ
నడిపి చూడు
ఒక తడవా!"

- అన్నారు చాలాకాలం క్రిందట. పరిస్థితులను బట్టి నైరాశ్యంలో మునిగిన వారే! కానీ ఈనాడు ఆ పడవ ఒక్క అడుగు ముందుకు సాగకుండా నానా తిప్పలూ పెడుతోంది - సరంగుని నవ్వులపాలుచేస్తోంది.

చాలామంది జీవితాలకు 'దుర్భర' అనే బిరుదు తగిలించబడుతోంది. నిర్భయ జీవనులు చాలా తక్కువయ్యారు. ఆర్థిక స్థితి మెరుగుపడితేగానీ - ఈ దుర్భరత్వం దూరంకాదు ఇందుకోసమే ప్రభుత్వం "గరీబీ హటావో" నినాదం వెలువరించింది. ఈ నినాదం నింగిని తాకుతోందిగాని, నేలమీద ప్రాకడం లేదింతవరకూ, ధరలు ఆకాశంలో వుంటే నినాదాలు క్రిందకెలా దిగుతాయి?

కొందరు వ్యక్తులు పుట్టుకచేత బీదవారవుతూ వుంటారు. కొందరు సంపాదన కొరతవల్ల అవుతూ వుంటారు. 'అధిక ధరలు' ఒకపాటిగా వున్న వారినీ ఆ సూత్రం లేనివారినీ ఒక త్రాసులో పెట్టి తూస్తున్నాయి అలాటి 'సమత'ను సాధించినందుకు ఎంతో సంతోషిస్తున్నాయి.

అందువల్లనే ఈ 'అధికధరలు' ఆచార్య పీఠం వహించి, ప్రజలందర్నీ అంతే వాసుల్ని చేసుకుని జీవితగతుల్ని ఒకపక్క, తమతమ ఒక పక్కా, సంయమనాన్ని ఒక పక్కా - బోధిస్తున్నాయి ఎంత చెప్పినా మానవులకు ఫాషన్లమీద మోజులు తగ్గలేదు. నిరాడంబరత్వం వైపు మనస్సు మొగ్గలేదు.

గాంధిజీ చెప్పిన సిద్ధాంతాలు మనం చాలావరకు విస్మరించామనుకోండి. అందువల్ల కొంచెం బాధపడుతున్నామనుకోండి. అయినా వాటిని సహించడం తేలికవుతోంది గానీ - ఆయన సిద్ధాంతాల్ని ఇప్పుడైనా పాటించాలనే భావన కలగడంలేదు.

***కొల్లాయికట్టినా కోటీశ్వరుల మొక్కులు***

ఆయన నిరాడంబరంగా వుండమని బోధించారు - స్వయంగా అలా జీవించారు ఆయనగారి పేరు ప్రతిష్టలకేం కొదవ రాలేదు. ఆకు చెప్పులు తొడుక్కు తిరిగినా లోకారాధ్యుడయ్యాడు. కొల్లాయి కట్టుకుని తిరిగినా కోటీశ్వరులచేత మ్రొక్కులందించుకున్నాడు. వేరుశెనగ పప్పులు తిని బ్రతికినా - "ఎవరుసాటి?" అనిపించుకోగలిగారు.

ఐశ్వర్యం ఆత్మలో వుందిగాని ఆహార్యంలో లేదు. విశాలహృదయంలో వుందిగానీ - విలువగల ఆహారంలో లేదు. ఠీవి సేవా భావంలో వుందిగాని టెక్కులో కాదు అని ఆ మహనీయుడు బోధించాడు. ఆయన సాధించినదే బోధించాడు. అలాటి చిక్కుల్లో పడటం ఎందుకని అందరూ ఊరుకున్నారు.

ఇప్పుడు ఆహారం అతి ప్రియమైంది. ఆహార్యాన్ని కావాలని విపరీత స్థితికి తీసుకుపోతున్నారు. దుస్తుల్లో విలువనుబట్టి వ్యక్తుల విలువలు గ్రహించడం కష్టంగా వుంది. పస్తుల్లో వుండేవాడు కూడా 'నిస్తుల తేజోవిరాజమానుడు'గా కనిపించడానికి ఎంతో ప్రయత్నిస్తున్నాడు మరీలేనివాడు తప్ప మామూలు దుస్తుల్లో కనిపించడంలేదు.

తక్కువ తరగతివారికి తక్కువ ఖరీదు వస్త్రాలు అందాలని కాబోలు చాలామంది వీలైనంత ఎక్కువ ఖరీదుల్లోనే పోతున్నారు. దుస్తుల విలువతో తన విలువ పోల్చుకుని ఆనందిస్తున్నారు. ధరలెందుకు తగ్గుతాయి? మరింతగా చుక్కల్లోకి పోతాయి.

ఎక్కడుందీ మానవత. ఎలాటి పరిణామానికి దారి తీస్తోంది. జగత్తు అన్ని అవసరాలకన్నా మానవుణ్ణి మానవుడు అర్థం చేసుకోవలసిన అవసరం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ రోజుల్లో "తోటిమానవుడు" అనే దృష్టితో పలకరించవలసిన బాధ్యత విస్మరించవద్దని ఉద్బోధిస్తోంది. ఆకాశవాణి దానికి ప్రతిధ్వనించాలి అంతర్వాణి అప్పుడు మనస్సులు మల్లె పందిరిలల్లుకుంటాయి. మంగళగీతాలాలపిస్తాయి.

అంతేగానీ, శుష్క నినాదాల వల్లనే దేశంలో పుష్కలత్వం సంప్రాప్తిస్తుందని, మానవత మేల్కొంటుందని భావించడం అవివేకమే అవుతుంది.

***చీకటిబాటల్లో రూపాయివేట***

అసమానతతో క్రుంగిపోతున్న సంఘం అధికధరలతో మరింత దుర్భర స్థితిలో పడింది రూపాయి వేటలో జీవితపు బాటలే చీకటితో కప్పుకుని పోతున్నాయి.

జీవితమంటే రెండు విధాలు ఒకటి శారీరక పోషణ రెండవది మానవతను నిలబెట్టుకోవడం ఈ రెంటికీ భిన్నమైన వాతావరణం ఏర్పడింది.

రోజు గడవడం గొప్పగా వుంది. మోజుల మాట అలా వుంచి పొట్ట నిండటం ఘనకార్యంగా వుంది. ఫోజులమాట అలా వుంచి ధర్మాలు అందడంలేదు - ధరలూ అందటంలేదు. న్యాయం అందడంలేదు. నాణ్యతా అందడంలేదు. సంతోషం అందడం లేదు. సమృద్ధీ కనిపించడంలేదు. ఏ వ్యక్తికావ్యక్తి తనకు తానే ఎంతో బరువుగా ఫీలవుతున్నాడు. ఒక్క ఇంజను సంసారపు బండిలాగలేకుండా వుంది అందుకే సంసారానికి జంట ఇంజన్లు అవసరమనే భావన కలిగింది చాలామందిలో.

**సిరికి అంతులేని పిరికితనం.**

రూపాయల శక్తి తగ్గిపోయిందిఅని బజారువెళ్ళి ఏ వస్తువునూ తేలేక తల వంచుకుని తిరిగి వస్తున్నాయి. వాటి బలంతో బ్రతుకుతున్న మానవుడు మరింత బలహీనుడైపోతున్నాడు.

కొద్ది తావుల్లోనే కుప్పగా కూర్చోవడం ఎవరు పిలిచినా బయటికి రాక పోవడం క్రొత్తచోట్లకు పోవడమంటే బిడియపడటం ఉన్నచోటనే గడియలు బిగించుకోవడం ఇవన్నీ పిరికి లక్షణాలు. సిరివున్న వాళ్ళలో కరుకుతనం ఏర్పడుతోందిగాని - సిరికి మాత్రం అంతులేని పిరికితనం.

పైగా నల్లనయ్య హృదయం మీద నివసించడం అలవాటు గనుక బైటికి వచ్చినా చీకటి చోట్లే వెతుక్కోవడం కూడా అలవరచుకుంది తను చీకట్లో దాగి తనను దాచిన వాళ్ళ ముఖాలలో వెలుతురు గుమ్మరించడం ఆమెకు సరదా!

***చండ్ర నిప్పుల్లో జీడిగింజలు***

ధరలు పెరగడం వల్ల తన గౌరవం తరుగుతోందని ఆమె గ్రహించినట్లు లేదు. గ్రహిస్తే అందరి గృహాలలో స్వేచ్ఛగా విహరించేదే ఆమెలో కొంత సాహసం ప్రబలాలి. మానవులలో కొంత మానవత్వం ఉండాలి.

అప్పుడే ఏదైనా శాంతి. అంతవరకు 'అధికధరల' చండ్ర నిప్పులో హృదయాలు మాడిన జీడిగింజలు కావలసిందే

**(8' నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**హైదరాబాదు నగరంలో** నాకో యువక పుంగవునితో పరిచయమైంది. చాలా సరదాగలవాడు. కళల మీద అభిమానం వుంది. ఒక పూట హరికథ చెపుతాడు - ఒక పూట బుర్రకథ వినిపిస్తాడు.

ఊరికే అటూ ఇటూ తిరుగుతున్నప్పుడుకూడా పెదిమలతో మద్దెల చప్పుళ్ళు చేస్తూనే ఉంటాడు. ఈ అన్నిటితోపాటు భగవంతుడతనికి భావప్రకటనకు అనుకూలమైన ముఖం ప్రసాదించాడు. అందులో మళ్ళీ కొంత వింతరూపం కూడా వుంది. ఏటవాలు ముఖం - కోటేరు ముక్కు.

ఊరికే కూర్చోకుండా ఉద్యోగం చేస్తున్నాడు. ఆఫీసుకి వెళ్ళడమంటే పూర్వం అండమానులకు వెళ్ళేవాళ్ళ ముఖం పెడతాడు. కానీ వెళ్ళడం మాత్రం మానడు. మానితే మరి అన్ని కళల్ని ప్రదర్శించే ఉత్సాహం ఎలా వస్తుంది?

***ట్రంకు పెట్టెలో పిచ్చుకల కిచకిచ***

ఇంటిదగ్గర నుంచి తెచ్చుకున్న పూర్వపు ట్రంకుపెట్టెలో పది పిచ్చుకలు కిచకిచమంటేగా - ఆ హుషారు పైకి తన్నేది. అందుకని పిచ్చుకగూడు బాగానే చూసుకుంటాడు. ఏ సినిమాకో బయలుదేరితే తప్ప - ఒక్క పిచ్చుకను బయటికి పోనియ్యడు. వాటిని పెద్ద గుంపుచేసి ఇంపుగా, సొంపుగా జీవితం దిద్దుకోవాలని ఆయనగారి అభిలాష.

ఎవరైనా ఆ పిచ్చుకల మాట ఎత్తితే వాటిని బయటికి తియ్యమంటారేమోనన్న భయంతో "లేవు గురూ! అన్నీ ఎగిరిపోయాయి. ఎలా పోతున్నాయో, తుర్రున ఎగిరిపోతున్నాయి. ఫస్టు తారీఖుకి గాని గూట్లో అవి ఉండేది. రెండు రోజులే గురూ. ఏం చేస్తాం?" అని నొసటిమీద కుడిచేతి నాలుగు వేళ్ళతో కొట్టుకుంటూ, విచారం ప్రకటిస్తాడు.

వాటిమాట ఎత్తకపోతే మంచి దిటవుగా, ధీరుడుగా, కళాకారుడుగా, గాయకుడుగా - మన యోగక్షేమాల కోసం తాపత్రయపడే దయాంతరంగడుగా సాక్షాత్కరిస్తాడు. మనల్ని మురిపించడానికి ప్రయత్నిస్తాడు. ఎన్ని విధాలుగానో తన తడాఖా చూపిస్తాడు.

ఎవరైనా పొగుడుతుంటే సంబరాలు పడతాడుగాని - రవ్వంత అయినా లొంగడు. తన స్వప్రయోజనానికి దూరమైన విషయం వచ్చినప్పుడు - అంతటి కలుపు కట్టు మనిషి 'గడవాసం'లాగా నిలబడిపోతాడు.

***పరోపకారంలో పరమనైష్ఠికుడు***

ఎన్నో కబుర్లు చెపుతూ ఉంటాడు. ఎన్నో సామెతలందిస్తూ ఉంటాడు. రాగాలు తీస్తాడు. లాస్యం చేస్తాడు తనలో తనే సృష్టిగా నవ్వేస్తాడు. భేషుగ్గా ఫోజు పెట్టేస్తాడు. పరోపకారం విషయంలో 'పరమ నైష్ఠికుడు - తక్కిన సమయాలలో 'అతి దాష్టికుడు'

అర్ధరాత్రికాడ లేచి కూర్చుని అద్భుతంగా భజన చేస్తాడు. ఉండి ఉండి మూడో కాలంలోకి పోతూవుంటాడు. చటుక్కున దిగిపోతూ వుంటాడు. తాళాలతోపాటు ముఖంలో కవళికలు కూడా మారుస్తూ ఉంటాడు. అన్నట్లు ఆ మిత్రుని వ్యవహార నామం - "ఉంజయుడు" - అసలు పేరు మృత్యుంజయుడు. పొట్టి తనం కోసం అది అలా మార్పు చేయబడింది. అందరూ 'ఉంజయా' అని పిలుస్తారు. చాలామంది "ఈయనగారికేం సంజయుడంతటివాడు" అంటూ ఉంటారు.

నగరంలో ఆయనకు చాలామంది మిత్రులున్నారల్లే ఉంది. ఉంజయుడున్నాడా? అని ఎప్పుడూ ఫోనులు వస్తూనే ఉంటాయి. మొన్న ఒకరోజున రాత్రి పదకొండుగంటలకు ఫోను వచ్చింది. ఆయన నిద్రపోతున్నాడు.

"ఇప్పుడు ఫోను చేశారేమిటి? అంత అర్ధరాత్రివేళ." అంటే -

"ఒకవేళ ఇవ్వాళ వోటీకి వెళ్ళివచ్చావేమోనని పిలిచాను" అన్నాడా పెద్దమనిషి, ఉంజయుడు ఓటీలు ఎక్కువగా చేస్తూ ఉంటారు. ఆఫీసు టైం అయిన తర్వాత పని చెయ్యడం వోటీ కదా మరి.

ఉంజయుడు వోటీల ప్రియుడు. ఆయన అంటూ ఉంటాడు. "వో.టిలనుకోకుండా కొత్తపిచ్చుకలు వచ్చి గూట్లో చేరుతూ ఉంటాయండి. అసలు వాటి అందమే వేరు. తళతల మెరిసిపోతూ ఉంటాయి. ఆ కిచకిచల్లో కీర్తనలు వినిపిస్తాయి. ఎంత మధురం? ఎంత ఆనందం?" అని.

చాలా హాస్యం ఉంది ఆయనలో. ప్రతి క్షణం ఏదో ఒక కవ్వింపూ, కవ్వింపూ ఉంటుంది. ఏవో కొత్త ఉపమానాలు, మాటలు విసురుతూ ఉంటాడు. ఏదో మాట సందర్భం వచ్చి ఒకనాడు అంటున్నాడు "అలాటి పనిచేస్తే ఊరుకుంటారా? చందాలు వేసుకుని చావగొడతారు" అని. ఈ పదం తర్వాత కూడా చాలాసార్లు వాడటం జరిగింది. ఆయన ప్రత్యేక హాస్య వచనాల్లో ఇది ఒకటి.

ఆయనగారికి కొంచెం పొగడ్తలు అవసరం. అలాటి సమయం వచ్చినప్పుడు మనిషి ఉబ్బిపోతూ ఉంటాడు. మధ్య మధ్య అనుమానం వచ్చి "మీరు హాస్యంగా మాట్లాడుతున్నారా నిజమా?" అని ప్రశ్నిస్తూ ఉంటాడు. నిజమేనని చెప్పిన తర్వాత

***అర్జంటుగా ఆరుపౌనులు పెరిగాను***

"అలా అయితే సంతోషం. మీకు తెలుసో లేదో నేను ఈ క్షణంలో అర్జంటుగా ఆరుపౌనులు పెరిగిపోయాను. చూడండి ఎలా ఉన్నానో!" అని ధీమాగా చెపుతూ ఉంటాడు.

సినిమాలంటే అమిత సంతోషం. దానితోపాటు బలంకూడా అప్పటికప్పుడు అర్జెంటుగా వస్తుంది. ఆ పరుగు వేరు ఆ సంబరం వేరు. రాజబాబు అంటే ఎంతో మోజు. ఆయన హాస్యమంతా 'తాజాసరుకు' అని చెప్పి సంబరాలు పడుతూ ఉంటాడు.

తను కూడా సినిమాలలో చేరి శక్తి సామర్థ్యాలు ప్రదర్శించాలనే కుతూహలం ఎక్కువగా ఉంది. కానీ, "ఉన్న ఉద్యోగం ఊడిపోతే ఈ ఉంజయుడు పని ఏమవుతుంది. కనీసం రాజబాబు చిత్రాలు చూసేందుకైనా చేతులో పైసలుండవు."

స్టార్‌కి కావలసిన నైపుణ్యం సరిపడ్డంత స్టోరులో వుందిగానీ అంతగా అవసరమైతే వాడుకునేందుకు కావలసిన కరెన్సీ స్టాక్ లేదు అంటూ ఉంటాడాయనగారు.

"ఏ ప్రొడ్యూసరైనా పిలిచి పది పిక్చర్లను ఒక్కమాటే కాంట్రాక్టు వ్రాస్తే అప్పుడు బురఖా మార్చేస్తాను, నా తడాఖా చూపించేస్తాను. మన నటనంటే మాటలనుకున్నారేంటండి?" అని మధ్యలో యాసంలోకి దిగి మనల్ని హాస్యంలో ముంచి తేల్చడానికి ప్రయత్నిస్తూంటాడాయన.

***టైపిస్టు కాపిటలిస్టుగా మారాలి.***

"మీ ఆశయం గొప్ప హాస్యనటులుగా రూపొందాలనేనా" అని ప్రశ్నిస్తే ఆయనగారదోవిధంగా ముఖకవళికలు మార్చి "స్టార్‌ను" కావాలనే కోర్కె ఉందనుకోండి. అసలు కోరిక ఏమిటంటే ఈ టైపిస్టు ఒక కాపిటలిస్టు కావాలని మన కీర్తి మవుంట్ ఎవరెస్టు ఎత్తున పెరగాలని - అంటూ ధీమాగా మాట్లాడారు.

"కాపటలిష్టులు తెర వెనక్కి పోయే ఈ కాలంలో మీరు ఆ హోదా కోసం ప్రయత్నించడం ఏమిటి?" అని ప్రశ్నిస్తే "కాపిటలిస్టు అనే పదం ఎక్కడికి పోతుందండీ? ఉన్న వాళ్ళల్లో ఎక్కువ మొత్తం ఎవరి దగ్గర వుంటుందో అతడే కాపిటలిష్టు" అని ఆయన నిర్వచించాడు.

మొత్తానికి ఉంజయుడుగారు, ఊహలు కల వ్యక్తి. ఉత్సాహం ఎక్కువ. ఈ కాలాన్నిబట్టి బ్రహ్మచారిగా ఉండటంలోనే ఎక్కువ "ఎడ్వాన్టేజ్" ఉన్నదని భావించి సంబరాలు పడే యువకుడు. తన 'సుఖం కోసం' ప్రపంచాన్ని మరిచిపోగల ప్రతిభావంతుడు.

అన్నట్టు ఉంజయుడు భక్తుడు కూడా. ఈ మధ్య ఎవరో కొనుక్కున్న తావళం ఒకటి చేతపట్టాడు. పూసలు తిప్పుతూ పుణ్యలోకాలు దర్శిస్తూ ఉంటాడు. బహుముఖ ప్రజ్ఞులుగల బ్రహ్మచారి.

**(11 ' నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

"**దయవుంచి** నీ ఉపన్యాసం కొంచెం బంద్ చేస్తావా? లేదా? అర్థరాత్రివేళ అదిరిపోతోంది కొంప. బెదిరిపోతున్నారు పిల్లలు." అని ఒక గృహస్థు భార్యను హెచ్చరించాడు.

"నా నోరు బంద్ చేసుకోనా! నన్ను అదమాయిస్తున్నారా! కామందులు గనుక మీకన్ని దమ్ములున్నాయి అలా అనడానికి. పడే బాధ పైకి చెప్పుకునే అవకాశం కూడా లేదన్న మాట ఆడవాళ్ళకు. బంద్ అట బంద్. నా నోరు బంద్ చేస్తే నాలుగు పూటలు సాగదీ సంసారం" అని ఆవిడగారు బిగించని తీగలమీద వగల రాగాలు సవరించింది.

*పలుకే బందా? నవ్వే బందా...*

బంద్ అనేమాట అప్పుడప్పుడూ ఇలాంటి సంభాషణల్లో వినిపిస్తూ వుండేది పూర్వం. మా మిత్రుడొకడు ''పలుకే బంగారమాయెనా?'' అన్న మాదిరిలో -

''పలుకే బందాయెనా!

పిలిచినా పలకవు!

చిందే బందాయెనా

త్రోసినా కదలవు..

నవ్వే బందాయెనా

గిలిగింతలే కులకవు!.''

అంటూ ఒక పాట వ్రాసి రోడ్డుమీద ఆడపిల్ల కనపడ్డప్పుడల్లా పాడుతూ వుండేవాడు. మరో దురదృష్టపు ప్రియుడు ప్రియురాలి కొంప చుట్టూ తిరిగి తిరిగి

''తలుపులు బందూ

వలపులు బందూ!

వో సుందరి నిన్నేమందు.

నీ అందమె మరి నా మందు

వో సుందరి నిన్నేమందు

హృదయం బందు

వదనం బందు.

మరి చేయక నాకిక విందు.

నిద్రలోన, నడకలోన

నిన్నే తలుచుచు నుందు.

వో సుందరి నిన్నేమందు.

ఎందుకు మనకీ బందు?

చేయవ నాకిక విందు.

నిలువ నీదు నన్ను

వలపుల కామందు.

నీ అందమె మరి నా మందు

వో సుందరి నిన్నేమందు

దయదలచి మాట విందూ ''

పాటవ్రాసి, ఒక పక్షం రోజులు ఆవిడ యింటి గవాక్షమందు నిలబడి వచ్చినప్పుడల్లా ఒక చరణం పాడి వినిపించడం మొదలు పెట్టాడు.

***తన్ను ముందు - అదే వాడికి విందు.***

ఆవిడ విని విని విసుగెత్తిపోయి, చివరకు ఒకరోజు యింటి నౌకర్ని పిలిచి

''వాణ్ణి తన్ను ముందు

చూడకు వెనకా ముందు.

దెబ్బకు మరవాలి మన సందు.

అదే వాడికి తగిన విందు ''

- అని పాడిందిట - నౌకరు పాటకు సరిపడ్డ యాక్షన్ చేసి చూపించాడుట. ఆ పూటతో ఆ ప్రేమికుడి ఆశలు బంద్ అయినాయట. కన్నీరు మాత్రం బంద్ కాక, చాలాకాలం కొట్టుకున్నాడుట.

'బంద్' అనేమాట ఇలా పాటల్లోకి ప్రవేశించి, తన ప్రాభవాన్ని, ప్రచారాన్ని చాలావరకు సాధించకలిగింది. మరో ప్రేమికుడు తను మాత్రం ప్రేమించిన జవరాలి యింటిచుట్టూ పిచ్చి చూపులు చూస్తూ అనేకమాట్లు తిరిగేవాడట. ఆ వాలకం చూచి ఏదో సవరాలు కట్టేవాడు కావన్ను. అట్లా గోడలవంకా, ఆడపిల్లల జడలవంకా చూస్తూ తిరుగుతాడు - అనుకునేవారుట అక్కడి వారంతా.

తిరిగి తిరిగి రూముకి రాగానే మిత్రులు అడిగేవారట. ''ఏమిటి నేటి తమాషా?'' అని. అతగాడు అప్పుడే నిరాశ చెందడమేమిటనుకునేవాడు కాబోలు - దర్జాగా నిలబడి ''ఇప్పుడేం వుంటుంది తమాషా ప్రస్తుతం దర్వాజా బంద్. కొంచెం మనిషికి ఎక్కువ ఘోషా!'' ముందుంది.

***చూపులు బంద్! చుట్టరికాలు బంద్***

''అసలు నిషా?'' అనేవాడుట. ''దర్వాజా'' హృదయానికి సంబంధించిందని అతని భావం. దాని ఘడియలెప్పుడో తకాలున ఊడిపోతాయని - అప్పుడు సునాయాసంగా ప్రవేశించవచ్చనీ పాపం అతని అభిలాష. బంద్ - హిందీనుంచి దిగుమతి అయినమాట. కానీ తెలుగులో బాగా అతుక్కుపోయింది. 'సంప్ బంద్ అయింది'' - ''రాకపోకలు బంద్ అయింది'' - ''చూపులు బంద్'' - ''చుట్టరికాలు బంద్'' ఇత్యాది మాటలు తరుచు వాడబడుతూ వుంటాయి.

మొన్న ఒకావిడ ఊరు బయలుదేరుతూ భోషాణమంత పెద్ద పెట్టె వేసుకుని బయలుదేరింది. దాన్ని రిక్షాల్లో పెట్టడానికే ముగ్గురు మనుష్యులు కావలసి వచ్చారు - ''ఎందుకే అంత పెట్టె వేసుకుని బయలుదేరావు? దిగేటప్పటికే ఏ బందో రావచ్చు. రైలు దగ్గరనుంచి ఇంటిదాకా ఎవరిచేత తోడు పట్టించుకుపోతావు?'' అంటున్నాడు.

***మా అన్నయ్య రైలు పెట్టే మోయిస్తాడు***

ఆవిడ ''బంద్''లూ వుండవు. ఏం వుండవు. మీరు ప్రతిదానికి భయపడతారు. ఇలా అయితే ప్రయాణం చేశామే. అంతగా 'బంద్' వుంటే స్టేషన్నుంచి మా అన్నయ్యకు ఫోను చేస్తాను. వాడిచేతిక్రింద చాలామంది వుంటారు. ఈ పెట్టేమిటి అవసరమైతే రైలుపెట్టే మోసుకుపోగలరు'' అని రిక్షా తోలించుకుని చక్కాపోయింది.

''దీపావళికి మా అల్లుడూ, అమ్మాయి వద్దామని బయలుదేరారుట. అత్తగారు ఆరుమైళ్ళ పైకిలేచి ''మీరలా వెళ్ళడానికి వీలులేదు. ఎటు చూచినా బందులు గదా. ఎట్లా చేరతారు వూరు. పండగ మీకు పట్టాల మీదే గడిచిపోతుందేమో. కావలిస్తే పదిరూపాయల టపాకాయలు కొని దాచుకుని, రైళ్ళు మళ్ళీ రివ్వున పోవడం ప్రారంభించిన తర్వాత వెళ్ళిరండి. అల్లుడూ, కూతురూ ఎప్పుడు వెడితే అప్పుడే పండగా'' అని వారిని ఆపేసిందిట. ''ఏం చెప్పమంటారు సోద్యం'' అని ఒక గృహస్థు ఎంతో బాధతో చెప్పాడు.

ఈ రోజుల్లో ఎప్పుడనేది బంద్ అయిపోతుందో చెప్పడం చాలా కష్టంగా వుంది. ''ఫలానా రోజుకు ఆ ఊరు వెడదామని వుంది. ఎక్కడా ఎలాటి బందులూ లేకపోతే'' అనుకోవడం మాములైపోయింది.

***పట్టే పట్టే నీళ్ళు బంద్ - పుట్టే పుట్టే పిల్లలు బంద్***

తినే, తినే హోటళ్ళు బంద్, తిరిగే తిరిగే బస్సులూ, రైళ్ళూ బంద్. చదివే చదివే స్కూళ్ళు బంద్.. అమ్మే అమ్మే అంగళ్ళు బంద్, వెలిగీ వెలిగే దీపాలు బంద్. పట్టే పట్టే నీళ్ళు బంద్, పుట్టే పుట్టే పిల్లలు బంద్. అన్ని రంగాల్లో బందులే.

కరువురోజులు వచ్చి పడటం వల్ల మనుషుల్లో కనికరాలు బంద్ అయినాయి.

ఎవరికివారు సృష్టికర్తలమనుకోవడం వల్ల పెద్దరికాలు బంద్ అయినాయి. చాలామంది గుండెలు గులకరాళ్ళుగా మారిపోవడం వల్ల కృతజ్ఞతలు బొత్తిగా బంద్ అయిపోయాయి.

"ఈ బందులవల్ల కలిగేవన్ని ఇబ్బందులే. గాలి పీల్చేందుకు వీలులేదు, నడుం వాలేందుకు లేదు - ఇంట్లో వుండటానికి శాంతి, బయటికి పోయేందుకు ధైర్యం లేదు. బ్రతుకులు పరుచుకునేందుకు వీలులేదు. చుట్టి ఒక మూల పెట్టడానికి వీల్లేదు" అని ఒక గృహస్తు ఎంతో అటమటించాడు.

అన్నిటికన్నా తమాషా ఏమిటంటే కంట్రోళ్ళు పెట్టి వస్తువుల్ని సరసమైన ధరలకు విక్రయిద్దామని ప్రభుత్వం తలపెట్టిన తక్షణమే ఆయా వస్తువులు బజారులో అంతవరకూ చిందులు తొక్కే వస్తువులు ఒక్కసారిగా సిగ్గుపడి ఏ చీకటి కొట్లోనో బందై వూరుకుంటాయి.

ఈ అన్నిటి మాటా అలా వుంచి - ఈరోజుల్లో ముఖ్యంగా ఆపేక్షలు, అనురాగాలూ బంద్ అయినాయి. ధరలు పెరిగిన తర్వాత సంసారాల్లో సరసాలే బంద్ అయినాయి. ఏ దంపతుల్లో చూచినా చిలిపితనం, చిరునవ్వు కనిపించడంలేదు. హృదయం బంద్, పెదవులు బంద్.

బంద్ - బంద్ ఎక్కడ చూచినా బందులే ఎక్కువ వున్నాయి. మానవుడు ఆశలు బంద్ చేసుకుని బ్రతకవలసిందేగాని వేరు మార్గం కనిపించడంలేదు.

**(12 ' నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మొన్న మా** బంధువుల్లో ఒకరి అబ్బాయికి పెళ్ళి అయింది. అతగాడు సిక్కింలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళి అయిన పదిరోజులకే భార్యను తీసుకుని సిక్కిం బయలుదేరడానికి నిశ్చయించాడు. ఎవరు కాదంటారు!? జంటగా మారిన తర్వాత ఒకరివెంట ఒకరు తరుముకుంటూ తిరగవలసిందేకదా..

***రెక్కలమీద కూర్చో ప్రేయసి***

కథల్లో, నాటకాల్లో కొన్ని డైలాగ్స్ వింటూ వుంటాం - "ప్రేయసి! నిన్ను నా రెక్కలమీద ఎక్కించుకుని ఆకాశపుటంచుల్లోకి పారిపోతా.. కొండ శిఖరాలమీద వ్రాలుతా! నువ్వు సిద్ధంగా వుండు.. ఇద్దరికీ ఈ ప్రపంచంతో సంబంధంలేదిక" - అలాగే.

"అది విమానము

ఆగివున్నది మనలకొరకై

స్నిగ్ధ హృదయానంద

చిత్తులు జేరవచ్చు

దానిపై....

నీకు నాకీలోకమేటి

ప్రాకిసోదము నాకభూమి

ప్రణయజ్యోత్స్న వికసితంబగు

పథిని సోదము నెచ్చెలీ!

అనే గేయం కూడా వింటూవుంటాం. ఇవన్నీ కావ్యాల్లోనుంచి, కథల్లోనుంచి నిత్యజీవితాలలోకి వురికినాయి. ఈ కాలంలో చాలామందికి కనిపించని రెక్కలు వచ్చినాయి. వెళ్ళి వెళ్ళి వేలమైళ్ళలో వెళ్ళి వ్రాలుతున్నారు.

పైన చెప్పిన ఉద్యోగి సిక్కిం గురించి మాట్లాడుతూ అది యే సిద్ధిపేటో, చిలకలూరిపేటో అన్నట్లుగా వర్ణించడం ప్రారంభించాడు. అంతేకాకుండా నన్ను తప్పకుండా అక్కడికి రమ్మని ఆహ్వానించాడు. "పోనీ చలికాలం రాలేకపోతే - వేసవిలో రండి చాలా బాగుంటుంది. మీరు వస్తారని వ్రాస్తే సిరిగిల్ వచ్చి ఆహ్వానం అందిస్తాం. అక్కడనుంచి కార్లో రెండువందలమైళ్ళే' అన్నాడు. నేను ఇంతవరకు విశాఖపట్నం దాటి వెళ్ళలేదనీ, ప్రయాణాలు చేయడం అట్టే చేతకాదనీ తెలియదాయనగారికి. మనస్సు మాత్రం భారతదేశమేం ఖర్మం, ప్రపంచంలో ఏ దేశాన్నీ గురించి విన్నా, ఏ ప్రాంతాన్ని గురించి చదువుతున్నా అక్కడికి వెడితే బాగుండును అనిపిస్తుంది.

***మిస్సిసిప్పికి బదులు మూసీ!***

చిన్నప్పుడు జాగ్రఫీ పాఠాలు చదువుతుంటే అనిపించేది ఈ ప్రాంతాలన్నీ చూచివస్తే బాగుండునని. మిస్సిసిపి ఒడ్డున షికార్లు చెయ్యాలని ఎన్నిమార్లో అనుకున్నాను. పుట్టిన తర్వాత కలలు కనికని నలభై అయిదోయేటగా నన్ను మూసీ నది తీరాన షికార్లు చెయ్యగలిగాను.

నైలునదిలోయలో పత్తితోటల్లో పనిచేసే వారి పాటలు వింటూ సంతోషించాలనిపించేది. నాగార్జునసాగర్ నిర్మించే రోజుల్లో పనిచేసే కూలీల పాటలు వినడమే సరిగ్గాపడలేదు. చరిత్రలో తోడుదుర్గాన్ని గురించి చదివి - అక్కడి పూర్వవైభవాన్ని తిలకించాలని ఎంతో ఉవ్విళ్ళూరుతూ ఉండేవాణ్ణి.

ఆంధ్రప్రభవారు ఆఫీసు పెట్టి ఉద్యోగరీత్యా వెళ్ళమని చెప్పడం బట్టి దగ్గరలో వున్న చిత్తూరు చేరి అక్కడి వైభవం ఒక సంవత్సరం చూడగలిగాను. ఎంతకొట్టుకున్నా ప్రయాణాలు ఒక చిన్న పరిధిలోనే జరిగినాయి.

చాలా చిన్నతనంలోనే పెద్దన్నగారి మనుచరిత్ర చదవడం జరిగింది. సిద్ధుడు కాలికి రాసుకున్న పసరు మహిమ తెలిసిన తర్వాత అలాటిదేదైనా వుంటే బాగుండును - రైళ్ళ ప్రయాణాలు చెయ్యకుండా ఆయా తావుల్లో వెళ్ళి వ్రాలుతూ వుండవచ్చుననిపించేది. ఈ రోజుల్లో ఆ పసరెక్కడ దొరుకుతుంది!?. చేతుల్లో పచ్చ వెలిసిపోయేందుకు ప్రయాణాలు చెయ్యాలిగాని.

***మంచుకొండల దగ్గిర మహాకావ్యం.***

"మీరు సిక్కిం వస్తే పర్వతసానువుల్లో మీకో చిన్నడేరా వేయించి అప్పగిస్తాను. కాఫీ వగైరాలన్నీ పుష్కలంగా సప్లయిచేయిస్తాను. ఒక కావ్యం వ్రాసుకొందురుగాని. దాన్ని హిమాలయానికే అంకితమిద్దురుగాని." అని ఆయనగారు నా మనస్సు ఉప్పొంగేలాగా చెప్పారు.

నిజమే! అంతటి ప్రశాంతతో అక్కడ లభిస్తుంది. అంతటి ఉన్నతి తొంగి చూస్తుందా శిఖరాలవంక చూస్తుంటే కానీ ఈ బొందెను అక్కడికి చేర్చడమెలా. మళ్ళీ ఇక్కడకు చేర్చడమెలా.. బెజవాడ వదిలి రెండు నెలలుంటేనే చెప్పలేని బెంగపుట్టుక వచ్చింది.

ఎవరెస్టు శిఖరారోహణ జరిపిన మహనీయుడు టెంజింగ్. "ప్రజలలో క్రమశిక్షణ అవసరమనుకుంటే వారిని పర్వత ప్రాంతాలకు పంపండి. మీకు మంచి మిత్రులు కావాలంటే మంచుకొండలకు రండి" అన్నాడు. ఈ ఆధునిక యోగి చెప్పిన సత్యాలివి.

పూర్వం మహాయోగులు, ఋషులు, పర్వతసీమల్లో ఏకాంత జీవనం గడుపుతూ క్రమశిక్షణనే కాకుండా శాంతిని కూడా సంపాదించుకోగలిగారు. మహానగాలు ఆముష్మిక ప్రపంచానికి ఆలంబలననే సంగతి అందరూ గ్రహించిందే అక్కడికి చేరడమెలా అన్నదే నాబోటివారికి ప్రశ్న.

ఈ కాలంలో విమానాలు వచ్చినాయి గనుక చాలామంది అతితేలికగా ఒక దేశం నుంచి మరో దేశానికి ఉరుకుతున్నారు అమెరికాలో ఉన్నవాళ్ళు అదిలాబాద్‌లో ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఇండియాకు పురుళ్ళకు వస్తున్నారు. పిల్లవాడు పుట్టిన తర్వాత నెలదాటకముందే అట్లాంటిక్ సముద్రం దాటుతున్నారాపాపడితో.

### *'గోల్కొండ' స్పీడుకే కేరింతలు*

చెవుల్లో దూది తియ్యకూడదని పెద్దలు చెప్పే సమయంలోనే బాలింతరాండ్రు రివ్వున విమానంలో ఎగురుతున్నారు. పిల్లవాడికి కోసిన బొడ్డు ఎండకపూర్వమే "ఎయిర్ ట్రావెలర్" అయిపోతున్నాడు. కానీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి "వోహో! వోహో ఏమి స్పీడు.. ఏమి స్పీడు. వాయువేగంతో పోతోంది. మనోవేగానికి మించిపోయింది" అని ఆశ్చర్య సంభ్రమాలు ప్రకటించే నాబోటివారు ఇంకా చాలామంది ఉన్నారు దేశంలో.

మొన్న ఒకరోజున ఒక యువతీమణి గర్భవతి అమెరికాలో వున్న భర్తకి ఫోను చేసింది. సరిగ్గా అరగంటకల్లా ఆయన పలికాడు. ఇద్దరూ మాట్లాడారు కొంచెంసేపు. తనకు పురుడువచ్చే టైం అయిందని, అప్పటికి రమ్మని ఆవిడ కోరింది. అలాగేనన్నాడాయన. నేను రెండు ఆషామాషీలు వ్రాసి అచ్చులో చూసుకునేలోపల ఆయన రావడం కొడుకు పుట్టడం మీరు ఫలానా తారీఖునరండి అని భార్యతో చెప్పి మళ్ళీ వెళ్ళడం జరిగింది.

ఒకరోజు వరంగల్‌కు ట్రంక్‌కాల్ చేస్తే రావడానికి గంటన్నర పట్టింది. అమెరికానుంచి అరగంటా.. ఎనభై మైళ్ళదూరానికి దానికి మూడింతలు టైం. ట్రంక్‌కాల్ సంగతేమిటి? అక్కడికి ఒకసారి వెళ్ళిరావాలన్న నాబోటి వాళ్ళకు విదేశీయాత్ర చేసినంత పని అవుతుంది.

### *సిక్కిం ఆహ్వానం సీతాఫలమండీ ఆహ్వానం.*

వెనుక కృష్ణాపత్రికలో పనిచేస్తున్నకాలంలో ఒకసారి అయిదారుగురు మిత్రుల్ని వెంటవేసుకుని కృష్ణానది ఒడ్డువెంట పదిమైళ్ళు నడిచాను. ప్రక్కపొలాలలో వున్న చిలగడ దుంపలు మొక్కజొన్న పొత్తులూ తింటూ నడిచాం. ఒడ్డులు ఎండి ప్రవహిస్తూన్న నది. రెండు కట్టలకూ మధ్యగా సన్నగా ఆ ఎండలో గోధుమ వన్నెతాచులాగా కనిపించిన దృశ్యం ఇప్పటికీ నా మనస్సులో చెరిగిపోలేదు. ఆ యాత్ర మేం చేసిన సాహసయాత్రలలో ఒకటిగా చెప్పుకుంటూ వుండేవారం చాలాకాలం.

సిక్కిం రమ్మంటాడు మా చెల్లెలి కుమారుడు - రెండు నెలలనించీ ఊళ్ళో ఉన్న సీతాఫలమండీ రమ్మంటుంది మా అక్క మనవరాలు. ఒక నెలనుంచీ మలక్‌పేట రమ్మంటాడు మా అమ్మాయి ఆడబడుచు అల్లుడు.

ఆహ్వానాలలో వారి సౌహార్దం వుంటుంది. కానీ నేను వాటిని అందుకోకపోవడంలో వుంది - ఆషామాషి

**కాలం మళ్ళీ** వెనక్కిపోతోంది. పోక ఏం చేస్తుంది. ఎంతదూరం క్రొత్తకోసం పరుగెత్తింది. నురుగులు క్రక్కుతూ పరుగెత్తితే సరా బరువులు మోయొద్దు.

పాత ఆచారాలకు మళ్ళీ ప్రాధాన్యత వస్తోంది. వాటి గొప్పతనం కొద్ది కొద్దిగా గ్రహిస్తున్నారు. ఆచరణలోకి తేవడం కూడా ప్రారంభిస్తున్నారు.

చాలాకాలం క్రిందట ఆషామాషీలో రాగి కడియాలు ధరించడం విషయం వ్రాశాను. విజయవాడలో వాటిని గురించి ఉషశ్రీగారు చేసిన ప్రచారాన్ని కూడా వివరించాను. రాను రాను 'రాగి' సర్వరోగ నివారణగా రూపొందింది.

***రాగి కడియం రోగ నివారణ***

రాగి కడియాలు ధరించినవారి సంఖ్య పెరిగిపోతోంది నానాటికీ. అందరూ తమ రుగ్మతలు తగ్గిపోతున్నాయనే చెపుతున్నారు. పూర్వం మంత్రించిన రాగి బిళ్ళలు, తాయొత్తులూ కడితే ఆరోగ్యం బాగుపడేది. ఇప్పుడు మంత్రం లేదు తంత్రం లేదు.

రాగి ముక్క దొరికితే వంచి చేతికి వేసుకోవడమే దాంతో రోగాలన్నీ ఎగిరిపోతున్నాయట ఒకచోట కాదు భారతదేశమంతటా ఈ చికిత్స ప్రారంభమైంది. నేను చాలామందిని అడిగాను, ఫలితమేమిటి? అని. ఒకాయన చెప్పాడు - ఏడాదికి పైనుంచీ ఉన్న ఆయాసం సునాయాసంగా తగ్గిపోయిందట అదివరలో మేడమీదకు వెళ్ళాలంటే మెట్టుమెట్టుకీ ఆయాసం వచ్చేదట ఇప్పుడు రోజుకు పదిమాట్లు బంతిలాగా పై కెగురుతున్నాడుట. క్రిందకు దిగుతున్నాడట.

మరో ఆయన చెప్తాడు - తనకు తరుచు తలనొప్పివస్తూ ఉండేదట ఇప్పుడది బొత్తిగా రావడంలేదట. రాగి ముక్క మహాత్మ్యంతో తాను రోగనివృత్తి పొందానని ఆయన ఎంతో సంతోషంగా చెప్పాడు.

***గుండెనొప్పులు కీళ్ళనిప్పులు, తలనొప్పులు పరారు?***

ఇంకో మిత్రునికి రాగి కడియం ధరించిన తర్వాత కీళ్ళ నొప్పులు రావడం పూర్తిగా మారిందిట. అంతకు ముందు ఎంతో మందులు వాడాడుట. వేలకు వేలు ఖర్చుపెట్టాడట. ఇప్పుడు కీళ్ళు ఇనప గొళ్ళాలకంటె గట్టిగా ఉన్నాయట.

ఇలాంటి ఫలితాలు అందుకోగలవారెందరో ఉంటారు దేశంలో. అందరి కథలూ వ్రాస్తే ఎంత బాగుంటుందో! రాగి కడియం ధరించడమే కనుక ప్రతివారూ, మతంతో సంబంధం లేకుండా ధరించడం జరుగుతోంది. ఇది ప్రకృతి అందించిన వరంగా అందరూ భావించడం గమనించతగ్గ విషయం.

బెంగుళూరు నుంచి వచ్చిన ఒక కన్నడ మిత్రుని చేతికి కడియం ఉండటం చూశాను మొన్న. హైదరాబాద్‌లో ఉన్న ఒక క్రిష్టియన్ ఫాదర్ చేతికీ ఉండటం చూశాను. ఇద్దరూ తమ ఆరోగ్యాలు బాగున్నాయని, చెప్పారు సంతోషంతో.

ఇక్కడేమిటి? బొంబాయి నగరంలో ఈ కంకణధారణ మరీ ఎక్కువగా ఉందట. అక్కడ ప్రతి వీధిలో ఈ కంకణాలు రూపాయి ధరకు అమ్ముతున్నారుట అది సరి అయిన రాగి అవునా కాదా? అనే పరిశీలన కూడా లేకుండా కొనేస్తున్నారుట

***కొందరికి విస్మయాలు: కొందరికి సంశయాలు***

నిజంగా వీటివల్ల రోగాలు నయమవుతున్నాయా? అనేది ప్రశ్న వేడిని తీసివేసే గుణం రాగిలో ఉంది గనక ఈ ఫలితాలు అందుతున్నాయంటున్నారు కొందరు. నెత్తురుపోటు కూడా తగ్గుతోందని కొందరు చెపుతున్నారు.

అయితే వేడిని ఆకర్షించే గుణం జింక్, అల్యూమినియం, టిన్ మొదలైన లోహాలలో కూడా వుందిగదా - రాగికి ఒక్కదానికే యింత ప్రాముఖ్యం రావడమేమిటి? అంటున్నారు కొంతమంది.

'ఇది కేవలం కంకణం ధరించిన తర్వాత మానసికంగా కలిగే మార్పు అయివుంటుంది. ఆ మార్పు మంచి మందుగా పరిణమించి ఉంటుంది. అంతేగాని రుగ్మతలెక్కడ పోతాయి? - అంటున్నారు మరికొందరు.

అయితే వీటిని ధరించేవారిలో ఎక్కువ మంది పురుషులే ఉంటున్నారు వారిలో విద్యాధికులు, వ్యాపారవేత్తలు, అనుభవజ్ఞులు చాలామంది ఉన్నారు. వీరందరూ మూఢ విశ్వాసంతో రోగాలు పోతున్నాయని చెప్పుకునే స్థితిలో ఉంటారా! అనేదికూడా విచారించవలసిన విషయం.

చాలామంది ఆసక్తిపరులు చేతికి రాగి కడియం తొడుక్కోవడానికి కొంచెం సంశయిస్తున్నట్లున్నారు. రాగితో రిష్టువాచీలకు స్ట్రాప్‌లు ఏ కంపెనీవారయినా తయారుచేస్తే కావలసినంత బేరం ఉంటుందనే నా భావం. అసలైన రాగితో అందంగా, నగిషీలతో వాటిని తయారుచేస్తే - ఉభయతారకంగా ఉంటుంది కొనేవాళ్ళకు.

***రాతియుగంనుంచీ రాగిమోజు***

రాగిలో ఏదో గొప్ప శక్తి ఉన్నదనే విషయం ఈనాడు తెలుసుకున్నది కాదు. రాతి యుగంలోవారు కూడా రాగిని రోగనివారిణిగా, ఉపయోగించేవారు. రాగిలో గల మన్నిక, కాంతీ ప్రజల్ని ఎక్కువగా ఆకర్షించేదట. అందువల్ల వాటితోనే ఇంట్లో చెంబులు, వగైరా పనిముట్లు తయారు చేయించుకునేవారు.

పూర్వం పల్లెటూళ్ళలో చాలామంది రాగి డేగిసాలలో అన్నం వండుకోవడం చూశాను. వారనేవారు "ఇత్తడి గిన్నెతో వండిన కూడు అరగదు మహానుభావా? పైగా అతివేడి" అని ఈ డేగిసాలవంట ఇప్పటికి కొందరి ఇళ్ళల్లో ఉంది. కాని రాగి ఖరీదు ఎక్కువ కావడం వల్ల జర్మన్ సిల్వర్ ఎక్కువగా వాడకంలోకి వచ్చింది. ఇప్పుడు వైట్ మెటల్ యుగం వచ్చింది.

రాగి పళ్ళాలు, పంచపాత్రలు, ఉద్ధరిణులు, చెంబులు - వగైరాలు ఎక్కువగా వాడబడుతూ ఉండేవి. కాశీనుంచి గంగాజలం రాగి చెంబులతో తెచ్చి దాచుకుంటారు. పూర్వం చాలామంది రాగి కడియాలు వేసుకునేవారు. రాగి బిళ్ళలు మెడలో ఉండేవి. రాగి తాయెత్తులు ప్రతి బిడ్డకూ కట్టేవారు. కాళ్ళకు రాగి కడియాలు వేసుకునేవారు మొగవాళ్ళు కూడా వాటిని 'వెంకన్న' కడియాలనేవారు జబ్బలకు రాగి దండకడియాలు ధరించేవారు.

***బొంబాయిలో రోజుకు 7000 కడియాలు***

కారణం ఏమైనా కానివ్వండి మళ్ళీ 'రాగిమోజు' దేశంలో తల ఎత్తింది. ప్రతిరోజూ వేలకు వేలు కడియాలు అమ్ముడుపోతున్నాయి. ఒక బొంబాయిలో రోజుకు 7000 కడియాలు అమ్ముడుపోతున్నట్లు వ్రాశాడొక జర్నలిస్టు.

పారిశ్రామిక వేత్తలు మాత్రం ఈ రాగిమోజు తలుచుకుని భయపడుతున్నారు. అసలే దేశంలో రాగి అతి కరువుగా ఉంది. ప్రస్తుతం విదేశాల నుంచి అరవైకోట్ల రూపాయల విలువగల రాగి దిగుమతి చేసుకోవలసి వస్తోంది. పై సంవత్సరానికి 1,24,000 టన్నుల రాగి అవసరమవుతుందనీ, దానిలో సుమారు 26,000 టన్నులు దేశంలో ఉత్పత్తి అవుతుందనీ అంచనా వేశారు.

పోతే లక్ష టన్నుల కొరత ఈ కొరతలో ఈ మోజు బయలుదేరింది. ఇంకెంత కొరత వస్తుందో వీటివల్ల తెలియదు. కొరతమాట ఎలావున్నా రుగ్మతలు తొలిగిపోతే సంతోషించవచ్చు. కొరతలు మనకు ఎందులో లేవు గనుక.

***తామ్రపత్రాలు.. ఆరోగ్య సూత్రాలు***

ఇటీవల స్వాతంత్ర్య యోధులకు ఎన్నో వేలమందికి ప్రభుత్వం సత్కారాలు చేసింది. ఆ సమయంలో వారి తామ్రపత్రాలు బహుకరించడం జరిగింది. ఏమిటా ఇవి ఇచ్చారని చాలామంది అనుకున్నారు. కానీ వాటి విలువ ఇప్పుడు తెలుస్తోంది. ఆ పత్రాల్ని కంకణాలుగా చేయించి ఇంటిల్లపాదికీ వెయ్యవచ్చు. వాటిద్వారా ఆరోగ్యభాగ్యాన్ని పొందవచ్చు.

కొందరికి ఆ పత్రాలను చెడగొట్టడం ఇష్టంలేకపోతే వాటిని ఏ గూట్లోనో అలంకారం క్రింద పెట్టి ఉంచక - నిద్రపోయేటప్పుడో, వెనుకటి చరిత్రను నెమరు వేసుకునేటప్పుడో గుండెలమీద పెట్టుకుంటే మంచి ఆరోగ్యాన్నిస్తాయి. ఆరోగ్యానికి మించిన మహద్భాగ్యం మరొకటి ఏం ఉంటుంది?

మొత్తానికి రాగికి మంచి గిరాకీ దానితోపాటు గౌరవం వచ్చాయి. వాటి పుణ్యమా అంటూ కొందరి రుగ్మతలు నయమైతే ఎం.బి.బి. యస్ సీట్ల త్రొక్కిసలాటన్నా కొంత తగ్గుతుందేమో!

(11 ' సెప్టెంబర్ 72 - ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**నాకు మల్లేనే** ఉద్యోగంలోనుంచి బయటపడి రికామీగా తిరుగుతున్న మిత్రుడు తరుచు కలుసుకుంటున్నాడిటీవల వచ్చి. రికామీగా ఉన్నా, హుషారుగా ఉండగలడు. కొంచెం ఆస్తివున్నమాట నిజమే గాని - దానినుంచి వచ్చిన హుషారు కాదది.

అతనికి దిగులుపడటం చేతగాదు. పొగడ్తలకోసం ఎదురుచూడడు ప్రొద్దు ఎలా గడుస్తుందా అన్న భయంలేదు. పరోపకారబుద్ధి వుంది బంధు ప్రీతి వుంది. ఇంకేం కావాలి? హాయిగా కాలంగడిపేస్తూ ఉంటాడు.

"ఏం శేషూ! రేపు సాయంత్రం కలుసుకుందామా! " అంటే

"ఎన్నిగంటలకు? సరిగ్గా అయిదుగంటలా! సరే వచ్చేస్తాను" అంటాడు.

"ఆరు గంటలకు ఫలానా చోటికి వెడదాం?" అంటాననుకోండి.

"వెడదాం ఎంతసేపు?" అంటాడు.

"ఏడున్నరకు ఇంటికి రావాలి" అంటాను.

"ఏడుంబావుకేవద్దాం మనదేం ఉంది?" అని నవ్వుతూ అనేస్తాడు.

"ఊళ్ళో ప్రయాణాల మాటకాదు. బయట ఊళ్ళ ప్రయాణాలమాట చెప్పినా అంతే. మనం ముసలివాళ్ళమైనాం. పోనీ ఏ హైదరాబాదో చేరి కాలం గడిపేద్దాం వృద్ధసంఘం ఒకటి స్థాపిద్దాం అక్కడ" అంటే -

***ఆకులలాగా ఉన్నాం... ఎప్పుడు రాలిపోతామో***

"అలాగే చేద్దాం. తొందరగా చేస్తే మంచిది ఎన్నాళ్ళదాకానో దేనికి? పైవారం బయలుదేరుదాం ఎండు ఆకులలాగా ఉన్నాం. ఎప్పుడు రాలిపోతామో" అని పకపక నవ్వుతాడు.

అతగాడు ఎండు ఆకు అన్నప్పుడల్లా హృదయంలో ఫెళఫెళమన్న శబ్దం వినిపిస్తుంది. మామూలు సమయాలలో అరవై అంటే అంత పెద్ద వయస్సనిపించదు. డెబ్బయి దాటినవాళ్ళు కూడా రుబ్బుపత్రాల్లాగా తిరుగుతూ ఉంటారు. పైవాళ్ళు ఉంచితే ఉద్యోగాలు చేస్తూ తెల్ల మీసాలు మెలివేస్తూ ఉంటారు.

పైగా కలం చేతపట్టినా, ఎవరినో కూర్చోపెట్టుకుని పోసుకోలు కబుర్లు చెపుతున్నప్పుడూ మనస్సు మాములుగా, పచ్చగా ఉన్నట్లే ఉంటుంది. ఆరోగ్యాన్ని గురించి ఆలోచిస్తున్నా, సంపాదన విషయంలో లెక్కలు వేస్తూన్నా.. వేదాంతంలోకి మనస్సు పోనిచ్చినా అధిక ధరల్ని గురించి ఆలోచించినా, సంఘంలో తలయెత్తే కృతచర్యలు తెలుసుకోగలిగినా బ్రతుకు ఎండు ఆకుగా మారిపోయినట్లే అనిపిస్తుంది.

కొన్ని ఆకులు రాలిపోతే భగవంతుడికి జాలివుండదు. సంఘానికీ లోటు ఉండదు.

ఈ రోజుల్లో అయినవాళ్ళక్కూడా అట్టే విచారం ఉండటంలేదు అన్నీ తెలిసి కూడా ఆశలు పెంచుకునే వారిని తలిస్తేనే విచిత్రంగా ఉంటుంది.

ఒక వృద్ధమూర్తిని "తమ కోరిక యేమిటి? జీవితంలో సాధించదలిచిందేమిటి? " అని ప్రశ్నించాను. ఆయనగారు పది నిముషాలు అటూ ఇటూ చూచి, "ఆ సమస్యను గురించి ఆలోచించడం మంచిదే. అయితే పై ఆదివారం వస్తా" అని హఠాత్తుగా లేచిపోయాడు.

ఆదివారాలు ఆరు గడిచినాయి. ఆయనగారి దర్శనం మాత్రం కాలేదు.

***నరకంలో హౌస్ ఫుల్ బోర్డు.***

మొన్న మిత్రులు పుచ్చా పూర్ణానందంగారు మరో సమవయస్కునితో చలోక్తులాడుతూ "అప్పుడే మనకు ఛాన్సు రాదు అక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేశారంట. అయినా ఇంకో తమాషా విన్నారా? అక్కడ చోటు చాలకపోవడం వల్లనే అక్కడ వేసే శిక్షల్ని కొద్దిగా రూపాలు మార్చి ఈ లోకంలోనే అమలు జరుపుతున్నారు. అందువల్ల పిలుపులు కొంచెం ఆలస్యమవుతున్నాయి."

"ఇక్కడ సిగరెట్లన్నా దొరుకుతున్నాయి. అక్కడ అవీ ఉండవు" అన్నాడు రెండో పెద్దమనిషి.

"నాకు బీడీలు అలవాటు అవి దొరుకతాయేమో" అనుకున్నాడింకో ఆయన.

"అంతా నరకం మాట ఎత్తుతావేమిటి? అన్ని పాపాలు మనమేం చేశాం? పెద్ద ఉద్యోగాల్లో చేరి క్రిందివాళ్ళ నోళ్ళు కొట్టివేశామా? లంచాల పొట్లాలు చూడగానే సంతకాలు పెట్టేశామా? మరొకరికి మేలు జరుగుతుంటే సహించలేక, గుండెల్లో ఎర్రతేలు కుట్టినట్లు ఏడ్చామా? మనమేం పాపం చేశాం? మనకు నరకం ప్రాప్తించడానికి. సరాసరి స్వర్గానికే పోతాం" అన్నారు పూర్ణానందంగారు.

***రంభా, ఊర్వశీ ముసలివాళ్ళయ్యారట***

"అక్కడ అసలు ఖాళీలేదుటండీ. పూర్వం ధర్మాలు చేసినవాళ్ళూ, యజ్ఞయాగాదులు చేసినవాళ్ళూ అక్కడ చేరేవారుట. ఇప్పుడు రాజకీయాలద్వారా దేశానికి సేవచేసిన వారికి మాత్రమే ప్రవేశార్హత పెట్టారుట. అందువల్ల స్వర్గం క్రిక్కిరిసిపోతోందిట. పైగా రంభా, ఊర్వశీ మొదలైన వాళ్ళంతా బొత్తిగా ముసలి వాళ్ళయిపోయారట. స్వర్గవాసుల్ని పలకరించే ఓపికైనా లేకుండా ఒక మూల ఎక్కడో పడివున్నారుట. గృహాన్నే స్వర్గసీమ చేసుకుని ఇక్కడే ఉండటం శ్రేయస్కరం" అన్నారు రెండో ఆయన.

"ఏం గృహమో? ఏం స్వర్గమో? ఇంతవరకు ఈ నెల యింటి అద్దే కట్టలేదు" అని రెండో ఆయన గొణుక్కున్నారు.

"అలా అంటే ఎలాగండీ? పురుషులుగా జన్మించిన తర్వాత ఇంటి కడగళ్ళు తప్పుతాయా? మన వేదాంత మాటలు ఇతరులు వొప్పుతారా? పురుషుడైన తర్వాత తురుపులాగా పనిచెయ్యాలిగాని విషాదంతో కూర్చుంటే ఎలా?"

"అయినా ఇంకో సత్యం ఉంది మీరు గ్రహించవలసింది. ఈ కడగళ్ళున్నాయి చూశారూ! ఇవి చాలాకాలం భరించాం. ఇక భరించవలసిన కాలం చాలా తక్కువ. అది ఆలోచించరేం మీరు. "

***కడగళ్ళ ముసురులో వడగళ్ళవాన***

"అయినా జీవితమంటే కడగళ్ళే.. అందులో ఈ కాలంలో ఈ కడగళ్ళ ముసురులో నుంచి ఎప్పుడో సుఖమనే వడగళ్ళవాన కురుస్తుంది. దానికోసం ఆశపడి కూర్చోవలసిందే" అని ఆయన దీర్ఘోపన్యాసం చేశారు.

మళ్ళీ శేషగిరి అన్నాడు - "మీరెన్ని మాట్లన్నా చెప్పండి మనం ఇక్కడవుండటమనేది హుళక్కి. ఒక చిన్నగాలికి రాలి ఊరుకుంటాం. ఈ గాలి ఎప్పుడు వీస్తుందో మనకు తెలియదు గనుక ఇలా గోల జీవితంలోపడి కొట్టుకుంటూ ఉంటాం" అని.

పూర్ణానందంగారు నవ్వి "అలా కొట్టుకు పోవడమంటూ లేకపోతే మనంటి సరుకు ఈ లోకంలోకి ఎందుకు వస్తుంది? ఏ ఇక్ష్వాకులో ఇంకా పరిపాలిస్తూనే ఉండేవారు. భారతదేశ ప్రతిష్ఠ నిలబడేది. మీవంటి రకాలు ఎందుకొస్తాయండి" అన్నారాయన.

***జీవితం టైమ్ ఎండు వర్కు లెక్కలాటిది.***

"బయటికి వెళ్ళకపోతే ఎలాగండీ? వెళ్ళి తీరాలి. జీవితం కూడా టైం ఎండ్ వర్కు లెక్కలాటిదే ఈ ప్రపంచం ఒక తొట్టి. పైనుంచి జీపులు వచ్చి నింపుతూ ఉంటారు. క్రింద జనప్రవాహం జారిపోతూ ఉంటుంది భూమిలోకి. లేకపోతే తొట్టి ఎక్కడ పడుతుంది? కాకపోతే ఇప్పుడు ఫామిలీ ప్లానింగ్ ద్వారా తొట్టిలోకి వచ్చే ప్రవాహాన్ని తగ్గించారు" అన్నాను.

"పోక ఏం చేస్తామండీ? అందరం పోతాం. ఉండి ఉద్ధరించేదేం వుంది? ఉన్నన్నాళ్ళూ ఇలా కొట్టుకుంటాం. కళలు, సారస్వతం అంటూ కళాసేవచేసేవారు మాత్రం కలకాలం ఉంటారా? అలావుంటే కాళిదాసాదులే ఉండేవారు. దేశమంతా ఇలాటి కాఫీదాసులు, సిగరెట్ల దాసులూ ఎందుకు అవతరిస్తారు? " అన్నారు పూర్ణానందంగారు.

అన్నట్లు మొన్న వేసవికాలం గడిచిన తర్వాత అంటే మేనెల వెళ్ళిన తర్వాత ఎప్పటికో ఉషశ్రీగారు ఏ ఊరునుంచో ఊడిపడ్డారు. రాగానే ఆయన వేసిన ప్రశ్న "ఏమిటి బ్రతికి ఉన్నారా?" అని.

"ఆ! ఇలా ఉన్నాం ఫర్వాలేదు. వేసవికాలం గడిచింది. మళ్ళీ వేసవికాలంలాగాలంటే ఇంకో పదినెలలదాకా ఫర్వాలేదు. తర్వాత మాట చెప్పలేం" అన్నారు.

***ఎప్పుడో ఒకప్పుడు ఆకులు రాలక తప్పదు.***

ఆ మాట వినగానే ఉషశ్రీగారు అన్నారు. "మరేం ఫర్వాలేదు ఈ వేసవికాలానికి తట్టుకున్న ఘటాలు మరో పదేళ్ళదాకా చక్కగా బ్రతుకుతారు. అంతవరకూ నాది గ్యారంటీ అని. "

ఆ గ్యారంటీని జ్ఞాపకం చేసుకొమ్మని చెప్పాను వృద్ధమిత్రులకు. శేషగిరి మాత్రం "ఎప్పటికో అప్పటికి ఆకులు రాలితీర్తాయి" అన్నాడేదో పేద్ద సత్యాన్ని వెలిబుచ్చినట్లు.

**(7' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"మనసిచ్చినవాడే** నా ప్రియుడు" - అని ఒక నాయిక ఎంతో ధీమాగా చెప్పుకుంది. ప్రియుడనేవాడు ఏమి ఇచ్చినా, ఇయ్యకపోయినా కనీసం మనసైనా ఇస్తే కొంత మెచ్చుకునే అవకాశం ఉంటుంది. మనస్సు అనేది మహత్తరమైన సంపద అంటారు. కనుక దానితో తృప్తిపడవచ్చు.

"నచ్చినవాడే నా ప్రియుడు" అనే మరో నాయిక తన స్వాతంత్ర్యభావాన్ని వెలిబుచ్చుకుంది. మరి ఇక్కడ "నచ్చడ"మనేమాటకు ఆవిడగారి వ్యాఖ్యానమేమో తెలియదు. అవతలవాడి మనస్సుతో సంబంధంలేదని మాత్రం అర్థమవుతుంది.

***నచ్చడమంటే చూపులో, మాటలో!***

నచ్చడమంటే కంటికి నచ్చడమో ఏమో మరి, ఒకప్పుడు అవతలవాడి తుంటరితనం నచ్చవచ్చు. మన జానపదాలలో కొంటితనాన్ని చూచి గుండెలు గ్రుమ్మరించిన నాయికల గాథలు కొన్ని ఉన్నాయి. ఈ రోజుల్లో కొంటితనానికి ఏం తక్కువవుంది? అంతా కొంటిమాయలే!

చూపులే కొంటిచూపులు. నడకలే కొంటి నడకలు. వలపులే కొంటి వలపులు. రూపాలే చాలావరకు కొంటె రూపాలు. మాటలు సరేసరి.

ఇలాటి వారంతా నిజానికి నవ్యపథంలో విహరించే నలకూబరులుగా ప్రత్యక్షమవుతున్నారు. ప్రత్యేకతలంటూ ఏమీ ఉండవు. అంతా ఒకటేపాట. ఆరాధన అంటూ ఏమీ వుండదు. ఒకేరకపు వేట.

పైన చెప్పిన నాయికకు నచ్చినవాడంటే ఇలాంటి కొంటెదొర కావచ్చు. అలాటి పరిస్థితిలో ఆమెకు లభించే ప్రియుడు మామూలు ప్రేమదినుసులు - హృదయం, త్యాగం, ఆరాధన, స్పందన, మొదలైన వాటిని మూటగట్టుకు రావలసిన అవసరం ఉండదు.

తన భాగ్యమంతా ఎదుటివాళ్ళ కళ్ళల్లో ఉన్నప్పుడు అతగాడు పాతకాలపు ముళ్ళకంచెల్లోపడి నడిచిరావడమెందుకు? రాజమార్గంలోనే నడుస్తాడు. రావలసిన ఆహ్వానం వస్తుంది. కావలసిన భోగం దానంతటదే అందుతుంది.

***జుట్టుచూసి ప్రేమ. పడికట్టు మాటలు చూసి ప్రేమ***

ఇలాటి వలపులను గురించి ప్రస్తావిస్తూ ఒకాయన అన్నాడు. ''ఏం ప్రణయాలు? అ ర్థ్వానపు ప్రణయాలు. హృదయాల సంగతి అక్కరలేదు. ఉత్సుకత విషయం అంతకన్న అక్కరలేదు. జుట్టుచూసి ప్రేమ, కట్టుచూసి ప్రేమ, పడికట్టు మాటలు చూసి ప్రేమ. వీటితోనే సరిపెట్టుకుంటున్నప్పుడు ఇంకా సాధించవలసిందేం వుంది? ''

''వాళ్ళు సాధించవలసిందేం లేదు. కాకపోతే 'నచ్చిన పురుషుడు' అని సంబరాలుపడే బింబాధరుల మానసికతత్వాన్ని పరిశోధించవలసిందేగాని'' అని మరో ఆయన అన్నారు.

ఒకళ్ళకు నచ్చిన విషయాన్ని గురించి మరొకరు పరిశోధించవలసినది ఏం వుంటుంది ఎందుకు నచ్చాడంటే వాళ్ళుమాత్రం చెప్పగలరా! అసలు ఆ ప్రశ్నకు వారు గుక్కతిప్పుకోగలరా?

ఈ నచ్చడమనేది చాలా విచిత్రమైన విషయం. అది 'పర్సనల్' నిర్ణయం. మరొకరు విచారించడానికి అవకాశంలేదు.

''అదేమిటయ్యా! ఆ వేషం వేశావు. నీకేం బాగుంది? వెనుకటి వేషంలోనే నువ్వు బాగుండేవాడివి'' అంటే వెంటనే

''మీ సంగతి నాకెందుకు? నాకు నచ్చింది. నేను తీసుకున్నాను'' అంటాడు గర్వంతో. అడిగేవాళ్ళకు పిచ్చికాకపోతే ఒకరికి నచ్చిన విషయాన్ని గురించి సంశయం ప్రకటించడమేమిటి?

***రోహిణి ఎండల్లో రగ్గు కప్పినట్లు***

అక్కరలేని సలహాలు చెపితే అవతల వాళ్ళకెలా ఉంటుంది? భగ్గున మండే రోహిణీకార్తె ఎండల్లో మిట్టమధ్యాహ్నం వేళ ఒక పెద్ద రగ్గు తీసుకెళ్ళి కప్పినట్లుంటుంది.

ఆ మధ్య ఒకరి యింటికి వెళ్ళాను సాయంత్రంపూట. వరండాలో కూర్చుని ఆ యింటి యజమానితో మాట్లాడుతున్నాను. ప్రక్కభాగంలో దంపతులు ముస్తాబై బయటికి వచ్చారు. ఇంటికి తాళం పెట్టారు. చెరో తాళం చెవి తీసుకొచ్చారు. భర్త అన్నాడు ''సరే! నీకు నచ్చిన సినిమాకు నువ్వుపో! నాకు నచ్చిన దానికి నేనుపోతా. పదిగంటలకు వచ్చి కలుసుకుందాం'' అని.

''పదిగంటలకు వచ్చి కలుసుకుందాం'' అన్న మాటలో కొంచెం స్థాయీ భావం ఉంది. ఆయనగారు ఆ మాత్రం మాట్లాడటంలో కొంత దాంపత్యగౌరవం ఇమిడివుంది. బయటకురాగానే కొంత స్వేచ్ఛ ఉండాలనే సత్యాన్ని వారు గ్రహించారు. స్వేచ్ఛలోనే దాగివుంటుంది. ఇచ్ఛ. ఆ ఇచ్ఛకే పర్యాయపదం నచ్చడం.

***భర్తకు నచ్చిన చీర! భార్యకు నచ్చిందా?***

ఒకసారి పెళ్ళిలో పదిమంది ఆడవాళ్ళు ఒకచోట సమావేశమయ్యారు. వారారోజున చర్చించిన విషయం - స్త్రీ తనకు నచ్చిన దుస్తులు ధరించినప్పుడు భర్త చూసి గర్వపడాలా! అన్నది.

చాలాసేపు చర్చ జరిగింది. స్త్రీ తనకు నచ్చే విధంగానే అలంకరించుకోవాలన్న వారి సంఖ్య పెరిగింది. ఆ తీర్పు సమయంలో వోటువేస్తూ చేతులెత్తిన వారందరికీ గోల్డుస్పాట్‌లు బహూకరించబడ్డాయి.

'నచ్చినవాడు' - నిజానికి అంతగొప్పవాడుగా ఉండక్కర్లా. తనకు నచ్చని వాడితో పోటీపెట్టడానికి ఎట్లాంటి నకిలీ సరుకైనా సరిపోయింది. ఆ సరుకుకే ఎంతో ప్రతిష్ట కల్పించాలనే ఆకాంక్ష బయలుదేరుతుంది.

***మెచ్చుకుని మెడలో వేసే పొగడ దండలు***

కొందరికి కేవలం తనను మెచ్చుకునే వాళ్ళే నచ్చుతారు. మెచ్చి మెడలో వేసే పొగడ్తల పేరిట పొగడ దండలు విచ్చి సువాసనలు వెదజల్లుతుంటే ఆ వ్యక్తి నచ్చక ఏం చేస్తాడు?

మా మేనత్త పాపం అల్పసంతోషి, అమితభాషి. ఒక్కొక్కరోజున మధ్యాహ్నంపూట భోజనాలవగానే - ఆ ఎండలోనే ఆయాసపడుతూ మా యింటికి వచ్చేది. "ఏమిటి అత్తయ్యా ఇంత హడావుడిగా పరుగెత్తుకువచ్చావు?" అంటే

***ఇవ్వాళ మామయ్యకు పచ్చడి నచ్చిందిరా.***

"వచ్చానర్రా. నాకు ఇంట్లో ఉండబుద్దిపుట్టలేదు. ఇవ్వాళ మీమామయ్య పచ్చడి తనకెంతో నచ్చిందని ఎంతో మెచ్చుకున్నారు. అంతకంటే నాకింకేం కావాలి చెప్పండి. భర్తకు నచ్చే సేవలు చేయడంలో ఉన్న ఆనందం మరోదాంట్లో ఉంటుందా?

నా మనస్సుకి ఇవ్వాళ పండగలాగా ఉంది. అందుకని మిగిలిన పచ్చడి పుచ్చుకుని చక్కావచ్చ మీకూ రుచి చూపిద్దామని, హాయిగా తినండి" అని పచ్చడిగిన్నె అక్కడపెట్టి పరమానందభరితురాలయ్యేది.

"ఆయనగారికి నచ్చిన పచ్చడి ఇక్కడికి తెచ్చావేంటి? పైగా ఇంత సంతోషంగా ఉన్నప్పుడు ఇలా వచ్చేశావేమిటి? నచ్చడమంటే ఏమిటి? మనసు విచ్చడమేగా?" అని మా పెద్దమ్మ అనేది.

***నచ్చడం రత్నాలు పొదిగిన రంగుల పచ్చడం.***

"ఏమో? అదంతా నాకు తెలియదు. ఆ మాట మీ చెవిని వెయ్యాలనిపించింది. వచ్చేశాను. కావాలంటే రేపు మరింత పచ్చడి చేస్తాను. మనుష్యులు నచ్చకపోయినా ఒకప్పుడు వారి చేష్టలు నచ్చుతాయి. అదేం సాధ్యమో" అని ఆవిడ తన ఆవేదనతో కూడిన ఆనందాన్ని తెలియపరిచేది.

'నచ్చడం' అనేది ఒక్కొక్క సమయంలో రత్నాలు పొదిగిన రంగుల నచ్చడంలాగా కనిపిస్తూంది మురిపిస్తుంది.

**(4' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"ఓటు కావాలన్నా...**
**సీటు కావాలన్నా...**
**వాటముగ బస్సు రూటు కావాలన్నా..**
**పర్మిట్లు కావాలన్నా**
**ప్రమోషన్లు కావాలన్నా..**
**చింతించకో ప్రాణనాధా! "**

ఈ పాట తరుచు వినపడుతూవుంటుంది. అంతకు ముందు ఎలా వున్నా జూన్, జూలై నెలలనుంచీ పాట శ్రద్ధగా వినాలనిపించింది. వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తి కలిగింది.

ఇది కలెక్టరు జానకి చిత్రంలో నాగభూషణం చెప్పిన కుచేలోపాఖ్యానం హరికథలోనిదట. కుచేలుడు నిస్సహాయుడై ఉన్న తరుణంలో భార్య ప్రోత్సాహపరుస్తూ శ్రీకృష్ణుని వద్దకు వెడితే పైన చెప్పిన పనులు అన్నీ సులభంగా అవుతాయని చెపుతుందట.

***ఎందరో కుచేలుళ్ళు... కొందరు కృష్ణుళ్ళు***

మరి ఈ రోజుల్లో కుచేలుళ్ళ సంఖ్య అతిగా పెరిగింది. వారితోపాటే, వరదాన హస్తులూ పదాన్యులూ అయిన కృష్ణయ్యలు కూడా పెరిగారు.

ఒక్క కాలేజీ సీటు కావాలంటే దాతలు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులై పోతున్నారు. కొన్నికొన్ని పేరున్న కాలేజీలలో ఆఫీసు గదులు వైకుంఠధామాలైపోతున్నాయి. గేటు దగ్గరనుంచి "సీటు. సీటు... ఒక్క సీటు. వరదాతా! సకలగుణోపేత, విద్యాజ్యోతి" అంటూ భక్తులు ప్రస్తుతిస్తూ లోపలకు ప్రవేశించడం జరిగింది.

కానీ అదిష్టానవర్గాల దర్శనం కాక పడికాపులు పడడం నిస్పహాయులై తిరిగిరావడం కూడా మాములు దృశ్యమైపోయింది. మాటలా మరి.. అంత తేలిగ్గా ముక్తి సంపాదించడం.

మొదట చెప్పిన పాటలో శ్రీకృష్ణుణ్ణి అడగమంటుంది సీటు కుచేలుడి భార్య. ఇక్కడ ఎందరు కృష్ణయ్యలనైనా అభ్యర్థించవలసి వస్తుంది సీటు కోసం. కృష్ణులు అటుకులతో అంత తేలిగ్గా వశమవుతారా! ఎన్ని తిప్పలు పడాలి? ఈ కృష్ణయ్యలతో సంభాషణ చూడండి ఎలా ఉంటుందో.

కృష్ణయ్య: ఎవరు నువ్వు ఎందుకలా ప్రొద్దుటినుంచీ వాకిట్లో తపస్సు చేస్తున్నావు?

అభ్యర్థి: చిత్తం తమ దర్శనభాగ్యం కోసం. నేడు సుదినం.

కృష్ణ: ఏమిటి నీ కోరిక. నీ కులగోత్రమ్ములేవి? ఏ వర్గమునకు చెందినవాడవు? ఎవరు పంపగా వచ్చితివి?

అభ్యర్థి: అవసరము పంపగా వచ్చితిని. అట్టి వారి కులగోత్రములన్నియూ ఒక్కటే. తమరు...

కృష్ణ: అసాధ్యునివలెనున్నావు. చెప్పుము కోరిక.

***రాకరాక ఒక్కడు కాలేజీకి వచ్చాడు.***

అభ్యర్థి: రాకరాక ఒక్క కుమారుడు జూనియర్ కాలేజీకి వచ్చినాడు. అన్నలు ఎంతో ప్రయత్నించి అంత దూరము రాలేకపోయినారు. వీడు ఆచారము తప్పించి పైకి వచ్చినాడు. వీనికి మీరొక్క సీటు సిఫార్సు చేయవలసినదిగా వినమ్రుడనై వేడుచున్నాను.

శ్రీకృష్ణ: నేనా! సీటా! ఎంతమందికి ఇప్పించగలను? వేరు మార్గము చూసుకొనుము.

అభ్యర్థి: అంతమాట వినలేను. మీరుతప్ప నాకెవరు గలరు? అసలైన విద్యాదాతలు మీరే. సీటు ఇప్పించిన వారినే కలకాలం తలచుకొందుము - కొలుచుకొందుము. ప్రభుత్వమువారు విద్యార్థి ప్యాసుకాడని ఇచ్చిన అర్హతా పత్రము. సిఫార్సువలననే బర్హిబర్హముగా భాసించుచున్నది. లేనిచో ఆ పత్రమును చూచువారెవరు? పిలిచి క్లాసు లోపల కూర్చుండుమనువారెవ్వరు?

శ్రీకృష్ణ: నాకు సాధ్యం కాదు. చాలామందికి చెప్పాను.

అభ్యర్థి: మీరలా అంటే నేనెవరితో చెప్పుకోను.

శ్రీకృష్ణ: బ్రహ్మదేవుడితో

***సరస్వతీ నిలయాలు .. .సిఫార్సుల వలయాలు***

అభ్యర్థి: ఆయన మాట ఏ కాలేజీవారు వింటారు స్వామీ? కళాశాలలు సరస్వతీ నిలయాలేగానీ సీట్లు సిఫార్సుల వలయాలు. తమరు ఫోను తీసి ఒక్కమాట చాలు. రెండేళ్ళదాకా మీకు మళ్ళా శ్రమ ఇవ్వను. కరుణించాలి.

శ్రీకృష్ణుడు: నువ్వు నాకు పరమభక్తుడవలె ఉన్నావు. నిన్ను చూస్తే జాలివేస్తుంది. కానీ నేను నిరుడే నా అభ్యర్థుల పేర్లు ఇచ్చేశాను. వారిలో ఎవరైనా తప్పితే మీ అబ్బాయికి చాన్సు ఉండేది. అందరూ పాసయ్యారు. మీవాడికి పై సంవత్సరం తప్పక ఇప్పిస్తాను. ఈ

సంవత్సరం రెస్టు తీసుకోమను. టైపు నేర్చుకోమను. విద్యార్థులకు మధ్య మధ్య ఖాళీరావడం ఆరోగ్యరీత్యా చాలా మంచిది. వెళ్ళిరా. నాకిక తీరికలేదు.

అభ్యర్థి: అంతేనంటారా! నా గతి అంతేనంటారా! సీటు దొరకదంటారా?

శ్రీకృష్ణుడు: ఏం చేస్తావు? ఈ ఏడు తప్పాడనుకో.. వెళ్ళిరా.

ఇలా అభ్యర్థించి, నిస్పృహతో తిరిగి వచ్చిన వారనేకమంది ఉంటారు. పిల్లల తల్లితండ్రులతో వారికి గల తొందర ఇతరులకు కూడా ఉంటుందనుకుని పొరబడుతూ ఉంటారు. సీటు ఇంద్రాధిపత్యంగా మారింది.

***సీటు దొరక్కపోతే - సిగరెట్టుకొట్టు పెట్టరా***

ఇంటర్ సీటుకోసం ఎంతగానో తిరిగి తిరిగి వేసారిపోయిన ఒక తండ్రి కొడుకుతో వ్యాపారం ఏదైనా చేసుకొమ్మని బోధించాడు. వారి సంభాషణ -

"చివరికి సిగరెట్టు కొట్టు పెట్టుకోవచ్చురా! రోజుకో అయిదారు రూపాయలు మిగులుతాయి. కాలేజీ కోర్సు ముగిసేనాటికి నువ్వో ఇల్లు కడతావు. బిడియం దేనికిరా! వ్యాపారం చేసేవాళ్లొక్కరేరా బిక్కముఖాలు లేకుండా కనపడేది. కావాలంటే సాయంత్రంపూట ఎప్పుడైనా సినిమాకు వెడుదువుగాని. ఆ కాసేపు కొట్లోనే కూర్చుంటాలేరా! నా మాట వినరా.." అని తండ్రి.

"వినను నాన్నా! నా భావి జీవితమంతా నాశనమైపోతుంది. నేను న్యూక్లియర్ ఫిజిక్స్‌లో చేరాలని ఎన్నో పరిశోధనలు చెయ్యాలనీ ఫారిన్ వెళ్ళాలని కలలు కంటుంటే సిగరెట్టు కొట్టు పెట్టమంటారేమిటి? ఇది హాస్యమా! " అని కుమారుడు అడిగాడు.

"హాస్యమేమిట్రా?అన్ని మార్కులొచ్చి ఫస్టుక్లాసు జాబితాలో పడి సీటు కోసం ఇలా తంటాలు పడటం చూడలేక అన్నానురా! మొదటి సీటులోనే ప్రవేశం దొరికింది. ఇన్ని ప్రహరీలెలా దాటతావు ఎందుకొచ్చిన బాధ బ్రతుకుతెరువు చూచుకోవడం మంచిదిరా!" అని తండ్రి.

ఆ తండ్రి ఎంత విసుగుపడుతున్నాడో ఆ కుమారుడిలో అంత రోషం ప్రజ్వరిల్లుతోంది - పై చదువులకు ఎగ్రబాకాలని. వారి వేదన వేరువేరుగా చెప్పుకోవడమేగాని - పరిష్కరించుకోవడమెలా!

***ఒకడు మైసూర్ - ఒకడు భోపాల్ - ఒకడు విజయవాడ***

ఒక గృహస్థు కాలేజీ చదువులకు వచ్చిన ముగ్గురు కుమారులు ఒక్క ఊళ్ళో ఉండి చదువుకుని, ఆశపడి విజయవాడలో ఇల్లు తీసుకుని కాపురం పెట్టాడు. తను ఉద్యోగరీత్యా దూరంగా ఉన్నాడు. ముగ్గురు కుమారులూ ఫస్టుక్లాసులో వచ్చినవాళ్ళే. వాళ్ళకు సీట్ల కరువేం ఉంటుందనుకున్నాడు.

కానీ జరిగిన విషయం ఒక్క కుర్రవాడికి తప్ప తక్కిన వారిద్దరికీ ప్రవేశం దొరకలేదు. వారిని చూచి ఇనపగేట్లు గభాలున మూసివేశారు. ఏం చేస్తారు? ఒక కుర్రవాడు భోపాల్ వెళ్ళాడు. ఒకడు మైసూరు వెళ్ళబోతున్నాడు. భారతదేశం అంతా ఒకటే అనే సూత్రం వారికి అన్వయమయ్యే పరిస్థితి ఏర్పడింది.

తలో రాష్ట్రంలో.. తండ్రి పాపం ఉద్యోగరీత్యా ఒక ఊళ్ళో. ఊళ్ళో కాలేజీలున్నాయంటే కొందరికే ఉపయోగపడుతున్నాయి. కొన్ని కాలేజీలలో అడగడం మాత్రం మార్కులడుగుతారు. తరువాత వారి యిష్టం. రిమార్కు చేసేందుకు వీలులేదు.

ఒక్క హైదరాబాద్‌లో మాత్రం సర్కారు విద్యార్థులకు సీటు దొరకలేదంటే ఎలాగో అలా సీటు చూపిస్తామన్నారు ప్రభుత్వంవారు. వాళ్ళకు వాళ్ళు కోరిన చోట మాత్రం కాదు అదైనా కొంతనయం.

ప్రతి ఊళ్ళో విద్యార్థులు వలసపోకుండా 'కావలసిన సీట్లు పెంచడం' అనే చర్యకూడా ప్రభుత్వం తీసుకుంటే ఎంతో మేలుగా ఉంటుంది. ఒక్క సీటు కోసం ఇళ్ళూ వాకిళ్ళూ వదిలిపోవడం ఎంత కష్టం. ఇది ఏటేటా చాలామందికి పట్టుకునే దురదృష్టం.

(18' సెప్టెంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఇది ఒక విధంగా** ఆలోచిస్తే యాచనగా కనిపిస్తుంది. యాచన అనాదిగా వస్తున్న విషయమే అయినా, అదివరకటి కంటే ఎక్కువగా పరివ్యాప్తి చెందింది.

"యాచించకుండా జీవితం గడుపుకున్నాం" అని చెప్పుకోగలవారు పూర్వం చాలామంది వుండేవారు. వారి సంఖ్య చాలా మైనారిటీలో పడింది. సరాసరి చేతులు జాచకపోయినా మనసుజాచడం సర్వసామాన్యమైంది. జాచనిదే జాము ప్రొద్దు గడవడంలేదు నిజానికి.

ఇదివరలో అయితే డబ్బులేనివాళ్ళు డబ్బుకలవాళ్ళనూ, తెలివిలేనివాళ్ళు తెలివికలవాళ్ళనూ, బలంలేనివాళ్ళు బలంకలవాళ్ళనూ అవసరాన్నిబట్టి ఎంతో బిడియపడుతూ యాచన చేస్తూవుండేవారు.

ఇప్పుడా తారతమ్యాలన్నీ పోయినాయి. చాలావరకు తారుమారు పరిస్థితులే ఏర్పడినాయి. పైగా తప్పనిసరి పరిస్థితులుకూడానేమో.

***సొమ్మిచ్చి యాచించడం.***

పూర్వపు యాచనలో చేతులు జాచడమంటే వట్టి చేతులు జాచడమనే అర్థం. ఇప్పటి పద్ధతి అదికాదు - డబ్బు చేత్తో పుచ్చుకుని యాచించడం ఒక ప్రత్యేకత. దాని వెనుక ఆవశ్యకత కూడా ఒకటి ఉంటుంది.

ఉదాహరణకు చెప్పాలంటే ఎన్నో ఉన్నాయి. కిలో పంచదార కావాలంటే డబ్బిచ్చి కీళ్ళోడ్చి యాచించాల్సివస్తోంది. పాలు కావాలన్నా అంతే ఇంత పశుసంపదవున్న దేశంలో సీసా పాలకోసం ఎంతో ప్రయాస పడలిసి వస్తోంది.

పాడిగలవాళ్ళు పదిమందికి అమ్ముకునేవారు. నెలవారి కాతాలుండేవి. పాలు బాగుండకపోతే అడగడానికి అవకాశం ఉండేది ఎక్కువపాలు పోయించుకునేవారు మీటర్లు పెట్టి కొలిచి, ధర తగ్గిస్తూ ఉండేవారు. ఇప్పుడు మూతలు బిగించిన సీసాలు వస్తుంటే అడిగేందుకు ఏం వుంది? అవైనా అడగ్గానే దొరుకుతున్నాయి గనుకనా!

వీధుల్లో గేదెలు కనిపించడంలేదు. పాలకావిళ్ళు అసలేలేవు. ప్రతి ఉదయం వీధుల్లో బిందె తీర్థంలాగా 'బిందెక్షీరం' ప్రత్యక్షమయ్యేవి. ఎప్పుడు కావాలన్నా దొరికేవి. ఇప్పుడేం వుంది? డిపోల వల్ల వంటి కాలిమీద తపస్సు.

***సొమ్ము ఇస్తూ సీసాల భజన***

ప్రక్కగా మురుగు కాల్వలుండటంవల్ల దోమలు కొరుకుతూ ఉండడంవల్ల అనుకోకుండా కథాకళి నృత్యం ప్రారంభమవుతుంది. రెండు సీసాలు చేతులో కలవాళ్ళు సీసాల భజన కూడా చేయడం ప్రారంభిస్తారు.

మొన్న ఒక గృహస్థు అన్నాడు "రోజుకు రెండు గంటలు పాలయాచనతో సరిపోతోంది. డొక్కు ముఖాలతో తయారు కావలసివస్తోంది. ఈ బాధకు బదులు రెండు బర్రెల్ని మేపుకోవచ్చంటే - మా ఆవిడ ఒప్పుకోవడంలేదు. "

"నేను కోడికూసే వేళ లేచి పాలసీసాలతో బయటికి నడవడం - ప్రత్యూష పవనాల హాయిని అనుభవిస్తూ చక్కని కునుకుతియ్యడం - పాలయాచనకు విమోచన నా జీవితంలో ఉండదు. బస్సుల దగ్గరకు పోతే డబ్బులు చేత్తో పుచ్చుకుని ఎన్నిరకాలో

యోచించాలి. కానీ సీటుమాత్రం లభ్యంకాదు. కండక్టరు ఒక చూపు చూసి పొమ్మన్నట్లు చెయ్యివూపుతాడు. "నువ్వు అనర్హుడవు పొమ్మన్న భావం స్పష్టంగా గోచరిస్తూంది. "బదర్! బదర్! కొంచెం అర్జంటుపని.. అర్జంటుపని. " బతిమాలుతూనే ఉంటారు. బస్సు "ఏమిటా పిచ్చివాగుడు" అన్నట్లు ఎంతో దూరం పోతుంది.

మొన్న హైదరాబాదులో బస్స్టాండులో నిలబడి ఉన్నాను, అక్కడ జరుగుతున్న తమాషాలన్నీ చూస్తూ. ఒక ఉద్యోగస్థుడికి బస్సులు రెండు మూడు తప్పిపోయాయి. అన్నిటిదగ్గర "బదర్! బదర్ అర్జంటుపని" అంటూనే వున్నాడు. కానీ లభించలేదు. మరో బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు. ఈ మధ్యలో ఆగడందేనికి? - అని కాబోలు.

"బదర్! బదర్!" మంత్రం పటిస్తూనే ఉన్నాడు.

***బస్సుస్టాండులో బదర్ స్తోత్రం***

మరో రెండు బస్సులు కూడా అలాగే మోసం చేసి వెళ్ళిపోయాయి. కానీ ఆయన మాత్రం బదర్! బదర్ మంత్రం ఎంతమాత్రం ఆపలేదు. చివరకు గతి తోచక "బదర్! బదర్! అర్జంటు పని సెక్రటరేట్" అంటూనే ఒక రిక్షాలో కూలపడ్డాడు.

బస్సుల విషయం వచ్చిందిగనుక ఇక్కడ ఒక చిన్న తమాషా చెపుతున్నాను. ఇటీవల అబీద్ రోడ్డు వెంట ఒక డబుల్ డెక్కు పోతోంది. ఫుట్‌బోర్డుమీద ఒక పాతికమంది యువకులు నిలబడ్డారు. ఒకచోట బస్సు కొంచెం నెమ్మదిగా నడిచింది. ప్రక్కనే ఒక పెద్దమనిషి సైకిల్ పుచ్చుకుని నిలబడ్డాడు.

ఫుట్‌బోర్డుమీదగల ఒక వీరుడు సైకిల్ హాండిల్ గట్టిగా పట్టుకున్నాడు. మరొకడు సీటు పట్టుకున్నాడు. 'హుస్' అని దాన్నీ పైకి ఎత్తారు బస్సు స్పీడులోకి పోయింది. సైకిల్ కూడా పోతోంది. దానివెంట సైకిల్ యజమాని వెంటపడ్డాడు. ఒక అరఫర్లాంగు దూరం వెళ్ళిన తర్వాత సైకిల్ వదిలివేశారు. ఆ యజమాని వెళ్ళి తీసుకున్నాడు. ఆ దొడ్డాఫీట్ చూసి రోడ్డుమీద వారంతా ఎంతో నవ్వుకున్నారు.

యాచన విషయంలోకి వస్తే ప్రతి చిన్నపనికీ యాచన తప్పడంలేదు. అన్నిటికంటే విచిత్రమేమిటంటే ఒకరికి ఒకరు పరస్పరం సహకరించుకుంటూ, కష్టసుఖాలు పంచుకుంటూ బ్రతకవలసిన భార్యాభర్తలే.. (అంతా కాదనుకోండి - కొందరు ప్రముఖులు మాత్రమే) రోజుకు వందసార్లు యాచనలోకి దిగుతూ ఉంటారు.

***పురుష పుంగవుని చీర యాచన***

"ఈ పూట కొంచెం చారు పెడతావు!? ఒంట్లో సరిగాలేదు. ఒక్కొకప్పుడు చాలులే! అట్టే అక్కరలేదు. అయినా తొందరలేదులే. ఒక అరగంట అయినా ఫర్వాలేదు" అని నమ్రతగా అడుగుతూ ఉంటారు. చారునీళ్ళకోసమే అంతగా యాచించవలసి వస్తే - తక్కిన విషయాల్లో ఎంత యాచిస్తాడో ఆ పురుషపుంగవుడు, మనం ఊహించడం కష్టం.

ఇప్పటికి కూడా కొన్ని కొన్ని సంసారాల్లో గృహిణులు భర్తవద్ద ఎంతో నమ్రత వహించి, కొన్ని సందర్భాలలో గజగజ ఒణుకుతూ - 'గాజులు వేయించుకోవాలి ఒక్క రూపాయి ఇస్తారా?' అని అడగటం అంటూ ఉందంటే ఎంతో ఆశ్చర్యం వేస్తూంది.

***చెక్కిట చిటికె - చేతులో నోటు***

ఆయనగారు మంచి మూడ్‌లో ఉండి, ఆమె అర్ధాంగి అనేమాట స్ఫురణలో ఉండి కరుణిస్తే రూపాయి లభిస్తుంది. లేదా వాయిదా అన్నా పడుతుంది. మూడ్ లేని సమయంలో అయితే ఒక్క మూర్ఖపు చూపు మాత్రమే లభిస్తుంది.

భార్య చేతి గాజులకోసం యాచించాలా! ఒకవేళ భార్య మర్యాదకోసం అడిగినా - ప్రియుడు సరసుడైతే చెక్కిట చిన్న చిటికె, చేతిలో అయిదురూపాయల నోటు పడతాయి

(22 ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

అర్ధరాత్రి అంతా నిశ్శబ్ధం. రోడ్డుకు కొంచెం విశ్రాంతి చిక్కినట్లుంది. వొత్తికిలి పడుకుంది. వీధి దీపాలు కారుచీకటిని పార్రతోలలేక చిన్నపుచ్చుకుంటున్నాయి.

ఆకాశం వంక చూశాను. పాతికవత్సరాలు స్వతంత్ర్యమనుభవించిన ఆకాశం. అంతులేని చుక్కలు. చంద్రుడు లేని ఆకాశం. "బాపూజీ లేని భారతదేశం" అన్నమాటను జ్ఞాపక చేసింది. ఆకాశం మీద చందమామ మళ్ళా ఉదయిస్తాడు. బాపుజీ.. మళ్ళీ ఎప్పటికో? ఏమో?

***ఆకాశం మీద అక్షరాలు***

ఆకాశం వంక అలా చూస్తూ నిలబడ్డాను. ఒక అదృశ్య హస్తం ఏవో అక్షరాలు వ్రాస్తోంది. ఏ వేలు కొసనుంచో వెలుగు కలం చకచకా వ్రాసింది, "స్వాతంత్ర్య భారత రజతోత్సవం" అనే వాక్యం.

నిజం స్వాతంత్ర్యం వచ్చి పాతికవత్సరాలైంది. 'స్వాతంత్ర్యం' అనే మాట చాటున ఎందరో ఎదురొడ్డిన ప్రాణాలు, ఎందరో సాగించిన రణాలు, ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, విసర్జించిన భోగాలు, భారతీయులందరినీ ఒకటిగా చేయడానికి సమకూర్చిన అనురాగాలు, చెరసాలల ఇనుప కటకటాలు, పోలీసుల చేతుల్లో లాటీలు, కాంగ్రెసు మహాయోధుల భేటీలు, బ్రిటిష్‌వారు దమన నీతిని ప్రదర్శిస్తూ జరిపిన లూటీలు, ఎన్నెన్నో దృశ్యాలు కనిపించినాయి. భారత ప్రజల కష్టాలు చూచి కరిగిన గాంధీజీ కనిపించారు. గాడ్సే కిరాతచర్యకు గురి అయి నేలకు ఒరిగిన మహాత్ముడు కనిపించాడు. భారత స్వాతంత్ర్య చరిత్ర బంగారు పుటలతో చిత్రించబడిన పవిత్ర చరిత్ర.

ఆ చరిత్ర స్మృతులలో మునిగి ముచ్చటపడుతూ, ఆ నాయకుల దృఢసంకల్పాన్ని త్యాగనిరతినీ దేశభక్తినీ తలచి అచ్చెరువొందుతూ అలా నిలిచిపోయాను. కొంతసేపు ఆ అక్షరాల మీదనే వుంది చూపు.

***ఆకాశపుటంచుల్లో ఊరేగింపు***

ఇంతలో ఆ అక్షరాలు తొలిగిపోయినాయి. 'నెహ్రూజీ పరిపాలన' అనే శీర్షిక మరింత పెద్ద అక్షరాలతో కనిపించింది. ఆయన ప్రణాళికలు రూపొందించిన విషయం జ్ఞాపకమొస్తుంది. ప్రాజెక్టులను ఆయనగారు శంఖుస్థాపనలు చేస్తున్న దృశ్యాలు కనిపించాయి.

దేశంలో పేదరికాన్ని, నిరక్షరాస్యతను, తొలగించడం కోసం ఆయన ఎంతో కృషి చేశారు. భారత ప్రజానీకానికి ప్రియతమ నాయకుడయ్యాడు. గులాబివాసనలు గుబాళించే ఆ మహానాయకుని స్మరిస్తూ కొంచెం సేపు పచార్లు చేశారు. "జవహర్‌లాల్ నెహ్రూకూ జై" అనే ఒక పెద్ద కేక. భారతమాత పులకరించే కేక వినిపించిందాకాశం మీదనుంచి. ఉలిక్కిపడి విన్నాను. వీధిలో ఇంకా ఆ కేక మారుమ్రోగుతూనే ఉంది. అంతులేని ప్రజల ఊరేగింపు ఆకాశపుటంచుల వరకూ సాగుతూనే ఉంది.

నెహ్రూజీ భారత ప్రధాని. ప్రప్రథమ భారత ప్రధాని హిమాలయాలల్లో ధవళకీర్తి నార్జించుకున్న వంశానికి చెందిన మహానాయకుడు భారతదేశ సౌభాగ్యం కోసం జీవితాలను పణం పెట్టిన వంశంలో జన్మించిన త్యాగమూర్తి - ఇలా ఆలోచిస్తూ నిలబడి పోయాను చాలాసేపు.

ఆకాశం మీద అక్షరాలు మళ్ళీ చెరిగిపోయినా ప్రధాని లాల్ బహదూర్ అన్న వాక్యం కనిపించింది. ఆ పొట్టి నాయకుడు గట్టి నాయకుడు భారత ప్రధానిగా నియమితుడై అమిత ప్రజ్ఞతో పరిపాలన సాగించిన దృశ్యాలు కనిపించినాయి.

***లాల్‌బహదూర్ వీరహక్కులు***

బలహీనమైన శరీరం. అద్భుతమైన ఆత్మశక్తి, ధర్మానురక్తి, దాగిన శౌర్యం. ఆ నాయకుని గురించి ఆలోచించాను. పాకిస్తాన్‌తో యుద్ధం సంభవించినప్పుడు అతి పరాక్రమంతో నిలిచి, శత్రువులను తరిమిన నాటి ఆయన ప్రతాపం తలచుకుని ఆనందించాను.

రవంత జంకకుండా, ఆ సమర సమయంలో ఆయన చేసిన ప్రసంగాలు వినిపించినాయి "ఆయుధాలకు ఆయుధాలతోనే జవాబు" అని రేడియోలో చేసిన ఆయన ప్రసంగం చెవి దగ్గర మారుమ్రోగింది. ఒక శౌర్యపు కెరటంగా ఊగింది.

ఇంతలో ఆకాశంలో కారుమబ్బు ఒకటి ముంచుకు వచ్చింది. ఏ దృశ్యం కనిపించలేదు. ఏ భావం స్ఫురించలేదు. విచారిస్తూ ఆ మబ్బువంక చూస్తున్నాను. దానికి "తాష్కెంటులో శాస్త్రీజీ మరణం" అన్న విషాద వాక్యం కనిపించింది. కళ్ళవెంట జడివాన కురిసింది.

ఆ మహనీయుడు మరణించాడు. భారతదేశం చిన్నపుచ్చుకుంది. భారత ప్రజల ఆత్మల్లో ఏదో బాధ తొంగిచూచింది. ఎవరు నాయకులు? అనే ప్రశ్న భారతదేశమంతటా వినిపించింది.

"ఎవరెవరు? ఎవరు. రెండు మహోన్నత శిఖరాలు ఒరిగిపోయినాయి. కానీ అవి గొప్ప విజయస్థంభాలుగా నిలిచిపోయినాయి. వాటి ప్రతిష్ఠను, ప్రతిభను నిలబెట్టగల నాయకుడెవరు ఎవరు?" అని అందరూ ఆలోచనానిమగ్నులయ్యారు.

***ఇందిరా ప్రియదర్శిని దర్శనం***

ఆ సమయంలో ప్రధానిగా అవతరించింది ఇందిరాప్రియదర్శిని. నెహ్రూజీ ఏకైక పుత్రిక. గులాబి వంశానికి చెందిన ఒక దొంతర గులాబీ. ఎంత గొప్ప వార్త.

ఆకాశం వంక చూశాను. "ప్రధాని ఇందిరా ప్రియదర్శిని" అనే అక్షరాలు ప్రచురించినాయి. "మహిళా ప్రధాని భారతదేశ ప్రధాని కోటానుకోట్ల భారతీయుల భావి జీవన పథాన్ని సరిదిద్ద సంకల్పించిన వనిత" అని అందరూ ఆశ్చర్యంగా చూశారు. ఆమెకు సంబంధించిన విశేషాలు శ్రద్ధతో విన్నారు.

***గులాబి సంతానం గొప్ప వారసత్వం***

ప్రియదర్శిని.. కొద్దిరోజులలోనే గొప్ప మార్గదర్శిని కావలసింది. ప్రపంచ చరిత్రలో "ప్రథమ మహిళాప్రధానిగా" పేర్కొనబడింది. నెహ్రూజీ సంతానం ఎంత గొప్పవారసురాలు. ఇందిర పరిపాలనా దక్షతకు లోకం ఆశ్చర్యపోయింది. భారత ప్రజానీకం అబ్బురపోయింది. `ఇందిర యుగం` ప్రారంభమైంది. రాజనీతిలో దిట్టగా నిలబడగలిగింది.

ఇందిర పేరు ఇంటింటా మారు మ్రోగింది. ఆమె పేరు వినిపించిన చోట విజయం తొంగిచూసింది. మహాశక్తి అన్నారు. పాకిస్తాన్‌తో వైరం వచ్చినప్పుడు మహిషాసురమర్దని అన్నారు. అన్నిటా సమర్థురాలనిపించుకుంది.

నవయుగానికి నాంది గీతాలు పాడింది. కాంగ్రెసులో క్రొత్త కాంగ్రెసు క్రొత్త కాంగ్రెసులో గులాబి వర్ణం ఎంతో ఘనత సంపాదించింది.

***పేరు వినిపిస్తే విజయం***

ఆమె పట్టుదలను దయాగుణాన్ని ధర్మగుణాన్నీ ప్రదర్శించడం కోసం బంగ్లా యుద్ధం వచ్చింది. అందులో అవలీలగా విజయం సంపాదించింది. అమెరికాను సైతం లెక్కచెయ్యలేదు.

పాకిస్తాన్‌కు స్నేహ హస్తం జాచింది. అనంత శక్తి ప్రదర్శించింది. ఇందిర పరిపాలనలో ఈ రజతోత్సవం జరుగుతోంది. ఎంతో గొప్పగా జరుగుతోంది.

ఈ మహోత్సవాన్ని తిలకిస్తున్నాను. ఈ పాతికేళ్ళ చరిత్ర స్మరిస్తున్నాను. స్వర్ణోత్సవం సమయంలో భారతమాత శక్తి స్వరూపాన్ని తిలకించి పులకరించే భాగ్యం నా మనుమలకు, మనుమరాండ్రకు వదులుతున్నాను. ఆనాటిదాకా ఈ చిన్నివ్యాసాన్ని దాచుకొమ్మని కోరుతున్నాను.

(13 ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**స్వతంత్రం** వచ్చి పాతికవత్సరాలైంది. రజతోత్సవ సన్నాహాలు జరుగుతున్నాయి. అతి వ్యాప్తంగా అట్టహాసంగా! ఈ పాతిక వత్సరాలలో దేశం ఏం సాధించిందంటే ఎన్నో చెప్పవచ్చు. ఏం సాధించలేదంటే అంత కంటే పెద్ద జాబితా తయారు చెయ్యవచ్చు.

వీటి సంగతి అలా వుంచి, పిల్లల్లో, పెద్దల్లో దేశీయాభిమానం ఎంతవరకు ఏర్పడిందనే విషయం ఆలోచిస్తే పిచ్చిగుడ్లు వెయ్యక తప్పదు. ప్రస్తుతానికి పిల్లల విషయం తీసుకుందాం. వారికి దేశ నాయకుల పేర్లు ఎంతవరకు తెలుసు? అని ప్రశ్నిస్తే చాలా హాస్యం బయటపడుతుంది.

***కందుకూరి ప్రకాశంగారురా!***

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంగారి జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అంతటా కమిటీలు వేశారు. ఎన్నో స్మారక చిహ్నాలు నెలకొల్పబోతున్నారు. ఒక జిల్లాకు ఆయన నామం అంకితం చేశారు. ఎంతో గర్వించతగిన విషయం. అన్నింటికన్నా ముఖ్యం ఈ కాలపు పిల్లలకు ఆయన చరిత్రను బోధించండం. దాని ద్వారా భవిష్యత్తులో కూడా కొంత 'ప్రకాశత్వం' సాధించడం అవసరమేమోననిపిస్తుంది. చిన్న తరగతుల్లో పిల్లలకు ఎన్ని పాఠాలో చెప్పి వదలడం కంటే ఒక్క నాయకుని జీవితం ఒక్క కవి జీవితం చక్కగా బోధిస్తే వాళ్ళ మనసుల్లో మల్లెతోటలు వేసినంత పని అవుతుంది. మొన్న ఒకరింటికి వెళ్ళాను. వాళ్ళ అబ్బాయి ఏడోక్లాసు చదువుతున్నాడు. అప్పటికే వాళ్ళ బుర్ర పాదరసమైపోతుందని - పట్టి సీసాల్లో బిగించి, సీలువేసి చేతికి అందించాలని ప్రభుత్వం గవర్నమెంటు పరీక్షలు పెట్టింది. దాంతోమేలు జరగడం ఎలా వున్నా పరీక్ష అంటే భయం మాత్రం పోయింది.

పైన చెప్పిన కుర్రవాడు ఒక పాతికమంది దేశనాయకుల బొమ్మలు తెచ్చాడు. అన్నీ ఒక సైజులో వున్నాయి. వాటిని చీట్ల పేకలాగా కలుపుతున్నాడా కుర్రవాడు. కొంచెం సేపు కల్పి ప్రక్కనున్న తమ్ముడికో ముక్కా, చెల్లెలికో ముక్కా ఇచ్చి - వాళ్ళ పేరు చెప్పమంటున్నాడు. బుద్ధుడు, గాంధీ నెహ్రూ బొమ్మలు మాత్రం చెప్పుకో కలిగారు.

నేను వెళ్ళిన తర్వాత ఒక బొమ్మను చూపించి ఎవరో చెప్పమన్నారు. "ప్రకాశంగారు" అన్నారు.

ఆ పెద్ద కుర్రవాడు"అవునవును నేననుకున్నాను" అని తమ్ముడి వంక చూసి "అవునురా! కందుకూరి ప్రకాశంగారు" అన్నాడు. మాకెంతో నవ్వూ దానితోపాటు ఆశ్చర్యం వేసింది.

"కందుకూరి కాదు నాయనా టంగుటూరి " అన్నాను.

"అలాగా! టంగుటూరి, కందుకూరి ఒకలాగానే వున్నాయి" అని ఒక మానికెడు మొలక నవ్వులు గుమ్మరించాడు.

"కందుకూరి వీరేశలింగంగారురా! ఆయన సంస్కర్త" అన్నది వాళ్ళ అమ్మగారు. అని ఆమె తొందరగా చెప్పడంలో "ఆయనగారు విధవావివాహాలు బహిష్కరించారు" అన్నది. వెంటనే మళ్ళీ "ప్రోత్సహించారు" అన్నది.

***భార్యాభర్తల్లో ఎవరు పోయినా రెండోవారిని...***

"చాలా గొప్ప సంస్కారి ఆయనగారు. రాజమండ్రిలో వితంతువుల ఆశ్రమం ఒకటి స్థాపించారు. ఎన్నో వివాహాలు చేశారు" అన్నారు తండ్రిగారు.

ఏడో తరగతి కుర్రవాడు - తన చరిత్రాజ్ఞానాన్ని ఒక్కసారిగా ప్రదర్శించాలని "మరి అంతకు ముందు ఏంచేసేవారో తెలుసా! మొగుడు చచ్చిపోయినా, పెళ్ళాం చచ్చిపోయినా ఇద్దర్ని కలిపి నిప్పుల్లో త్రోసిపారేసేవారు" అన్నాడు.

మాకు పొట్టచెక్కలయ్యేంత నవ్వు వచ్చింది. వాళ్ళ అమ్మగారు "అదికాదురా! భర్తపోతే భార్యను కూడా చితిలో తోసేవారు. సహగమనం అంటారు దాన్ని" అని చెప్పింది.

"మరి భార్యపోతే భర్త నెందుకు తోసేవారు కాదూ?" అని ప్రశ్నించాడు రెండోవాడు.

"మగవాణ్ణి తోస్తే వూరుకుంటాడేమ్రిటా! తంతాడని భయం. అందుకని ఆడవాళ్ళనే తోసేవాళ్ళు గావన్ను" అన్నాడు పెద్దవాడు.

***చక్రవర్తా! సినిమా యాక్టరా***

తర్వాత మళ్ళీ బొమ్మలు తీసి పేర్లు చెప్పడం ప్రారంభించారు. చవన్ బొమ్మ వచ్చింది. టోపీలేదు. చాలాసేపు ఆలోచించారు. బొమ్మ చాలా స్థూలంగా కనిపించింది. అందుకని కాబోలు వెంటనే "పృధ్విరాజు" అన్నాడు పెద్ద అబ్బాయి.

"చక్రవర్తా? సినిమా యాక్టరా!" అని తండ్రిగారు ప్రశ్నించారు.

"చక్రవర్తే.. మాకు అయిదోక్లాసులో వచ్చాడు. చాలా బలపరాక్రమములు గలవాడు. అని వుంది పాఠంలో" అన్నాడు ఏడవ తరగతి విద్యార్థి.

"పృధ్విరాజ్ ఎప్పుడు దేశాన్ని పాలించాడు? ఏం చేశాడు?" అని తల్లి ప్రశ్నించింది.

"ఏమో? ఏం చేశాడో? ఎవడికి జ్ఞాపకం. అసలు ఆ ప్రశ్న వదిలేశానప్పుడు" అన్నాడు అతి తేలికగా.

నిజమే ఆ మూడు పేజీల పాఠాలూ ముక్కుకు రాచుకోవడం పరీక్ష అవగానే దులిపి పారెయ్యడం. ఆ తరగతి పంతులుగారికి అంతవరకే బాధ్యత. వాళ్ళ బుర్రల బాధ్యతలు ఎంతవరకు తీసుకోగలరు? ఇప్పుడున్నవి గురుకులాలా! గురుశిష్యసాంప్రదాయాలా! పరీక్ష ప్యాసు కావడం గుడ్డిలో మెల్ల. తప్పితే కంట్లో పువ్వు.

***టోపీ తీసి మనల్ని టోపీ వేశాడురా.***

చివరకు ఆ బొమ్మ తెచ్చి నాకు చూపించారు. "ఈయన - చవన్. మన కేంద్ర ఆర్థికమంత్రి" అన్నాను.

"చవనా! ఎవరబ్బా! ఎక్కడో చూశానే అనుకొన్నా" అని తమ్ముడివంక చూచి "టోపీ తీసేశాడు. మనల్ని టోపీలో వేసాడు. అయినా ఇందరు మంత్రుల పేర్లు, ఫోటోలూ ఎవరికి జ్ఞాపకం వుంటాయి. ఏరా తమ్ముడూ?" అన్నాడు.

తమ్ముడికి ఎంతో రోషం వచ్చినట్లుంది.

"ఆ! నాకు పదిమంది తెలుసు. ఇందిరాగాంధి, బ్రహ్మానందరెడ్డి, పి.వి నరసింహారావు, ఇంకా ఇంకా.. " అని మూడు వేళ్ళు ముడిచి నాలుగోది ముడవడం కుదరక ఆలోచిస్తున్నాడు.

అన్నగారు ఎంతో తొందరగా "సంజీవరెడ్డి.. " అన్నాడు. వాళ్ళనాన్నగారు - "బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డి ఇపుడు మంత్రులుగాలేరు - మాజీ మంత్రులు" అన్నాడు.

పెద్దకుమారుడు పెద్దగా ఆలోచించనక్కరలేదన్నట్లుగా "ఏమో! మళ్ళీ వస్తాడేమో" అన్నాడు.

తర్వాత మళ్ళీ నాయకుల ఫోటోలు తీశారు. అందులో ఒకదానిపేరు తెలియలా! చాలాసేపు ఆలోచించి "ఈయనెవరండి?" అన్నారు.

"ఆయన మదన మోహన మాలవ్యా!చాలా గొప్ప. కాశీవిద్యాలయం కట్టించారు" అన్నాను.

"మాలవ్యా" అంటే ఏమిటి అన్నాడు తమ్ముడు.

"మనకు మల్లయ్య... వాళ్ళకు మాలవ్యా."

"ఏమిటంటావేమిటి పేరు. మనం మల్లయ్యా అనం. అలాగే వాళ్ళు మాలవ్యా అంటారు. దానికేంలే" అన్నాడు.

తర్వాత ఇంకో ఫోటో తీశారు. వారికి తెలియలేదు. "సర్దార్ పటేల్" అన్నాను.

"ఈయన్ని ఎక్కడో చూచినట్లున్నామే! ఏ ఊరు?" అన్నాడు ఒక సోదరుడు.

"ఆయన ఇక్కడివాడు కాదు. పోయి చాలాకాలమైంది. మీరెక్కడ చూశారు" అన్నాడు తండ్రి.

"ఎక్కడో గుర్తులేదు" అన్నాడు పెద్దవాడు.

"నాలుగోక్లాసు పుస్తకంలో వుందిరా బొమ్మ?" అన్నాడు.

"ఆ! అందులోనే చూసి వుంటాను" అని అన్న నవ్వుకున్నాడు.

నేనప్పుడు చెప్పాను "ఈ నాయకులందర్నీ గురించి తలోరోజు చెపుతాను. వింటావా! మీకు బాగా తెలుస్తుంది మన చరిత్ర" అన్నాను.

"ప్రతిరోజూ రాలేమండీ.. ప్రతి ఆదివారం వస్తాం" అన్నాను.

అందుకే ఎంతో సంతోషించి వచ్చేసాను.

**(26` ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

'**దేశంలో దానకర్ణులు** కనిపించడం లేదుగానీ వాగ్దానకర్ణులు మాత్రం కొరతలేదు` అన్నాడు మొన్ననొక పెద్ద మనిషి.

నిజమే వాగ్దానాలు ఉత్సాహంలో మంచి, ఉద్రేకంలో నుంచి ఉబుకుతూ ఉంటాయి. కానీ వాటిని నిర్వహించడమే కొంచెం శ్రమతో, ఖర్చుతో కూడినపని.

వాగ్దానాలను వాయిదా వేయవచ్చుననే ధీమా ఏర్పడుతూ వుంటుంది. కానీ ఎంత ఫాయిదా పోతుందో అర్థం చేసుకోరా పెద్ద మనుష్యులు.

"ఏమండోయ్ మీరు ఫలానా విషయంలో వాగ్ధానం చేశారు. పదినెలలు దాటి పోయింది. ఇంతవరకు నెరవేర్చారు కాదు. " అని ఎవరినైనా ప్రశ్నిస్తే..

"అవును చేసిన మాట నిజమే. ఎక్కడికి పోతుంది. పది నెలలు కానివ్వండి. పది సంవత్సరాలు కానివ్వండి. వాగ్దానం వాగ్దానమే. తప్పించుకునే శక్తి ఎవరికి వుంటుంది?" అని దబాయిస్తాడు.

"నిజమేననుకోండి. ఏది ఏమైనా వాగ్దానం చేసిన తర్వాత తీర్చివేస్తే మంచిదికదా! పైపెచ్చు మీరు పెద్దలు" అంటే

***వాగ్దానం తప్పను విల్లులోనైనా వ్రాస్తా!***

"ఎంత పెద్దవాణ్ణయితే మాత్రం మేం మాట నిలబెట్టుకోకుండా పోనులే! పెద్దవాణ్ణయ్యాను. నేను మాట చెల్లించకుండా పోతాననేగా మీ భయం. అంతగా అయితే విల్లులోనన్నా వ్రాసి పోతాగాని. మాట చెల్లించుకోకుండా వుండను. తెలిసిందా?" అని ఆయనగారు వాగ్దానానికి మరో వాగ్దానంతో హామీ యిస్తాడు.

వాగ్దానాలు చేసేవారు చేస్తూనే వుంటారు. కానీ వాటివల్ల లాభం పొందేవారికి కాలం కలిసిరావాలి. అంటే కర్మ తొలిగిపోవాలి. ఈ లోపల అవతల వాళ్ళను దూషించి మాత్రం ఏం లాభం?

అవును మరి బహుమతి ప్రదానం, సత్కారం, సన్మానం, ఇత్యాదులు ఎప్పటికప్పుడే జరిగిపోతాయి. వాటి విషయంలో చెరుకుగడ విరిచి చేతికిచ్చినట్లే వుంటుంది. కానీ వాగ్దానాలు అలా కాదు. అని దుంపల్లాగా బాగా ఊరాలి. అదృష్టం పండినప్పుడు వాటిని తవ్వి అందించాలి. అంతే.

మా బంధువుల్లో ఒకాయన చాలా ఉద్రేక ఉదారగుణం కలవాడు కూడా. అయితే రుణాలు కొంచెం జాస్తి. అందువల్ల పనులు అనుకున్నట్లు జరగవు. అంత మాత్రంతో గుణాల్ని ఎక్కడ చంపుకుంటాడు? పైగా అవి సహజమైనవి కదా!

అంతకు ముందు ఎవరెవరికి ఏమి వాగ్దానాలు చేశాడు. బంధువులు ఆయనకు సూచనలు చెయ్యడం ఆయన నిముషం ఆలోచించకుండా వాగ్దానాలు చెయ్యడం. ఆ తమాషా చూడండి.

***మట్టిరోడ్డు ప్రక్క మంచినీటి బావి***

ఒకరు "చూడు పార్థసారథి. మీ నాన్నగారు చాలా గొప్పవారు. ఎప్పుడూ ఈ మట్టిరోడ్డు వెంటే ఊళ్ళోకి వస్తూ ఉండేవారు. పైగా ఆయనగారిది చాలా చల్లటి మనస్సు. కనుక ఈ మట్టిరోడ్డు ప్రక్కగా ఒక మంచినీళ్ళ బావి తవ్వించు. ఆయన ఆత్మ ఎంతో సంతోషిస్తుంది. " పార్థసారథి (బిక్కముఖంతో) "కట్టిస్తా బాబాయి. తప్పకుండా కట్టిస్తా. ఈ నెలలోనే మొదలు పెట్టిస్తా. గొడ్లు నీళ్ళు త్రాగేందుకు పెద్ద తొట్టికూడా కట్టిస్తా బాబాయి. చుట్టూ చెట్లు వేయిస్తా. ఎవరన్నా వచ్చి కూర్చునేందుకు అరుగు ఒకటి కట్టించి మెట్లు కూడా పెట్టిస్తా బాబాయి" అన్నాడు.

"బాబాయి ఎలాగూ అంత పనిచేస్తున్నావు గనుక ఆ కట్టేది సిమెంటు నుయ్యే కట్టించు. మరల వరల నుయ్యి ఒక తరం కూడా సరిగా ఉండదు. ఆ నూతివల్ల మీ నాన్న ఆత్మకు శాంతి ఏం వుంటుంది?"

"ఉండదు బాబాయి ఉండదు. ఎంత మాత్రం ఉండదు. వరల నూతికి శాంతించే ఆత్మకాదు మా నాన్నది. చాలా గొప్ప ఆత్మ. ఏమన్నా సరిపెట్టుకుంటే సిమ్మెంటుతోనే సరిపెట్టుకోవాలి. నేనాయన కడుపున పుట్టాను. ఆయన ఆత్మే తెలియదంటావా బాబాయి"

బ్రతికి వుండగా గోతులేగానీ పోతే నూతులెక్కడ?

"తెలుసు గనకనే చెపుతున్నానోయ్. తండ్రులు బ్రతికి వున్నప్పుడు గోతులు తవ్వేవారేగానీ పోయిన తర్వాత వారిపేరిట నూతులు తవ్వే వారెవ్వరున్నారీ రోజుల్లో. కోటికి ఎక్కడో ఒక్కడు నీబోటి సుపుత్రుడు"

"ఏమంత సుపుత్రుణ్ణి బాబాయి. నేనేం నాన్న పేర సత్రవులు కట్టిస్తున్నానా, యాత్రికులకు సౌకర్యాలు కల్పిస్తున్నానా? " ఒక్కన్ను రెప్పగా అని ఎంతో వినయగా చెప్పాడు కుమార రత్నం

ఇప్పటికి పదిహేనేళ్ళయింది ఆ వాగ్దానం చేసి. ఇంతవరకా ప్రయత్నం మటుకు లేదు. ఆ రోజునే తండ్రి పేరు ఆ ఊరిలో ఒక గాంధీ విగ్రహం వేయిస్తానన్నాడు. పడిపోయిన హనుమంతుడి గుడికి ప్రాకారం కట్టిస్తానన్నాడు. కన్నీళ్ళతో చేసిన ఆ వాగ్దానాలు చన్నీళ్ళతో ఒకసారి ముఖం కడుక్కోగానే మరుపున పడిపోయాయి. ఆయన మాత్రం ఏం చేస్తాడు? అదోరకం ఉద్రేకం.

చాలాకాలం క్రింద ఒక ఊళ్ళో నాటక ప్రదర్శనం జరుగుతోంది ఒక పెద్ద మనిషి నాటకాన్ని మెచ్చుకుంటూ ఉపన్యసిస్తున్నాడు. ప్రేక్షకులలో ఒకాయన ఆయన దగ్గరికి వెళ్ళి "హీరోయిన్‌కి రజత పతకం ఇస్తాము మీరు కొంచెం ప్రకటించండి" అని తన పేరు చెప్పి చక్కా వచ్చాడు.

***స్వర్ణం కాదయ్యోయ్!! రజతం***

ఆ పెద్ద మనిషి మరి కొంచెంసేపు ఉపన్యసించి చివరకు "ఫలానావారు హీరోయిన్‌కి స్వర్ణపతకం ఇస్తానని వాగ్దానం చేశారు. ఒకటి రెండురోజులలో అందజేస్తామన్నారు" అని చెప్పాడు.

ప్రేక్షకుడు ఖంగారుపడుతూ లేచి నిలబడి "స్వర్ణం కాదండోయ్! రజతం" అని అరిచాడు. "అదంతా తర్వాత చూసుకొందాం లెండి" అని ఉపన్యాసకుడు దిగి వచ్చేశాడు. తర్వాత దానిమీద చాలా తకవార్ వచ్చింది. సభలో స్వర్ణం అన్నారు గనుక స్వర్ణమే ఇవ్వాలి గాని మాకు మారిస్తే నాకు అవమానం అంటుంది హీరోయిన్.

"నేను అలా అనలేదు. రజతమే అన్నాను. ఉపన్యాసకుడు చేసిన పొరపాటది. ఒకవేళ స్వర్ణపతకమే ఇవ్వవలసి వస్తే ఆ తేడా ఉపన్యాసకుడు భరించాలి. అది న్యాయం" అంటాడు బహుమతి వాగ్దానం చేసిన కళాభిమాని.

ఒక నెల రోజులు తర్జన భర్జన జరిగిన తర్వాత కళాభిమాని ఆయన మాట ప్రకారం వెండి మెడల్ తయారుచేయించి ఇచ్చేట్లు దానిమీద ఉపన్యాసకుడు తన స్వంత ఖర్చు బంగారం ఊదించి ఇచ్చేట్లు నిర్ణయమైంది. ఈ విషయం హీరోయిన్‌కి తెలియచేశారు.

***ఉపన్యాసకుడు బంగారం ఊదించాలి***

"ఊదిన బంగారం ఎన్నాళ్ళుంటుంది. అదేం పనికిరాదు" అని ఆవిడ అడ్డుపెట్టింది. మధ్యవర్తికి వళ్ళుమండిపోయింది. "బంగారం ఊడిపోతే అంటించుకుంటూ వుండవమ్మ. ఆ మాత్రం చేయలేవేమిటి? ఇట్లా పట్టు బడితే ఇకముందు ఎవరూ బహుమానాలే ఇవ్వరు" అని గట్టిగా డబాయించి మెప్పించి చక్కా వచ్చాడుట.

నారదుడు సంసారం చిత్రంలో పాపం అతగాడికి గుళ్ళు కట్టించాలని, గోపురాలు పెట్టించాలని తాపత్రయం బయలుదేరింది. అతడు దాతల వద్దకు బయలుదేరాడు. ఎక్కడికి ఏడంతస్థుల గోపురం అందులో మీరొక్క గోపురం కట్టించాలి అని అడగడం ప్రారంభించాడు.

***అయిదు తర్వాత రా ఆరు నేను***

అందరికీ తెలుసు ఇది నెరవేరే పనికాదని అందువల్ల ప్రతివారూ "మీరు అయిదో గోపురం కట్టించి నా దగ్గిరకు రండి ఆరోది నేను కట్టిస్తాను అని, ఆరు తర్వాత రండి ఏడోది కట్టిస్తా"నని చెప్పడం ప్రారంభించారు మొదటి అంతస్థుకి వాగ్దానం రాలేదు ఆ పని జరగనూ లేదు.

ఇలాటి వాగ్దానాల వల్ల ఎంతమాత్రం నష్టంరాదు. మనిషిని వదిలించుకోవడం అంత కష్టం కూడా కాదు.

**(30 ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

వాగ్దానాలకు అంతేమిటీరోజుల్లో. ప్రచారాల్లో వాగ్దానాలు ప్రణయాల్లో వాగ్దానాలు. పౌరుషం కోసం వాగ్దానాలు. హోదాకోసం వాగ్దానాలు. చాకిరి చేయించుకోవడం కోసం వాగ్దానాలు. టోకరా కొట్టడం కోసం వాగ్దానాలు ఎన్ని విధాలో ఎన్ని తమాషాలో.

ముఖ్యంగా ఎన్నికల సమయంలో చేసే వాగ్దానాలకు అంతు వుండదు చెయ్యగలరో లేదో ఊహించుకోవడానికి కూడా ఒకప్పుడు వ్యవధి వుండదు. అలా వాగ్దానాల తోరణాలు అల్లుకుంటూ పోవలసిందే వీటిలో చాలావరకు వెంటనే వాడిపోతాయి. కొన్నికట్లు వూడి గాలికి కొట్టుకుపోతాయి. ఏ కొద్ది మాత్రమో అలా నిలబడివుంటాయి. క్రొత్త చివుళ్ళు వేయకపోయినా కోరికలు తీరకపోయినా.

***ఆంధ్రమంత్రి అభయదానం***

మంత్రుల వాగ్దానాలకు సంబంధించిన కథలు కబుర్లూ చాలా వచ్చినా యిదివరలో. ఈ మధ్యనే ఒక ఆంధ్రమంత్రి వాగ్దానాలు నిలబెట్టుకుని తీరాలి. వాటిని సాధించి తీరాలి. అసాధ్యమనే మాట వినిపించకూడదు అన్నారు ఎంతో ధీమాతో. వీరివల్ల చాలా వాగ్దానాలు సత్యాలుగా వర్ధిల్లుతాయనే భావం కలిగింది.

దశాబ్దాలుగా అలా నిలిచిపోయిన వాగ్దానాలు కొన్ని వుంటాయి. అక్కడక్కడా "ఎప్పటికైనా నేను శాసన సభ్యుణ్ణయి, ఈ ఊరుకు కావలసిన సౌకర్యాలన్నీ సమకూర్చితీర్తాను" అని వాగ్దానాలు పెద్దలు చాలామంది ఎన్ని సంవత్సరాలుగానో ఆ వాగ్దానాన్ని పునరుద్ఘాటిస్తూ కాలం గడుపుతూనే వున్నారు.

ఒక మంత్రిగారు ఏదో ఊళ్ళో సభలో ఉపన్యసిస్తూ "నేను వాగ్దానం చేసి తప్పుకునేరకం ఎంతమాత్రం కాదు. అన్న మాట నెగ్గించి తీర్తాను. దీనిలో సత్యం మీరే చూద్దురుగాని - ఏదైనా మీరందరూ ఏకగ్రీవంగా కోరండి. వెంటనే చెయ్యకపోతే అప్పుడడగండి" అన్నాడుట.

*మంత్రిగారూ! తమరు పదవి వదలండి*

ఒక సభికుడు చివాలున లేచి "అయ్యా మేం ఏకగ్రీవంగానే అడుగుతున్నాం. ఇందులో చీలికలు లేవు. మా కోరిక తప్పక మన్నిస్తామన్నారు. తమరు శీఘ్రమైనంత త్వరలో మంత్రి పదవికి రాజీనామా ఇవ్వాలనేదే మా కోరిక. మాట తప్పకూడదు మరి" అన్నాడుట.

మంత్రిగారు కొంచెంసేపు పెదవులు మెదిపారుగాని మాట రాలేదు. చివరకు "అదేమి కోరిక ఇప్పుడు రాజీనామా యిస్తే ఎలా పదవిలోకి వచ్చి పదినెలలైనా కాలేదు. రాజీనామా ఇస్తే మీకు నష్టం. కావలసిన పనులు చేయించుకోండి. సంబరాలు పడుతూ చేయించుకోండి" అన్నాడుట.

"ఏం లాభం మాట తప్పారు మీరు" అని సభలో వారు కొందరు కేకలు పెట్టారుట.

ప్రేయసీ ప్రియుల మధ్య కూడా ఉద్రేకం కొద్దీ వాగ్దానాలు జరుగుతూ ఉంటాయి. వాటిని తీర్చడమంటూ వచ్చేసరికి, హృద్రోగాల క్రింద మారుతూ ఉంటాయి. సామ్రాట్టులు, సమర్థులూ పూర్వం వాగ్దానాలు చేసేవారు. ఎలాగో అలా నెరవేర్చుకునేవారు. షాజహాన్ తాజ్‌మహల్ కట్టించటం కేవలం ఆవిడ జ్ఞాపకార్థమేనంటారు. కానీ ఈ నిర్మాణానికి వెనుక కూడా ఒక గొప్ప వాగ్దానం ఉందిట.

***ముంతాజ్‌కు ముందుగానే వాగ్దానం***

షాజహాన్‌కు పట్టాభిషేకం జరుగబోతుండగా ముంతాజు తన మేనత్త నూర్జహాన్‌ను చూడటానికి జైలుకి వెళ్ళింది. కేవలం ఆవిడ ఆశీస్సులు పొందాలనేది ఆవిడ అభిమతం. కానీ నూర్జహాన్‌కు అంతులేని కోపం వచ్చిందిట. దీవించడానికి బదులు శపించిందట.

"నన్ను జైల్లో పడేసినంతమాత్రాన నా పేరు మాసిపోదు. దేశంలో ప్రతినాణం మీదా నా బొమ్మ వుంది. ప్రతివారు నాణంతోబాటు నన్నూ కళ్ళకు అద్దుకుంటున్నారు. నువ్వెంత నీ పేరెంత? " అని ధిక్కరించిందిట.

ముంతాజు దుఃఖిస్తూ వచ్చి భర్తకు విషయం తెలియచేసింది. అవతల పట్టాభిషేక సమయం దగ్గిరపడుతోంది. అప్పుడు షాజహాన్ వాగ్దానం చేశాడుట. "నీ పేరు ప్రపంచ వ్యాప్తి చెందేలాగా పాలరాతి భవనం కట్టిస్తాను. నాణాలు మారిపోతాయి. తాజ్‌మహల్ తరతరాలా నిలిచిపోతుంది" అన్నాడుట.

దురదృష్టవశాత్తు - ముంతాజు జీవించి ఉండగా ఆ నిర్మాణం జరగలేదు. అందువల్ల స్మారక చిహ్నంగా నిలిచిపోయింది అని చంద్రశేఖర్‌గారనే ప్రఖ్యాత రచయిత వ్రాశారు. ఇలాగే చరిత్రల్లో, పురాణాల్లో అంతులేని వాగ్దాన గాథలు గోచరిస్తాయి.

***నా సర్వస్వం ధారపోస్తాను దేవీ***

ప్రణయంలో పడ్డవారు వొళ్ళు తెలియకుండా వాగ్దానాలు చేస్తూ ఉంటారు. "నా సర్వస్వం నీకు అర్పిస్తాను దానికి సిద్ధంగా ఉన్నాను, నా ప్రణయదేవతా కోరుకోవడం నీదే తరువాయి, నీరజవదనా! మాట తప్పుతానని ఎంతమాత్రం సందేహపడకు మందగమనా" అలాటి వాక్యాలు జలపాతంలాగా కురిపించడం మామూలు.

ఒక యువక పుంగవుడు ఇలాగే అనేక వాగ్దానాలు చేశాడుట. తనను ఎంతో ఘనంగా ప్రేమిస్తున్నదనుకున్న వనితారత్నంతో.

ఆవిడ ఈ ద్విపద విని విని ఎంతో విసుగెత్తిపోయిందిట. చివరకు ఒకనాడు "నాకోసం మీరు చేయదలచిన త్యాగానికి ఎంతో కృతజ్ఞురాలిని. మీ సర్వస్వం దోచుకునేంత ద్రోహిని కాదు నేను. నన్ను ఒక సంవత్సరం పోషించండి మహాశయా! ఆ తర్వాత నేనే ఉద్యోగం చేసి మిమ్మల్ని పోషిస్తాను. పువ్వుల్లో పెట్టి పూజిస్తాను కూడా" అన్నదట.

***ఒక్కసారే చెక్కు వ్రాసి పంపిస్తా ప్రేయసీ***

"ఒక్క సంవత్సరం పోషించాలా! సంవత్సరమేనా, మొత్తం ఎంత అవుతుంది. ఎంత అయినా ఫర్వాలేదనుకోండి. అంత మొత్తం ఎంత అవుతుంది. ఎంత అయినా ఫర్వాలేదనుకోండి. అంత మొత్తం ఒక్కసారే తెచ్చి బ్యాంకులో వేద్దామని మీరు తిప్పలు పడకుండా తీరిగ్గా చదువుకోవచ్చని" అన్నాడుట.

ఆవిడ కొంచెం ఆలోచించి "బాగా ఖర్చు చేస్తే, అంటే మీ ప్రేయసిలాగా కనిపించాలంటే అంటే సీతాకోకచిలకలాగా సింగారించుకుని, మీ గుండెల్లో సంతోషం రంగరించాలంటే నాలుగువేలు అవుతుంది. ఈ సంవత్సరమంతా నాకు మల్లేనేనే వుండి అంటే అజ్ఞాతవాసం గడపాలంటే రెండున్నరవేలవుతుంది" అన్నదట.

ఆ ప్రణయమూర్తి బీదహృదయంలో ఫైర్ యింజన్ గంటలు మ్రోగాయట. కానీ పైగా ఎంతో తేలికగా భావించినట్లు నటిస్తూ "అలాగే మరేం ఫర్వాలేదు. నాలుగువేలకే చెక్కు పంపుతాను సీతాకోక చిలకలాగానే ఎగురు. మరేం ఫర్వాలేదు. నీకోసం ఆ మాత్రం ఖర్చు పెట్టడమొక లెక్కా! రేపు కనిపిస్తా" నని తెచ్చుకున్న నవ్వుతో వచ్చిన దారి చేత్తో పుచ్చుకున్నాడుట.

***నా టీ కాటిప్పణం వేరు సుందరీ!***

కొన్నాళ్ళు పోయిన తర్వాత తను తిరిగి ప్రేయసి దర్శనానికి రాకుండా "నేను సర్వస్వం అర్పిస్తానన్నమాట నిజమే. కానీ ఆ సర్వస్వానికి నేను భావించిన అర్థం వేరు. ప్రణయంలో సర్వస్వం అంటే - సుఖం, సంతోషం, హృదయం, సేవాస్తోత్రం ఇత్యాదులని అర్థంగాని సిరి అని కాదు. నువ్వు పొరపాటుగా అర్థం చేసుకున్నావు.

ప్రణయానికి సంబంధించిన టీ కాటిప్పణం సరిగా తెలియని నిన్ను ప్రేమించడం నాదే పొరపాటు. ఒకనాడు శుభమస్తు అని ప్రారంభించిన మన ప్రణయానికి ఈ ఉత్తరంతో స్వస్తి.

షరా: సొమ్ముమీద వ్యామోహంపోయి, అచ్చమైన, స్వచ్ఛమైన ప్రేమ నీలో తొంగిచూస్తే, అప్పుడు కొంచెం కబురు పంపించు" అని వ్రాశాడుట. ఇలా చెలామణి కాని వాగ్దానాలెన్ని ఉంటాయో ప్రణయంలో.

చాలాకాలం క్రిందట - కర్జు అనే ఒక సైనికాధికారి తన ప్రేయసితో అన్నాడుట "నువ్వు నాకు కల్పించిన స్వప్నమయ జీవితం మరే స్త్రీ కల్పించలేదు కనుక ఒకరోజు నీకోసం నా ప్రాణం అర్పిస్తాను" అని.

అన్నట్లుగానే ఒకరోజు రివాల్వర్ తీసుకుని తన తలమీద ప్రేల్చుకుని ప్రేయసి దగ్గర మరణించాడుట. ఇలాటి వాగ్దానాలు కూడా ఉంటాయి కొన్ని.

(24 ‘ సెప్టెంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మొన్న ఇక్కడ** వున్న ఒకరింటికి వెళ్ళాను. వాళ్ళకు అబ్బాయి పుట్టాడనీ, ఆరోనెల అని తెలిసింది గనుక ఊరికే వెడితే బాగుండదనీ, ఒక చిన్న చొక్కా, రబ్బరుబొమ్మలు, ఉయ్యాలతొట్టికి కట్టే గిలక వగైరాలు కొనుక్కుని, చక్కగా ప్యాకేజి చేయించి తీసుకెళ్ళాను.

భార్యాభర్తలున్నారు, కూర్చోమన్నారు. కాఫీ కలిపి ఇచ్చారు. కబుర్లలోకి దిగారు. ఎంత సేపటికీ పిల్లాడి మాట ఎత్తరు. అప్పుడు నేనే సంభాషణ ప్రారంభించాను.

"మీ పిల్లవాడు కులాసాగా వున్నాడా?"

"ఒ! బాగానే ఉన్నాడు" అన్నాడు తండ్రి.

"నలుపా ఎరుపా?" అని నా ప్రశ్న.

***చిరునవ్వులు... మసకనవ్వులు***

భార్య భర్తవంక చూచి చిరునవ్వులు గ్రుమ్మరించింది. ఆయనగారు మసక నవ్వులు మాత్రమే కురిపించాడు. చివరకు ఆవిడ అంది ‘తండ్రి రంగే‘ అని.

"తండ్రి రంగే"ననే సంతోష వార్త చెప్పటానికి పీటికగా ఆ నవ్వులు కురిపించి వుంటుందామె. అందులో కొంతగర్వం, సంతృప్తీ కూడా దాగి ఉన్నాయనడంలో సందేహం లేదు.

"పేరేం పెట్టారు?" అన్నాను.

"కృష్ణ కిశోర్ కిరణ్" అని ఇద్దరు ఒక్కమాటే అన్నారు.

ఏదో పెట్టేశారు పేరు. అందం, పొందికా అక్కర్లేదిలాటి వాళ్ళకు కొన్ని పేర్లు నచ్చినవి కలిపి ఒక్కసారే పెట్టేస్తారు. నిజానికి అవి ముగ్గురు మొగపిల్లలకు సరిపోతాయి. విడివిడిగా పెడితే ఆ పేర్లు అందంగా కూడా ఉంటాయి.

***ఫామిలీ ప్లానింగ్... ఒక పేరులో పదిపేర్లు***

కానీ ఇది ఫామిలీ ప్లానింగ్ యుగం కనుక ముందు సంతానం మీద అంతగా హోల్డు వుండదు గనుక ఇలాటి పేర్లు పెట్టి అభిలాష తీర్చుకుంటున్నారు కాబోలు అనిపించింది. పేరు పెట్టడం విషయంలో ఒకరనేదేముంది. కన్నవారి యిష్టం విన్నవారి కెలా వుంటే వారికేం?

"తొలిగా కొడుకు పుట్టడం ఎంతో యోగ్యమైన విషయం మీకు నడివయస్సు దాటేటప్పటికే అక్కరకు వస్తాడు" అన్నాను.

"ఏం వస్తాడో వాడికి వాడు ఉపయోగపడితే చాలు. మాకు ఏం పెడతాడు. ఈ రోజుల్లో అలాటి ఆశలు వుండకూడదు" అన్నాడు తండ్రి.

"అదేమిటండీ! అతగాడు గొప్పవాడు కావాలి. పేరు సంపాదించాలి మిమ్మల్ని హైక్లాసుగా పోషించాలి" అన్నాను.

"మనల్ని హైక్లాసుగా పోషించక్కరలేదు ఏమీ లేదు. వాడు ఒక మిడిల్ క్లాసు మనిషిగా బ్రతికితే అంతే చాలు" అన్నారు పితృపాదులు.

ఏదో చెబుతున్నారు గాని పిల్లవాణ్ణి తీసుకువచ్చి చూపించలేదు. పోనీవారు గ్రహిస్తారేమోనని నేను తెచ్చిన ప్యాకెట్ విప్పి బొమ్మలు అవి తీసి బల్లమీద పెట్టాను "మీ అబ్బాయి కోసం ఈ చిన్ని బహుమానం" అన్నాను.

"అబ్బో! ఇవన్నీ తెచ్చారా?" అని ఆయన చిరునవ్వులు దూసి పోశారు. ఆవిడగాను ఆ నవ్వుల్నే పువ్వులుగా ఏరుకుని తన చూపులతో దండలు గ్రుచ్చుతోంది ఇంకో పది నిముషాలు కూర్చున్నాను. వారు గడియారం వంక చూస్తున్నారు. దొంగతనంగా.

***మా పాపడు తాతయ్య గారింట్లో వున్నాడు.***

అది గమనించి "ఏడి? మీ బాబును చూపించండి. ఒక్కసారి చూచి వెళ్ళిపోతాను" అన్నాను. ఆవిడ నవ్వింది ఈసారి.

ఆయన వాటిని ఆత్రంగా ప్రోగుచేసు కొంటున్నాడు.

"మీకు తెలియదా మావాణ్ణి వాళ్ళ తాతయ్య అమ్మమ్మల దగ్గిర వదిలివచ్చాం. అప్పుడే రెండు నెలలైంది" అన్నదామె.

"వాణ్ణి అక్కడ చేర్చి వచ్చి ఈవిడ ఇక్కడ ఆఫీసులో చేరింది. మొన్న జూన్‌తో 'బాలింత శెలవు' అయిపోయింది" అన్నాడాయన.

నాకు ఏం మాట్లాడాలో తోచడంలేదు. రెండు నెలల క్రిందటే దింపి వచ్చారుట. నాలుగో నెలలోనే చిన్నపాపణ్ణి మైళ్ళదూరంలో వదిలి వేశారన్నమాట పొత్తిళ్ళల్లో దాగి పొట్టకు ఆనుకుని పడుకునే పాపడు కొంచెం వొత్తి గిలితే ఉలిక్కిపడతారంటారు తల్లులు. ఏ తలంటు ఉపోసుకుంటుండగానో పిల్లాడు తొట్టిలో కెవ్వుమంటే తల్లడిల్లిపోయే తల్లి. అంతదూరంలో వదిలి రావడమంటే ఎంతో త్యాగం చెయ్యాలి మరి.

నేను అన్నాను. "నాకు తెలియదు అబ్బాయి అక్కడ ఉన్నాడని అందుకని అడిగాను" అని.

"మీకు తెలియదూ! మావాళ్ళు వ్రాశారేమోననుకున్నాను. అందరికీ వ్రాయండి. పిల్లవాణ్ణి చూసే వాళ్ళు అక్కడికేరావచ్చు అని చెప్పి వచ్చాం" అన్నదామె.

***ఆ అమ్మకు పిల్లల్ని పెంచడం తెలియదు.***

"అలాగా! మరి మీ అత్తగారు చంటివాణ్ణి పెంచగలదా?" అన్నాను మాట తొందరలో.

"ఏం? ఆవిడకు ఆ మాత్రం తెలియదూ! మమ్మల్నందర్నీ పెంచలేదూ! మేమింతవాళ్ళం కాలేదా?" అని కొంచెం ఉద్రేకంగా అన్నాడు ఆ తండ్రి.

"అవును. ఆ మాటా నిజమే. ఈ చొక్కా బొమ్మలూ మీరు వెడితే తీసుకువెళ్ళండి" అన్నాను.

"మేం ఆరునెలల దాకా వెళ్ళం. శెలవు దొరకదు. ఎవరన్నా వస్తుంటారులెండి మీరిచ్చారని చెప్పి పంపిస్తాం" అన్నదామె.

"అలాగేలా అమ్మా.. పంపు" అన్నదామె.

"మీరు సండేదాకా వుంటారా?" అన్నాడాయన.

"శనివారం వెడదామనుకుంటున్నాను" అన్నాను.

***మీరు వచ్చినప్పుడు సండే వస్తే...***

"అరే! ఈసారి మీరు ఇక్కడికి వచ్చినప్పుడు 'సండే' వుండటం తటస్థిస్తే మా యింటికి భోజనానికి రండి" అన్నాడా గృహస్థు.

సరేలెమ్మని బయలుదేరాను. "ఈసారి నే రావాలి. వచ్చినప్పుడు 'సండే' రావాలి. అప్పుడు భోజనానికి రావాలి" అనుకుంటూ వచ్చి ఆటో రిక్షాలో కూర్చున్నాను.

అవును మరి ఉద్యోగాలలో చేరడం వల్ల మహిళలు ఇలా పిల్లల్ని దూరంగా వుంచవలసి వస్తోంది. వారిలో మమకారం లేకపోవడం వల్లనంటారా! ఎంత మాత్రం కాదనే అంటారు. సొమ్ము సంపాదనా అత్యధిక స్థానం ఆక్రమించిన ఈ రోజుల్లో ఇలాటి ఎడబాటులు పరిపాటి అయిపోతున్నాయి పాపం.

ఇలాటి అవస్థలో చిక్కుకున్న వారెందరో వున్నారీ రోజుల్లో, అందులో దంపతులు మాత్రమే వుంటున్న సంసారాలు చాలా వున్నాయి. వీరి పిల్లల్ని ఎవరు చూస్తారు? ఎవరు ఆ బాధ్యత వహిస్తారు.

"అలా పిల్లల్ని వదలడం కష్టంకాదా?" అని ఒకరిని ప్రశ్నిస్తే -

రూపాయలు కావాలి - పాపాయిల్ని ఆడిస్తే ఎలా?

"ఆ సంగతి మాకూ తెలుసు కానీ వాళ్ళు పెద్దవాళ్ళయితే చదువులు చెప్పించాలి. పెళ్ళిళ్ళు చెయ్యాలి. పెద్ద వాళ్ళను చేసి సంఘంలో ఒక ఉన్నత స్థానం కల్పించాలి. కనుక ఇద్దరం దోసిళ్ళతో కాకపోయినా పురుషిళ్ళతోనైనా సంపాదించాలి గదా మరి" అన్నారు.

నిజమే పాపం.. రూపాయికి విలువ తగ్గిపోయిన రోజుల్లో పాపాయిలను ఆడిస్తూ కూర్చుంటే ఎలా? డబ్బుంటే ఎక్కడున్నా రుబ్బు పాత్రాలల్లే ఉండొచ్చు.

(4' నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ప్రఖ్యాత** హాస్య రచయితలు శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు వారు వ్రాసిన 'భార్యను లొంగదీసుకోవడమెలా?' అనే పుస్తకం ఒకటి నాకిచ్చి "ఇది చదవండి దీనివల్ల ఉపయోగం వుంటుంది" అన్నారు ఎంతో ఆప్యాయంగా.

"నాకిది ఎందుకండీ?" అన్నాను కొంచెం ఆలోచనాపూర్వకంగా.

"ఎందుకంటారేమిటండీ! భార్యను లొంగదీసుకోవడానికి అనవసరమైన 'చిట్కా'లన్నీ వున్నాయి యిందులో. దీని వెల రూపాయిన్నరే. మీకు ఉచితం" అన్నారు నవ్వుతూ.

"ఈ పుస్తకం హెడ్డింగులో వున్న కార్యక్రమం యిదివరకే నెరవేరింది. ఇది మరెవరికన్నా ఉపయోగపడితే ఇచ్చివేస్తాను" అన్నాను.

"అలా ఏం ఇవ్వక్కర్లేదు కావాలన్న వాళ్ళు వాళ్ళే కొనుక్కుంటారు. మీరు చదవండసలు. ఎందుకు ఉపయోగపడదో చూస్తాను" అని పంపించారాయన.

సరే! నమ్రతతో వారికి నమస్కరించి పుస్తకం తెచ్చుకున్నాను. పుస్తకం మా ఆవిడ చూసింది. "మీరీ పుస్తకం తెచ్చుకున్నారు. నేను "భర్తనెలా లొంగదీసుకోవడం?" అని. శ్రీమతి పరిమళా సోమేశ్వర్ వ్రాసిన వ్యాసాలన్నీ తీసి దాచాను" అన్నదామె.

"చదివావా?" అన్నాను.

"చదవడానికి కాదు. ఏదో ఆయుధంలాగా వుంటుంది కదా అని దాచాను. యాభై వసంతాలు దాటిన వాళ్ళు దిగుళ్ళతో క్రుంగిపోవడంతో సరిపోతుంది గానీ, ఒకరిని ఒకరు లొంగదీసుకోవాలని ప్రయత్నించడమేమిటి? పాతికేళ్ళ క్రిందట అయితే వీటితో ఏమైనా ప్రయోజనం వుండేది" అన్నదామె.

"అయితే నువ్వా వ్యాసాలు చదువుకో. నేనీ పుస్తకం చదువుతాను. ప్రయోగాల విషయం ఇద్దరం ఆలోచించవద్దు" అన్నాను.

"ఆ ఆలోచనలకేం మనం ఆలోచించవలసినవి చాలా వున్నాయి. మీ మనస్సు బాగుంటే ఆషామాషీలకు సబ్జక్ట్స్ ఆలోచించుకోండి. లేకపోతే అర్థరాత్రివేళ నిద్రలో మూలుగుతూ వుంటారు" అన్నదామె.

నేను మునిమాణిక్యంగారి గ్రంథం చదవడం ప్రారంభించాను. మొదటి వ్యాసం ప్రారంభంలోనే "మన కవులుగానీ, దేవుళ్ళుగానీ తమ తమ భార్యల్ని లొంగదీసుకోలేదు - ఎవరూ అటువంటి ప్రయత్నం చెయ్యలేదు" అని వుంది.

ఇదేమిటి ఇలా వ్రాశారు. ఇంతవరకు ఎవరూ లొంగదీసుకోకపోవడేమిటి? తెలుగు కవుల ఆత్మకథలన్నీ మాష్టారుకి తెలుసా! ఒకవేళ తెలిస్తే మాత్రం వారి గార్హస్థ్య జీవితాలు తెలుసా! తెలిస్తే మాత్రం దాంపత్యజీవన సరళులు తెలుసా! అని ఆలోచించాను.

నాలుగు పంక్తులు చదివిన తర్వాత "అది చరిత్రలో ఎప్పుడూ జరగలేదు" అని వ్రాశారు. ఏమిటి మాష్టారు ఇంత ఘంటాపథంగా చెపుతున్నారు? పోనీ ఇలాటివి వ్రాసేటప్పుడు కొందరు కవుల అభిప్రాయాలన్నా స్వీకరించారా అంటే అదీ కనిపించడంలేదు.

ఆ అధ్యాయంలో ఎక్కడో చెప్పారు "కాటూరువారు అన్నారుట వారు భార్యమాటే వింటాను. అందుకని మాకు పోట్లాటలు లేవు" అన్నారని.

కాటూరి మాష్టారు అజ్ఞాతశత్రువులాంటి వారు. ఆయనగారు ఒకరిని లొంగదీసుకోవాలనిగానీ క్రుంగదీయాలనిగానీ ఎప్పుడూ ఆలోచించి వుండరు. వారిని ఉదాహరణగా చెప్పి తక్కిన కవులందర్ని ఆ జాబితాలో పడేస్తే ఎలా? అనిపించింది.

ఇలా ఆలోచిస్తుండగా ఒక మిత్రుడు వచ్చాడు. "ఏమిటి చదువుతున్నప్పుడు?" అన్నాడు. చెప్పను. ఆయనగారు నవ్వి "మంత్రాలతో చింతకాయలు రాలతాయా! మనిషి పుట్టుకతో రావాలిగాని" అన్నారు.

"ఎవరో సంగతి దేనికి మీ అభిప్రాయం చెప్పండి భార్యను అనుకూలవతిగా మార్చుకున్న పెద్దమనిషి ఒకడూ లేడు అని వ్రాశారు ముని మాణిక్యం వారు" అన్నాను.

"మలుచుకోడానికి అదేం మరా? తొలుచుకోవడానికి శిలా? భార్యవంక గుడ్లెర్ర చేసి చూచేవాళ్ళూ వున్నారు. కోటి దేవతల పెట్టుగా కొలుచుకునేవాళ్ళూ వున్నారు. ఎవరి యిష్టం వారిది. అసలు భార్యల్ని లొంగదీసుకొన్నవాళ్ళు లేరంటే నే ఒప్పుకోను... మా మేనత్తకు అరవై దాటినాయి. కానీ మా మేనమామ వాకిట్లో దగ్గితే వంటింట్లో రగ్గు ఒణికిపోయేది పాపం. "

"దగ్గుకే రగ్గు కప్పవలసివస్తే ఎదురుగా వచ్చి ఆయన ఒక్క కేకపెడితే ఆవిడ ఎంత వణికిపోతుందో, ఏం కప్పవలసి వస్తుందో" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏమో అదంతా నాకు తెలియదు. లొంగదీసుకున్నవాళ్ళు చరిత్రలో లేదంటే చెప్పాను" అన్నారాయన.

"ఒకళ్ళమాట దేనికి? మీ అనుభవం అభిప్రాయం చెప్పండి" అన్నాను.

"స్వంత అనుభవాలు చెప్పడం దేనికి? ప్రపంచానుభవం బోలెడుంది. దాన్ని బట్టి చెప్పవచ్చు. కొంతవరకు చెపుతా వినండి.

భార్యను లొంగదీసుకోవడం అనేది జనరల్‌గా ఆలోచించే విషయంకాదు. కోటానుకోట్ల దాంపత్యాలు అవి పూటకొకరకంగా మారుతూ వుంటాయి. గంటకోరకంగా మారేవి కూడా కొన్ని వుంటాయి.

'ప్రొద్దున్న మీరు చెప్పినట్లు విన్నాగా. ఒంటిగంటకి నాకు లొంగినట్లుగా ప్రవర్తించండి. రెండు గంటలకు మీకు లొంగినట్లు ప్రవర్తించి బాకీ తీర్చివేస్తాను' అని గడువును గంటల్లోకి, నవ్వులు వంటల్లోకి తెచ్చుకునేవారూ వుంటారు.

ఉద్యోగస్తుల విషయం మరో విధంగా వుంటుంది. అనుకోకుండానే చెరో పక్షం రోజులు ఒకరిమాట ఒకరు వినే పరిస్థితి ఏర్పడుతుంది. జీతం వస్తుంది గనుక నెలలో మొదటి పదిహేనురోజులూ భర్తకు భార్య లొంగినట్లే వుంటుంది. పదిహేనో తారీఖు నాటికి ఆయన పర్సు దులిపివేస్తాడు గనుక ఆవిడ ఆయన్ని పట్టుకు దులిపివెయ్యడం ప్రారంభిస్తుంది. పాపం ఆయన ఫస్టు తారీఖును మనసులో పెట్టుకుని ప్రాణాయామం ప్రారంభిస్తారు.

అయినా భార్యాభర్తలన్న తర్వాత ఎవళ్ళు ఎవళ్ళను లొంగదీసుకుంటారో, ఎవరు పైచెయ్యిగా వుంటారో అన్న బెంగ మనం పడటం దేనికి? కాగే పులుసులో సొరకాయముక్క ముందు వుడుకుతోందో, బీరకాయముక్క ముందా అని ఆలోచించినట్లుంటుంది. పుస్తకం మీరు చదివిన తర్వాత నాకోసారి ఇవ్వండి. ఆయన బాగా నవ్వించగలరు" అంటూ మిత్రుడు వెళ్ళిపోయారు.

(11 ' నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**గత వ్యాసంలో** శ్రీ మునిమాణిక్యం భార్యల్ని లొంగదీసుకోవడం కోసం చేసిన సూచనలు కొన్ని చూశాం. నెలతల మనోభావాల్ని గురించి వారు కొన్ని నిర్ధారణలు చేశారు. వీటిని కొన్నిటిని ఈ వ్యాసంలో పరిశీలిస్తాను.

మన సాంప్రదాయాన్నిబట్టి ఒక మగువ ఎప్పుడొక వ్యక్తికి అర్ధాంగిగా అవతరిస్తుందో అప్పుడే ఆయనకు లొంగిపోతుంది. దీనికి సంబంధించిన సామెతలు కూడా కొన్ని వున్నాయి.

"మూడుముళ్ళూ పడితే అందరూ మూగవాళ్ళయిపోతారు. "

"ప్రతి స్త్రీ భర్త దగ్గర అణుకువ, అత్తమామలవద్ద మెళుకువా ప్రాణం కన్నా ఎక్కువగా పాటించాలి.

"పుట్టింటి పులి - అత్తింటి పిల్లి"

ఇలా పెద్దలు ఎన్నెన్నో చెప్పుతూ వచ్చారు. చాదస్తంగానో పై హస్తంగానో.

కాలం మారింది గనక ఇలాంటివి కూడా మారాలి. శిక్ష విధించినట్లు కాకుండా సిగ్గుతో, చిలిపితనంతో, విభ్రమంతో మగువ తలవంచినా మధురభావనగానే వుంటుంది.

నిజానికి ఒకరికి లొంగడానికి ప్రయత్నించడందేనికి? మనస్సు ఉప్పొంగితే లొంగి పోవడం చేస్తారా! ఒక్క స్త్రీకే కాదు. పురుషులకు కూడా ఇలాంటి భాగ్యం ప్రాప్తిస్తోంది.

ఈ కాలంలో యువకులు ప్రేమ ప్రదర్శనంలో లొంగిపోతున్నారు. మళ్ళీ అటో ఇటో కాదు కంప్లీట్ సరెండర్. బయటికి మాత్రం పక్కా పోజులు.

నూటికి ఎన్ని వంతులో చెప్పడం కష్టంగాని చాలామంది భార్యలకు లొంగిపోతున్నారీరోజుల్లో, వీళ్ళ చరిత్రలు తూచా తప్పకుండా వ్రాస్తే బోలెడు పుస్తకాలు అమ్ముడుపోతాయి. ఈ ఆధునిక యుగంలో "అర్ధాంగికి దాసులు" అయినవారి కథలు మగవాళ్ళకు కొంచెం విడ్డూరంగా - ఆడవాళ్ళకు ఆనందదాయకంగా వుంటాయి.

కనుక ఈ లెక్క ప్రకారం ఆలోచిస్తే భర్తల్ని లొంగదీసుకోవడమనే సమస్య చాలా మందికి వుండదు. పోతే, తక్కిన తరుణులు కొంచెం పాత వాసనగల ఘటాలై వుంటాయి.

నిజం చెప్పాలంటే అక్కడక్కడా ఇక్ష్వాకుల నాటి నమునాలు, కొన్ని వున్నాయి. వారి విషయాలలో మార్పు వుండదు. "ఇలాటి చిట్కాలున్నాయి.. ఒక మండలం రోజులు ఉపయోగించి చూడండి" అంటే..

"అబ్బే. అవన్నీ దేనికిలెండి. అసలు మా ఆడవాళ్ళు అడుగుల్లో మట్టితీసి బొట్టుపెట్టుకొనేరకం. వీళ్ళ కోసం పుస్తకాలెక్కడ చదువుతాం" అంటారు. భార్యలకి లొంగిపోయినవాళ్ళు, అదివరకే లొంగతీసుకున్నవాళ్ళూ పోతే లొంగదీసుకోవలసిన అవసరంగలవాళ్ళు ఏ కొద్దిమందో వుంటారు.

వాళ్ళు కొద్దిమందే కావచ్చు. అయినా వారికి సహాయపడటంలో ఎంతో సేవాభావం వుంది. అసలిలాంటి వారి సంఘం ఒకటిపెట్టి వారికి ఆదివారం ఉపన్యాసాలిచ్చి - సోమ, మంగళవారాలలో ఎంతవరకూ లొంగతీసుకొన్నది రిపోర్టు పంపమంటే సత్వరఫలితాలు సమకూరవచ్చు.

అయితే చమత్కారం నేర్చిన స్త్రీలు కొందరు, లొంగినట్లే లొంగి మళ్ళీ యధాస్థానానికి వస్తే భర్తలు బయటికి చెప్పుకోటానికి సిగ్గుపడి లోలోపల బెంగ పెట్టుకునే స్థితికి రావచ్చు. ఇలాంటి కేసు విషయంలో సంఘం కూడా ఎక్కువగా తోడ్పడలేకపోవచ్చు.

భర్తలకు లొంగడం విషయంలో ప్రస్తావన వచ్చినప్పుడు ఒకళ్ళు అన్నారట "దీనికో కార్యక్రమం దీర్ఘాలోచనదేనికి? లొంగవలసిన తరుణాల్లో లొంగుతారు. తర్వాత తమ హోదా తాము చూసుకుంటారు. అవసరమొస్తే లొంగడమే కాదు గుండెల్లో బొంగరం తిరిగినట్లు కూడా తిరుగుతారు"

ఆ కాసేపట్లో రోషాలుండవు. వేషాలు వుండవు. ఆ కాసేపట్లోనే పాషాల్ని కూడా కరిగించిపోతపోయవచ్చు. అయినా అంగనామణులు. ఎప్పుడూ లొంగివుంటే పురుషులు ఆ బరువుమోయగలరా? అడుగు అవతల వెయ్యగలరా! అని ఆమె సవాల్.

మొన్న ఒక వృద్ధుడు మా యింటికి వచ్చినప్పుడు శ్రీ మునిమాణిక్యంగారి పుస్తకం చూడటం తటస్థించింది. అది తీసుకుని చివరిదాకా చదివాడొక గంటలో.

అందుకు నాకెంతో సంతోషం కలిగింది. చివరకు అడిగాను "ఏమిటి మీ అభిప్రాయం. అనుభవజ్ఞులుగదా?" అన్నాను. దానికి ఆయన నవ్వి "పుస్తకం చక్కగా వ్రాశారు. రచయితల వద్ద వుండే సుగుణం ఇదే. వారి పనులు వారు చూసుకుని ఊరుకోకుండా, తన అభిప్రాయాన్ని, అనుభవాల్నీ పదిమందికీ అందించి ఆనందింపచేస్తారు" అన్నారాయన.

"అది సరేననుకోండి. అసలు సమస్యను గురించి మీ అభిప్రాయమేమిటి" అన్నాను.

"చదివి ఆనందించడమే అభిప్రాయం. చదివించడంలో మునిమాణిక్యం వారు సిద్ధహస్తులు. సమస్య విషయమంటారా! ఏం చెప్పను? దాంపత్యాలు దాగుడు మూతలు కొందరిళ్ళలో ఫిడేల్ నాదాలు. కొందరిళ్ళలో బిందెనాదాలు. ఇక ఒకరిని ఒకరు లొంగతీసుకోవడం సమస్య అంటారా! భార్య లొంగితే ఒక బాధ లొంగకపోతే మరోరకం గాథ. ఎప్పుడూ లొంగినట్లుండి, బ్రతుకంతా బంగీ కట్టినట్లుకట్టి ఒక చోటు పెడితే ఇక ఆ దాంపత్యంలో రంగూ, రజనూ ఏం వుంటుంది.

శ్రీకృష్ణుడంతటివాడు ఎప్పుడూ లొంగివుండే రుక్మిణివద్ద, తన చాకచక్యం, నాయకత్వం చెల్లక సత్యభామవద్ద జేరి, ఆ ఎర్రజీరల కళ్ళతో నీరాజనాలందుకోవాలని కోరుకొనేవాడు. కనుక కేవలం నమ్రతా మూర్తులుగా నాముసుద్ద నములుతున్నట్టు నిలబడే భార్యలున్నా జీవితం అంత హాయిగా వుండదు.

"చిలిపి కజ్జాల తర్వాత చిరునవ్వు" పాలయలుక తర్వాత మొలకనవ్వు, పెనురగడ తర్వాత పిన్ననవ్వు, వాగ్యుద్ధం తర్వాత రాగభావన, ఇత్యాది చేష్టల భర్తలకు వెలలేని కానుకలు - ఆయా సమయాలలో భర్తలు అర్ధాంగులకు బానిసలు అనడంలో ఎంతో శోభవుంది" అన్నారాయన.

"మీరు చెప్పినదంతా నిజమేననుకోండి. అసలు భార్యను లొంగదీసుకోవడమనేది మునిమాణిక్యం వారి దృష్ట్యా అనవసరమని తోస్తూంది. మనమావిషయంలో ఏకీభవిద్దామా? " అన్నాను.

"తప్పకుండా ఏకీభవిద్దాం. వారు పుస్తకం ఎంతో చక్కగా వ్రాశారు. ఆడా, మగా అంతా చదవతగింది. తప్పక చదవాలి. కానీ ఆ వస్తువును గురించి ఏ జంట కాజంటే ఆలోచించుకోవాలిగానీ దాన్ని సర్వసామాన్య సమస్యగా చేసి తర్కించటం అంతసమంజసం కాదనుకుంటాను. ఏమంటే భార్యా భర్తలమధ్య జరిగే వ్యవహారాలన్నీ లాలూచీ కుస్తీలుగా నడుస్తూ వుంటాయి చాలావరకు" అన్నారాయన.

నేనూ ఆయన మాటలతో ఏకీభవించాను. మునిమాణిక్యం వారిని మరోసారి అభినందిస్తూ మా సంభాషణ చాలించాం.

(12‘ నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ప్రకృతి కూడా మానవుల** మీదకు మాటిమాటికీ కసితో ఎదురు తిరుగుతోంది. మానవుడు ఎదురు తిరగడంలేదే!? నేమాత్రం ఊరుకుంటానా - అన్నట్లు సవాళ్ళు చేస్తోంది.

సంసారాలు చూస్తే జాలిగాథలతో నిండిపోతున్నాయి. ఒక రోజు ఎలా గడుస్తున్నదో చెప్పడానికి వీలులేకుండా వుంది. ముప్పూటలా భోజనం వున్నా లేకపోయినా, గప్పాలు కొట్టుకు బ్రతుకుతున్నారు చాలామంది.

"ఏ పూటా కుండ నిండా బియ్యం పొయ్యలేదు. పొయ్యనిండా మంట పెట్టడం లేదు. నోట్లోకి నాలుగువ్రేళ్ళు పోవడం లేదు. సగానికి సగం బియ్యం రెండు చితుకులు పొయ్యిలో నాలుగంటే నాలుగు మెతుకులు నోట్లో" అన్నది మొన్న ఓ బీదరాలు. ఇలాటివారు ఎన్ని లక్షలమంది వున్నారో?

పరిస్థితులిలా వుండగా అనుకోని తుఫానులు వచ్చి పడుతుంటే ఇక నరుడెలా తట్టుకోవడం. ఎలా బ్రతుకులు సరిపెట్టుకోవడం? మే నెలనుంచీ ఆంధ్రప్రాంతంలో నాలుగైదు తుఫానులా రాజకీయపు తుఫానులకంటే ఇవి ఎక్కువ అవుతున్నాయంటే ఎంత ఆశ్చర్యం.

ఏ తుఫానునూ మనం ఆపలేమనుకోండి. అది వేరే సంగతి. అయినా వాటి ప్రభావానికి తట్టుకోవాలిగదా. దానికి అవసరమైన బలాలు వున్నాయా. ఏమున్నా ఇదంతా విధివైపరీత్యం కాక ఏమవుతుంది?

విజయవాడలో ఇంత గాలి ఎప్పుడు ఎరగమన్నారు చాలామంది. వాయుదేవుడు నూరు నుంచి నూటాయాభై కిలోమీటర్ల వేగం సంపాదించుకుని, బయలుదేరితే ఏమి ఆగుతుంది. అంత వెర్రికోపం దేనికయ్యా బాబూ అంటే వింటాడా ఏమన్నానా?

దీపాలు లేక ఊరంతా కాటుక ముద్ద అయింది. అయినా తలుపులు తెరవడానికి వీలా ఏమన్నానా? చీకటిళ్ళల్లో జీవితాల్ని మూటగట్టి భగవంతునికి అప్పజెప్పి మిడిగ్రుడ్లు వేసుకుని కూర్చోవడం తప్ప చేసేదేంవుంది?

ఉన్న మైనపు వత్తి వెలుగుతో గడియారం వంక చూస్తే, చిన్నముల్లు మాట అలావుంచి, పెద్ద ముల్లు మాత్రం కదిలిందా!? సూర్యభగవానుడు రావాలి. కళ్ళు కనిపించాలి. అంతవరకు అవి తెరచివున్నా మూసివున్నా ఒకటే అనిపించింది.

వనమహోత్సవాల కోసం మనం తాపత్రయపడుతుంటే ఆయన వనసంహారం చేసి చక్కాపోయాడు. అధిక వంటలకోసం మనం తంటాలు పడుతుంటే పండిన ధాన్యాన్ని పంచబంగాళం చేశాడాయన. మానవుడెంత ? మానవుని శక్తి ఎంతవరకూ? పంచభూతాలూ, ఆ పైన భగవంతుడు అనుగ్రహించినంతవరకే.

"నవంబరు ఏడవ తేదీ రాత్రి నా జన్మలో మరిచిపోను" అనడమే ప్రతివారు. ఒక మాదిరి పాకలన్నీ వూగిపోయాయి. ఇకవాటిలో వుండేవారి మనస్సులెలా వూగాయో? ఎలా చెప్పడం?

ఒకరు చిన్నపాకలో వున్నారు. ఇల్లు వూగడం ప్రారంభించింది. అంతా భయపడ్డారు. ఇంతలో ఒక ప్రక్క ఇల్లు అంటుకుని రవ్వలు రావడం ప్రారంభించాయి. ఒక ప్రక్క ఉధృతంగా గాలి, అందులో అగ్గి మంటలు. అగ్గిముద్దలు గాలిదేవుడు తెచ్చి ఎన్ని ఇళ్ళమీద వేసిపోతున్నాడు.

పైన చెప్పిన గృహస్తు భార్యాపిల్లల్ని ఎదురుగావున్న డాబా యింటికి వెళ్ళమంటాడు. పిల్లల్ని కాపాడమంటాడు. 'మీరు రాందే వెళ్ళ'నంటుందా ఇల్లాలు. ఆయన 'వంశాన్ని నిలపవే' అంటాడు. ఆవిడ 'నా మంగళసూత్రం కాపాడండి, మీరుకూడా' అని బ్రతిమాలుతుంది.

చివరకు ఆయన ఇంట్లో వుండి భార్యను పిల్లల్ని ఎదురింటికి పంపాడు. తాను పోతాననుకుని కాపలా కాస్తూ వుండిపోయాడు. ఇంట్లో ఎదురింటికి వెళ్ళిందే గాని ఆ ఇల్లాలు భర్తను తలుచుకుని అక్కడ బిగుసుకుపోయింది. ఆ ఇంటినుంచి ఈ యింటికి వార్తలేదు. ఎవరికి సాధ్యం వెళ్ళి చెప్పటానికి? బయటికి వస్తే ఆ చీకటి ముద్దలో చుట్టుకుని ఎక్కడికి కొట్టుకుపోతారో తెలియదు మరి. ఇలా ఎందరు భీతావహులై మతిచెడి ఆ రాత్రి గడిపారో చెప్పలేం.

ఒకరింటి కిటికీకి అద్దాలున్నాయట. ఎక్కడినుంచో ఇనప గిర్దరు వచ్చి ఆ అద్దాలకు కొట్టుకోవడంతో అది ముక్కముక్కలై ఇంట్లో వారి వంట్లోకి చొచ్చుకుపోయాయని చెప్పుకున్నారు.

ఒకరింట్లో సీలింగ్ ఫాన్ వూడి వెళ్ళి ఎక్కడో పడిందిట. తెల్లవారిన తర్వాత ఇలాంటి కథలెన్నో చెప్పుకున్నారు. అర్ధరాత్రి తర్వాత "చేసిన అఘాయిత్యం చాలు"నన్నట్లు గాలిదేవుడు ఎక్కడికో దూసుకుపోయాడు. రాత్రి ఇంతగందరగోళం జరిగిందన్న సంగతి తనకేమీ తెలియనట్లు సూర్యభగవానుడు వెలుగు శాలువ కప్పుకొని విను వీధిలో ప్రత్యక్షమయ్యాడు. ప్రజలకు ఎంతో ధైర్యం వచ్చింది.

రాత్రంతా ప్రాణాలు ఎలా నిలుస్తాయా అన్న భయంతో ఒణికిపోయిన జీవులు తెల్లవారేటప్పటికి మళ్ళీ ఈ ప్రాణాల్ని ఎలా నిలబెట్టుకోవడమా అ తాపత్రయంలో పడ్డారు.

"భోగి పండగ. ఏదో అలాగే తలంట్లు పోయాలి నలుగురికీ" అంటూ గృహిణులు కాగులు వెతుక్కున్నారు.

వాయుదేవుడు రాత్రంతా ప్రకృతికి తలంటి చక్కా పోయాడు. "చిక్కు నువ్వే తీసుకో" అన్నట్లు. ప్రకృతికి "భోగి" తలంటి పోశానని ఆయన మురిసిపోయాడు గావున్ను. అభిజిత్యానికి మానవుల 'జోడి' మసగబారిపోయింది. తలంట్లు పకపకలే లేవు. నూతన వస్త్రాల సందడులే తక్కువ.

అంతకుముందే కొనుక్కొచ్చిన వాళ్ళు పిల్లలకు తొడిగి "బయటికి వెళ్ళొద్దు. పదినిమిషాలు వుంచుకుని విప్పెయ్యమ"ని ఆదేశించారు. మంచి ఖరీదు బట్టలు కొనుక్కున్న మా బావమరిదిగారి వంటివాళ్ళు మర్నాడు సాయంత్రం వాటిని ధరించి చిన్న చిన్న షికార్లు చెయ్యడం ప్రారంభించారు.

తెల్లవారినప్పటి నుంచీ వ్యాపారాలు మళ్ళీ ప్రారంభమైనాయి. నేను తలుపు తీసి బయటికి రాగానే "చామంతి పువ్వులు, మల్లెపువ్వులు" అంటూ కేక వినిపించింది. "ఎంత ప్రళయం వచ్చినా భగవంతుని పూజకు అంతరాయం రాదు. అందులో శనివారం ఉదయమే పువ్వులు వచ్చాయి" అని పిలిచాను.

పూలదండలు ఎంతో చక్కగా వున్నాయి. అప్పుడే కోసినట్లుగా స్వచ్ఛంగా వున్నాయి. "రాత్రంతా వానగదా పాకలు ప్రాణాలు వూగినాయి కదా! ఎప్పుడు కట్టారీ మాలలు?" అని ప్రశ్నించాను.

"నిన్న సాయంత్రమే కట్టాం సార్. బయటికి రాలేక దాచేశాం. రాత్రి వానకూ, చల్లదనానికీ అలా వున్నాయి వాడకుండా" అని పువ్వులదండి కొలిచి ఇచ్చాడు.

"కొలత చూసుకోండి" అన్నాడు.

"నీ కొలత కేమిలే వీటితో మేము స్వామిని కొలవడంలో వుంది అసలు శక్తి" అని దండ తీసుకుని వెళ్ళాను లోపలికి. స్నానం చేసి స్వామి మంటపం విగ్రహం ఆ నవ్వే పువ్వుల మాలలతో అలరించాను. ఆ స్వామి అభయమిచ్చినట్లుగా చూశాడు. అక్కడితో మళ్ళీ సంసార సమరం ప్రారంభం.

ఇంతలో ఉప్పుబండి వచ్చింది. 'ఉప్పు' కేకలు వినిపించాయి జిహ్వాచాపల్యపు దినుసులు మళ్ళీ చెవిని పడడం మనసులో ప్రవేశించడం తాపత్రయ దావాగ్నులలో చిక్కుకోవడం సంభవించింది.

ఆ ఒకరోజు మాత్రం తుఫాను భీభత్సవానికి చెందిన వార్తలు ఎడతెరిపి లేకుండా చెప్పుకున్నాను. ఎవరి గాథ వారు చెపుతుంటే యెంతో జాలిగావుంది. "గాలి దేవుడు ఇంతపని చేస్తాడు అనుకోలేదు" అని ప్రతివారూ విస్తుపోవడమే.

"ఏవయ్యా వరుణదేవా! ఎందుకయ్యా నరులమీద నీకు అంత క్రోధం దీనివల్ల నీ శక్తిని ప్రదర్శించడం తప్ప వేరేం ప్రయోజనం సాధించావు?"

పత్రికలలో నీ ప్రతిభను గురించి వ్యాసాలు వ్రాయించుకోవాలనే ఆకాంక్ష ఎక్కువైందిలే మహానాయకులకు మల్లేనే.

(15' నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**శ్రీ వావిలాల** గోపాలకృష్ణయ్యగారు మంచి మంచి వాక్యాలు సృష్టిస్తూ వుంటారు. ఆయన వకృత్వంలో చమత్కారం కూడా చాలా వుంది.

'నవంబరు ఒకటిదాకా గాంధీ - తర్వాత బ్రాందీ' అన్నమాట ఎంతో చక్కగా అన్నారాయన. ఈనాటి యువలోకాన్ని గురించి ఆయన ఓసారి మాట్లాడుతూ "ఒక్కసారిగా ఇంత మార్పు ఎలా వచ్చిందో చెప్పలేం. ఆలోచించినా అర్థం కావడంలేదు" అన్నారు.

ఆయన హైదరాబాదులో రోడ్డుమీద కనిపించి కాసేపు నిలబడి మాట్లాడారు. అక్కడకు నలుగురు చేరారు. ఆ సందర్భంలో ఆయన ఒక గృహస్థు విషయం మాట్లాడుతూ

"ఆ ఇంట్లో కుర్రవాడు ప్రతిరోజూ సినిమాకు వెళతాడుట. తల్లి లబోదిబోలాడుతుందిట. ఇలా అయితే వాడేం చదువుతాడు? ఏం పరిక్ష పాసవుతాడు? ఏ వారినికో ఒకసారి అయితే ఫర్వాలేదు. ప్రతి నిత్యం అలా హాజరైతే ఎలాగండీ కొంచెం మందలించండి. మన బాధ్యత కాదుటండీ" అని భార్య భర్తతో గోలపెడుతుందట.

ఆయన అంతా విని మెల్లగా అంటాడుట "నువ్వు చెప్పినట్లు వాణ్ణి మందలిస్తాను. దానికేం ఎంతసేపు. అయితే ముందుగా మనమొక విషయం ఆలోచించుకోవాలి సినిమాకు వెళ్ళొద్దని వాణ్ణి ఆపుతామనుకోండి అసలు వాడు ఇంట్లోనుంచే లేచిపోతే ఏం చేస్తాం?"

"అలావుంది వాడి మనః ప్రవృత్తి. ఒక్కరోజు గట్టిగా అడిగామా మర్నాడు "కనపడటంలేదు" అని పత్రికల్లో వేయవలసిన ఖర్మం పడుతుంది. కన్నీటి వాగులు వారించాల్సి వస్తుంది. ఆలోచించుకో. ఇప్పుడైతే ఏ అర్ధరాత్రికో తిరిగివచ్చి ఇంత తిని పడుకుంటాడనే ఆసక్తి అన్నా వుంది" అన్నాడుట భర్త.

ఆ మాట విని భార్య "అయితే వద్దులెండి. అంత అవస్థ మనమెక్కడ పడతాం. వాడిష్ట ప్రకారమే కానియ్యండి" అన్నదిట. అనడమే కాదు. ఆ రోజునుండి ప్రతి సాయంత్రం సినిమా వేళకు ఇంత టిఫిన్ చేసి తనే స్వయంగా క్రాపు దువ్వి, పౌడర్ కొట్టి డబ్బులు చేతిలో పెట్టి పంపడం ప్రారంభించిందంట. "ఇంతా చేసి మనస్సు వూరుకోక ఏ సినిమాకు ఇవ్వాళ వెళ్ళేది?" అని మాత్రం అడిగేది. దానికే ఆ కుర్రవాడికి కోపం వచ్చేది "ఏమిటమ్మా ఆ ప్రశ్నలు ఏ సినిమాకు వెళ్ళేదీ చెప్పాలా? ముందుగా ఎలా చెప్పేది? ఇంట్లో ఒక ఫోను పెట్టించు. టిక్కెట్లు కొన్న తర్వాత ఫలానా హాలు అని ఫోను చేస్తా" అని గొడవగా మాట్లాడేవాడట.

దాంతో ఆవిడ భయపడి "పోనీలే నాయనా నీ యిష్టం వచ్చిన చోటుకి వెళ్ళు. ఊరికే అడిగా" అని ముంగురుల మీద ఒక ముద్దు పెట్టి పంపించడం ప్రారంభించిందంట.

చాలామంది ఇళ్ళల్లో కుర్రవాళ్ళు కొంచెం ప్రొద్దుపోయే దాకా రాకపోతే భర్త భార్యని, భార్య భర్త భార్యనీ "నువ్వేమీ అనలేదుగదా వాణ్ణి అని, మీరేమీ అనలేదుగదా?" అని ప్రశ్నించుకోవటం జరుగుతోంది.

దీపాలు పెట్టే వేళకు ఏ ఒక్క ఇళ్ళలోనూ కన్న సంతానమంతా వుండడం లేదని ఒకావిడ గొడవచేసింది ఇటీవల. అన్నాలు కూడా ఒక్కసారి పెట్టడానికి వీలులేదు. ఎవరొస్తే వాళ్ళకి అయిదునిమిషాల్లో వడ్డించాలి. నోరెత్తకుండా "ఎక్కడికెళ్ళావు ఇంత ప్రొద్దుపోయింది?" అంటే ముద్ద కంచంలో పారేసి లేచిపోయే ప్రబుద్ధులు కూడా బయలుదేరారు.

వాళ్ళనడిగితే అంటారు "మాకు మాత్రం స్వంత భావాలూ, అభిలాషలూ లేవా. అంత అమాయకులమా?! ఇంకా మమ్మల్ని అదమాయించాలని, అదుపులో పెట్టాలని చూస్తారేం పాపం. ఖర్మ పూర్వకాలం వాళ్ళైతే ఏ పల్లెటూళ్ళోనో వుండేవారు గనుక, గానగ తిరిగినట్లు అక్కడే తిరిగేవారు.

పట్నాల్లో వాళ్ళం అలా ఎలా తిరగగలం? ఇల్లో చోట స్కూలో చోటా, ఫ్రెండ్స్ వూరంతా వుంటారు. ఏ నోటు బుక్కో కావాలంటే వెళ్ళాలా వద్దా? పెన్ను పాడైపోతుంది - పెన్ కార్నర్‌కి వెళ్ళాలా వద్దా? ఫ్రెండ్స్ సినిమాకు వెడదామంటారు వెళ్ళాలా వద్దా? వెళ్ళకపోతే తెల్లారి వాళ్ళ ముఖాలు చూడాలా వద్దా? ఇలా అవసరాలు మారిపోయాయి. వాటితో పరిసరాలు మారక తప్పదు. ఇంట్లోనే కూర్చోపెడతామంటే ఎలా?" అంటూ ఎంతో చాకచక్యంగా చెపుతారు.

ఒక కుర్రవాడు ఈనాటి పరిస్థితుల్ని గురించి మాట్లాడుతూ "అసలు మా సైకాలజీ అర్థంకావడంలేదు పెద్దవాళ్ళకు. మమ్మల్ని చేతులూ కాళ్ళు కట్టి వెనక్కి ఈడ్చుకు పోయి ఎక్కడో కూలవేస్తామంటారు? అంతకన్నా పాపఖర్మం వుందా? అసలు ప్రగతి అనే మాట వాళ్ళు ఆలోచిస్తున్నారా? టెర్లిన్ కాలంలోనుంచి ధోవళీల యుగంలోకి, నెక్ టైల కలంనుంచి రుద్రాక్షమాలల కాలంలోకి తీసుకుపోమంటే ఎంత విడ్డూరంగా వుంటుంది" అన్నాడు.

"ప్రగతి వద్దనడంలేదయ్యా. ప్రగతిలో కొంచెం సంగతి కూడా ఆలోచించాలి. అంటే మన సంస్కృతి, సభ్యతా, సాంప్రదాయాలూ, ఆచారాలు విడవకుండా ముందడుగు వేస్తే ఎంతో సంతోషంగా వుంటుంది" అన్నాను.

"అన్ని విషయాలు ఆలోచిస్తూనే వున్నాం కానీ అతకడం లేదు. కొన్ని అతికినా వాటిని వదలడం లేదు" అన్నాడాయన.

నిజమే మరి ఈ పాత క్రొత్తల కలయికలో కొంచెం కలగాపులగం వ్యవహారం తప్పదు. ఏమైనా ప్రగతిని కోరే మన బాలబాలికలవే, మన సంస్కారాన్ని, సభ్యతనూ కాపాడవలసిన బాధ్యత వుంది.

ఒక గృహస్థు అన్నాడు "ఏం చెప్పమంటారు? కుర్రవాళ్ళు పెరగడంతోపాటు స్వాతంత్ర్యం కూడా పెరుగుతోంది ఆ స్వాతంత్ర్యం వారికి నచ్చిన విషయాలలోనే మావాడు అయిదో క్లాసు చదివేటప్పుడు అయిందింటికల్లా ఇంటికి వచ్చేవాడు.

క్లాసులతోపాటు గంటలు పెరిగినాయి. ఇప్పుడు తొమ్మిదోక్లాసు. తొమ్మిది కొడితేగానీ గుమ్మంలో అడుగు పెట్టడంలేదు. ఎప్పుడో నోరు జారి "ప్రొద్దుపోయిందిరా నాయనా" అంటే " ఏమంత ప్రొద్దుపోయింది. ఇంకా ఫస్టుషో అన్నా వదలలేదు" అని జవాబు చెపుతాడు. నేనేం జవాబు చెప్పాలో తోచక తొండ ముఖం పెట్టుకుని వూరుకోవలసి వస్తుంది" అన్నాడు.

నూతన యుగంలో జాతీయ జీవనాన్ని సరిదిద్దగల బాలబాలికలకు తగిన బోధన జరగాలి పాఠశాలల్లో. అదే అసలైన విద్య.

**(17 ` నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఎక్కువ తక్కువ** అనేవి చాలా విషయాలలో వాడబడుతూ ఉంటాయి. సృష్టిలో అనేక సంపదలుంటాయి. మానవులలో అనేక గుణాలుంటాయి. ఆచారాలలో అనేక వివరాలుంటాయి.

ఈ అన్నింటిలో ఎక్కువ తక్కువల ప్రసక్తి వస్తూనే ఉంటుంది. ఇదివరలో కులాలలో ఎక్కువ తక్కువలని చెప్పుకునేవారు. అవన్నీ క్రమంగా సమసిపోతున్నవి. "భగవంతుని సంతానమంతా ఒక్కటే" అనే సత్యాన్ని గ్రహించడం జరుగుతోంది.

మానవులలో ఎక్కువ తక్కువలని చెప్పుకునేవారిదివరలో. ధనం ఉన్నవారు ఎక్కువనీ, పదవులలో ఉన్నవారు ఎక్కువనీ, చదువుకున్నవారు ఎక్కువనీ, వయస్సులో ఉన్నవారు ఎక్కువనీ, ఇలా ఎన్నెన్నో విధాలుగా ఎక్కువ తక్కువలు నిర్ణయించినదే.

ఇప్పుడా పరిగణనే ఉండటంలేదు. సొమ్మున్నవాళ్ళను చూచి ఎవరూ "ఎక్కువ వాడు" అనుకోవడంలేదు. ఎవరి ఎక్కువ వారిదే పొమ్మంటున్నారు. పదవుల్లో వున్న వారిని చూచి ఎవరూ భయపడటం లేదు. "ఆ ఎక్కువ నీదికాదు నీ పదవిది" అంటున్నారు.

చదువుకున్నాడు, మహా పండితుడు, శాస్త్ర సారమంతా వడబోశాడు. సరస్వతీ స్వరూపుడు అని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. "ఆయన చదువువల్ల మా కొచ్చేదేమిటి? అవకాశం ఉంది కాబట్టి చదివాడు. అయినా ఈ కాలంలో అంత చదువు అనవసరం. గ్రంథాల పురుగు అయిపోతాడు కానీ లోకజ్ఞానమనే గ్రంథం ఎంతమాత్రం అంటదు" అంటూ విమర్శిస్తున్నారు.

పోనీ ఆధునిక విద్యల్లో పెద్ద పెద్ద పరిశోధనలు వగైరాలు చేసి డాక్టరేటులు పొందిన వారిని చూచినా 'ఎక్కువవారు' అనడానికి చాలామందికి మనస్కొగడం లేదు. నా విద్యల్లో నేనే గొప్పవాణ్ణి. నా విద్య ఆయనకు రమ్మంటే వస్తుందా అని సగర్వంగా చెపుతారు.

"కాదయ్యా అలాంటివారు దేశానికి ఎంతో ఉపయోగపడతారు" అని సంజాయిషీ చెప్పబోతే వారు తమ వ్యాఖ్యానాన్ని సాగదీస్తున్నారు. దేశానికి ఎవరు ఉపయోగం లేదో చెప్పండి. గొడ్లను కాసే కుర్రవాడు దగ్గర నుంచి రోడ్లు వేసే కూలీదాకా అంతా అవసరమే. ఎవరి ప్రత్యేకత వారికుంది" అని చెపుతున్నారు. కాదనడం ఎలా?

కవులు గొప్పవారయ్యా అంటే 'కావచ్చు కానీ, కంచంలో కూడుకోసం మూడుపూటలా వెతుక్కునే కాలంలో కవిత్వాలు వినే వోపికా, సోకు ఎక్కడుంది. ఎవరో కడుపు నిండిన కొద్దిమందికి గొప్పతనం కావాలి' - అంటున్నారు.

నిజానికి యీ రోజుల్లో అందరికంటే రైతే గొప్ప అనే సత్యం అందరూ అంగీకరిస్తున్నారు. "నువ్వు పొలాలు పండించాలి. మా కడుపులు పండించాలి" అని మూగగా వారు రాగాలాపన చేస్తున్నారు. రకరకాలుగా వినిపిస్తున్నారు. 'రైతే రాజు' అనే కితాబు కూడా అందిస్తున్నారు.

పంట ఎక్కువగా పండించిన రైతు మహాశయుణ్ణి పూర్వకాలంలో క్రతువు లెక్కువ చేసిన రాజులతో పోలుస్తున్నారు.

రైతే రాజైతే ధాత్రి స్వర్గము కాదా! అని చెప్పుకుని గర్విస్తున్నారు. రైతు అందరికన్నా ఎక్కువ అంటే ఈ రోజుల్లో కాదనేవారు ఎవరూ లేరు. అసలలా అనడానికి అవకాశం కూడా లేదు.

పూర్వం ప్రభువులనీ, ప్రజలనీ, రెండు తెగలుండేవి. పాలకు లెక్కువ అనీ, పాలితులు తక్కువ అనీ, భావించేవారు. భావించడమేమిటి పాలితులకు భగవంతునికంటే ఎక్కువగా మ్రొక్కడం అలవాటైపోయింది ప్రజలకు.

ఇప్పుడు వ్యత్యాసాలు అంతరించినాయి. జీవిత సత్యాలు బయటపడ్డాయి. ఎవరికి వారే ఎక్కువ అని అంగీకరుస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ప్రజలే ఎక్కువ అనే నిర్ణయం కూడా జరిగింది.

ఒకవేళ అలాంటి వ్యత్యాసాలు ఏర్పడతాయనే భయాన్ని పోగొట్టుకోవడానికి ప్రతి సంస్థలో యూనియన్లు ఏర్పడ్డాయి. వాటిద్వారా తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవడానికి సభ్యులు ప్రయత్నించగలరు. పూర్వకాలం వారు -

"తక్కువేమి మనకూ

రాముండొక్కడుండు వరకూ"

అని ఎంతో ధీమాగా పాడుకుంటూ వుండేవారు. కొందరిప్పటికీ అలా పాడుకుని ఆనందించేవారు లేకపోలేదు. కానీ ఈనాడు పై పాటకు బదులుగా

*"తక్కువేమి మనకూ*

*యూనియనొక్కటుండు వరకూ"*

- అనే పాటా, దానితోపాటు కొంత ప్రాబల్యం ఏర్పడినాయి. కనుక ఏ సంస్థలోనూ ఎక్కువ తక్కువల ప్రసక్తి రావడంలేదు.

కాకపోతే పై అధికారులకు సంస్థల యజమానులకూ జీతాలు, వాటితోపాటు దాహాలు, వాటితోపాటు పనిచేయని అహంకారాలూ, ఫలితం లేని ఆలోచనలు, అక్కరకు రాని అక్కసులు, అధికారాన్ని సూచించే మేజాలు వాటిమీద కొనితెచ్చిపెట్టుకున్న రోజాలు. ఇత్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి.

ఇలాంటివారికి కొద్దిపాటి జీతాలను ఆశించే నౌకర్లు ఎదురుగుండా అనే "ఎస్సార్"లు అవతలకు పోయి అనుకునే "తప్పగొయ్యలు" కూడా ఎక్కువగా ఉంటే ఉండవచ్చు.

అయితే, సంస్థల్లోనూ, గృహాల్లోనూ, కూడా ఆశయాలు తక్కువ, అణుకువ తక్కువ అభిమానం తక్కువ. ఐకమత్యం తక్కువ. పోతే ఉపన్యాసాలెక్కువ. ఉద్రేకాలెక్కువ. పూర్వదృష్టి ఎక్కువ. ఉపాయాలెక్కువ. ఉద్యానాలెక్కువ. ఉక్కుచట్రాలెక్కువ. పూజల్లింపులెక్కువ. ఉగ్ర స్వరూపాలెక్కువ. ఉసూరు మనడాలెక్కువ. ఉడుకుబోతుతనాలెక్కువ.. ఇక ఎక్కువ తక్కువల జాబితాలలో చేర్చడానికి తగిన ఏడ్పులు కొన్ని ఉన్నాయి.

జీతాలు తక్కువ - ధరలు ఎక్కువ.

చేసిన పనికి మార్కులు తక్కువ - రిమార్కులెక్కువ.

అధికారులలో సామరస్యం తక్కువ - సణుగుడు ఎక్కువ.

దక్షత తక్కువ - దర్పం ఎక్కువ.

ఉపకారం తక్కువ. ఉప్పునీళ్ళు ఎక్కువ

ఉదాసీనత తక్కువ ఉద్వాసాలెక్కువ.

లాభాలు తక్కువ - స్వలాభాలెక్కువ

ఖజానా తక్కువ - దుబారాలెక్కువ

అదుపు తక్కువ - కుదుపులెక్కువ

ఇలాంటి ఎక్కువ తక్కువలతో చాలా సంస్థలూ, సంసారాలూ నడిచిపోతున్నాయి. చచ్చి, చెడి ప్రతినిత్యం సూర్య నమస్కారాలు చేస్తూ...

పోతే ఎవర్ని ఏ సందర్భంలో పలకరించినా ప్రశ్నించినా "నీ ఎక్కువేమిటి?" అని వెంటనే గ్రుడ్డు ఎర్రజేస్తాడనే భయం మాత్రం ప్రతి హృదయంలో మెదులుతోంది.

దేశంలో వ్యాపించిన ఎక్కువ తక్కువల విచిత్ర కారణాలను మరి కొన్నింటిని మరోసారి వర్ణిస్తాను.

(19 ' నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పూర్వం** మన దేశంలో స్త్రీ కంటే పురుషుడు ఎక్కువ అనే భావం వుండేది. ఉండటమేమిటి? అలాగే ప్రవర్తించేవారు పురుషపుంగవులు.. పురుషుడు ఎలాటివాడైనా అతడొక గురుపీఠంగా భావించబడేవాడు.

ఆయన తపస్సంపన్నుడనీ, ఆవిడ శిష్యపరమాణువనీ, లేదా దాసి అని నిర్ణయించబడింది. ఆ వ్యత్యాసాన్ని ఆధారం చేసుకునీ పురుషుడు ఆధిపత్యం వహించి, అధికారం చలాయిస్తూ వచ్చాడు.

కానీ ఈనాడు ఆ వ్యత్యాసం అనవసరమని కృత్రిమమనీ గ్రహించింది ఈ లోకం. స్త్రీ బానిస కాదనీ, సమాన ప్రతిపత్తులు గల వ్యక్తి, అని హెచ్చరించి, వెనుకటి పిచ్చిభావాన్ని తొలగించారు చాలావరకు. 'నీకు నువ్వెక్కువ నాకు నేనెక్కువ' అనే భావాన్ని స్పష్టంగా చెప్పకలుగుతోంది మహిళ.

"ఫాలాక్షుడంతటి వాడే భార్యకు అర్థస్థానమిచ్చి ఆమెలోగల సమానత్వాన్ని రుజువు చేయగలిగాడు. అలాంటప్పుడు ఈ నీలాచలాలొకలెక్కా" ,అంటున్నారు, కొందరు ఆర్గ్యుమెంట్ కోసం.

మొత్తం మీద ఈ కాలంలో పురుషుల "ఎక్కువతనం క్రమక్రమంగా క్షీణించిపోయి స్త్రీల తక్కువతనం" అదృశ్యమవుతోంది. సాంఘికంగా ఇది ఒక గొప్ప అదృష్టం.

కొందరు వ్యక్తులు ప్రపంచంలో ఇంకెవరు వ్యక్తులు లేరన్నంత మూర్ఖత్వంతో తాము ఎక్కువవారం అనుకోవడం పరిపాటి అయింది. ఎవరింటి వారు ఎక్కువ కావచ్చు. కానీ లోకానికేం ఎక్కువ.

వెనుకటికి బందరులో మా మేష్టారు ఒకరు అంటుండేవారు. "ఎవడింట్లో వాడు ఎక్కువే అనవచ్చు కానీ ప్రక్క యింటితో పోల్చుకుంటే రెండోవాడు... ఆ వీధిలో గల వాళ్ళందరితో పోల్చుకుంటే పదోవాడో, ఇరవయ్యోవాడో... ఆ పట్టణంలో వారితో పోల్చుకుంటే, ఏభయ్యోవాడో అవుతాడు. దేశం మొత్తం మీద ఆలోచిస్తే ఒకటి ప్రక్కన వంద సున్నాలు చుట్టాలి. కనుక ఎక్కువ అనేదానికి అర్థంలేదు. ఎందరో వుంటారు తన్ను మించినవాళ్ళు. "నాకు నేనే" అనుకునేవాడికి తిప్పలూ వుండవు. 'నా అంతవాడు లేడు' అనుకునేవాడికి ఎప్పటికైనా మాడుపోటు తప్పదు" అనీ.

మా బంధువుల్లో ఒకాయన వున్నాడు. ఆయన పనివేళ భార్యను సావిట్లోకి పిలిచి తాను వీధి కిటికీలో తలదూర్చి ఎదురుగా వున్న మేడమీద పచార్లు చేసే పెద్దమనిషిని చూపించి.

"ఆయన అంత బడాయి చూపిస్తాడు. మనకంటే ఏం ఎక్కువే?" అని ప్రశ్నించేవాడు. నిజానికి ఆవిడ మనస్సులో "ప్రపంచంలో ఎవరన్నా నీకంటే ఎక్కువే. ఇన్ని కుళ్ళుగుణాలు ఎవరిలో వుండవు?" అనాలనిపించేది.

కానీ బయటికి భార్య నిలబెట్ట వలసిన మర్యాద ప్రకారం "అబ్బే ఎందులో ఎక్కువ. ఊరికే అలా పిచ్చి తిరుగుడు తిరుగుతాడు" అనేది.

"ఇక్కడ కాదే రోడ్డుమీద కూడా అలాగే బడాయిగా నడుస్తాడు. పలుకరించినా సరిగ్గా మాట్లాడడు. ఏమిటో ఆ ఎక్కువ అర్ధంకాదు" అని ఆయన ప్రశ్న.

" ఆయన ఎక్కువేమిటి నా ముఖం? అయినా ఆయన్ని మీరు పలకరించడమేమిటీ? అంతగా అవసరమొస్తే ఆయనే పలకరిస్తాడు. మీరు ఈసారి కనిపిస్తే అసలు మాట్లాడకండి. మీరెక్కడ ఆయనెక్కడ? చట్టిముక్కూ వాడూనూ" అని ఆవిడ వ్యాఖ్యాత.

"వాడి ముఖం వాడెంత. మూడేళ్ళ క్రిందవరకూ యు.డీ.సి. ఇంకా సూపరింటెండుగా మూడేళ్ళు సర్వీస్ కాలేదు. ఇక అందులో నుంచి పైకి వెళ్ళే ఛాన్సు కూడా లేదు. అంత షోగ్గా తిరుగుతాడేం అప్పుచేసి కట్టిన ఆ మేడ మీద?" అని భర్త ప్రవచనం.

"అయినా మీరా కిటికీ తెరిచారెందుకు? మూసెయ్యండి. వాడు నాట్యం చేస్తే మాత్రం మనకేం కనపడుతుంది. అసలు నేనెప్పుడూ ఆ కిటికీ తియ్యను, రోత" అంటుందామె.

"నే మాత్రం తీస్తానా!? ఇవ్వాళ ఆదివారం గదా అని తీశా. తియ్యగానే వాడు కనిపించాడు. అయినా ఎప్పుడు తీసినా వీడే కనిపిస్తాడే పెళ్ళాం ఎప్పుడూ కనిపించదేం?" అని ఆయన ప్రశ్న. "ఏమో వాడు తిరుగుతున్నాడని బయటికి రాలేదేమో. లేకపోతే ఎప్పుడూ అక్కడే వుంటుంది. ఓ పట్టు చీరకట్టి, పిట్టగోడమీదకు వంగి లొట్టి పిట్టల్లే చూస్తూనే వుంటుంది వీడి వంక. అలా చూసి చూసి ఆమె మెడ అలా ఒంగిందనిపిస్తుంది" అంటుందావిడ.

ఇలా ఒకళ్ళని తక్కువ చెయ్యడం ద్వారా తమ ఎక్కువతనాన్ని నిలబెట్టుకోవాలి అని తాపత్రయపడుతూ వుంటారు కొందరు. మహనీయులు పెద్ద గీత దగ్గర దానికన్నా చిన్న గీత గీసి పెద్ద గీత పరువు నిలబెట్టినట్లు.

పోతే మన దేశంలో 'ఎక్కువ' జాబితాలోకి వచ్చేవి ఏమిటి? అని ప్రశ్న వేసుకుంటే తేలేవి చాలా వున్నాయి.

రాజకీయ కక్షలు, సమ్మెలు, సత్యాగ్రహాలు, రాళ్ళు విసరడాలు, నిప్పు అంటించడాలు, దొంగతనాలు, ధిక్కారాలు దౌర్జన్యాలు, అవినీతి చర్యలు, లంచగొండితనాలు, నగర నదీజలాల పంపిణీ తగాదాలు, సవాళ్ళు, పరవళ్ళు, పదవీ వ్యామోహాలు, పరపతీ వ్యామోహాలు, మైకుల గందరగోళాలు, శిలావిగ్రహాలు, నీలాపనిందలు, పెళ్ళీయాడు దాటిన వధువులు, "అప్పుడే ఏం పెళ్ళి" జపం చేసే ఈడు దాటిన వరుళ్ళు, మతి తప్పిన తండ్రులు, శ్రుతి తప్పిన దాంపత్యాలు మితిమీరిన అసత్యాలు.

బజారు ధరలు, వరదలు, తుఫానుగాలులు, ఇంటికి తెచ్చి ఇచ్చే ప్రభుత్వ ఋణాలు, లాటరీ పణాలు, వికృత గుణాలు, అశాంతి ఆరాటం, అనవసర పోరాటాలు, నీళ్ళు రాని పంపులు, ముసలితనపు వొంపులు, మంత్రివర్యుల క్యాంపులు, అసభ్యతకు సంబంధించిన ముంపులు, ఇలా ఎన్నెన్నో చెప్పవచ్చు.

పోతే 'తక్కువల' జాబితాలలో చేర్చదగినవి కూడా చాలా వున్నాయి. ఉదాహరణకు కొన్ని సూచిస్తాను. పెద్దల మాటలకు విలువలు అసలు మానవాత్మకు నెలలు, మంచితనం, సేవాభావం, గుట్టుసంసారాలు, గుండెల వీరులు, ధర్మవాక్కులు, సత్య ప్రచారాలు, భక్తి ప్రబోధనలో, దానధర్మాలు, వినయవిధేయతలు, పార్టీభక్తి, తోటివారిపై అనురక్తి, ఆధ్యాత్మిక శక్తి, యుగంధర యుక్తి, పాపవిముక్తి, నిస్వార్థం, నిండుతనం, మిత సంభాషణ, సంసార పోషణ, పుష్టి భోజనం, తుష్టి జీవనం, దాంపత్య రహస్యాలు, వ్రతాలు, క్రతువులు.

అయిదు రోజుల పెళ్ళిళ్ళు, ఆడవాళ్ళ కాళ్ళకు కడియాలు, ఎడంచేతి గాజులు, భర్తలపై మోజులు, చెక్కిట జాజులు, సంతానంపై వాత్సల్యం, వాకిట్లో రంగవల్లులు, ఇంట్లో మంగళహారతులు, జోలపాటలు, వంటింట్లో పొయ్యిలు, ఇత్తడి సామానులు, ఏడు గజాల చీరలు, ఇలా ఎన్నెన్నో తక్కువ జాబితాలలో సరిపోయాయి.

ఈ ఎక్కువ తక్కువల ప్రభావం తలుచుకుని ముక్కుమీద వ్రేలు వేసుకునేవారూ ఉన్నారు. చెక్కిట కెంపులు పూయించుకునే వారూ ఉన్నారు.

**(7 డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

వివేక భట్టాచార్యగారు "స్వర్గం నుంచి ప్రత్యేక వార్త" అనే వ్యాసం వ్రాశారు. అందులో ఒక పత్రికా విలేఖరి స్వర్గానికి వెళ్ళినట్లు - అక్కడ తనను సారస్వతమూర్తులున్నచోట ఉంచమని కోరినట్లు వ్రాశారు. తర్వాత పత్రికా విలేఖరి కొన్ని విషయాలు సేకరించాడు. 'రవీంద్ర సంగీతం' నారదమునిచేత ప్రాక్టీస్ చేయిస్తున్నారట. ఒక సంవత్సరంలో ఆయన ఉత్తీర్ణుడైతే రవీంద్ర సంగీత శాఖాధ్యక్షునిగా అక్కడ నియమించేందుకు హామీ యిచ్చారట. నారదుడు దానికోసమై తంటాలు పడుతున్నాడుట.

కొద్దికాలం క్రిందనే అక్కడ ప్రాక్పశ్చిమ దేశాలకు చెందిన హిందూ, ముస్లిమ్, సిక్కు, క్రిష్టియన్, యూదు వేదాంత ప్రముఖులు సమావేశమై 'రవీంద్రుని గీతాలలో అన్ని మతాల సారం వుంది గనుక వీటిలో ఏ 'యిజం' యొక్క ప్రస్తావనా లేదు గనుక ఈ సంగీతాన్నే స్వర్గలోకంలో ఆస్థాన సంగీతంగా అంగీకరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారట.

అందువల్ల నారద మహామునిని తాత్కాలిక ఆస్థాన గాయకునిగా నియమించారు. ఆయన తన పదవిని ఖాయపరుస్తారో, లేదోనని కంగారు పడుతున్నాడట. టంగులు తెగేటట్లు రవీంద్ర సంగీతం ప్రాక్టీసు చేస్తున్నాడట.

పత్రికా విలేఖరి తర్వాత రవీంద్రుల్ని కలుసుకున్నాడట. ఆయన "నువ్వు పత్రికా విలేఖరివా?" అని ప్రశ్నించారట.

"విలేఖరినేకాదు. ఇంగ్లీషు, బెంగాలీ, ఉరుదు, హిందీ భాషల్లో పుస్తకాలు కూడా వ్రాశాను" అన్నాడుట విలేఖరి.

"అది సరేగానీ, నువ్వు నా పుస్తకాలను గురించి విమర్శ రాసేముందు వాటి నెప్పుడైనా చదివావా?" అని గురుదేవులు ప్రశ్నించారట. పత్రికా విలేఖరి వెంటనే జవాబు చెప్పలేకపోయాడట. కారణం? తనేమీ చదవలేదని అతని మనస్సులో అతడు చెప్పుకుని తలవంచుకున్నాడట. తర్వాత గురుదేవులు పత్రికా విలేఖరికి పచ్చి ద్రాక్ష కొన్ని తీగలనుంచి త్రుంచి ఇచ్చారట. అక్కడ కూడా తమ కవితా వైదుష్యానికి తగిన ఠీవి ప్రకటిస్తున్నారట.

పత్రికా విలేకరి అక్కడ ఇంకో విచిత్రమైన విషయం కనిపెట్టాడట. అక్కడ వున్న సాహిత్యవేత్తలందరూ సదస్సులు జరుపుతున్నారట. వారిలో ఇటీవలి తరాలవారు కొందరు "మీ రచనలు చాలా పాతపడిపోయాయి. వాటిని పరిష్కరించి ఈ కాలానికి తగినట్లుగా చెయ్యాలి" అని ఒక తీర్మానం పెట్టారట.

ప్రాచీనులు దాన్ని అంగీకరించారట ఏకగ్రీవంగా. భూలోకానికి తమ ప్రతినిధులను పంపి అలా చేయడమే అక్కడే వాటిని తాము పరిష్కరించి నూతన ప్రతులు భూలోకానికి పంపడమా! అనేదింకా తేలలేదట.

పత్రికా విలేఖరికి రవీంద్రులు చాణుక్యుని పరిచయం చేశారట. అక్కడ అనేకమంది సంస్కృత పండితులు పధ్నాలుగో శతాబ్దం నుంచి ఇరవయ్యో శతాబ్దం వరకూ, చెందిన వారున్నారు. వీరిలో చాలామంది జర్మనీ, తిరుపతి, బాత్‌పురాలకు చెందిన ఉద్దండులున్నారుట.

పత్రికా ప్రతినిధి చాణుక్యుని దర్శించాడట. ఆయన మాత్రం తొణక్కుండా అలాగే నిలబడి వున్నాడట. విలేఖరి చెప్పాడట. "అయ్యా! విద్య జీవితంలో ఎక్కువ ఉపయోగం లేకుండా పోయింది. మీరు విద్యావంతుణ్ణి చక్రవర్తికి మించిన స్థానంలో ఉంచారు. కానీ ఈరోజుల్లో చక్రవర్తి కాదుగదా! సర్వసామాన్యమైన ఒక కమిటీ సభ్యుని ముందు కూడా విద్యావంతుడు నిలబడలేకపోతున్నాడంటే మీరు కోప్పడవద్దు. ఇప్పుడు ప్రజలు జీవించేది విద్యతో కాదు. వట్టి చాకచక్యంతో, పొగడ్తలతో వీటివల్లనే విజయాలు సంపాదిస్తున్నారు. అఖండ కీర్తి గడిస్తున్నారు. అందరిచేత 'ఆహా' అనిపించుకుంటున్నారు."

"చాణుక్య మహాశయా! వింటున్నారా? కనుక మీరు దయవుంచి "విద్యాత్వమ్నప్పదంచా" అనే వాక్యాన్ని మీ శ్లోకంలోనుంచి కొట్టి వేసుకోవడం మంచిది. లోకం మారినా పాత శ్లోకాలు అలా పెట్టుకు కూర్చుంటే వచ్చే లాభమేమిటి?"

ఇది విని చాణుక్యుడు జావకారిపోయాడట. ఎంతవాడైతే మాత్రం ఏం చేస్తాడు. ఆ కాలంలో పూజింపబడ్డాడు. మహారాజుల్ని కూడా చదరంగంలో పావుల్లాగా కదిలించి, ఆట ఆడాడు. కాలం మారిందని చెపితే కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు తప్ప ఏం చెప్పగలడు? పత్రికా విలేకరి చాణుక్యుణ్ణి హడలగొట్టి వేశాడు.

విలేఖరి అక్కడనుంచి మెల్లగా మారి కొంతముందుకు సాగాడట. అక్కడొక పండితోత్తముడు కనిపించాడు. విలేఖరి ఎరుగున్న ముఖంలాగా కనిపించింది.

కొంచెం ఆలోచించి "ఆయన బాలాంతిక పదకోశకర్త రాజశేఖర్ బోస్ కాడూ. ఆయన్ని 'పరుశురామ్' అనికూడా అంటారు?" అని ప్రశ్నించాడట. అక్కడ ఉన్నవారు "అవును ఆయనే" అన్నారట. "అలాగే ఇక్కడున్నారా వారు? ఒక్కసారి పలకరించి వస్తాను. అలాంటి మహనీయుణ్ణి చూసి కూడా అవతలకు ఎలాపోను?" అన్నాడు విలేఖరి.

"వెళ్ళండి ఫర్వాలేదు. ఇది పదకోశకర్తల శాఖ. వీరందరినీ మేము పేర్లు పెట్టి పిలవడం ఆచారం లేదు. వారు సృష్టించిన పదకోశాల పేర్లతోనే వ్యవహరిస్తూ ఉంటారు. ఉదాహరణకు ఆక్సుఫర్డు, కేంబ్రిడ్జి. అదుగో ఆ ప్రక్క కనిపించేది - వెబ్‌స్టర్" అన్నాడు అక్కడగల ప్రతినిధి.

"ఏమిటి వీరంతా ఏదో కార్యక్రమంలో మునిగివున్నట్లున్నారు. ఇంతపేరు సంపాదించుకుని, హాయిగా ఇక్కడ చేరారుగదా! ఇంకా ఏమిటి వీరింత దీర్ఘాలోచనలో వున్నారు?" అని విలేఖరి ప్రశ్నించాడు.

"వారు తమ తమ పదకోశాల్ని పరిష్కరించుకుంటున్నారు" అని చెప్పాడు ప్రతినిధి.

"పదకోశాల్ని పరిష్కరించడమా? ఇదేం రాజ్యాంగ చట్టమా? విదేశాంగ నీతా?" అని విలేఖరి విస్తుపోయడట కొంతసేపు.

ఇంతలోనే ప్రక్కనున్న స్వర్గ సాహిత్య ప్రతినిధి పత్రికా విలేఖరిని 'ఛాంబర్సు' వద్దకు తీసుకుపోయి "ఇలా చూడండి. ఈ పెద్దమనిషి భూలోకంనుంచి ఇప్పుడే వచ్చాడు. పదకోశానికి సంబంధించిన సలహాలేమైనా వుంటే మీరు అడిగితెలుసుకోవచ్చు. తాజా సలహాలివ్వగలడు" అని పరిచయం చేశాడు.

ఛాంబర్సు విలేఖరి వంకకు తిరిగి "మహాశయా కొంచెం సలహా చెప్పండి. న్యాయం, ధర్మం, సత్ప్రవర్తన, నీతి, కరుణ ప్రేమ, అనురాగం, గౌరవం, నైతిక విలువలు, సచ్ఛీలం, సమర్థత. ఈ మాటలవల్ల భూలోకంలో ఏమైనా ప్రయోజనం వున్నదా? వీటికి నేను

పేర్కొన్న అర్థాలింకా అమలులో వున్నాయా? ఇవన్నీ నిష్ప్రయోజనమై పనికిరాని పదాల క్రిందపడివున్నాయని విన్నాను. నిజమేనా?" అని ప్రశ్నించాడట.

పత్రికా విలేఖరి ఏం జవాబు చెప్పాలో తోచక అలాగే నిలబడిపోయాడుట. ఇంతలో "గ్రంథం సైజు తగ్గిస్తే ఎవరు కొంటారండీ?" అనే గొంతు వినిపించింది. ఎవరాయన అని ప్రశ్నిస్తే "పబ్లిషర్" అని అక్కడవాళ్ళు చెప్పారట.

తర్వాత పత్రికా విలేఖరి షేక్సుపియర్‌ను కలుసుకున్నాడు. ఆయనతో ఇలా చెప్పాడట. "మీరు మీ రచనలను ఎన్ని విధాలుగానన్నామార్చండి. కానీ ఒక్క వాక్యం మాత్రం మార్చవద్దు. దానికి ఎన్నోవేల పౌనుల విలువ వుంది. కాపిటలిజం, సోషలిజం, హ్యూమనిజం ఏదైనా రానివ్వండి, 'యిజం'లు లేనిచోట కానివ్వండి. ఢిల్లీ, పెకింగ్, లండన్, వాషింగ్‌టన్, మాస్కో ఎక్కడైనా కానివ్వండి చలామణి అయ్యే ఆ వాక్యాన్ని మాత్రం మీరు మార్చకండి" అని విలేకరి కోరాడు.

"మీకు జ్ఞాపకం వుంటే ఆ వాక్యమేమిటో చెపుతారా?" అని షేక్సుపియర్ అడిగాడు. "రేషన్, కంట్రోలు, ఇన్‌ఫ్లేషన్‌ల కాలంలో ఆ వాక్యాన్ని ఎవరు మరిచిపోతారు స్వామీ? "మతిభ్రష్టులు విందులు చేస్తారు. ధీమంతులు ఆరగిస్తారు" అని వ్రాశారు. మీకే జ్ఞాపకం లేదూ?" అన్నాడట విలేఖరి. ఆ మహారచయిత తనలో తాను నవ్వుకున్నాడట.

**(8 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**దేశంలో** సినిమా ప్రేక్షక సంఘాలు చాలా వెలసినాయి. సినిమా ఈనాటికి ఒక చక్కని వినోద కాలక్షేపంగా మారింది. ప్రేక్షకుల సంఖ్య పెరుగుతున్నది క్రమక్రమంగా. వెండితెర మీద అభిమానం పెరుగుతోంది మెల్లమెల్లగా.

అనేక చిత్రాలు శతదినోత్సవాలు జరుపుకుంటున్నాయి. ఇదంతా ప్రేక్షకుల అభిమానం వల్లనేన్నని అందరూ ప్రశంసించడం వింటున్నాం.

ఈ కాల పరిణామాన్నిబట్టి కొందరికి సినిమా అవసరమైన కాలక్షేపంగా మారింది. సినిమ వ్యామోహం అనే స్థితినుంచి 'అవసరం' అనే భావాన్ని కల్పిస్తున్నాయి ఈనాటి కల్లోల పరిస్థితులు. అంతులేని ధరలు, ధర్మనిగ్రహత లేనివారి సాంగత్యాలు వగైరాలు.

ఈ అస్తవ్యస్త స్థితుల్లో చిక్కుకొని ఈ వినోదానికి కారణభూతులైన తారాగణాన్ని ఒక్కసారి చూడాలి అనుకోనివాళ్ళు చాలా అరుదు. "ఎలా చూడడం?" అనే దిగులు ఏర్పడుతుంది అందరిలో.

ఒకసారి ఒక శతదినోత్సవ సభకు వచ్చిన ఆహ్వానాన్ని మరో సినిమా అభిమానికి యిచ్చాను వంట్లో బాగుండక పోవడం వల్ల. ఆయన ఎంతో సంతోషంతో తీసుకువెళ్ళాడు.

మర్నాడు పదిహేను రూపాయలు పెట్టి ఒక ఖద్దరు శాలువా తెచ్చి నాకు కప్పాడు. "ఇదేంటండి నాకెందుకు?" అంటే ఆయన ఉద్రిక్తకంటంతో ఇలా అన్నాడు. "మీరు చేసిన మహాత్యాగానికి ఇది ఒక లెక్కా? ఈ కాలంలో శతజయంత్యుత్సవ ఆహ్వానపత్రం అలా అడగ్గానే ఇచ్చేసే వదాన్యులు, విశాల హృదయులు ఎవరుంటారు? అక్కడ ఆ కళాకారులకు సన్మానాలు జరిపి శాలువలు కప్పుతుంటే ఆ అద్భుత దృశ్యాన్ని చూసి ఆనందించే భాగ్యం కల్పించిన మీరే నాకు పదే పదే జ్ఞాపకం వచ్చారు. అలాంటి అపూర్వానుభవాన్ని ఆయాచితంగా నాకు ప్రసాదించిన త్యాగమూర్తులు మీరు. నా యీ చిన్న కానుక స్వీకరించండి. లేకపోతే నేనెంతో బాధపడతాను" అంటూ అతడు మాట్లాడాడు.

"ఆహ్వానాన్ని శాలువకు అమ్ముకున్నామా?" అన్నాను ఎంతో విసుగ్గా.

"అమ్ముకోవడం కాదండీ నా అభిమానాన్ని మీరు అర్థం చేసుకోవడంలేదు. ఆ తారలను చూడాలనే ఆపేక్ష నాకెంతో వుంది. కానీ అలాంటి అవకాశం నాకింతవరకు రాలేదు. మీ మూలంగా లభించింది. ఆ ఆనందాన్ని ప్రకటించుకునేందుకే శాలువా తెచ్చాను" అన్నాడాయన.

నేను వ్రాసిన ఒక చిత్రం శతదినోత్సవం జరిగింది. నేనూ ఆ సభలో పాల్గొని ఆనందించాను. బహుమతి అందుకున్నాను. కానీ ఆ ప్రేక్షకులు ప్రదర్శించే బులబాటం తలిస్తే ఆనాడు నేను పొందిన ఆనందాన్ని మించి వుంది.

ప్రేక్షక లోకానికి ఉండే ఉత్సాహం ఆనందం వర్ణించడానికి వీలులేదు. ఈ దృష్టితో ఆలోచిస్తే అది ఫిలిం లోకానికి చెందినవారు చేసుకున్న అదృష్టమనిపిస్తుంది. లేకపోతే అశేష ప్రజానీకం వారిని చూడాలని అలా తాపత్రయపడడం, తన్మయం చెందడం దేనికి?

ప్రజాహృదయాలలో వారికి అంతస్థానం వుంది గనుకనే వారిని ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనిపించడం చూసి ఎంతో సంతృప్తి చెందడం జరుగుతోంది.

దేశంలో పరిస్థితులు తారుమారకగా వున్నాయి. ప్రజాజీవనంలో తందరబిందరేగానీ స్థిమితం కనిపించడంలేదు. ఇంత అశాంతిలో కొంచెం మనశ్శాంతి కలిపించుకోవాలంటే ఫిలిముల దృష్ట్యానే కొంచెం ఏర్పడుతుందేమోననిపిస్తుంది.

"తప్పో - ఒప్పో, మంచో చెడ్డో, నీతో, అవినీతో మూడు గంటలకాలం ముచ్చటగా గడిపి చక్కా వస్తున్నాం. వాటిల్లో వున్న దోషాలను గురించి విచారించవలసిందీ, విచారపడవలసిందీ మనం కాదు. పైనున్నారుగా పెద్దలు" అన్నాడొకాయన.

"వరుసగా పాతికేళ్ళు పురాణానికెళ్ళాను. అక్కడ చెప్పిన ధర్మాలన్నీ విన్నాను. మనస్సుకు పట్టించుకున్నాను. సంసారాల్లో పురుషుడెలా ఉండాలో, స్త్రీలెలా ఉండాలో అన్నీ గ్రహించుకున్నాను."

"అవన్నీ సంతానానికి బోధించి అలా తయారుచేయాలనుకున్నాను. కానీ ఎవరు వింటున్నారు? పాతకాలపు మాట బూతును మించిపోయింది. సీతమ్మలాగా, అనసూయలాగా, అరుంధతిలాగా వుండాలని కోరేవారెవరున్నారీకాలంలో? అరుంధతి పేరు ఎప్పుడయినా మా ఆడపిల్లల దగ్గిర ఎత్తితే 'నీ రంధి నువ్వు మానవు' అని విసుక్కుంటున్నారు. "

మగపిల్లలు మాత్రం తక్కువా! వాళ్ళెన్నో నీతులు నేర్చారు. వాళ్ళకు ఇంటికి రావడమే కష్టంగా వుంది. ఎవరెలా వున్నా కాలూ, చెయ్యీ వున్నంతవరకూ కన్నసంతానాన్నికింత సేవ చేసుకోవాలనిపిస్తోంది గదా! మొగపిల్లలు ఇంటికి వచ్చినప్పటి నుంచీ పడితే యోగాభ్యాసం లేకపోతే పిచ్చి రాగాలాపన.

"ఏవో పాటలు.. మధ్యమధ్యలో ఈలలు. బల్లలు బ్రద్దలు కొట్టడం ఆ గొట్టం లాగూలలో పీట మీద కూర్చోలేక కంచం చేత్తో పట్టుకుని నాలుగు ముద్దలు తినడం, కూర బాగుండలేదనడం, చారు దొడ్లో పారబొయ్యమనడం - చల్లవంక చూసి కళ్ళు మూసుకుని ఎడం చెయ్యి అడ్డం పెట్టడం, ఆ కంచాన్ని విష్ణుచక్రంలా గిరాటు వేసిపోవడం నిత్యకృత్యమైపోయింది. "

"అమ్మా! అని స్థితి అన్నమడుగని నోరున్.." అన్నాడు సుమతీ శతక కర్త. ఆ శతకంలో పద్యాలు చాలా మార్చివేయాలీ రోజుల్లో. బాబూ అన్నం పెట్టరా! అమ్మాయి అన్నం పెట్టవే అని అరవలేక నాలుక అరవ అప్పడం కన్నా సన్నపడిపోయింది.

ఇలాంటి కాలంలో పాతకాలపు ఆశలు పెట్టుకుని ఏం లాభం? అజంతా బొమ్మలాగా వంటింటి గోడకు అతుక్కుపోయి ఏం లాభం? అందుకని నేనూ రెండురోజులకోసారి సినిమాకు పోతున్నా. ఒక మూడు గంటల కాలక్షేపం.

"ఎలాంటి సినిమా అన్నా కొంత బాగుంటుంది కదా! రెండు పాటలైనా బాగుంటాయి కదా. ఏ కథ అయినా ఇంట్లో కథంత గందరగోళంగా ఉండదు కదా?" అని ఒక ముసలమ్మ తన వ్యథను ఆత్మకథలో ఒక అధ్యాయంలాగా వర్ణించింది.

ఈ దృష్టిలో ఆలోచిస్తే ఫిలిం ప్రేక్షకుల అభిమానాలు అసహజంగా కనిపించవు. గృహిణులుకూడా చాలామంది సినిమా డబ్బులిలా చేతిలో పడేసి తర్వాత మీ చిలిపితనం చూపించండి అంటున్నారు భర్తలను.

ఏ విధంగా ఆలోచించినా ఈ కాలంలో ఫిలిములు కొంత కాలక్షేపంగా వినియోగపడుతున్నాయి. కల్లోలంలోనుంచి చల్లటి నీడకు వెడుతున్నట్లు భావిస్తున్నారు ప్రజలు. అలాంటి శాంతిని ప్రసాదించే నటీనటులంటే అభిమానం ఎక్కువ కావడంలో ఆశ్చర్యం ఏం వుంటుంది?

సినిమా పాటలు విన్నా, నటీనటుల్ని చూసినా పకపకలాడటం, ఉత్సాహం ప్రకటించడం చూస్తున్నాం.

నటీనటులు - వారికి తీరిక వుండకపోవచ్చు. ఇలాంటి సన్మాన సందర్భాల్లోనే కాకుండా అప్పుడప్పుడు దేశంలో సంచారం చేయడం మొన్న శ్రీరామారావుగారు చెప్పినట్లు ప్రజాసేవలో పాల్గొనడం మంచిదనిపిస్తుంది.

పైన చెప్పిన సన్మాన సందర్భాలలో ప్రజలు పొందిన ఆనందాన్ని, వారు వెలిబుచ్చిన భావాల్నీ ఈసారి వ్రాస్తాను.

### (9 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఇటీవల** దేశంలో అంతరాతం ఆత్మగా మేల్కొంటోంది. ఈ అంతరాత్మ అనుకోకుండా రాజకీయాల్లోకి కూడా ప్రవేశించింది.

ఈ అంతరాత్మ పునర్జన్మ రాష్ట్రపతి ఎన్నికల సమయంలో మేల్కొల్పింది ప్రధాని ఇందిరాగాంధి. హఠాత్తుగా మేల్కొన్న ఈ అంతరాత్మ అనతి కాలంలో అఖండ విజయం సంపాదించ కలిగింది. "అమ్మా! అంతరాత్మా! నీకెంత శక్తివుంది?" అని దేశం విస్తుపోయింది.

ఇంకేం వుంది ప్రతి వ్యక్తి అంతరాత్మను మేల్కొల్పడం ప్రారంభించాడు. అంతిమ విజయం తధ్యమనే విశ్వాసంతో ప్రతివారు అంతరాత్మద్వారా కొన్ని ప్రయోగాలు సాధించడానికి ఉపక్రమించారు.

ఇందులో విచిత్రమేమిటంటే 'ఇంట గెలిచి రచ్చ గెలవమని శాస్త్రం వుంది గనుక చాలామంది ముందుగా ఈ నూతన అస్త్రాన్ని ఇళ్ళల్లో ప్రయోగించడం ప్రారంభించారు.

ఒక గృహస్థు భార్యను తెల్లవారు ఝామున లేపి "ఇవ్వాళ ఉదయం తొమ్మిదింటి కల్లా ఆవడలు తినాలి. లేచి మినప్పప్పు నానబొయ్యి" అన్నాడట.

"ఇదేమిటండీ రాత్రి నిద్రపోయేముందు పెసరట్టు తినాలని వుందని చెప్పారుగా! ఇంతట్లో ఈ మార్పేమిటండి?" అన్నదిట భార్య కళ్ళు నులుపుకుంటూ.

"అదంతా నాకు తెలియదు అంతరాత్మ తెల్లవారు ఝామున మూడున్నర ఆ ప్రాంతాల్లో నిద్రలేపింది. 'మాధవరావు? నువ్వు రేపు ఉదయం తొమ్మిదింటికి ఆవడలు ఫలహారం చెయ్యి. ఎంతో హాయిగా వుంటుంది అని చెప్పింది.' నేను దిగ్గునలేచి కూర్చున్నాను. నేను అంతరాత్మ నడిగాను. నేనప్పటి వరకూ వేరే ఫలహారం అనుకుంటున్నానే. ఇంతలో మార్పడం?"

"నీ మనస్సు అనుకుంటే అనుకోవచ్చు. దానికింత మధనపడతావెందుకు మాధవరావు? నేను ఆజ్ఞాపించిన తర్వాత, అన్ని ధర్మాలు వదిలి నేను చెప్పినట్లు చెయ్యవలసిందే అన్నది."

నేను బిక్కముఖం వేసి "మినప్పప్పు నానుతుందంటారా అన్నాను. "మినప్పప్పేమిటి? ఇనపగుగ్గిళ్ళు కూడా నానతాయి. అది నా ప్రభావం నువ్వు సంశయాలు పెట్టుకోవద్దు. సభ్యత ఆలోచించవద్దు. వెంటనే నే చెప్పినట్లు చెయ్యి. అంతిమ విజయం నీదే అన్నది. " అని ఆయన భార్యతో చెప్పాడు.

"అసలు మామూలుగానే చచ్చిపోతున్నాం. ఇందులో ఈ అంతరాత్మ గొడవ ఒకటి వచ్చి పడింది. ఇక ఎన్ని అవస్థలు పడాలో? " అని ఆమె లేచి వెళ్ళి మినప్పప్పు నానబోసిందిట.

ఉదయం తొమ్మిది గంటలకు భర్త కోరిన ప్రకారం ఆవడలు ఫలహారం చేసి భార్యను ఎంతో కొనియాడాడుట. "ఇకనుంచీ ప్రతీ ఆదివారం ఉదయం ఆవడలే చెయ్యి అన్నపూర్ణా అంతరాత్మచేత మాటిమాటికీ చెప్పించుకోవడం అంత బాగుండదు" అని ఆయన మిత్రుడింటికి వెళ్ళాడుట.

తిరిగి తిరిగి మధ్యాహ్నం వంటి గంటకు ఇంటికి చేరాడుట. భార్య పొయ్యిమీద అత్తెసరన్నా వడవెయ్యకుండా హాయిగా పడుకుని నిద్రపోతోందిట. మాధవరావు ఉలిక్కిపడి ఆవిణ్ణి లేపి "ఏమిటి ఇలా పడుకున్నావు? వంట చెయ్యలేదా?" అన్నాడుట.

"లేదు" అని ఆవిడ మరో వైపు తిరిగి పడుకొందిట.

మాధవరావు తనుకూడా అటువైపు వెళ్ళి "ఏమిటి? వంటిగంట అయింది. ఇంకా వంట ఎందుకు చెయ్యలా? అని ప్రశ్నించాడుట.

"ఆదివారంనాడు ఆవడలు తిని హాయిగా నిద్రపోండి. అన్నం మాట తలపెట్టకండి. అరక్క అవస్థపడతారు. రాత్రి కొంచెం వండుకు తినండి. ఆరోగ్య సూత్రాలు పాటించండి అని మీరు అలా వెళ్ళగానే అంతరాత్మ నన్ను పిలిచి గట్టిగా చెప్పిపోయిందండీ. 'అక్కడికి ఆయన వూరుకొంటారా?' అన్నాను. 'భయపడకు అంతిమ విజయం నీదే అని చెప్పిందండీ'" అని మళ్ళీ ముసుగు పెట్టుకొందిట. ఆ అరుణాదేవి ఇలా ఏదో ఒక సూచన చేసి చక్కా పోవడంకాదు. కొందరికి ప్రతి విషయంలోనూ సలహాలిస్తోందిట అంతరాత్మ. ఆ కారణం వల్ల వారు అంతరాత్మ సూచించిన మార్గంలోనే నడవడం ఏర్పాటు చేసుకుంటున్నారుట.

కొందరు అంతరాత్మ చెపితే సూచనలన్నీ జ్ఞాపకం ఉంచుకొలేక రికార్డు చేసుకుని వుంచుకోవడం జరుగుతూ ఉండవచ్చు. ఉండవచ్చునేమిటి? మొన్న ఒక పత్రికలో కార్టూను చూశాను. ఆ పెద్దమనిషి కాంగ్రెసు దుస్తులు ధరించి అన్నాడు.

నోట్లోకి ఒక గొట్టం పోనిచ్చి దాన్ని టేప్‌రికార్డుకు కనెక్టు చేసి కూర్చున్నాడు. ఇంతలో ఆయనకోసం ఎవరో వచ్చారు. భార్య వాకిట్లోకి వెళ్ళి "మావారు ప్రస్తుతం బయటికి వచ్చి మాట్లాడడానికి వీల్లేదు. ఆయన అంతరాత్మ చెప్పే విషయాలు టేప్ రికార్డు చేస్తున్నారు. మీరు మరోసారి వచ్చి కలుసుకోండి" అని చెపుతోంది.

మొన్న ఒకావిడ అంతరాత్మ విషయం వచ్చి ఇలా అంటోంది. "ఎంత అంతరాత్మ అయితే మాత్రం అలా సంచరించడానికి ఎలా వీలవుతుంది? మగవాళ్ళయితే అలాగే చెప్పుకోవచ్చు అది చెప్పినట్లు చెయ్యనూవచ్చు. ఆడవాళ్ళకు అది ఎలా సాధ్యమవుతుంది? "

"మాటవరుసకు చెపుతాను. ఆ గది నడివీధిని బడిపోతూ ఇంటిమాట మరిచిపోతే ఎలా కుదురుతుంది? అలా తిరుగుతున్నావేమిటి? సంసారం వదిలి, సంతానాన్నీ, పతినీ వదిలి" అని ఎవరన్నా ప్రశ్నిస్తే "నన్నేం చెయ్యమంటారు? అంతరాత్మ తిరగమంది నేను తిరుగుతున్నాను" అంటుందనుకోండి.

"అక్కడితో వదిలి వూరుకుంటారా? అంతరాత్మ మీద అభిమానం వుంటే వుండొచ్చుగాని ఆడదానిమీద ఉంటుందా? భర్త అనే మహావీరుడు పరుగెత్తుకు వచ్చి నాలుగు బాది ఇంటికి తీసుకుపోతాడు.

లేదా వూళ్ళో నలుగురూ ఏకమై ఫలానా లీలావతికి పిచ్చి పట్టిందని యాగీ చేస్తారు. "అంతరాత్మ" వుంటే మాత్రం వినిపించుకునేదెవరు? విలవ గ్రహించేదెవరు? అన్నదామె.

ఏది ఏమైనా అంతరాత్మకు చాలాపని తగిలింది కాలంలో. అంతరాత్మకు దోహదం చేసే శక్తులం వెనుక ఏమన్నా వుంటే ఉండవచ్చు. కానీ పేరుమాత్రం దానికే వస్తోంది. దేశంలో చాలామంది నిజానికి "అంతరాంత్మ"ను "ట్రేడ్‌మార్కు"గా వుపయోగించుకొంటున్నారు అంతిమ విజయం మాట ఎలావున్నా పంతంతో కొంత విజయం సంపాదించ కలుగుతున్నారు.

ఆత్మ, అంతరాత్మకూ మనవాళ్ళు వేదాంతంలో చాలా ప్రముఖమైన స్థానమిచ్చారు. ఈ రెండిటికీ పరమాత్మకూ దగ్గర సంబంధం వున్నదన్నారు. ఆత్మసాక్షికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు.

కాకపోతే ఆత్మ మంచి ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పుతుంది - గంభీర భావనతోననే అభిప్రాయం మార్చుకోవచ్చు. చిలిపి ప్రశ్నలు వేసుకున్నవారికి చిలిపి జవాబులు, స్వార్థం ప్రశ్నించుకున్నవారికి చిలిపి జవాబులు, స్వార్థం ప్రశ్నించుకున్నవారికి అందుకు సరిపోయే జవాబులు కూడా చెపుతుందనే సత్యం ఒకటి ఇప్పుడు బయట పడింది.

"మట్టికుండలోన మాణిక్యమున్నట్లు
వూపునందు దాని పొసగినట్లు
తమవునంటి యాత్మ తళతళలే విరజిమ్ము
నిక్కనురసి దావు వక్కణించె"

- అని శ్రీ ఎలమంచలి వెంకటేశ్వరరావుగారు 'హృదయ వాణి' అనే గ్రంథంలో వ్రాశారు. ఈ ఆత్మకు ప్రస్తుతం అమలులో వున్న 'అంతరాత్మకు' గల సంబంధమేమిటో విజ్ఞులు విచారించాలి.

(12' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**అప్పిచ్చేవాడు,** వైద్యుడు ఎండిపోని జలాశయం, ద్విజుడు - ఈ వసతులు గల గ్రామంలో వుండమన్నాడు సుమతీ శతక కర్త.

ఈ కాలానికి సంబంధించిన అర్థంతో పరిశీలిస్తే పైన చెప్పిన ద్విజుడు అన్న వాక్యానికి రాజకీయవేత్త అని చెప్పుకోవచ్చు. మరి వారికి రెండు జన్మలుంటాయి ఏ కులానికి చెందిన వ్యక్తి అయినా రాజకీయవేత్తగా మారడమే మరో జన్మగా భావివించబడవచ్చు.

అలాటి రాజకీయ వేత్త గ్రామంలో లేకపోతే పనులు కావడం కష్టం. ఆయన శాసన సభ్యుడో, శాసనమండలి సభ్యుడో, యింకా అదృష్టం బాగుండి లోక్‌సభ సభ్యుడో అయితే మరీ మంచిది.

తమ గ్రామాన్ని తాను బాగుచేసుకోవడం కోసం ఆయన తగిన శ్రద్ధవహించి, ప్రభుత్వ కార్యాలయాలలో వున్న ఎర్రబద్దలను కత్తిరించి ఎలాగో అలా తన గ్రామానికి అవసరమైన సౌకర్యాలు కొన్ని కల్పించుకోగలుగుతాడు.

కనుక ఈనాడు సుమతీ శతకర్త చేసిన సూచనల్లో ముఖ్య సూచిక ఒకటి నెరవేరిందనే చెప్పాలి. పోతే గ్రామంలో ఎక్కువమంది ద్విజులుంటే లాభమో నష్టమో ఆయన తెలియచెయ్యలేదు.

జలాశయాల విషయం. ఆ ద్విజులు ఏర్పడిన తర్వాత జలాశయాల విషయం ఎక్కువగా ఆలోచించవలసిన అవసరంలేదు. వారు తలుచుకుంటే భగీరథిని తెచ్చి చూరు చుట్టూ ప్రవహింపచేయగలరు.

అన్ని గ్రామాలలో చెరువులు, నూతులు, బోరింగ్ పంపులు ఏర్పడుతున్నాయి. ఈ కార్యక్రమానికి అవసరమైన సహాయంతో లభిస్తోంది. ఎక్కడ ఒక మంచినీళ్ళ బావి త్రవ్వినా ఒక మంత్రి మహాశయుడు వచ్చి ఆ మహత్కార్యాన్ని అభినందించి, ప్రారంభోత్సవం చేసి సంతృప్తి చెందుతున్నాడు.

పూర్వకాలంలో వలె గాక ఈనాడు దాళ్వా పంటలు, చెరుకు పంటలు వగైరాలకుగాను కాల్వలు వేసవిలో కూడా వదులుతున్నారు. పొలాలు పండినా, పండకపోయినా కాలువల్ని మాత్రం ఎండనీయడం లేదెంతమాత్రం. కనుక యిప్పుడు ఎడతెగ బారుయేరులు ప్రతి గ్రామంలో ఏర్పడినాయనే చెప్పాలి.

సుమతీ శతకకర్త చెప్పిన జాబితాలో వైద్యుని మాట ఒకటి వుంది. ఈనాడు చాలా గ్రామాలలో ఆస్పత్రులు వెలుస్తున్నాయి. రోగాలకి ప్రముఖ కేంద్రాలైన పట్టణాల్ని, నగరాల్ని వదిలి వెళ్ళడానికి డాక్టర్లు జాలివెలిబుచ్చుతున్న గ్రామాలలో కూడా డాక్టర్లను నిత్య ప్రత్యక్షం చెయ్యాలనే కృషి జరుగుతోంది.

అదిగాక ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం వల్ల దరిదాపుల్లో పట్టణాలలో గల ఆస్పత్రులకు అనతికాలంలో చేరే అవకాశాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. కనుక ఏదో విధంగా గ్రామాలకు వైద్య సౌకర్యాలు ఉన్నాయనే చెప్పాలి. మారుమూల గ్రామాలక్కూడా డాక్టర్లను పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నందువల్ల వైద్య సమస్య పరిష్కారమవుతున్నదనే చెప్పాలి.

గ్రామాలకు వైద్య సౌకర్యాల విషయంలో ప్రసంగిస్తూ ఒక పెద్దమనిషి అన్నారు. "ఈ విషయంలో ఎక్కువగా చింతపడక్కరలేదు. రోగాలు గ్రామాలకు వాటంతటవే ప్రాకుతున్నాయి గనుక వాటి వెంట డాక్టర్లు పరుగులు తీసే అవకాశాలు ఏర్పడి తీరుతాయి" అన్నారు.

పోతే ఇక అప్పిచ్చువాడు అనే విషయం మిగిలింది. పూర్వం రైతుల ఋణాల బాధలో చిక్కుకుపోయారని వాళ్ళను ఆ ఒత్తిడిలో నుంచి, ధనికవర్గం పిడికిలిలో నుంచి తప్పించాలని నినాదాలు వినిపిస్తూ వుండేవి.

ఇక ప్రజాస్వామాన్యం విషయంలోకి వస్తే అప్పు ఇవ్వాలంటే ప్రాణాలు ఒప్పేవి కాదు. ధనికులకు, వడ్డీ మురిపాల వల్ల కొందరు అప్పుకోరిన వాళ్ళ గొంతులకు మూడు పీట ముళ్ళు వేసి చేత్తో పట్టుకుని, కొద్దిగా విదిల్చేవారు.

అప్పుతెచ్చిన వాళ్ళు వాళ్ళ తరంలో వడ్డీ కూడా తీర్చలేక సతమతం కావడం - రెండో తరం వాళ్ళు ఆ బాధలు పడలేక ఆస్తులు పూర్తిగా అమ్మి ఋణబాధ నుంచి విముక్తులై, పాపర్ల జాబితాల్లో పడి, ఏ పట్టణాలో పట్టుకు లేచిపోవడం జరుగుతూ వుండేది.

హామీలు పెట్టడానికి ఆస్తులు లేని వాళ్ళు ఎంత చిన్న అప్పు తేవడానికైనా పడరాని అవస్థలు పడుతూ వుండేవారు. ఋణదాత మనస్సు కరిగించడానికి వాళ్ళు ఎన్నెన్నో పాట్లు పడేవారు.

అప్పు అడగాలనుకున్నప్పుడు వెంటనే అడగలేక కొంతకాలం "వంశాను క్రమణికగా వారిని కీర్తించడం. వాళ్ళ వాకిళ్ళలో ఉన్న ఆల్ సే యస్ శునకం మీద చేతనైతే శతకం వ్రాసి యజమాని వినేటట్లుగా ప్రతిరోజూ చదవడం"

ఆయన మెచ్చుకుంటున్నాడనే భావం కలిగిన తర్వాత, ఆ శతకాన్ని "మీ వంశంలో ఎవరు కోరితే వారికి అంకితమిస్తా"నని హామీ ఇవ్వడం, ఆ తర్వాత అప్పు సంగతి బయటపెట్టడం జరుగుతూ వుండేవి. ఇంత యజ్ఞం చేసినా ఒకప్పుడు ఫలితం సిద్ధించకపోవడం జరుగుతూ వుండటం కద్దు. ఒకపుడు సత్వరం ఫలితం ప్రాప్తించడం అక్కడితో "ఋణగ్రస్థ" జీవితం ప్రారంభం కావడం సంభమవుతూ వుండేవి.

అలాటికాలం చాలావరకూ మారిపోయింది. అప్పుల అవసరం ఎప్పటిలాగానే వుంది. కొంచెం ఆలోచిస్తే అప్పటికంటే కొంచెం ఎక్కువైందని కూడా చెప్పాలి. కాకపోతే అప్పు అడగడానికి అంత అవస్థ పడటంగానీ తీర్చడానికి దిగులుపడటంగాని చేయటంలేదు. అప్పు చెయ్యడం ఒక పురుష లక్షణంగా, తీర్చలేక పోవడం ఒక దేవతా చేష్టగా మారిపోయింది ఇప్పుడు. అప్పు తీసుకునేవారిలో లోకువా,

ఇచ్చేవారిలో ఒక రకం లోకువా కనిపిస్తున్నాయి ఈనాడు. లోకువ అంటే మరేది కాదు. అప్పివ్వడం ఆలస్యమైతే ఎందుకివ్వరు అని అడిగే అవకాశాలు వచ్చాయి. అంటే వెనుకటి భయం తగ్గి చనువూ, స్వాతంత్ర్యం ఏర్పడినాయిగదా.

ఇప్పుడింకో క్రొత్త అధ్యాయం వెలసింది. "అప్పుల భారతం"లో. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా, ఎవరికి పడితే వారికి (అయితే కొన్ని షరతుల ననుసరించేననుకోండి) అప్పులివ్వడం ప్రారంభించింది. "అప్పులు ఇవ్వబడును" అని ప్రకటనలు కూడా జరుగుతున్నాయి.

కొన్ని కొన్ని సాంకేతిక రంగాలలో అనుభవం కలవారికి, ఎలాటి హామీలూ కోరకుండానే వారి శక్తి సామర్థ్యాలను ఆధారం చేసుకుని, అప్పులిచ్చి, వారి శ్రామిక రంగాన్ని అభివృద్ధి పరచడానికి శాయశక్తులా కృషి చేయడానికి పూనుకుంది ప్రభుత్వం.

"పరిశ్రమలు స్థాపించండి.

వ్యవసాయం దిగ్విజయంగా కొనసాగించండి.

వ్యాపారాలు తలపెట్టండి.

మీకు నచ్చిన వృత్తులు చేపట్టండి.

పాడిని అభివృద్ధి పరచండి.

ఫలవృక్షాల వీపు చరిచి, పండ్లు కాయించండి.

మీకు తోచింది చెయ్యండి.

దేశాభివృద్ధి భారం వహించండి.

సోమరితనాన్ని వెనక్కు నెట్టండి.

మొదలు పెట్టండి కార్యక్రమం.

అర్జీ మా చేతులలో వుంచండి.

మీకు ధన సహాయం చేస్తాం. "

అంటూ బ్యాంకులు అప్పీళ్ళు చేస్తున్నాయి. అడిగినవారికల్లా అప్పులిస్తున్నాయి. బ్యాంకుల జాతీయకరణంలో ప్రథమాధ్యాయం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. సోషలిస్టు వ్యవస్థాపనకు నాందీగీతంగా లక్ష్మి వూరువూరా, వాడవాడా ఇంటింటా సంచారం చేస్తోంది.

లక్ష్మి ప్రసన్నం ఇంతగా మున్నెన్నడు జరగలేదనీ, ఆమె ఉదారత 'ఇందిరా రాజ్యంలో' ప్రదర్శించినట్లు మరెప్పుడూ ప్రదర్శించలేదనీ ప్రజానీకం చెప్పుకుని ఎంతో మురిసిపోతున్నారు.

ఋణాలు తీసుకున్నవారు గర్వంతో నిలబడగలుగుతున్నారు. సుమతీ శతక కర్త కోరిన "అప్పిచ్చువాడు" ఇప్పుడు "ఇందుగలడందులేడను సందేహము లేదు, దాత సర్వోపగతుండు" అనిపించుకుంటాడు. అంతకంటే ఏం కావాలి?

**(13' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

ఎక్కడ చూచినా సంఘాలు, సంఘాలు. అంతులేని సంఘాలు.

తెల్లవారిన తర్వాత లేచి పత్రిక చూస్తుంటే ఏవో కొత్త సంఘాలు కొన్ని కనిపించి తీర్తాయి. అందులో కొన్ని వింతవింత సంఘాలు. కొన్ని విచ్చలవిడి సంఘాలు. కొన్ని పనిలేని సంఘాలు కొన్ని పనివుండి చెయ్యలేని సంఘాలు.

మొత్తం మీద అనేక సంఘాలు. అనేకమంది అధ్యక్షులు, అనేకమంది కార్యదర్శులు. అంతులేనంతమంది కార్యనిర్వాహక వర్గ సభ్యులు. చేసే నిర్వాకాలు లేకపోయినా చెప్పుకుని సంతోషించడానికి అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటారు.

ఇక తీర్మానాలంటారా? అంతులేదు. సలసలలాడే నూనె బూర్లె మూకుడు దగ్గిరపెట్టుకుని, తలో జంతిక చుట్టు వత్తి అందులో పారేస్తారు. ఒకరు పిండిగొట్టంలో కూరితే, మరొకరు వత్తడంలో వత్తాసు చేసి, దాన్ని బలపరిచామని సంతోషపడతారు.

కొన్ని సభలు రెండురోజులు. కొన్ని నాలుగు రోజులు. బోలెడు ఖర్చు, బోలెడు హంగామా. ఏమైతేనేం కొన్ని తీర్మానాలు చేయాలిగా! తమ పార్టీ ప్రగతి కోసం పడే ఆదుర్దా బయట పెట్టుకోవాలిగా.

ఆ తీర్మానాల జంతికలు ఒక పెద్ద జంగిడి నిండుతాయి. వేడివేడివి పత్రికలద్వారా ప్రజలకు పంచిపెడతారు. కొన్ని చదువుతుంటేనే నూనెకంపుకొడతాయి. కొన్ని మర్నాటికి కొడతాయి. అయినా ఈ సభలు, తీర్మానాలూ అంతులేకుండా జరుగుతూనే వుంటాయి. సముద్రస్నానంలో నూనె మిఠాయి దుకాణాలలాగా తీర్మానాల జంతికలు తయారుచేసి పోస్తూనే వుంటారు.

ఇదివరలో అయితే దేశ క్షేమం, దేశాభ్యుదయం, మాతృభక్తి, మతసామరస్యం, దీన జనోద్ధరణ, విద్యావ్యాప్తి మొదలైన విశేషాలను గురించి పెద్దలు తీర్మానాలు చేసే నేతి పిండివంటల్లాగా ఎంతో రుచిగా వుండేవి. కొన్నాళ్ళు ఘుమఘుమలాడుతూ నిలవ వుండేవి.

అప్పుడిన్ని సంఘాలు లేవు. ఇన్ని సమస్యలు కూడా లేవు. కాంగ్రెసు సంస్థ వుందంటే దేశ దాన్య విముక్తికి సంబంధించిన విషయాల మీదే తీర్మానం చేసేది. అందరూ ఎంతో కుతూహలంతో వాటిని అంగీకరించేవారు.

స్వాతంత్రం వచ్చిన తర్వాత కాంగ్రెసు నెత్తిమీద అనేక బాధ్యతలు పడ్డాయి. అవి ఒక పట్టున తీరేవి కాదు. పట్టుబడితే ఇట్టే మారేవి కావు. కాంగ్రెసు సంస్థ భారత జాతీయ జీవనాన్ని శుభప్రదంగా, శాంతిప్రదంగా, స్వయంపోషకంగా అన్నిటినీమించి ఔన్నత్యపూరితంగా తయారు చేయాలని పూనుకుంది. మరి దీనికి ఎన్ని సంఘాలు కావాలి?

పైన చెప్పిన సదభిప్రాయంతో ప్రారంభమైన పంచవర్ష ప్రణాళికలను అమలుపరచడానికి ఎన్ని సంఘాలు? ఎన్ని ఉప సంఘాలు? ఎన్ని తాత్కాలిక సంఘాలు? ఎన్ని చిరంజీవి సంఘాలు? వీటినన్నిటినీ ప్రజలూ, ప్రభుత్వం మార్కండేయాభివృద్ధిరస్తూ అని దీవిస్తూ కూర్చోవడం జరుగుతోంది.

ఒక్క వ్యవసాయ రంగంలో ఎన్ని సంఘాలు. అప్పులిచ్చే సంఘం, మంచి విత్తుల సేకరణ సంఘం, పంపిణి సంఘం, నీటిపారుదల సంఘం, ముురుగు నిరోధక సంఘం, పంటల అభివృద్ధి సంఘం, ధరల పెంపుదల సంఘం ఇలాటివి జనరల్‌గా ఎన్నో వున్నాయి. ఇటీవల ఎక్కడో చదివాను. పచ్చి జీడిపప్పుల సంఘం, వేగించిన జీడిపప్పు సంఘం, అఖిలభారత జీడిపప్పు అభివృద్ధి సూచన సంఘం, అంతర్జాతీయ జీడిపప్పు ఎగుమతి సంఘం.

ఇలా ఎన్నెన్ని వస్తువులున్నాయో అన్నిటిమీద దరహాస దశ సంఘాలన్నీ ఉద్భవించాయి. ఉపసంఘాల మాట వూహకు వదిలి వేద్దాం పోనీ.

సంఘాల ప్రయోజనాలు రెండు విధాలు. ఒకటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్ణయించడం - రెండు తమ హక్కులకు భంగం రాకుండా చూచుకోవడం. మూడవ ప్రయోజనం కూడా ఒకటి వుందిగాని దాన్ని ఎక్కువగా ఉదాటించడం నా భావం కాదు. వూరికే వుటుంకించడమే - ఈ తృతీయ ప్రయోజనం పదవులపై అభిలాష.

అభిలాష ఆత్మకు పరిభాష. ఏ ఆత్మ ఎలా ప్రోత్సహిస్తుందో మనమేం చెప్పగలం? అది ఒక మనస్సులో వేసే ముడులు మరొకరు ఎలా విప్పగలరు? పదవులను ఆశించడం ఆత్మను పోషించుకోవడమే అవుతుంది. కనుక ఆ విషయాన్ని వదిలేద్దాం.

ఒక్క కాంగ్రెసులో ఇప్పుడెన్ని సంఘాలు వెలిసాయి? మీవి పదియిళ్ళు కావాలని కొందరు దీవిస్తూ వుంటారు. ఎవరు దీవించారో తెలియదుగానీ, కాంగ్రెసు సంస్థ ఐదేమిటి పాతిక ఇళ్ళుగా మారిపోయింది. ఇంకా వృద్ధిపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఒక్కొక్క రాష్ట్రంలో చక్కగా మూడు నాలుగు కాంగ్రెసు సంస్థలు వెలుస్తున్నాయంటే ఎంత సంతోషం? వీటి ఆశయాలలో కూడా ఎక్కువ భేదం వుండదు. ఏదో పదవుల శాఖ అనేది ఒకటి వుండవచ్చు. పదవుల అన్వేషణ శాఖ అనేది బైటికి కనిపించకుండా ఒకటి ప్రాకులాడుతుంటే వుండవచ్చు.

అది మినహాయిస్తే ఆశయాలన్నీ ఒక్కటే అందరూ ఖద్దరు కడతారు. అందరూ గాంధీ జన్మదినోత్సవాలు జరుపుతారు. అందరూ స్వాతంత్ర్య దినోత్సవంనాడు జెండా ఎగరవేస్తారు 'వందేమాతరం' అని పాడుకుని పరవశమవుతూనే వుంటారు.

మొత్తం మీద ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెసు సంస్థ ఈనాడు శాఖోపశాఖలుగా వర్థిల్లుతోంది. అలంకారప్రాయమైన తాత్కాలిక సంఘాలు, తాత్కాలిక పదవులు కూడా ఏర్పడి ఎంతో ముచ్చటగురవుతున్నాయి.

ప్రగతి మీద అభిమానం గలవారు ఎవరైనా సరే. క్రొత్త సంఘాలు నెలకొల్పుకోవడానికి ఆలోచించవలసిన పనిలేదు. ఆలస్యం చెయ్యవలసిన పనిలేదు. ఏ సమయంలోనైనా విఘ్నేశ్వరపూజ చెయ్యవచ్చు. తెల్లవారేటప్పటికి విశాల భారతదేశమంతా వారి పేరు ప్రాకిపోతుంది.

కాంగ్రెసు మహా సమర సమయంలో లాఠీదెబ్బలకు మోకాళ్ళు విరిగిన వారు ఆ మహాయజ్ఞంలో తమ సిరి అంతా స్వాహా చేసి పాపర్ల జాబితాలో పడ్డవాళ్ళు తెలివితేటలూ నిజాయితీ, నిబద్ధతా, అందరికంటే ఎక్కువ పర్సెంటు దేశభక్తి వుండి అరణ్యవాసంలో, అజ్ఞాతవాసంలో వున్న వాళ్ళూ.

ఇప్పటికీ గాంధీ జపం చేస్తూ అహింసపేరిట దుప్పటి కప్పుకుని, ఆకలి దప్పికలమాట ఆలోచించకుండా, అందరికీ అందిన పట్టుకొమ్మ మనకు అందలేదనే నైరాశ్యంలో పడకుండా ప్రణవ జపం చేసేవారు.

ఇలాటివారు వేరువేరుగా సంఘాలు స్థాపించలేరుగానీ లేకపోతే ఈపాటికి కాంగ్రెసు మహావృక్షం శతశాఖలు ధరించి, ఎన్నెన్నో రకాల జీవులకు ఆశ్రయమిస్తూ వుండేది.

దేశగీతాలు ఒక కొమ్మను వినిపిస్తూంటే - వైతాళిక గీతాలు ఒక కొమ్మని పూస్తుంటే ప్రభృతాలు, పల్లవి తప్పకుండా పాడి వినిపిస్తూ వుండేవి.

కొన్ని శాఖలమీద రామచిలుకలు వ్రాలి ముద్దుపలుకులు పలుకుతూ వుంటే కొన్ని కొమ్మలమీద వృద్దపావురాలు ఏవో సుద్దులు పలుకుతూ వుండేవి.

(15' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**సరసంగా మాట్లాడటం,** సంతోషంతో పలకరించటం, సద్భావంతో సహకరించడం - ఇవన్నీ ఉత్తమలక్షణాలని పేర్కొంటారు పెద్దలు.

సరసంగా మాట్లాడటం, చమత్కారంగా జవాబు చెప్పడం గొప్పకళక్రింద జమకట్టవచ్చు. "సరసం ఒక విధమైన సిరి" అన్నారు పెద్దలు.

మొన్న ఒక పండిత మిత్రుడు మాట్లాడుతూ "ఇటీవల నేను బంధువుల ఇంటికి వెళ్ళాను. ఆ ఇంట్లో వున్న ముసలి దంపతులు, ఎప్పుడూ ముసి ముసి నవ్వులు నవ్వుతూ చమత్కారంగా మాట్లాడుతూ, ఒకరివంక చూసి ఒకరు సంబరాలు పడుతూ కనిపించారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఈ వయసులో ఇంత హుషారుగా ఎలా వుండగలిగారా? అని. ఎంత తమాషా అండీ" అన్నాడు.

"దాంట్లో తమాషా ఏం వుంది? దాంపత్యానికి అవసరమైన దినుసులు సంపాదించి వాడుకుంటున్నారన్నమాట. మనమంతా దిగుళ్ళ బేళ్ళల్లో మునిగిపడి వుంటాం. వాళ్ళు బయటపడి అలా వయస్సు కూడా మరచి అలా సీతాకోక చిలకల్లాగా ఎగురుతున్నారు" అన్నాను.

"ఏం సీతాకోకచిలకలండీ? చిన్న వయస్సులోవున్న నేనే అలా వుండలేనింట్లో. కాలేజీనుంచి ఇంటికి వెళ్ళేసరికే కళ్ళు ఎర్రబడతాయి. కాళ్ళు లాక్కు వస్తాయి. మనస్సు చెడివుంటుంది. అలాంటప్పుడు సరసాలేం జ్ఞాపకం వస్తాయి. ఎప్పుడు రెండు మెతుకులు పడేస్తారా అని మడత కుర్చీలో పడి మంచం వంక చూస్తూ వుండటం తప్ప. అసలలాటి చైతన్యం ఎలా వస్తుందండీ. నే వెళ్ళిన ఇంట్లో ఇల్లాలు నడవలేదనుకోండి. అన్నీ నాట్యభంగిమలు నవ్వుల మువ్వల చప్పుళ్ళూ" అని ఆయన ఎంతో దిగులుపడ్డాడు.

మా బంధువుల్లో ఒకాయన భార్యను "చిలకా! చిలకా" అని పిలుస్తూ వుంటాడెపుడూ. "ఇవ్వాళ ఉల్లిపాయ పులుసుపెట్టు చిలకా! చిల్లర డబ్బులేమైనా దాచావా చిలకా" ఇలా మాట్లాడుతూ వుంటారు. పాపం ఆయన బులపాటమేగానీ ఆ చిలక వట్టి కొయ్య చిలక. రోజుకొక్కసారి అన్నా "కూ" అనదు. భర్త చెప్పినా మాటలు తిప్పి చెప్పడం అసలే సున్నా. అయినా ఆయనగారి బంధువులొచ్చినా, పరాయివాళ్ళొచ్చినా "చిలక ప్రయోగం" వదిలిపెట్టడు పాపం.

వెనుకటికి మా మేనమామగారు అంటూ వుండేవారు. "ఆడపిల్లను పిలవడంలో చాలా జాగ్రత్త వుండాలి. ముద్దు పిలుపులకు పోతే వాటిని వెన్నముద్దలలాగా ఆరగించే నేర్పుండాలి. అలాంటి సరసం లేనిచోట ఆయ్! ఓయ్ అనడమే మంచిది. ఈ సత్యం గ్రహించకుండా చిలకా చిలకా అంటూ వెంటపడితే పిలకపట్టుకుని గుంజి వదిలిపెడతారు. 'చందమామా! చందమామా' అంటూ వెంటపడితే, నట్టింట్లో సావిట్లో అక్కరలేని చిందులు త్రొక్కడం ప్రారంభిస్తారు. సరసమెరిగిన చోట ఎన్ని సరిగమలైనా వాయించవచ్చు" అన్నాడు.

ప్రేయసిని చాలామంది "నా గులాబీ" "నా జిలేబీ" "నా తేనె" "నా బెడ్‌లైట్" "నా చిమ్నీ" "నా హోప్" "నా సోపు" అంటూ రకరకాలు పిలుస్తూ వుంటారు. ఇటీవల ఒక కథలో నాయకుడు ప్రేయసిని "నా రేషన్ కార్డు" అని సంబోధించాడు.

మా ఫ్రెండ్ ఒకాయన భార్యను ఎంతో సంబరంగా చూసుకుంటాడు. సిరి అంతా ఆవిడదేనని నమ్మకం. లక్ష్మి తన కళ్ళు వాళ్ళావిడ కిచ్చి గుడ్డిదైందనీ, సరస్వతి గొంతు అందించి మూగదైందనీ ఆయన భ్రాంతి పాపం.

ఆవిడ పేరు కమల. ఆయనగారు నిత్యం 'కమలాష్టకం' వల్లిస్తూనే వుంటాడు. ఆవిడ ఎప్పుడో ఒకసారి ఒక చిరునవ్వు విసురుతుంది. "నరుడా! నీ పూజకు మెచ్చాను. నీకేం వరం కావాలో కోరుకో" అన్నట్లు.

ఇలా ఒకవైపునుంచి స్తోత్రపాఠాలు బయలుదేరడం, బ్లాంక్ పర్సులో పొగడ్తలు బయలుదేరడం సరసం క్రింద జమపడదు. ఒక వికార చేష్ట క్రింద పరిణమిస్తుందిగాని అది పరస్పరంగా వుండాలి.

సీత, రాముణ్ణి "ఆర్యపుత్రా" అని సంబోధిస్తే ఆయన మరింత గౌరవంతో "ఏమి భూపుత్రీ" అనేవాడు. అంతేగానీ "ఏమిటీ కౌసల్య కోడలా?" అంటే ఎంత తీసికట్టుగా వుంటుంది.

ఇలా తీసికట్టు పిలుపులు పిలవడం కూడా సరసమేననుకునే మహనీయులు కొందరులేక పోలేదు. మా వూళ్ళో ఫిష్షుఫారం తప్పిన పండితుడొకాయనున్నాడు. వాడికి కర్మం చాలక ఒక పాతికెకరాల పిత్రార్జితం వుంది. అందుకని ఎవరో ఆశపడి ఒక అందమైన పిల్లనిచ్చారు.

మరి ఆ అమ్మాయిని నీరసంగా పలకరించే సభ్యత ఎక్కడనుంచి వస్తుంది. పాతిక ఎకరాలలో సస్యం పండుతుందిగానీ, సభ్యత పండునా! ఆ సరసుడా అమ్మాయిని "ఎంకి" అని పిలిచేవాడు.

అక్కడితో ఊరుకునేవాడా? ఆ సంబోధన అక్కడితో వదిలితే లాభం లేదని "నాయుడు బావకి నీళ్ళు తోడు" అనీ, "నాయుడు బావకి రొట్టె కాల్చిపెట్టు"అనో అనడం అక్కడితో తను చక్కటి పోలికలు పోల్చానని తనలో తనే పొంగిపోయి తన్మయత్వంలో పడటం జరుగుతూ వుండేది.

బంధువులూ, స్నేహితులూ ఇంటికి వచ్చినప్పుడిలాటి బడాయి కూతలు హెచ్చు అవుతూ వుండేవి. ఆ అమ్మాయి చచ్చినట్లు పడుతూ వుండేది. ఇదోరకం సరసం. బొత్తిగా ఇరవయ్యో నెంబరు నూలు.

గ్రాంధిక భాషలో ప్రేయసుల్ని, ఒక్కొక్కప్పుడు భార్యల్ని పిలవడంలో ఎంతో సరసం, సభ్యతా గోచరిస్తాయి. ఇలాటి పిలుపుల్లో కవిత్వంతోపాటు కాంక్ష కూడా దాగిదోచూచులాడుతూ వుంటుంది.

"కాసిని మంచినీళ్ళు తెస్తావా మృగనయనా! ఇవ్వాళ పచ్చడిలో ఉప్పు చాలలేదే ఉల్లాసలాస్య తరంగిణి" "నా మాడును కొంచెం నూనె అంటుతావటే మరాళకుంతలా"

ఇలాటి ప్రయోగాల వల్ల కొంత కొంత ఉబలాటం, అర్థంకాని ఆనందం వెల్లివిరుస్తూ వుంటాయి. ఆమె కూడా పండితురాలైతే ఇక ఆ సంభాషణలు చెప్పనక్కరలేదు. ఏ పాఠ్య గ్రంథంలోనో, వారిరివురి జీవిత చరిత్రలతో ప్రవేశిస్తాయి. గైడ్సు ఆ సంభాషణలలో గల చాతుర్యాన్ని, కవి సమయాన్ని, నిశిష్టార్థాన్ని మిక్కిలిగా వివరిస్తాయి.

ఇలాటి సంబోధనల విషయంలో మా ఉషశ్రీగారిని పేర్కొనాలి. ఆయనగారిటీవల పత్రికలలో వ్రాసే వ్యాసాలు చాలావరకూ "ప్రేయసికి నివేదనలు"గా రూపొందుతున్నాయి. అందులో ఆయన ఎన్నుకుంటున్న సంబోధనలు చాలా సుబోధకంగా, సరసంగా, చమత్కార పూరితంగా వుంటున్నాయి. ఆయన 'ప్రేయసిని' గౌరవించడంలో గారవించడంలో పరిపూర్ణమైన సిద్ధిపొందారనిపిస్తుంది. అనిపించడమేమిటి? పొందారు.

**(17' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"ఒక్క రసం మాటేమిటి?** ఆయనగారు ఒక్కరోజులో నవరసాలు గుమ్మరించగలరు. 'మావారు' అని చెప్పుకోవడం కన్నా 'మహానటులని' చెప్పుకుంటే మంచిది.

"పైగా ఏ రోజు ఏ పోర్షన్ అప్పగిస్తారో ఏ రోజు ఏ రసం ప్రదర్శిస్తారో చెప్పడం కష్టం. అది అలా వచ్చేస్తుంది. మహా తరంగంలాగా. ఆ రసంలో లీనమైపోతారు. ఇవతల వాళ్ళు గుడ్లూ, చెవులూ అప్పగించి ఊరుకోవలసిందే"

మొన్న ఆదివారం పిల్లలందర్నీ పెందరాళే లేపి, మొఖాలు కడిగించి, కాఫీ త్రాగించి, మంచిబట్టలు తొడిగించి, అందర్నీ కాఫీ హోటల్‌కు తీసుకువెళ్ళారు. తలుపు దగ్గర చూస్తూ "ఈ పూట నువ్వేం ఫలహారం చెయ్యక్కరా మేం తెస్తాం అందాకా వారపత్రిక చదువుకో" అని ఎంతో ఆప్యాయత ఒలకబోసి వెళ్ళారు. వాళ్ళందరికీ అడిగిందల్లా తినిపించి, తను తిని నాకో రూపాయి దాణా

తెచ్చారింటికి. అంత కరుణ ఎలా వచ్చిందో చెప్పలేను. కాపరానికి వచ్చిన క్రొత్తలో కూడా అంత కరుణా, ప్రేమా అనుభవించినట్లు జ్ఞాపకం లేదు.

ఆయన నవ్వుతూ దగ్గిర కూర్చుని అవన్నీ నాచేత తినిపిస్తుంటే "పిచ్చిదానికి తలంటి" శాస్త్రం జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం దాకా ఆ గుణం అలా నిలబడే ఉంది. వంటచేసి అవస్థపడుతున్నానని కూర తరిగి అందించారు. పులుసులోకి చింతపండు పిసికి అక్కడ పెట్టారు. ఇలా ఎంతో సహకారం ప్రదర్శించారు. ఆ తర్వాత ఆఫీసుకి వెళ్ళారు. ఆ రసం అక్కడితో సమాప్తి.

సాయంత్రం రావడం రావడమే హిరణ్యకశ్యపుని వేషంలో వచ్చారు. వాకిట్లో వున్న పిల్లల్ని తలొకటీ వేశారు. "పాడు సంతానం, కీడు సంతానం" అని తిట్టిపోశారు. అప్పుడు లోపలకు వచ్చి వెంటనే "నిన్ను చేసుకోవడం బుద్ధి తక్కువ అయింది" అన్నారు.

"నిజమే" అన్నాను.

"మీకెంత సేవ చేసినా ప్రయోజనం లేదు. కృతజ్ఞతలేని జీవులు. ఈ కొంపేమిటి, ఈ సంతానమేమిటి? ఎలా మగవాడు బ్రతకడం?" అని తిట్టిపోశారు.

కాఫీ తెచ్చి ఇస్తే "ఎందుకీ గరళం? నాకేం అక్కరలేదు" అంటూ అక్కడ నుంచీ చివాలున వెళ్ళిపోయారు. పిల్లలకు చదువు ప్రారంభం. మొదటగా అయిదేళ్ళ కుంకను గట్టిగా పట్టుకుని "ఎక్కడరా! హిమాలయాలు? చెప్పరా శుంఠా లేదా నీ చెంప పగిలిపోతుంది" అని రెండు గుంజీలు గుంజి "ఎక్కడరా హిమాలయాలు కిరాతుడా! మీ అందర్నీ "డల్స్‌ను" కన్నది అక్షరజ్ఞానం లేదు. ఎక్కడరా హిమాలయాలు?" అని గ్రుడ్లు ఉరిమాడు.

"అమ్మా" అని ఏడవడం మొదలుపెట్టాడు. ఆయనకు కోపం మరింత ఎక్కువైంది.

"అమ్మను ప్రార్థిస్తున్నావా అప్రాచ్యుడా మీ అమ్మేకాదు. ఆ బ్రహ్మ దిగివచ్చినా నిన్ను వదిలేది లేదు. ఎక్కడ హిమాలయాలు?" అని ఒక్క వూపు వూపడంలో వాడు క్రిందపడి చివరకు "దొడ్లో" అన్నాడు.

"దొడ్లోనా చూపించు" అని వాణ్ణి నేలమీద వేసుకుని ఈడ్చుకుపోయాడు దొడ్లోకి. నేలమీద కాలితో బలంగా తన్నుతూ "ఎక్కడరా దుర్మార్గుడా ఎక్కడ హిమాలయాలు?" అంటుండగా నేను వెళ్ళి "ఎందుకు వాణ్ణి అలా చంపుతారు వాడికేం తెలుసు ఎక్కడున్నాయో. చదివేది ఓనమాలు, హిమాలయాలు అడిగితే ఏం చెపుతాడు?" అన్నాను.

"అయితే మాత్రం జనరల్ నాలెడ్జి వుండొద్దు. ఇప్పుడెన్ని పరీక్షలు పాసయినా జనరల్ నాలెడ్జి లేందే ఏ ఉద్యోగం రావడం లేదు. నేనింకా అందరికీ తెలిసిన హిమాలయాల సంగతి అడిగాను. అక్కడ ఎవరికీ తెలియని ప్రశ్నలడుగుతారు. ఇప్పటినుంచే జనరల్ నాలెడ్జి మారిపోయాలి" అన్నారాయన.

ఆ రాత్రి అన్నం వేళదాక అయిదేళ్ళవాడి దుంప తెంపి అప్పుడు మ్యాపులో హిమాలయాలు చూపించి వదిలారు. వాడు నిద్రల్లో "హిమాలయాలు" అంటూనే వున్నాడు.

"ఇలాంటి సంఘటనలెన్నో మా యింట్లో మా వారికీ ఒక రసమేమిటి? అన్ని రసాలూ తెలుసు. అయితే సరసం కంటే విరసం పాళ్ళు ఎక్కువ" అని ఆ ఇల్లాలు మొత్తుకుంది పాపం.

ఇలాటి తిట్లతో, శాపనార్థాలతో గడిచిపోయే సంసారాలు కొన్ని వున్నాయి. చెయ్యి చేసుకునే ప్రబుద్ధులు కొందరుంటారు. "వంట్లో విరిగిన బొమికేగానీ విరగని బొమికలేదు" అని వేదనపడే ఇల్లాండ్రు ఎంతమందో వున్నారు.

చాలాకాలం క్రితం క్రింద ఏడెనిమిది మంది పిల్లల తల్లి ఒక బంధువురాలు మా ఇంటికి వచ్చింది. చాలాకాలానికి వచ్చిందని బ్రతిమాలి ఆ రోజు ఎలాగో ఆపాం. మర్నాడు ఉదయం ఒక రవికకు సరిపోయే 'కట్‌పీస్' ఒకటి కొని బొట్టి పెట్టి ఇచ్చారు మావాళ్ళు. ఇంకా రెండురోజులు వుంటే బాగుండేదన్నారు.

దానికా ఇల్లాలు "ఇంకా నయం నిన్ననే ఆయన చాలా అవస్థపడి వుంటారు ఎట్లా కాలం గడించిందో ఏమో!?" అంది.

"ఒక్క రోజేగా ఎక్కడో అక్కడ తింటారు. ఊళ్ళో చుట్టాలున్నారుగా" అన్నాం.

"తిండి విషయంలో కాదు. తిండి ఎవరైనా పెడతారు. తిట్లూ, తన్నులూ ఎవరు తింటారు? ఇటీవల కాలంలో నిన్న ఒక్కరోజు నాకు దెబ్బలు తప్పింది.

"ఒక్కొక్క రోజు మరిచిపోయి నిద్రపోయినా అర్ధరాత్రి లేచి, ఏదో తగాదా పెట్టుకుని, నాలుగు తన్ని, పళ్ళు పటపట కొరికి, అక్కడికీ కసితీరక, జుట్టుపీకి, తలగోడకు వేసి కొట్టి అప్పుడుగానీ నిద్రపోరు" అని ఆమె కంట తడిపెడుతూ చెప్పింది. ఆవిడ దుర్దశ అప్పుడు తెలిసింది. దాంతోపాటు ఆయనగారి సంస్కారం కూడా.

"కలకంటి కన్నీరొలికిన సిరులు యింట నుండనొల్లదు" అన్నారు పెద్దలు. కన్నీరు ఒలకడమే కాదు ఇంట్లో నదిగా ప్రవహించినా, సిరి తొలిగిపోని ఇళ్ళు చాలా వున్నాయి. అసలు సిరిని చూసుకుని ఆలిని తన్నడమంటే, కళ అభివృద్ధి చెందుతుందేమోననిపిస్తుంది.

మరి పైన చెప్పిన పద్యభాగంలో సిరికి వేరే అర్ధం చెప్పుకోవాలో లేకపోతే సిరి తన పద్దతులు మార్చుకుందో చెప్పలేం. కొందరికి సరసం ఇలా పతాకస్థాయినందుకుంటుంది.

అయితే ఇలాటి పరిస్థితులు మన దేశంలోనే కాదు అన్ని దేశాలలో, అన్ని కాలాలలో వున్నాయి. వెనుక రష్యాకు రాణిగా వెలిసిన కాథరిన్ కూడా ఇలాటి అవస్థలు పడిందిట భర్త డ్రాంక్ డ్యూక్ పీటర్ ద్వారా.

సర్వసామాన్యమైన వనితగా రష్యా చేరి, పీటర్‌ను పెళ్ళాడింది. చాలామంది పిల్లల్ని కన్నది. కానీ పీటర్ చేతిలో తన్నులూ, తిట్లూ తప్పలేదు ఒక్కరోజు కూడా. ఆ ప్రబుద్ధుడు సంతానాన్ని చూసి "వీళ్ళు నా సంతానం కాదనేవాడట. భార్యను పదిమందిలో పట్టుకుని బండకూతలు కూసేవాడట.

"నీకు విడాకులన్నా ఇస్తాను. లేదా ఏదైనా కాన్వెంటులోనన్నా పారేస్తాను పాపిష్టురాలా" అని సభల్లో, విందుల్లో తిట్టి జుట్టుపట్టుకుని ఈడుస్తూ వుండేవాడుట. మొత్తం మీద ఇద్దరికీ ఒక్క ఘడియ సఖ్యత కుదిరేది కాదుట. భర్త దుర్మార్గుడైతే అలాటి రాణికే టికాణా లేకపోయింది. ఇంక మామూలు వాళ్ళకా!

ఇళ్ళలో దంపతుల మధ్య సరస ప్రసంగాలు అనేది అదృష్టం కొద్దీ లభించే ఒక వరం. అది తప్పితే జీవితమే శాపం.

**(20' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కొందరు మహానుభావులకు,** అసలీ ప్రపంచం వంక చూడటానికీ, ఇతరుల్ని పలకరించడానికీ, వారు చెప్పినమాట ఆలోచించటానికీ జవాబు చెప్పటానికీ ఎంతమాత్రం ఇష్టం ఉండదు.

ఎంతో చెప్పగా విని విని ఒకసారి చెవులో జోరీగ దూరిన గొర్రెలాగా తలతిప్పుతారు. లేకపోతే నొప్పులు వచ్చి ఆగిపోయిన గర్భిణీ స్త్రీలాగా ఒకసారి పొట్టపట్టుకుని, "అ, ఉ" అంటారు. ఆ మూలుగుడికి అర్ధం అవుననో కాదనో నిర్ణయించడం కష్టం.

ఈ రకమయిన మనస్తత్వాలు ఎందుకు వస్తాయి. అనే విషయం మీద పరిశోధనలు చెయ్యడం అనవసరమనిపిస్తుంది. ఒకాయన ఈ సందర్భంలో మాట్లాడుతూ ఆ పిచ్చి కళలకు కారణం - "మనస్సులో గర్వం దాగి అయినా వుండాలి. లేదా ఏదో అసమర్థత లలా అతడిని ఆవరించి అంకిళ్ళు నొక్కి అయినా వుండాలి" అన్నాడు ఇదోరకమైన విచిత్రతత్వం.

ఇలాటి వాళ్ళు సంసారాల్లో ఎలా ప్రవర్తిస్తారనేది కూడా నివారించవలసిన విషయమే. కాకపోతే కాపురం చేసే ఇల్లాలు, కన్న సంతానం - ఇది నిత్యం వుండే ప్రారబ్దమేగదా అని పట్టించుకోవడం మానేసి వుంటారు. లేకపోతే ఆయన మూలుగుళ్ళుకు వ్యాఖ్యానాలు ఎక్కడ వ్రాయగలరు?

కొందరు ఏ సమయంలోనన్నా కనిపించనివ్వండి ఒకటే రకం ధోరణిలో ఒకటే విషయం మీద మాట్లాడి మన బుర్రల్ని అప్పడాల పిండి ముద్దలాగా చేసి 'అనవసర విషయాలు' అనే పీట మీదవేసి బాది మధ్య మధ్య వాళ్ళ చాదస్తమనే చమురులో చేయి తడిచేసుకుని మన బుర్ర మళ్ళీ ఏ వారానికోగానీ పనికిరాకుండా చేస్తూ వుంటారు.

చీకటి బజారులో పందికొక్కు గోతులు త్రవ్వి పది రాళ్ళు ఈడ్చుకొచ్చిన పెద్దమనిషి ఒకాయన ఉన్నాడు. ఆయన గారెప్పుడు కనిపించినా "చూడండి, ప్రపంచంలో ఏదైనా సాధ్యంగానీ, ఒకళ్ళకిచ్చిన డబ్బు తిరిగి రావడం మాత్రం అసాధ్యంగా వుంది."

"ఏం చెప్పమంటారు? అలా వుంది కాలం. ఇచ్చేదాకా ఇలవేల్పులులాగా తిరుగుతారు ఇంటిచుట్టూ. జాలిపడి చేతిలో వేశామో మన వీధివంక చూడరు. మన మాట అట్టేపెట్టి ఏం చెప్పమంటారు అవస్థ. ఒకడికి భార్య పురుడంటే నూరు రూపాయలిచ్చి ఆ పిల్లకు అయిదో ఏడు. అయిదు రూపాయలు జమచేస్తే ఒట్టు పెట్టండి.

"పోనీ వెయ్యకపోతే ఇలా ఇచ్చుకోలేకపోయాను. ఫలానా కారణాలవల్ల తను వచ్చి చెప్పి పోకూడదూ? చస్తే రాడు. వాడికేం ఎందుకు రావాలి? వందరూపాయలు అలాగ్గా సంపాదించాడు.

"ఇంట్లో అంతా క్షేమమా?" మొన్నీమధ్య సందుచేసుకుని అడిగితే "ఏం క్షేమం? నేనిలా అప్పులు పెట్టి ఆస్తంతా నాశనం చేస్తుంటే వాళ్ళేం క్షేమంగా వుంటారు. నామీద కక్షకట్టి చూస్తున్నారు" అని ఎంతో ఫీలయిపోతాడు.

ఆ జీవితంలో మరో సంభాషణ వింటామనిగానీ, ఆయన మనస్సు మార్చుకుని మనం చెప్పేది వింటాడని ఆశపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఆయన గుండెల్లో ఎప్పుడూ ఆ పాత రికార్డే తిరుగుతూ వుంటుంది. అరిగిపోకుండా కొంచెమైనా చెరిగిపోకుండా.

కొందరు ప్రబుద్ధులు ఎదురైనప్పుడు పలకరించకపోతే బాగుండదని "ఎక్కడ నుంచి రావడం?" అంటామనుకోండి. "ఏం చెప్పను? ఒక చోటేమిటి ఇక్కడికి ఆరురోజులనుంచీ ఇందుగలడందులేదను సందేహము వలదు అన్నట్లు తిరుగుతున్నాను. ఆరు రోజుల క్రిందట హైదరాబాదు, మర్నాడు నిజామాబాద్, మర్నాడు తిరిగి హైదరాబాద్, ఆ మర్నాడు వరంగల్లు. ఉన్నది అయిదు గంటలే అక్కడ. ఆ పని చూసుకుని సరాసరి ఖమ్మం మెట్టు, అక్కడో మనిషితో మాట్లాడి మొన్న ఉదయం బెజవాడ చేరుకున్నా - నిన్న ఉదయం మళ్ళీ జగ్గయ్యపేట. తీరా అక్కడికి వెడితే కావలసిన మనిషిలేడు.

ఆయనకోసం వెళ్ళి ఆయన్ని పట్టుకుని మాట్లాడి రాత్రికి ఒంటిగంటకు విజయవాడ చేరుకున్నా. తీరా చూస్తే తెల్లారి రుద్రవరం వెళ్ళవలసి వచ్చింది. వెళ్ళి అరగంట క్రిందే చేరా. ఇంకా ఇంటికి వెళ్ళలేదు. ఇదుగో వచ్చే ఫిబ్రవరివరకు ఇలాగే వుంటుంది. తర్వాత రెండు నెలలు ఖాళీ. ఎక్కడికీ వెళ్ళను. అప్పుడు కలుస్తా తీరిగ్గా" అంటూ వెళ్ళిపోతాడు.

అంత సోది చెప్పినందుకు మనస్సులో బాధపడుతున్నా. మరోమూడు మాసాలదాకా తీరిక లేదని చెప్పినందుకు అభినందిస్తూ అక్కడినుంచి అవతలకు సాగడం జరుగుతూ వుంటుంది.

మరో రకం పెద్ద మనుష్యులుంటారు వారెప్పుడూ ఏదో ఒక పెద్ద ప్లాను వేసుకుని మాట్లాడతారు తప్ప మామూలు సంభాషణ అంటూ వారి నోటినుంచి వినిపించదు. "ఇదుగో ఫలానా వ్యక్తికి సన్మానం చేయాలనుకుంటున్నాం. గ్రాండుగా చెయ్యాలి. అధ్యక్షుడిగా ఎవర్ని పిలిస్తే మంచిదంటారు? రాష్ట్రపతి అయితే బాగుంటుందనుకోండి. ఆయన ఇటు ఎప్పుడు వస్తారో కనుక్కుని వ్రాస్తే ప్రోగ్రాంలో పడిపోతుంది. ఇది ఒకటి మనసులో వున్నదనుకోండి. మరొకరెవరైతే బాగుంటుంది. రాధాకృష్ణన్‌గారైతే బాగుంటుంది కానీ బహుశః ఆయన ఎక్కడికీ రారంటున్నారు. అలాంటప్పుడు మనం కోరడం కూడా అంతగ బాగుండదు. అధ్యక్షుని సంగతి తేలితేగానీ ఉపన్యాసకుల సంగతి తేలదు. అదీ వచ్చింది చిక్కు"

అని నిజంగా ఏదో గొప్ప చిక్కులో పడ్డవాడిలాగా బాధపడతాడు.

కొంచెం సేపు ఆగిన తర్వాత "పోనీ సినిమాకు చెందిన వాళ్ళనెవళ్ళనైనా పిలిస్తే రాజకపూర్ అయితే తప్పకుండా వస్తాడు. "ఏం ఒకసారి ఇలాగే ఉత్తరం వ్రాస్తే ప్రస్తుతం తీరుబడిలేదు. కనుక క్షమించండి అని వ్రాసాడు.

ఈసారి వ్రాస్తే మటుకు కాదనడు. కానీ అతణ్ణి పిలవడమా దేవానంద్‌నా? అని సందేహంగా వుంది. మా చెల్లెలువాళ్ళు "ప్రతి సభకూ మొగవాళ్ళను పిలవడమేనా? ఈసారి నూతన్‌ని గానీ, లతామంగేష్కర్‌ని గానీ పిలవండి. మంగేష్కర్ అధ్యక్ష్యోపన్యాసం ఇవ్వలేకపోవచ్చు. కానీ రెండు పాటలు పాడితే పాతిక ఉపన్యాసాలతో సమానం అంటున్నారు. మీ ఉద్దేశ్యమేమిటి?" అని సూటి ప్రశ్న.

"మీరు పిలిపించాలే గానీ అంతకన్నా కావలసిందేముంది? సభ సర్వాంగశోభితంగా వుంటుంది. దిగ్విజయంగా సాగుతుంది అంటాం మనం.

ఆయన ముసి ముసి నవ్వులు నవ్వుతూ కొంచెం ముందుకు పోయి మళ్ళీ వెనక్కి వచ్చి "అయితే వీళ్ళంతా వాళ్ళ ఖర్చులమీద వాళ్ళే వస్తారుగా. మనల్నేమీ అడగరుగా అని ప్రశ్న."

"వ్రాసి చూడండి. తేలిపోతుంది" అంటాం.

"అంతేలెండి లేకపోతే మనమెక్కడ భరిస్తాం. మా సభ్యుల పేర్లు వున్న ఇళ్ళూ వాకిళ్ళూ అమ్మాలి. సన్మానం జరగకపోతే మానే" అంటూ వెళ్ళిపోతాడు.

ఈ సన్మానాల ప్లేట్లు విసుగులేకుండా వీధివీధినా పెట్టేవాళ్ళు కొందరున్నారు.

### (22ʻ డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మొన్న** ఒక పెద్దమనిషి డాక్టరుగారి వద్దకు వచ్చి తన ఆరోగ్యం బాగోలేదని చెప్పాడు.

డాక్టరుగారు "ఏమిటి మీ అసలు కంప్లయింటు? అని అడిగారు.

దానికా పెద్ద మనిషి "అన్నిటికంటె ముఖ్యమైన బాధ రాత్రిళ్ళు బొత్తిగా నిద్రపట్టదు. ఏ తెల్లవారు ఝూముకో కొంచెం ఇట్టా కునుకు వస్తుంది - అట్టా మెళుకువ వస్తుంది" అన్నాడు.

"మీకిలా నిద్రపట్టకపోవడం ఎన్నాళ్ళనుంచి? అన్నాడు డాక్టరుగారు.

"ముఖ్యంగా మూడు నెలలనుంచి అనుకోండి. అంతకు ముందింత విపరీతం లేదు. రోజుకో రెండు గంటలు నిద్రపోయే వాణ్ణి" అన్నాడాయన.

"మూడు నెలలనుంచా? తలపోటు వుందా?" అని డాక్టరు ప్రశ్న.

"ఉండదు మరీ కొంచెం వుంటుంది"

"కళ్ళుపోట్లా?"

"అయ్యో వాటికేం. రోజూ వుంటాయి."

"నిద్రపట్టకపోతే ఏం చేస్తూ వుంటారు. చదవడం అభ్యాసం వుందా?"

"అప్పుడప్పుడూ చదువుతా! అదైనా బుర్రకు ఎక్కదు"

"సరే మూడు మాత్రలిస్తాను. రాత్రిళ్ళు పడుకోబోయేప్పుడు వేసుకోండి. రాత్రి అన్నం తక్కువ తినండి. వీలైతే రాత్రిళ్ళు మాడుకు చమురు అంటించుకోండి. అంత కన్నా ఏం లేదు" అన్నాడు డాక్టరుగారు.

"ఈ మాత్రలతో నిద్రపడుతుందంటారా?" అని ప్రశ్న.

"ఓ! కుంభకర్ణ నిద్ర. మీకెందుకు మీరు వేసుకోండి" అని చీటీ ఇచ్చారు డాక్టరుగారు.

ఆ పెద్దమనిషి వెడుతూ వెడుతూ నావంక చూసి "రాత్రిళ్ళు నిద్ర తక్కువ" అన్నాడు. నేనేదో జాలిపడతానన్నట్లు.

"నాకు మాత్రం పట్టి ఏడుస్తుందేమిటి? తెల్లవార్లూ గడియారం ప్రక్కమీద పెట్టుకుని కూర్చుంటాను" అనుకున్నాను మనస్సులో. కానీ ఇతరులపట్ల సానుభూతి ప్రకటించడం మన ధర్మం గనుక ఆయన చెప్పగానే "అలాగా పాపం. నిద్ర పడుతుంది లెండి. మాత్రలు ఇచ్చానుగా" అన్నాను. ఆయన నవ్వుతూ వెళ్ళిపోయారు.

వైద్యశాస్త్ర రీత్యా డాక్టరుగారు ఆయన్ని కొన్ని ప్రశ్నలు వేశారు. అంతవరకే జవాబులు సంపాదించారు. కానీ మానసిక శాస్త్రంరీత్యా ముఖ్యంగా ఈ రోజుల్లో వెయ్యవలసిన ప్రశ్నలు కొన్ని వున్నాయి. వాటిని కొన్నిటిని మాత్రం ఉదహరిస్తాను.

"మీది అద్దె ఇల్లా! స్వంత ఇల్లా అద్దె ఇల్లయితే ప్రతినెలా అద్దె కడుతున్నారా? పంపునీళ్ళు, వాకిట్లో వూడ్పు వగైరాలను గురించిన తగాదా లేమైనా వున్నాయా? ఇస్తానన్న రోజుకి ఇవ్వలేకపోయిన బాకీలేమైనా వున్నాయా? అవి ఆఫీసుకి దగ్గరలో దాపుల్లో వున్నాయా?"

"పై అధికారి ఈమధ్య ఏమైనా నోరు చేసుకున్నాడా? చెయ్యదగిన మేలు చెయ్యకుండా అడ్డుపడుతున్నాడా?"

"పెళ్ళికి ఎదిగిన ఆడపిల్ల వుందా? చదువు మానేసి వూరువెంట తిరిగే పుత్రరత్నాలున్నారా?

"కోడలు వేరుపడతానని, కొడుకు కొంపచీలుస్తాననీ గొడవ చేస్తున్నారా?"

"కొంపలో గుట్టు గోడదాటి బయటికి ప్రయాణించిందా?

ఇలాంటి కారణాలు అనేకం వుండవచ్చు నిద్రలేకపోవడానికి. ప్రణయగాథల్లోకి పోతే ప్రియులకు విరహంలో, విప్రలంబంలో నిద్రపట్టకపోవడమంటూ వుంటుంది.

"జొన్న చేనుకాడ

సొగసు కత్తెను చూసి

నిన్నటేళ నించి నిద్రలేదు" - అన్నాడొక జానపద నాయకుడు. ఒక చదువుకున్న మగువ ప్రియునికి ఉత్తరం వ్రాస్తూ మూడు నెలలకు పైగా నీ దర్శనం కాలేదని చెప్పడానికి బదులు "వందరోజులు నిద్రహరించిన ఓ వన్నెకాడా!" అని పేర్కొన్నదట.

పూర్వకాలంలో మహారాజులకు సైన్యాలకు శత్రువుల్ని తలచినప్పుడు నిద్ర అదృశ్యమైపోయేది. "నిద్దురరాదు కన్నులకు నీదగు పేరును విన్నమాత్రమే" అనీ, "నిన్ను తలచినప్పటినుంచీ నిద్రలేదు" అని చెప్పుకునేవారు పాపం.

అన్నట్టు రుక్మిణిదేవి తనను రాక్షస వివాహం చేసుకోవలసిందిగా బ్రాహ్మణోత్తమునితో కబురు పంపుతూ "కూరుకు రాదు రేయి" అన్నది. తనకోసం నిద్రమానుకుని అలా కూర్చుంటుందని వినినప్పుడు కృష్ణుని మనస్సు కరగకుండా వుంటుందా? నీ మూలంగా నిద్రవుండటంలేదనేది ఒక విధమైన అపీలు. దానికి చర్య వెంటనే వుంటుందని ఆశాభావం కలగడంలో ఆశ్చర్యంలేదు.

నిద్రలో అనేకరకాలున్నాయి. కొందరు కేవలం నిద్రపోతు రకాల క్రింద జమకడుతూ వుంటారు పాపం. కొందరికి నిద్ర తమ స్వాధీనంలో వుంటుంది. కొందరిని నిద్ర లాగి చెంపకాయ కొట్టి నిద్రపుచ్చుతుంది దాని ఇష్టం వచ్చినప్పుడు. ఏ పనిలో వున్నా, ఎంత బాధ్యత వహించినా నిద్రవచ్చి వారి చెవిదగ్గర 'అలోజు' వాయించి హాయిగా నిద్రపుచ్చుతుంది.

నిద్రపోతున్న వాళ్ళను లేవడం మహాపాపాల్లో ఒకటి అని చాలామంది అంటూ వుంటారు. కానీ పాపం చాలామందికి ఈరోజుల్లో నిద్రమేల్కొని చేయవలసిన వృత్తులు లభిస్తాయి. వాళ్ళు రాత్రిళ్ళను పగలుగా చేసుకుని జీవిస్తూ వుంటారు. హాయిగా గుర్రాలు కట్టవలసిన వేళ పొట్టను జ్ఞాపకం చేసుకుని లొట్టలు పోయిన కళ్ళతో తమని తాము తిట్టుకుంటూ కాలం గడుపుతూ వుంటారు.

నాగరికత పెరిగిన కొద్దీ రాత్రికీ పగలికీ తేడా కూడా తరిగిపోతోంది. క్రమక్రమంగా పూర్వం ప్రణయజీవులు, ఋణగ్రస్థులు, చోరులు వగైరాలు మాత్రమే నిద్రకు వీళ్ళు వదులుకునేవారు. ఇప్పుడెన్నెన్ని వృత్తుల్లోవారో, నిశిని బలవంతంగా బయటకు నెట్టుతూ పాటుపడవాల్సివస్తోంది.

కొందరికి కొన్నాళ్ళు రాత్రిళ్ళు, కొన్నాళ్ళు పగలు షిఫ్టులుంటాయి. వారో వారం సూర్యవంశపు రాజుల క్రిందా, ఒక వారం చంద్రవంశం రాజులక్రిందా జమపడుతూ వుంటారు. అలాటివారెవరైనా కనిపించినప్పుడు "రాత్రి డ్యూటీయా? పగలా? " అని అడగడానికి బదులు "సూర్యవంశమా! చంద్రవంశమా!" అనడం జరుగుతూ వుంటుంది.

ఇలాటి రాత్రిళ్ళు నిద్రమేల్కొని పని చేసేవాడికి ఎప్పుడో అప్పుడు కునికిపాట్లు రాకమానవు. వాళ్ళూ నరులేగాని, విలింపులుకారుగా? అందువల్ల కూడా ఒక్కొక్కప్పుడు మాట రావడం ఉద్యోగాలు పోవడం తటస్థిస్తూ వుంటుంది. పై అధికారులు జాలిగలవారైతే తప్ప తిప్పలు తప్పవు.

ఈ సందర్భంలో అబ్రహాం లింకన్ జూపిన జాలి కథ ఒకటి వుంది. ఒకసారి లింకన్ సైనికుల్ని తనిఖీ చేయడానికి వెళ్ళాడట. రాత్రిపూట అక్కడ ఒక 'సెంట్రీ' తుపాకి ఒక మూలపెట్టి కునుకుపాట్లు పడుతున్నాడుట. లింకన్ చూశాడు. అతనిపైన జాలి కలిగింది. తను అమెరికా ప్రెసిడెంటుననే మాట కూడా మరిచిపోయి, ఆ తుపాకి తన భుజాన పెట్టుకుని పహరా ప్రారంభించాడుట.

కొంతసేపటికి ఆ సెంట్రీకి మెళుకువ వచ్చింది. లింకన్ అలా పహరా చేయడం చూశాడు. నిలువునా కూలిపోయినంతపని అయింది. గజగజ ఒణుకుతున్నాడు. నోటమాట రాలేదు. లింకన్ ఏమీ అనకుండా తుపాకి అతని భుజాన పెట్టి 'పహరా సాగించు' అని చెప్పి వెళ్ళిపోయాడుట.

సెంట్రీ నిద్రపోవడం చాలా ప్రమాదకరమైన విషయం. అలాటి సందర్భంలో కూడా లింకన్ అతనిపైన జాలి వహించడం ఒక్కటే కాక తాను అతని బదులు పహరా తిరగడంలో ఎంతో ఉదారత గోచరిస్తుంది. నిద్రలో గల బాధలు, సాధనలు, చాలావున్నాయి. అసలు అరవైయేళ్ళ జీవితంలో నిద్రపోని ఒక విచిత్ర పురుషుని వృత్తాంతం ఈసారి వివరిస్తాను.

**(26' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పూర్వం ఆరునెలలు** నిద్రపోయి, ఆరు నెలలు మేల్కొనే కుంభకర్ణుడిలాటి వాళ్ళున్నారని మనం విన్నాం. ఆరునెలలు ఎలా నిద్రపోగలిగాడా? ఆరు నెలలు ఎలా కంటి రెప్పవేయకుండా ఎలా మేలుకొన్నాడా? అనే సంశయం మనకు వస్తూ ఉంటుంది.

కానీ ఈ రోజుల్లో కుంభకర్ణుడి తాతల్లాంటి వారున్నారనే సంగతి వింటే ఎంతో ఆశ్చర్యంగా వుంటుంది. ఆరు నెలలు కాదు అరవై సంవత్సరాలనుంచి నిద్రపోని వ్యక్తి వున్నాడీనాటికి. ఆయన ఆరోగ్యానికేం భంగం లేదు. రాత్రింబవళ్ళు పనిచేసి ధనం సంపాదిస్తూ వుంటాడు.

ఈ మహనీయుడు స్పెయిన్ దేశంలో వున్నాడు. పేరు వేలైంటెన్ మదీనా. వయస్సు అరవై ఎనిమిది సంవత్సరాలు. "చిన్నతనంలో మాట నాకు తెలియదుగానీ నాకు బుద్ధి తెలిసిన తర్వాత ఎప్పుడూ నిద్రపోలేదు" అని ఆయన చెపుతాడు.

సామాన్యంగా మానవుడు తన ఆయువులో మూడోవంతు నిద్రక్రింద వినియోగపరుస్తాడు. కానీ మదీనా అంటాడు "నా జీవితంలో ప్రతిక్షణం నేను హాయిగా అనుభవిస్తూనే వున్నాను" అని. అంతేకాదు "నా వయస్సు అరవై ఎనిమిది వత్సరాలు. నిద్రపోకుండా గడిపిన కాలాన్ని కూడా కలుపుకుంటే నా వయస్సు సుమారు తొంభై వత్సరాలుంటుంది" అంటాడు మదీనా!

ఈయన ఒక వ్యవసాయ కూలీ. ఆజానుబాహుడు. అవివాహితుడు. అక్కడ పొలాలలో పనిచేసేవారికి ఎనిమిది గంటల కొక షిఫ్ట్ చొప్పున వుంటాయి. ఇతగాడు మూడు షిఫ్టులూ పనిచేసి అందరికంటే మూడు రెట్లెక్కువ జీతం సంపాదిస్తాడు.

భూస్వామి మారిస్ అనే ఆయనకు మదీనా మీద ఎంతో అభిమానం. అతనికి కావలసినంత పని ఇస్తాడు. మదీనా పగలంతా అంటే సుమారు పద్దెనిమిది గంటల పొలం దున్నడం, పంట పోగుచేయడం. అసలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. అప్పటికే దేశం నిద్రపోతుంది.

కానీ ఇతగాడికి నిద్ర ఎక్కడ నుంచి వస్తుంది. అందుకని తక్కిన ఆరుగంటలు వాచ్‌మన్‌గా పనిచేస్తాడు. మళ్ళీ తెల్లారుతుంది. మళ్ళీ అందరు కూలీలతోపాటు పనిలో పాల్గొంటాడు. నిద్రబాధలేని నిలింపులన్నా ఎప్పుడైనా కళ్ళు నులుపుకుంటారేమోగానీ ఇతనికి అదికూడా వుండదుట పైగా వాచ్‌మన్‌గా వ్యవహరించినప్పుడు ఏవైనా పుస్తకాలు పుచ్చుకుని చదువుకుంటూ వుంటాడట.

కొంచెం అలసటగా వున్నదనిపిస్తే అక్కడే వున్న తన గుడిసెలోకి వెళ్ళి కాసేపు కూర్చుంటాడుట. ఆ కూర్చోవడం కూడా కటిక నేలమీదే మెత్తని పక్క చూస్తే అతనికి తలనొప్పి వస్తుందిట. అక్కడ అలాంటివేమీ వుంచడు.

ఇంకో విచిత్రమేమిటంటే "నిద్రమత్తు" స్థితే ఎప్పుడూ రాదుట. అసలు అతడు ఎప్పుడూ ఆవలించినట్లు కూడా జ్ఞాపకం లేదుట. 'ఏమో ఏం ఆవలింతో? అట్లాంటి అనుభవం నాకు లేదంటే నమ్మండి" అంటాడు మదీనా.

లోకంలో అందరూ నిద్రపోతున్నారు. అందులో ఏదో తమాషా కొంత వుండి వుంటుంది. పోనీ నిత్యకృత్యంగా కాకపోయినా శాంపిల్‌గా ఒక్కసారి దాని మజా తెలుసుకొందామనే అభిలాష అతనికి ఒకటి రెండుసార్లు కలిగి నిద్రకోసం ప్రయత్నం చేశాడుట. కానీ ఎంత తన్నుకున్నా కళ్ళు మూత పడలేదు. ఇంకా గాఢనిద్ర మాట చెప్పాలా? దాంతో అతడు ఆ ప్రయత్నం మానుకున్నాడుట.

అతడు వదులుకుంటే సరిపోతుందా ప్రపంచమంతా అతణ్ణి గురించి వింతవింతలుగా చెప్పుకోవడం ప్రారంభించారుగదా అదైనా ఒక రోజా? ఒక నెలా? ఒక సంవత్సరమా? అరవై యేళ్ళు అనిమిషుడుగా జీవించిన వ్యక్తిని గురించి ఎంత వింతగా చెప్పుకుంటారు.

ముఖ్యంగా వైద్య ప్రపంచం ఈ విచిత్ర వ్యక్తిని గురించి ఎంతో ఆలోచించారు. నిద్రరాకపోవడానికి కారణమేమిటి? అంత విరహం మాత్రం ఎలా సాధ్యమవుతుంది. అంత విరక్తికి కారణం ఏం వుంటుంది? ఉంటే మాత్రం కంటిరెప్పలు వూరుకోవద్దూ.

పోనీ అందరికీ ఉపయోగించే నిద్రమందులు వాడి చూద్దాం. ఎందుకు నిద్రపోడో? అనుకున్నారు. వైద్య నిపుణులు పరీక్ష చేశారు. ఒకటి కాదు. పదికాదు. పట్టెడు మాత్రలు మింగించి చూశారు, ఇంజక్షన్‌లు ఇచ్చారు. అవి ఏ దారిని పోయినాయో ఏమీ తోచలేదు. వైద్య ప్రపంచాన్ని ధిక్కరించే మహనీయుడు అవతరించాడెవడురా. అని నాలుగురోజులు అతణ్ణి వదలకుండా రాత్రింబవళ్ళు వెంటపడి పరీక్ష చేశారు.

చివరకు ఏమీ అర్థంకాక "ఇతగాడు నిద్రారహితుడు. అదేదో విచిత్ర సృష్టి. అప్పుడప్పుడూ వచ్చి చూచేవారికి మాత్రం విప్రవినోదంగా వుంటుంది" అని ఒక స్టేట్‌మెంటు ప్రకటించి ఎవడింటికి వాళ్ళుపోయారు.

నిద్రను గురించి అనేక పరిశోధనలున్నాయి. అసలు కారణాన్ని ఇంతవరకు ఎవరూ కనిపెట్టలేదని తేల్చారు. శాస్త్రజ్ఞులు. కానీ నిద్రను గురించిన పరిశోధనలద్వారా కొన్ని కొన్ని నిర్ణయాలు మాత్రం చేయగలిగారు. బడలిక వల్ల నిద్రవస్తుందంటారు. అదీ సరి అయిన కారణం కాదన్నారు.

మనసు, ఆత్మ రెండూ వుంటాయి మానవునిలో. మనస్సు మాత్రమే నిద్రపోతుంది. ఆత్మ జీవించి వున్నంతకాలం మేల్కొనే వుంటుంది. అని ఒక వ్యాఖ్యానం వుంది. ఆంత మేల్కొని వుంటుందనడానికి కొన్ని ప్రయోగాలు చేసి చూశారు.

మనిషి నిద్రపోతుండగా కూడా చదువుకోవచ్చని కొందరు నిర్ధారణ చేశారు. దీనికిగాను ఒక యంత్రాన్ని తయారు చేశారు. అనేక దేశాల్లో ఈ యంత్రాన్ని ఉపయోగించారు. మంచి ఫలితాలు అందించాయట. ఈ పద్ధతిద్వారా భాష, కవిత్వం, లెక్కలు, నాటకాలు వగైరాలన్నీ చదవ వచ్చుట.

ఈ సందర్భంలో ఒక విచిత్రం వినండి. ఒక వ్యక్తి ఈ పద్ధతి ద్వారా పదిరోజుల్లో అతిక్లిష్టమైన చైనా భాష నేర్చుకున్నాడుట. ఈ విషయాన్ని గురించి యిలా వ్రాశారు. "పదిరోజుల్లో అందులో నిద్రలో చైనా భాష అంతా నేర్చుకోవడమంటే పిచ్చిగొడవ క్రింద జమకట్టి వూరుకుంటారు చాలామంది. కానీ ఇది నిజం. అలా అభ్యసించిన వ్యక్తి. 'లింక్ లెటర్' అనే ప్రఖ్యాత అమెరికన్ ఫిలిం నటుడు"

ఈ యంత్రం నిద్రపోతూ విద్యార్థులకు, పగలు తీరుబడిలేని గృహిణులకు, అభిలాష కలిగిన వయోజనులకు ఎంతో ఉపకరిస్తుంది. మొదట్లో చెప్పిన "మదీనా"కు చదువు ఎక్కువ ఆసక్తి కలగలేదుగానీ, లేకపోతే సకల శాస్త్రాలూ చదివి, జగత్ప్రసిద్ధ సంపాదించేవాడు. అతని డిగ్రీలు మైలు పొడవుండేవి.

సుమారు డెబ్బయి సంవత్సరాలు. కంటి రెప్ప వాల్చకుండా అలా వున్న మదీనా శరీరాన్ని చాలామంది వైద్య శాస్త్రజ్ఞులు చనిపోయిన తర్వాత తమకిమ్మని కోరారుట. కానీ అతడు నిరాకరించాడు. స్పెయినులోవున్న ఒక వైద్య సంస్థకు వాగ్దానం చేశాడుట. బ్రతికివున్నప్పుడే శరీరతత్వాన్ని తెలుసుకోలేని వాళ్ళు కళేబరాన్ని పరిశీలించి ఏం తెలుసుకుంటారు? వట్టి వ్యామోహం. ఆ శరీరానికి ఒక అద్భుతమైన చరిత్ర మాత్రం వుంటుంది వైద్యశాస్త్రంలో.

ఎప్పుడూ నిద్రమత్తులో పడివుండే హాళ్ళు చాలామంది వుంటారు. నిద్రకు అధిక ప్రాధాన్యమిచ్చి మాటల్లోనే గుర్రుకొట్టే వాళ్ళు వుంటారు. ఈ లోకంలో నిద్ర నిజానికి చాలావరకు తరిగిపోతోంది. స్థిరత్వం లేకపోవడంవల్ల.

అయితే మన ఆశయాలు, ఆఫీసు ఫైళ్ళు కోరికలు మాత్రం చక్కగా నిద్రపోవడం నేర్చుకున్నాయి. ఎంత మొత్తుకున్నా అవి లేవవు. లేవడం వాటికి అలవాటు కూడా లేదు నిజానికి.

(31 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మొన్న** హైదరాబాద్ నుంచి బస్సులో వస్తున్నాను. అందులో సుమారు పదిమంది ఆడపిల్లలు, పెళ్ళికానివారు, విద్యార్థిదశలో వున్నవారూ ప్రయాణం చేస్తున్నారు. అంత దూరప్రయాణమైనా, వాళ్ళు విసుక్కున్నట్లుగానీ, అలిసిపోయినట్లుగానీ కనిపించలేదు.

పైగా ఆ ఏడుగంటల ప్రయాణంలో బస్సు కదిలే ముందు గడిచిన అరగంట కాలంలో వారు పకపకలాడుతూనే వున్నారు. ఒకరిని మించి ఒకరు పెద్ద గొంతుతో మాట్లాడుతూనే వున్నారు. వారి సంభాషణలో ప్రత్యేకత ఏమంటే వారిలో ఒక్కరు కూడా తెలుగుముక్క మాట్లాడలేదు. కాలేజీ చదువు వృధాపోనియ్యడమెందుకు? ఇంగ్లీషు భాషను చిన్నబుచ్చడమెందుకు అన్నట్లు ఆ భాషనే వాడుతూ వచ్చారు.

చివరికి వేరుశనక్కాయలు కొనవలసి వచ్చినా "గ్రౌండ్‌నట్" అన్నారు గనుక ఆ అమ్మకందారుడు వెంటనే ఇచ్చాడు. లేకపోతే ఏ నా బోటిగాడో దుబాసీగా పనిచెయ్యాల్సి వచ్చేదే

చెప్పవచ్చిందేమంటే వారందరూ ఏదో పెళ్ళికి - స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళివస్తున్నారట. వారందరూ పైగా పెళ్ళీడువాళ్ళు. సామాన్యంగా పెళ్ళిళ్ళకు వెళ్ళి వచ్చేటప్పుడు కొంత సంసార వేదాంతం, చింతా ఏర్పడుతుంది. బహుశాః ఆ పెళ్ళికూతురు వాళ్ళ స్నేహితురాలై వుంటుంది. లేకపోతే అలా జట్టుగా వెళ్ళరు.

తమతో కలిసిమెలిసి తిరిగిన ఒక స్నేహితురాల్ని ఒక వ్యక్తి వివాహమాడి తీసుకువెళ్ళాడంటే కొంత చింతగానే వుంటుంది. నిజానికి ఒక స్నేహితురాల్ని కాకి ఎత్తుకుపోయినట్లే వుంటుంది. అలాటి సందర్భంలో కొంత ఆలోచనలో పడటం సహజం. కానీ వారికి అలాటి చింత ఏమాత్రం వున్నట్లు కనిపించలేదు వారిలో.

విద్యార్థి దశలో ఎంతో స్వేచ్ఛా, ఆనందం వుంటాయి. ఎంత చదువుకున్న అమ్మాయిలైనా వివాహం తరువాత కొంతవరకు ముడుచుకుపోవడం తప్పదు. అందువల్ల ఆదిలో వున్న ఉత్సాహం తగ్గిపోతుంది. కానీ ఆ విద్యార్థినులను చూస్తుంటే భారతదేశంలో మహిళల జీవితాలింత స్వేచ్ఛగా, ఆనందంగా ఎందుకు వుండకూడదూ అనిపించింది.

వారు ఆ బస్సులో అనుకోకుండా వేసుకున్న నవ్వుల పందిళ్ళ నీడలు భారతదేశమంతా ఎందుకు అవతరించకూడదు అనిపించింది. ఒక వృద్ధ ప్రయాణికుడు అన్నాడు "సూర్యారావుపేటలో తల్లులు ఎంత చక్కగా మాట్లాడుతున్నారో, ఎంత స్వేచ్ఛగా వున్నారో. ఈ ఆనందాన్ని అర్థం చేసుకున్న భర్తలు వస్తే వాళ్ళ జీవితాలు ఎంత బాగుంటాయో" అని.

నిజమే మరి వారందరూ 'నాధుల' చేతుల్లో పడిపోతారుగా. వారి అడుగుజాడల్ని అనుసరించవలసి వస్తుందిగా! అప్పటి రూపాలెలా వుంటాయో అనిపించింది.

ఆ అమ్మాయిలెంతో అమాయకంగా మాట్లడటం గమనించాను. ఒక అమ్మాయి అంది. తనకు వోర్పు చాలా తక్కువని. అంటే ఏమిటి? ఒక ఉదాహరణ చెప్పమంది మరో అమ్మాయి.

మొదటి అమ్మాయి ఇలా చెప్పడం ప్రారంభించింది - "ఉదాహరణ కావాలా! చాలా వున్నాయి. నాలో అసలు వోర్పూ నిదానం లేవని చెపుతుంటే ఉదాహరణలకేం కరువు. ఒకటి చెపుతా విను. నాకు బజ్జీలంటే ఇష్టం. అందుకని మా అమ్మ అప్పుడప్పుడూ చేస్తూ వుంటుంది. కానీ నేను వాటిని ఎప్పుడూ సరిగా ఉడకనివ్వను. సగం ఉడకగానే తీసుకు తినేస్తూ వుంటా. అమ్మ గొడవ చేస్తూంది. ఇంకో పదినిముషాలు ఉడకనియ్యి మంచి రుచి వస్తుందని. నేనెప్పుడూ అలా వదల్లేదు. ఎప్పుడూ సగం ఉడికిన బజ్జీలే. నేను వెయిట్ చెయ్యలేను. అంత 'ఇన్‌పేషన్సు' తెలిసిందా?" అన్నది.

"మరి వాటి రుచి ఎలా తెలుస్తుంది సరిగ్గా" అని మరో అమ్మాయి ప్రశ్న.

"వెనుక జన్మలో ఎప్పుడో రుచి చూసి ఉంటుంది. ఈ జన్మలో కాదు" అని మరో అమ్మాయి జవాబు.

ఇలా కొంతసేపు చర్చ జరిగింది. తలొక విధమైన వాఖ్యానం చేశారు.

చివరకు ఒక అమ్మాయి అంది. "లీల తినే బజ్జీల గురించి ఇంత చర్చ చెయ్యడం దేనికి? దాని యిష్టం వచ్చినవి అది తింటుంది. ఇలాటి విషయంలో మనం చర్చ జరపడం వల్ల ఒక విషయం తేలింది" అంది.

"అదేమిటి? చెప్పు త్వరగా చెప్పు?" అన్నారందరూ.

"ఏమీలేదు. మనందరం ఫూల్సుమని తేలింది" అన్నది ఆ మొదటి అమ్మాయి.

కొందరు "అవును అచ్చంగా అంతే" అన్నారు.

కొందరు "ఒక్కనాటికి కాదు" అన్నారు.

అక్కడితో ఆ చర్చ సమాప్తమైంది.

ఆ అమ్మాయి సగం ఉడికిన బజ్జీలు తిని, తనకు బజ్జీలంటే చాలా యిష్టమనే నిర్వచనం చేసింది. ఇందులో చాలా సత్యం వుంది. ఒక సత్యాన్ని ఆవిడ బజ్జీలపరంగా బయటపెట్టింది. విజ్ఞానానికి వివేచన ఎంతో అవసరం. నాగరిక ప్రపంచానికి చెందినవారు, ఏవో కొన్ని పద్ధతులకు అలవాటైపోతారు. మంచిదే కానీ అలాటివారు మరో చోటికి వెళ్ళినప్పుడు అక్కడ వాతావరణానికి అనుకూలంగా ప్రవర్తించలేక ఎంతో అవస్థపడుతూ వుంటారు. అందులో "విద్యార్థి" దశలో వున్నవారు మరీను.

ఈ విషయంకూడా వారి ప్రసక్తిలో వచ్చింది. ఒక అమ్మాయి అంది "నేను బొంబాయిలో బంధువుల యింటికి వెళ్ళాను. 'గుడ్‌గాడ్' ఒక్కరోజు వుండలేకపోయాను. వారి పద్ధతుల్ని ఎంతో హేట్ చేశాను. ఐ హేట్ - హేట్ ...హేట్" అంది.

"ఏమిటి అంత పడని పరిస్థితి?" అని మరో అమ్మాయి అడిగింది.

"వాళ్ళు సాయంత్రం ఆరుగంటలకు భోజనం చేస్తారు. 'సప్పర్ బై సిక్స్', 'బై ఎయిట్ బెడ్' ఓ గుడ్ గాడ్ హెల్...హెల్...హెల్" అని అరిచింది.

"పోనీ నువ్వు మేలుకుని ఏ పుస్తకమో చదువుకోకపోయావూ" అన్నదొకామె.

"రీడింగ్.... ఇంపాజిబుల్. హౌసంతా హెల్. ఎలా చదవడం? మర్నాడే పారిపోయి వచ్చాను. సప్పర్ బై సిక్స్ - బెడ్ బై ఎయిట్.. హెల్..హెల్" అన్నదామె.

ఇంతలో బస్సు దగ్గరికి బఠానీలు అమ్మకానికి వచ్చాయి. కొన్నారు.

ఒక అమ్మాయి అంది "అమ్మో! ఇవి తినకూడదు కడుపునొప్పి వస్తుంది" అని.

"అమ్మో అవి తింటే జాండీస్ వస్తూంది" అని అరిచింది మరో ఆమె.

మరో ఆమె ఇలా సలహా చెప్పింది. "భయపడకండి. ఒక ఉపాయం చెపుతా వినండి. అన్నీ ఒకసారి నోట్లో వేసుకోకండి. ఒక్క గింజ వేసుకోండి. పది నిముషాలు నమలండి. అది అరిగిపోతుంది. అప్పుడు మళ్ళీ ఇంకొకటి వేసుకోండి. మళ్ళీ పదినిముషాలు" అంది.

"అయితే మనం ఇరవై గింజలతో హైదరాబాద్ చేరతాం. తక్కినవి?" అన్నదొకామె.

"బస్సు దిగగానే పారపొయ్యండి అవతల. అవి ఎవరిక్కావాలి?" అంది మొదట సలహా చెప్పిన ఆవిడ.

ఒకరు టైం చూశారు. రెండున్నరగంటల్లో గమ్యం చేరుతుందన్నారు. అప్పటికి పదిహేను గింజలు చాలని నిర్ణయించారు. అందరూ పదిహేను గింజలు చొప్పున ఏరుకుని తక్కినవి అక్కడే పారబోశారు.

బఠానీలు గడియారాలవంక చూస్తూ వారు గమ్యం చేరారు. వారి మూలంగ మా ప్రయాణం కూడా ఎంతో రమ్యంగా నడిచింది.

(14 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**సంక్రాంతి వచ్చింది.** కానీ ఏమి తెచ్చింది? కొన్ని తలపులు వెతికి తెచ్చింది. సంక్రాంతి అంటే ఎన్నో కవనాలు. ఎన్నోగానాలు.

కోడి పుంజులు, క్రొత్త అల్లుళ్ళు, కోడి గిత్తలు, ఎన్నో జ్ఞాపకం వస్తాయి. సంక్రాంతి కోడి పుంజులకు స్వర్గద్వారం తెలుస్తోంది. పిరికి చావూ, పీడ చావూ చావకుండా అవి వీరావేశంతో పోరాడి వీర స్వర్గమలంకరిస్తాయి.

వెనుకటికి ఒక కవి పుంగవుడు వ్రాశాడు - ఈనాటి పౌరుషం, లక్ష్యం, రెండూ పారిపోయి, ఒకటి కోడికత్తిలోనూ, ఒకటి వడిసెలలోనూ దాక్కున్నాయని, ఈనాడు కోడి కత్తుల మాట అలావుంచి, వాటి శౌర్యం, వైరం, రాజకీయవర్గాలలో చేరింది. వాటి ద్వారా రాజకీయరంగంలో విచిత్ర కుక్కుట పోరాటాల నిత్య సంక్రాంతి అవతరించింది.

గ్రామ సీమల్లో కోడిపందాలు ఇంకా విరివిగా సాగుతూనే వున్నాయి. కుక్కుటాలు నేటికీ పౌరుషశ్రీలను వెలారుస్తూనే వున్నాయి.

ఈ సంవత్సరం ఆంధ్రప్రాంతంలో మధ్యపానం మీద నిషేధం తొలగించడంవల్ల చాలా ఇళ్ళల్లో పానీయాల సీసాలు అతి అందమైనవి, సుందరమైనవి బొమ్మల కొలువుల్లాగా అవతరిస్తున్నాయి. మనస్సుల మధురగానాలలో మునిగి తేలుతున్నాయి. అందువల్ల ధనం భోగిమంటలలో నవ్వుల పంటల్లో పడటం ఒక పండుగ దృశ్యంగా మారి అనుకోని సంక్రాంతి అవతరించింది.

కోడిపుంజుల పోరాటాలకు సంబంధించిన సామెతలు మనకు చాలా వినిపిస్తాయి నిత్యజీవితంలో. ఒక ఇంట్లో ఇద్దరు పిల్లలు తరుచుగా తగవులకు దిగుతుంటే బామ్మ అంటుంది. "ఇదేం ఖర్మమో? వీరిద్దరూ ఒకరిమీద ఒకరు కోడిపుంజులల్లే లేస్తారమ్మా ఇద్దరూ కత్తులు కాళ్ళకు కట్టుకు పుట్టారదేం ఖర్మమో?" అని.

ఎదుటివాళ్ళ మీదకు మెదిలితే తిడుతూ తగవుకు లేచే వాళ్ళను గురించి మాట్లాడేటప్పుడు, "సాగిందా పుంజుల పోరాటం. అని కత్తులు కాళ్ళకు కట్టుకు ఎగురుతాయి. వీటికి నాలుకలే కత్తులు. తిట్లతో నాట్యం ప్రారంభిస్తారు" అనడం వింటూ వుంటాం.

పల్లెటూళ్ళల్లో పండుగ శోభ యింకా కొంతవరకూ నిలిచివుందిగాని బస్తీల్లో, నగరాలలో వాటి స్వరూపమే హరించిపోయింది. చాలావరకు, పట్టణాలలో గుమ్మాల ప్రక్కగా ప్రవహించే మురుగు కాల్వల దుర్గంధం గొబ్బిదేవతలు భరించలేవని కాబోలు - అసలు వాటిని పెట్టడమే మానేసారు.

మొన్న ఒకావిడ అంటోంది. "పేడచేత్తో ముట్టుకోవడమెలా అసహ్యం. ప్లాస్టిక్కు గొబ్బెమ్మలు తయారుచెయ్యరేం? వాటిని ఒక టేబుల్ వేసి వరండాలో పెట్టుకోవచ్చుగా. ఈ "ఐడియా" ఎవరికీ రాదేం. బొంబాయిలో మావాడున్నాడు. వాడికి వ్రాసి పై సంక్రాంతికన్నా అవి వచ్చేలాగా చూడమనాలి" అంది.

"మీ అయిడియా అద్భుతంగా వుందండీ. సాధ్యమైనంతవరకు పాత ఆచారాలను మార్చివేయడమే. మన అభిలాష. ఇలాంటి "అయిడియాలు" మీరు కొన్ని ఆలోచించి బయట పెడుతూ వుండండి. పారిశ్రామికవేత్తలు మీకు మంచి బహుమతి కూడా ఇస్తారు" అన్నాను.

సంక్రాంతికి అల్లుళ్ళు రావడం అనేది పూర్వం పెద్ద ఉత్సవంగా ఉండేది. ప్రతి ఇంటికి అల్లుళ్ళందరూ గవర్నర్లలాగా దిగేవారు. వెంట రక్షణదళంలాగా అతని తల్లీ, తోబుట్టువులు వచ్చేవారు. అల్లుడుగారు "ఏ ఆర్డినెన్సు" పాసు చేసినా తక్షణం అమలు జరగవలసిందే.

అల్లుళ్ళున్న కొద్దిరోజులూ మామలు, బావమరుదులూ ఏ క్షణానపడితే ఆ క్షణం ముద్దాయిలాగా నిలబడవలసిందే ఏం శిక్షపడుతుందోనని గజగజలాడవలసిందే. ఎన్ని హుకుములు చేసినా, ఎన్ని బహుపరాకులు పలికినా అల్లుళ్ళ పెదవులమీద మందహాసం చిందడం అరుదుగా వుండేది.

ఒకరింటికి సంక్రాంతికి అల్లుడొచ్చి వారం పదిరోజులు మకాం చేసి ఎలాగైతేనేం ఇంటికి వెడతానని బయలుదేరాడట. ఆ సమయంలో మామగారు చేతులు కట్టుకుని నిలబడి "తమరికేదైనా లోపం జరిగితే మన్నించాలి. ఉంటే చెప్పండి. ఈసారి వచ్చేసరికి సర్దుకుంటాం" అని సవినయంగా అడిగాడుట.

దానికా జామాత గుడ్లు తిప్పుతూ "అది మీ వల్ల కాదులెండి. చెప్పడం అనవసరం" అన్నాడుట.

"మీరలా అంటే ఎలా? తప్పకుండా సర్దుకుంటాం. మీకంటే ఎక్కువేలమంది మాకు? మీరు తృప్తిగా, శాంతిగా వుండటమే మాక్కావలసింది" అన్నాడుట మామగారు.

గుమ్మం అవతల నిలబడి చీరకొంగు గీరుకుంటున్న అత్తగారు "అంతేమరి అంతకన్నా ఏం వుంటుంది?" అని వంతపాట పాడిందిట.

"అయితే లోపం చెప్పమంటారా తర్వాత చింతిస్తారు అయినా నాకు లెక్కలేదు. చెపుతాను. మీరు ఇంతకాలం బ్రతకడం నాకు మాత్రం ఇష్టంలేదు. ఒక్కతే కూతురని, సిక్లీ మామగారనీ మీ సంబంధానికి అంగీకరించాగాని, వేరే కారణాలవల్ల కాదు" అన్నాడుట అల్లుడు.

పాపం ఏం చేస్తాడు మామగారు? అత్తగారామాట వినలేక లోపలికి పారిపోయింది. మామగారు కొంచెం ఆలోచించి "మీకు కావలసింది నా ఆస్తేగా. నా ఆయుర్దాయం సంగతి దేనికి వచ్చే సంక్రాంతికి మీ అభిలాష తీరుస్తాను వెళ్ళిరండి" అని కొంచెం దూరం సాగనంపి వచ్చాడుట.

అల్లుళ్ళలో తనయుళ్ళవంటివారు వుంటారు. దానవులలాటివాళ్ళూ వుంటారు. రానురాను అల్లుళ్ళ ఆర్భాటాలు ఎక్కువైపోతున్నాయి. తెల్లని కాకులన్నీ కనిపిస్తున్నాయిగానీ, అల్లుళ్ళ మంచితనాలు మృగ్యమవుతున్నాయి. అడిగినంతకట్నం గుమ్మరించి తెచ్చుకోవడంవల్ల ఏర్పడిన అగచాట్లవి.

కనుక సంక్రాంతి పండగల్లో అల్లుళ్ళ మర్యాదలు చాలావరకు అదృశ్యమవుతున్నాయి. ఎవరింటికైనా పాత ఆచారం ప్రకారం కొందరు వచ్చినా, టూరిస్టుల్లాగా వస్తున్నారుగాని రాయల్ గెస్టుల్లాగా రావడం పోయింది.

గంగిరెద్దుల హడావుడి కూడా తగ్గింది చాలావరకు. అందమైన ఎద్దును సంపాదించి, ఎంతో చక్కగా అలంకరించి తెచ్చేవారు పూర్వం. గంగిరెద్దులకున్నూడా కొన్ని లక్షణాలుండేవి. అందమైన నమూపురం, పసందైన కొమ్ములు, గంభీరమైన నడక, వగైరాలుండటంవల్లనే వాటిని చూడగానే కొంత ఆకర్షణ ఏర్పడేది.

ఇంటింటా వాటికి చాటెడు బియ్యం దొరికేవి. వాటి పాదాలు కడిగేవారు. పసుపు రాసేవారు. కొమ్ములకు మెళ్ళోనూ బంతి పూలదండలు వేసేవారు. వెన్నుమీద వస్త్రం కప్పితే పున్నెమని భావించేవారు. అవి దీవిస్తే అమితమైన భాగ్యాలు కలుగుతాయని భావించేవారు.

ఇప్పుడు వాటి దీవినలెవరిక్కావాలి? అయినా అంత వదాన్యత ఎక్కడుంది ఎసట్లో బియ్యానికే వెతుక్కునే కాలంలో చేటల్లో ధాన్యం ఎక్కడ నుంచి తెచ్చి పోస్తారు?

మొన్న మా వీధికో గంగిరెద్దు వచ్చింది. మేళం వినిపించగానే చూద్దామని వరండాలోకి వెళ్ళాను. మూడేళ్ళ దూడకు మూడు మూరల బట్టకప్పి, ముందుకాళ్ళకు నల్లటి త్రాళ్ళు కట్టి తీసుకువచ్చారు. పదమూడేళ్ళవాడొకడు సన్నాయి వాయిస్తున్నాడు. వాడిపై వాడులాగా వున్నాడు వాడు డోలు కొడుతున్నాడు.

'రామా సుజన జీవనా' అనే త్యాగరాయకృతిని వాడు త్రుంచి, త్రుంచి, ఆలాపన వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లో వున్నగాలి అంతా ఉపయోగించివాడు పాడుతున్నాడు. పిల్లవాళ్ళు అదే గొప్పగా భావించి ఆ మూడేళ్ళ గంగిరెద్దుకే ముచ్చట పడుతున్నారు. తలో రెండు పైసలు తెచ్చి ఇస్తున్నారు.

ఆ కుర్రవాడు పాట ఎలా వున్నా, ఏ సినిమా పాటో పాడకుండా త్యాగరాయకృతి ఎత్తుకున్నందుకు సంతోషించి పదిపైసలిచ్చి పంపించాను. వాడు గంగిరెద్దును దీవించమన్నాడు. దానికి వోపికాలేదు. ఇష్టంలేదు. అందుకని అలానే నుంచుంది. అతగాడు మరో యింటికి తోలుకు పోయాడు.

నేను నుంచుని ఆలోచించాను. "అన్ని రంగాలలో శక్తి క్షీణించిపోతోంది. గంగిరెద్దు స్వరూపం ఎంత మారిపోయిందో" అని.

"మన దేశంలో నాయకత్వాలు మాత్రం?" అనే ప్రశ్న మనస్సులో మెదిలింది. ప్రమాణాలు తరిగిపోతున్నాయి. నమూనాలు మిగులుతున్నాయి.

(4' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఇటీవల** ప్రఖ్యాత నటుడు రఘురామయ్యగారిని రెండు పద్యాలు పాడమని అడిగాం మా బంధువుల ఇంట్లో. ఆయన కొంచెం సేపు ఆలోచించి "కొద్దిగా లవంగాలు తెప్పించండి" అన్నారు. కానీ, ఇంట్లో లవంగాలు లేకపోయినాయి. ఒక కుర్రవాణ్ణి పిలిచి అంగడికి వెళ్ళమన్నాం.

ఆయన "వద్దులెండి, ఇంట్లో వున్నాయేమోనని అడిగాను. లవంగాలు సామాన్యంగా నోట్లో వేసుకోను. కానీ అవి దగ్గరపెట్టుకుంటే చాలు. అలా అలవాటైంది" అన్నారు. లవంగాలు దగ్గరవుంటేనే చాలు సంగీతం వస్తుందాయనకు.

మా చిన్నతనంలో ఒక గాయకుడుండేవాడు. ఆయన సంగీతం పాడాలంటే రెండు గుప్పెళ్ళు కందిపప్పు దగ్గిర ఉండాలి. మధ్య మధ్య రెండు బద్దలు నోట్లో వేసుకుంటూంటేగాని రాగం పెగిలేదికాదాయనకి. ఆయనగారు ఎక్కువగా కమాచిరాగం పాడుతూండేవారు.

అది చూచి కొందరు 'కందిపప్పుకి, కమాచి రాగానికి ఏదో సంబంధం వుంద'ని ఆయనతో హాస్యంగా అంటూ వుండేవారు. మొత్తం మీద ఆయనగారిని "కందిపప్పు గాయకుడు" అనేవారు.

శ్రీ రఘురామయ్యగారు లవంగాలు దగ్గర పెట్టుకుని పాడుతుంటే సంగీతానికి అవి దోహదాలు కదా అనిపించింది. తర్వాత ఆయన అన్నారు: "ఒక్క లవంగాలే కాదు, ఏదే నా కారపు వస్తువు దగ్గర వుండాలి సార్. మిరియం, శొంఠి వగైరాలలో ఏదో ఒకటి" అన్నారాయన.

ఈయనకు సంగీతం మీద ఎంత ప్రీతో. వ్యాయామం, యోగాభ్యాసాల మీద అంత ప్రీతి. వారింట్లో తంబూరా ఒక మూల వుంటే, కసరత్‌లో ఉపయోగించే ఇనపబార్ ఒక ప్రక్కన ఉంటుంది. ఆయన ఎప్పుడు మాట్లాడినా సంగీతానికి, ఆరోగ్యానికి గల సంబంధాన్ని గురించి ఎక్కువగా చెపుతూ వుంటారు. తను యోగాభ్యాసం చేస్తూ తరాన్ని ఎలా కాపాడుకునేది చెపుతూంటారు. ఊపిరితిత్తుల్ని ఎలా రోజూ శుభ్రం చేసుకోవాలో వర్ణించి, ఇతరులక్కూడా నేర్పుతానంటూ వుంటారు. గొంతులో అనేక వింత తీగలున్నాయంటారు.

మొత్తం మీద "మంచి శరీరంలోనుంచి మంచి సంగీతం వెలువడుతుంది" అనే సిద్ధాంతాన్ని ఆయన ఎప్పుడూ అమలులో వుంచుకుంటారు. 'గాయకుడికి ఊపిరి ఊపిరి తిత్తులు అవి బలంగా వుండాలి. అప్పుడు ఖంగుమని రాగం రావాలి' అంటారాయన. ఈ సందర్భంలో జార్జి మెరిట్‌తో జ్ఞాపకం వస్తాడు. ఈయన విక్టోరియన్ యుగానికి చెందిన ప్రఖ్యాత రచయితా, వేదాంతి. ఈయనకు బల ప్రదర్శనలంటే ఎంతో యిష్టం. కాస్త తీరిక దొరికితే అనేక కసరత్ ఫీట్స్ చేస్తూ వుండేవాడు.

పెద్ద పెద్ద ఇనుప చక్రాల్ని దూరంగా విసురుతూ వుండేవాడు. ఇనప కడ్డీలను గాలిలోకి ఎగరవేసి పట్టుకుంటూ వుండే వాడు. కొన్ని సందర్భాలలో ఇనపకడ్డీలను తలమీద పెట్టుకుని, రెండు చేతులతో వాటిని వంచుతూండేవాడు. చిన్న చిన్న వాసపు ముక్కల్లాగా. మానసిక విభూతికీ, శారీరక దారుఢ్యానికి ఆయన చక్కటి అనుబంధం కుదిర్చి, రెండు శాఖల్లో "శాండో" అనిపించుకునేవాడు.

లలితకళల ఆరాధనకు ప్రశాంతత అవసరమని చాలామంది అభిప్రాయం. కాని కొందరికి ఎంత గందరగోళంలోనైనా లలితకళల్ని ఆరాధించటం అలవాటు. అలాంటి వారిలో ఆస్కార్ వైల్డ్ ఒకరు. ఆయన హోటల్లో ఆర్కెస్ట్రా మ్రోగుతుండగా, పెళ్ళివాళ్ళ ప్రక్కన కూర్చుని ఆయన రచనలోకల్లా గొప్ప గ్రంథం ఒకటి సృష్టించాడట. ప్రఖ్యాత కళాకారుల జీవితాలలో అనేక వింత అలవాట్లుంటాయి మరి.

ప్రఖ్యాత రచయిత హెమింగ్ వే ఒక తెల్లటి గోపురం లాంటి కట్టడం సృష్టించుకుని దానిమీద గువ్వలాగా కూర్చుని వ్రాస్తుండేవాడుట. అంతేకాదు, ఆయనకు ప్రకృతిమీదా, పశుపక్ష్యాదులమీదా ఎంతో అబిమానం, ఆసక్తి వుండేవట.

ఆయన చూట్టూ ఎప్పుడు చూసిన పదహారు శునకాలు, పది ఆవులు, యాభై పిల్లులూ, ఒక వంద పావురాలు వుండేవట. వాటి భవు భవుల మధ్య, మ్యావ్‌మ్యావ్‌ల మధ్య, అంబా అనే అరుపుల మధ్య ఆయన బుర్ర పాదరసంలాగా పనిచేసేదట. కలం అతి వడిగా పరుగెత్తేదట

ప్రపంచ ఖ్యాతి చెందిన టాల్‌స్టాయ్‌కి రైలు కూతలు వినడమంటే ఎంతో యిష్టం. అందులో ఫైర్ ఇంజన్ కూత అంటే మరీ యిష్టం. ఆ కూత వినబడగానే ముఖం విప్పారేది. మంచి సంగీతం వింటున్నట్లుగా సంబరాలుపడేవాడుట. అంతేకాదు. ఇతరుల దృష్టిని ఆకర్షించే వింత పనులు కొన్ని చేస్తూవినడం ఆయనకు అలవాటు. ఒకసారి కనుబొమలు తీసివేసి, వీధుల్లో తిరగడం మొదలు పెట్టాడుట. అంతకంటే వెర్రి ఆలోచనలు కూడా వస్తుండేవాయనకు. వాటిలో ఒకటి ఏమిటంటే తాను కావాలంటే పక్షిలాగా పైకి ఎగరగలననే భ్రాంతి, భ్రాంతి వుండటం సరే, ప్రయత్నం కూడా చేసేవాడు. ఒకసారి మేడ రెండో అంతస్తునుండి ఎగరటానికి ప్రయత్నం చేశాడు. అక్కడనుంచి క్రిందపడటం, స్పృహ తప్పడం జరిగింది. అయితే, ఆయువు ఎక్కడో దాగివుండి, మళ్ళీ బ్రతికించి, కలం చేతపట్టించింది.

కొందరు రచయితలకు మరీ విచిత్రమైన అలవాట్లుంటాయి. ఒకచోట కూర్చుని కలం పట్టి వ్రాయటం కుదరని వాళ్ళు చాలామంది ఉన్నారు. ప్రఖ్యాత రచయిత విక్టర్ హ్యూగోకు 1852లో ద్వీపాంతరవాస శిక్ష విధించారు. వెళ్ళి ఒక ద్వీపంలో చేరాడు. అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన "లేమిజరబుల్స్" గ్రంథాన్ని వ్రాశాడు. అదైనా ఎలాగో తెలుసా నిటారుగా నిలబడి మరి ఎలా తంటాలు పడ్డాడో ఏమో, కొంగజపం చేస్తూ ఒక గొప్ప గ్రంథం వ్రాశాడు.

అలగ్జాండర్ డ్యూమస్ గ్రంథం వ్రాసేటప్పుడు మంచి భావాలు రాకపోతే, వెంటనే ఒక జపాను గౌను తీసుకుని తొడుక్కునేవాడు. తిండి అపరిమితంగా తినేవాడుట. కాని, కాఫీ, సిగరెట్లు వగైరాలను దగ్గరకు రానిచ్చేవాడుకాదుట. అప్పుడప్పుడు కొంచెం నిమ్మరసం పుచ్చుకునేవాడుట.

వ్రాస్తుండగా ఎవరైనా మిత్రులు వస్తే, తన భావాలు తెగిపోకుండా కుడిచేత్తో వ్రాస్తూనే ఎడంచేత్తో కరచాలనం చేసేవాడుట. కాగితాలు బల్లమీద పెట్టి వ్రాయటం ఈయనకి చేతకాదుట. అందువల్ల ఒక సోఫాలో పడుకుని దిండు మీద వ్రాలి, కాగితాలు సోఫాలోనే పెట్టుకుని, ఎంతసేపైనా వ్రాసేవాడుట.

లాయిడ్ జార్జి వ్రాత పద్ధతి మరీ విచిత్రంగా ఉండేది. మంచం మీద వెల్లకిల పరుండి పెన్సిలుతో త్వరత్వరగా వ్రాసి పారేసేవాడు. ఆ వ్రాత ఆయనగారి టైపిస్టులకు మాత్రమే అర్థమయ్యేది. వాళ్ళక్కూడా అర్థం కాకపోతే ఆ కాగితాల గతి అంతే. మళ్ళీ వ్రాయాల్సిందే మరి ఆయన వ్రాత ఆయనకే అర్థమయ్యేదికాదు. అందువల్ల అలాంటి శిక్షపడేది పాపం.

**(7 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మొన్న ఒక** పెద్ద మనిషితో మాట్లాడటానికి వెళ్ళాను. పరిచయం అయిన తర్వాత క్రమంగా ప్రసంగంలోకి దిగాం. ఆయనగారికో వింత అలవాటుంది. ఒక విషయం చెప్పడం పూర్తి అవగానే, నాలిక కొద్దిగా కరుచుకుని, ఎడమచేతి గుప్పిటితో కుడి భుజం మీద ఒక్కసారి కొట్టుకుంటాడు తర్వాత మళ్ళీ సంభాషణ ప్రారంభిస్తాడు.

ఆ దెబ్బలు ఆయనగారి సంభాషణకు ఫుల్‌స్టాపులాగా కనిపించాయి. ఇష్టమొచ్చినప్పుడల్లా అలా కొట్టుకోకుండా, ఒక భావాన్ని పూర్తిచేసి ఆ సంతృప్తిలోనే అలా కొట్టుకోవడం ఎంతో గొప్పగా కనిపించింది. ఆయనలో కనిపించని చందస్సున్నదనిపించింది.

నా చిన్నతనంలో కొద్దిరోజులు ఒక మీసాల ఆసామీ దగ్గర ఒక చిన్న ఉద్యోగం చేశాను. ఆయన నా చేత ఉత్తరాలు వ్రాయిస్తూవుండేవాడు. ఒక ఉత్తరం చెప్పడానికి ఒక గంట పైగా చెప్పేవాడు. ఎందువల్ల? ప్రతి వాక్యం తరువాత ఎడమవైపు మీసాన్ని వేళ్ళతో కాసేపు కొరికేవాడు. అప్పుడు గాని ఆయనకు ఆలోచన తట్టేది కాదు.

అంత ఆలస్యంగా ఉత్తరం చెప్పి "త్వరగా టైపు చెయ్యండి. ఈ పోస్టులో వెళ్ళాలి. అరగంటే ఉంది" అని తొందరపెట్టేవాడు. ఒకరోజు ఆయన ఆలాటి హెచ్చరిక చేయగానే అన్నాను "తొందరగానే టైపు చేస్తాను. నాకు పెద్ద మీసాలు లేవుగా కొరుక్కుంటూ కూర్చోవడానికి" అని. ఆయనగారికి కొంచెం కోపం వచ్చిందనుకోండి. అది వేరే సంగతి. ఆయన అలవాటు మాత్రం పోలేదు.

ఈ రోజుల్లో చాలామంది రచయితలు కాఫీ, సిగరెట్లు బలంతో కాలం సాగిస్తున్నారు. అవిలేకుంటే. "ఆవు పాలు ఇచ్చును" "కుందేటికి కొమ్ములుండవు" "గుర్రం సకిలించును" వంటి వాక్యాలు కూడా వ్రాయలేకపోవచ్చు.

"ఈ కథ ఎన్నాళ్ళలో వ్రాశావు?" అని ప్రశ్నిస్తే

"ఆరు సిగరెట్టు పెట్టెల కొరతలో" అని ఒకాయన జవాబిచ్చారు.

"ప్రియురాలికి వ్రాసిన ప్రతి ఉత్తరానికి రూపాయి డెబ్బయి పైసలవుతోంది. రూపాయి సిగరెట్లకు, అర్ధరూపాయి కాఫీకి, ఇరవై పైసలు పోస్టు కవరుకూ" అని ఒకాయన వ్రాసుకొచ్చాడట డైరీలో.

నేను ఒక వారపత్రిక ప్రచురణ కార్యక్రమం చూస్తున్నప్పుడొకాయన అరవై పంక్తుల గేయం ఒకటి పంపాడు ఆయన ప్రసిద్ధ రచయిత. కానీ గేయం చివర "ఇది సిగరెట్టు కాల్చకుండా వ్రాసిన గేయం. అదే దీని ప్రత్యేకత" అని వ్రాశాడు.

అది చూచిన తర్వాత సిగరెట్ అలవాటుగల రచయితలు సిగరెట్టు మత్తులేకుండా కథలు, గేయాలు వ్రాసి కొన్ని ప్రకటిస్తే బాగుండుననిపించింది.

వెనుకటికి బందరులో ఒక కవి పుంగవుడు వ్రాశాడు. టీ, కాఫీ, హుక్కా, బీడీ, సిగరెట్టు, కారాకిల్లీ ఇత్యాదుల ఇన్స్పిరేషన్ ఉంటుంది. మరికొందరికో ప్రేయసి, ప్రియురాలు, విరహం, విప్రలంబం, నిరాశ, నిస్పృహ కారణమవుతాయి.

ఈ కాలంలో ఇన్స్పిరేషన్‌లకు కొరతలేదు. ఆకలి కడుపులు, పీకుడు ముఖాలు అధిక సంతానం ఆర్థిక దుర్భిక్షం, కార్మిక శ్రేయస్సు, స్వాతంత్ర్యాసక్తి, ప్రభుత్వంపై విరక్తి, ఇత్యాదులెన్నోకాలాన్ని పరుగులెత్తిస్తున్నాయి.

పోతే, స్త్రీ రచయితలకు పొగ త్రాగుడు వగైరా అలవాట్లుండవు గనుక వారు వ్రాసే కవిత్వం చాలా వరకు సహజంగా, స్వచ్ఛంగా వుండే అవకాశాలేర్పడుతున్నాయి. అయితే, వారికి కొన్ని ఇబ్బందులు మాత్రం ఉంటాయి.

ఇటీవల ఒక రచయిత్రి సారస్వతాన్ని గురించి చర్చిస్తూ సంసార సేవలో గల బాధ్యత సాహిత్య సేవకు చాలా అడ్డం వస్తూ ఉంటాయి. ఈ విషయంపైన ఒక వ్యాసం వ్రాస్తున్నాను. ఏ క్షణానికా క్షణం ఏదో ఒక క్రొత్త సమస్య వచ్చిపడుతుంది సంసారంలో అన్నారు. నిజమే సంసారాలు సాహిత్య సేవకు కొంతవరకు అవరోధంగానే వుంటాయి. అని ఇన్స్పిరేషన్ కల్పించడానికి బదులు అనుకుని "పాల్పిటేషన్" కల్పిస్తూవుంటాయి.

మా మిత్రుడొకాయన ఉండేవారు. ఆయన రచయిత. ఆయన ఏదైనా రచన ప్రారంభించడానికి ముందు ఎంతో బాధపడేవాడు. ఒకప్పుడా బాధ పది, పదిహేను రోజులదాకా ఉండేది. కలం తీసుకోవడం, కొంచెం సేపు ఆలోచించి, కళ్ళు నులుపుకుని దాన్ని క్రిందపెట్టి కూర్చోవడం తర్వాత లాభం లేదని లేచి ఇవతలకు రావడం ఆయనకు అలవాటైంది.

ఇలా వారం రోజులపాటు ప్రతి వ్యాసానికి, ఆయనగారికి దొంగనొప్పులు వచ్చిపోవడం ఆచారమైపోయింది. కానీ మొదలు పెడితే మాత్రం అన్నం తినకుండా కూర్చుని ఆ వ్యాసం పూర్తిచేసేవాడు. ఆదిలో ఎంత బాధపడ్డా చివరకు 'సుఖప్రసవం' అని సంతోషించేవాడు.

'నా సహాధ్యాయి ఒకడున్నాడు, ఆయన ఏమి వ్రాయాలన్నా అంతులేని బాధతో గంటా రెండు గంటలు గడిపేవాడు. ముఖం ఎర్రబడేది. కళ్ళవెంట నీరు కారేది. ఆయన వంక చూడటానికి బాధగా ఉండేది. కొంతసేపటికి ప్రారంభించేవాడు వ్యాసం. ముఖంలో ఎరుపు కొంచెం కొంచెం తగ్గేది. పది కాగితాలు గీకి అవతల పారేసిన తర్వాత కళ్ళలో మంచు పువ్వులు విరిసేవి.

ఆదిలో అనుభవించే బాధకు ఆయన "కృత్యాద్యవస్థ" అని పేరు పెట్టుకున్నాడు పాపం. ఆరంభ దశలో మాత్రం సృష్టి అంతా తిరగతోడుతున్న వాడి ఫోజు పెట్టడం ఆయనగారికి రివాజయిపోయింది. వ్రాసింది బేరీజు వేస్తే ఆ విలువ కనిపించేది కాదు.

ప్రఖ్యాత నవలా రచయిత బాల్‌జాన్ ఏదైనా వ్రాయాలంటే అర్థరాత్రివేళ లేచి కూర్చునేవాడట. తెల్లవారినా కలం క్రిందపెట్టేవాడుకాదు. మర్నాడు మిట్టమధ్యాహ్నం అయ్యేవరకూ ఆ కలం అలా పరుగులు తీస్తూనే ఉండేది. మరి ఎక్కడది అంత బలం?

ఆయన దగ్గర ఎప్పుడూ ఒక నౌకరుండేవాడు. బాల్‌జాన్ అడక్కపోయినా ఆ నౌకరు అరగంటకోమాటు కాఫీ కప్పులో పోసి దగ్గర పెడుతుండేవాడట. అది చల్లారకుండా నోట్లో పోసుకోవడం ఉషారు చల్లారకుండా చూసుకోవడం బాల్‌జాన్ కవి పని.

అలా కాఫీ సముద్రానికి జీవితమంతా అతగాడు అవుపోసనం పడుతూనే ఉండేవాడట. చాలామంది అంటూ ఉండేవారట "ఆ గ్రంథాలన్నీ కాఫీ వ్రాసింది. బాబ్‌జాన్ కాదు" అని. నిజమే మరి. కాఫీ అలా ఉంచకపోతే ఆయన ఒక ఉత్తరం కూడా వ్రాయలేక పోయేవాడేమో.

హిందీ సాహిత్యంలో ప్రముఖ వ్యక్తిగా పరిగణింపబడిన భారతీయ హరిశ్చంద్ర తను ఏది వ్రాయాలన్నా ముందుగా గుప్పెడు అగరువత్తుల వెలిగించేవాడట. వాటి పరిమళంలో ఆఘ్రాణిస్తూ, అద్భుతమైన రచనలు చేసేవాడట.

ఇప్పటివలే ధరలు ఆకాశం అంటకుండా అందుబాటులో ఉండే ఆ రోజుల్లోనే ఆయన ప్రతిరోజూ పాతిక ముప్పయి రూపాయల విలువగల అగరు వత్తులు వెలిగించేవాడట. ఆహారం, వగైరాలకు ఎంత ఖర్చుపెట్టేవాడో తెలియదు. ఆయన్ని "అగరవత్తుల మహాకవి" అనేవారట.

(10 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**వెనుక** బందరు పట్టణంలో ఇద్దరు పిచ్చివాళ్ళుండేవారు. ఎవరికి వారు ఎక్కడ పడితే అక్కడ అంతులేని అల్లరి చేస్తూ తిరుగుతూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు విచిత్రంగా ఇద్దరూ కలుస్తూ ఉండేవారు. అప్పుడు ఆ ఇద్దరి మధ్యా చాలా తమాషా సంభాషణ జరుగుతూ ఉండేది.

ఉదాహరణకు ఒకటి చెపుతాను. వారిద్దరూ ఒకరోజు సాయంత్రంపూట కాఫీ హోటల్ వద్ద కలుసుకున్నారు. ఒకాయన బయటినుంచి ఇలా అరిచాడు -

"ఒరేయ్ పిచ్చి సన్యాసి నువ్వు బయటికిరా అక్కడ కూర్చున్నావేం? ఈ హోటల్ నాది. రా నీకీ మాత్రం తెలియదు. త్వరగా రా బయటికి. నే లోపలికి వెళ్ళాలి" అని.

లోపల వున్న ఆయన "నన్ను పిచ్చివాడంటున్నావా? నీది అసలు పిచ్చి. నాకేం పిచ్చిరా. నవ్వుతూ నాలుగు గారెలు తిన్నాను. పెసరట్టుకు ఆర్డరిచ్చి అక్బరు చక్రవర్తిలాగా కూర్చున్నాను" అన్నాడు.

"ఆరి దుర్మార్గుడా హోటల్ నాది అంటే వినవేం. నువ్వు అక్బరువైతే నేను అశోకుణ్ణి. నీ ఆటలు నా దగ్గర సాగవు. త్వరగా బైటికిరా. నాకు ఆకలవుతోంది" అని రెండో ఆయన ఆజ్ఞ

ఇద్దరూ చదువుకున్నవాళ్ళు. ఒకరు పండితుడు. ఒకాయన నటుడూ అవడంవల్ల చమత్కారంగా మాట్లాడుతూ ఉండేవారు. మధ్య మధ్య పద్యాలు చదువుతూ ఉండేవారు.

"నా హోటల్! నా హోటల్" అని ఒకాయన అంటుంటే చివరకు రెండో ఆయన అన్నారు "హోటల్ నీదేమిట్రా? అసలీ ఊరు నాది. నవాబుగారు నాకు వ్రాసి ఇచ్చాడు. కావాలంటే మా యింటికిరా పట్టా చూపిస్తాను."

"నీ పట్టా ఎవడిక్కావాలిరా. అక్కడ నుంచి కదలకపోయావంటే జుట్టు పట్టుకుని ఈడ్చుకువస్తాను. కాసేపట్లో జరగబోతోంది పిచ్చయ్య మానభంగం జాగ్రత్త" అని రెండో ఆయన హుంకరించాడు.

అక్కడితో లోపల పెసరట్టు తింటున్న వెర్రివాడు, దాన్ని దూరంగా త్రోసివేసి, లేచి నిలబడి ఉత్తరీయం గట్టిగా పొట్టకు అదుముకుని

"హే కృష్ణా మొరాలింపవా
యదుకుల కృష్ణ మొరాలింపవా
పాపాత్ముడు, దుష్టాత్ముడు
పరాభవింప వచ్చె
నీదు సోదరిని గానా
నీ అభయము వినలేనా కృష్ణా."

అని చక్కటి సంగీతంతో పాడి హోటల్లో ఫలహారాలు చేసేవారినందర్నీ పరవశుల్ని చేశాడు. ఆ సమయంలో వాకిట్లో వున్న 'వెర్రి' పరుగెత్తుకువచ్చి "ఎంత బాగా పాడావురా గొప్ప నటుడివి కావ్రటా. నీకు కప్పు బహుమతి ఇస్తున్నానురా" అని అక్కడ ఎవరో కాఫీ త్రాగి వదిలిపెట్టిన పింగాణీకప్పు చేతికిచ్చి అందర్నీ చప్పట్లు కొట్టమని, తనాగాయకుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

ఈనాడు కాంగ్రెసులో బయలుదేరిన వర్గాల్ని తలచుకుంటే పై వృత్తాంతం జ్ఞాపకం వచ్చింది. పైన చెప్పిన వాళ్ళిద్దరూ చివరకు ఆలింగనాల్లో కరిగిపోయినట్లు వీరు కరిగిపోతారో లేదో తెలియదుగానీ, వాళ్ళిద్దరూ ఒకరినొకరు నిందించుకున్నట్లుగానే ఉభయ పక్షాలు నిందించుకోవడం జరుగుతోంది.

ఒకరు హోటల్ నాదంటే, ఒకరు ఊరు నాది అన్నట్లుగానే వీరూ 'దేశం మాది' అంటూ ప్రకటనలు చెయ్యడం జరుగుతోంది.

ఆకాశం మీద చందమామలు రెండు ఉండటం, ఇద్దరు సూర్యులుండటం ఎంత అసంభవమో, ఐచ్ఛికమైన కాంగ్రెసు సంస్థలు రెండు ఉండటం కూడా అంత అసంభవం అనే భావం ఏ ఒక్కరికీ కలగకపోవడం ఆశ్చర్యకరం.

ప్రతిష్ఠ కాపాడుకోదలచినవారికి ధర్మాన్ని బేరీజు వేసుకోవడం రివాజు. ఆ దృక్పథం లేని వారందరినీ వట్టి పోజుల క్రిందే జమకడతాయనేది తేలిగ్గా అర్థమయ్యే సత్యం. కలహాలలో కక్షల్లో మునిగి తేలేవారు అంటే పరిశీలనకు దిగకపోయినా ప్రజానీకం ఎక్కడికి పోతుంది? వంచనా శిల్పాన్ని వారెంతమాత్రం సహించరు.

దేశాన్ని మేము కాపాడుతాం, మేం రక్షిస్తామని ఉభయులు ఉత్తరకుమారుడు ప్రజ్ఞలు కొడుతుంటే ఇరుపక్షాల వారిమీదా నమ్మకంలేక ప్రజలు నభోలోకం వంక చూడటం జరుగుతుంది. జరుగుతోంది.

అహ్మదాబాదులో తాము జరిపితే బొంబాయిలో వీరు జరిపారు. ఇరుపక్షాలవారికీ 'మా సభ విజయవంతమైంది' అనే ఆశాభావం ఏర్పడింది. ఇరువురికీ ప్రేక్షకులు కరువులేరు. ఇరువురూ "మా సభలకే ఎక్కువమంది హాజరయ్యారు" అన్నారు. ఎలా


కౌముది

హాజరయ్యారు? ఎందుకు హాజరయ్యారు? ఎలాంటి అనుభూతి సంపాదించారు? అనే ప్రశ్నలకు తావులేదు. హాజరయారు. అమితంగా హాజరయారు.

భారతదేశం చాలా పెద్దది. ఇలాటి సభలు పదహారు ఒకే నెలలో జరిగినా, దేశంలో తలోమూలా జరిగినా, ఆఖరుకి అండమానుల్లో జరిగినా, ఇంతమందీ హాజరయే అవకాశముంది. ఎలాంటి సభలనైనా దిగ్విజయం చెయ్యగల ప్రజానీకం మనకు ఉంది. అదే అందరి ధీమా.

సభలు జరిపిన తర్వాత సందేశాలివ్వడం, తీర్మానాలు చెయ్యడం అవసరం. ఈసారి సభల్లో తీర్మానాలతోపాటు, తిట్టిపొయ్యడాలు కూడా ఒక ముఖ్యాంశంగా పరిణమించింది. అదీకాక ఒకరు అవునన్నది కాదనడం, కాదన్నది అవుననడం ఒక ప్రత్యేక ఘట్టంగా తయారైంది.

"మమ్మల్నే నమ్మండి. ఇతరుల్ని చూసి మోసపోకండి. మా సేవ మంచిది. మహత్తరమైంది. భారతదేశ భవిష్యత్తు మా చేతుల్లోవుంది. మా మందు వాడి చూడండి. ధర సరసం. ఫల విశ్వాసం ప్రకటించిన వి.పి చార్జీలు ఉచితం."

అంటూ మందుల ప్రకటనలవంటి హామీలు ఉభయ పీటాలనుంచీ వెలువడటం ఒక విచిత్ర పర్వం.

ఎవరికి వారు కొంత బలాన్ని సమకూర్చుకుని సగర్వంగా వ్యవహరిస్తూ తమరే అసలైన సంస్థ అని ప్రకటించుకుంటూ, పదవీ వ్యామోహాలోపడి, పసిడి శంఖాలూదుకుంటున్న సమయంలో అందులో వారిని కొందర్ని తీసివేశామని వీరూ, ఇందులోవారిని కొందర్ని తీసివేశామని వారూ ప్రకటించుకోవడం అర్ధరహితర, హాస్యాస్పద ప్రలాపాలుగా ఉన్నాయిగానీ, మరో ప్రయోజనమేమీ సాధించడం లేదు.

దేశంలో వ్యాపారాలన్నిటినీ జాతీయం చేస్తామని అధికార ప్రభుత్వ ప్రకటన ముందు సంస్థానాధిపతుల భరణాలు తొలగించాలని ప్రతిపక్ష కాంగ్రెసు ప్రకటన అన్నిటినీ జాతీయం చేస్తాం, అభ్యుదయం సాధిస్తాం అని ఇండికేటుల పోలికేకలు, మనలో మాట మనస్సుల్నే జాతీయం చేసుకోలేని వాళ్ళు ఇతర వ్యాపారాల్ని, పరిశ్రమల్ని చేసి సాధించే ప్రగతి ఏమిటి చెప్పండి. ఎనభై ఏళ్ళకు పైగా జాతీయ సంస్థగా రూపొందిన కాంగ్రెసు మహా సంస్థలో గణనకెక్కిన మహనీయులు, వేటినో జాతీయం చేస్తామంటే వేడుక మాటలుగా ఉండవు మరి.

కాంగ్రెసు రెండుగా చీలినందువల్ల వచ్చిన లాభనష్టాలను గురించి కొంతవరకు వివరించవచ్చు. ఒకటి పత్రికలకు కావలసినంత ముడిపదార్థం. రెండు ప్రజల నిస్పృహకు అంతులేని అవకాశం. మూడు ఊరూరా ఉత్తర కుమారప్రజ్ఞలు. నాలుగు ప్రతిపక్షుల నాల్కలకు పదును, అయిదు అవినీతి వగైరా నుంచి అదును. అనైక్యతకు చక్కటి ఆలంబన.

రెండు మహాసభలవల్ల అంతులేని ధననష్టం. ఆ డబ్బుతో ఇరవైలక్షల ఎకరాలకు మంచి ఎరువు చల్లవచ్చు. అక్కడ స్వీట్లు తిన్నారట. పాలు త్రాగారట. ప్రజలపాట్లేం తప్పలేదు. వారి పాల దారిద్ర్యమే మిగిలింది. ఎందుకొచ్చిన ఖర్చులు చెప్పండి. ఒక్కచోటే వరుసగా రెండు సభలూ జరిపినా కొంత ఖర్చు తగ్గేది. కొంత సరసం మొగ్గేది. ఇవన్నీ ఆలోచించడానికి అవకాశమేది?

వెనుక మా ఊరిదగ్గర కాలువలో పడవలకు పోటీ వచ్చింది. ఒక పడవ ఆసామి అరటిపళ్ళు పెడితే, రెండో పడవ ఆసామి లడ్డూలు పెట్టాడు ఎక్కినవాళ్ళకు. చివరికోరోజున ప్రయాణికులు జిలేబీ పెడితే ఎక్కుతామన్నారు. అలాగే చేశాడు. నెలరోజులిలా పోటీలు జరిగేటప్పటికి ఇద్దరికీ నిలువు గ్రుడ్లు పడ్డాయి. అక్కడ ఆ సొమ్ము పడవ యజమానులది. ఇక్కడ డబ్బు ప్రజానీకానిది. దీన్ని ఏం త్యాగమంటారు.

మొత్తం మీద ఏది అసలు కాంగ్రెసని తెలియడం లేదింతవరకూ. ప్రజలు ఎవర్ని విశ్వసించారో తెలియడంలేదు. ఎడ్ల జంట ఏది అసలు కాంగ్రెస్సో తేలుస్తుందదంటున్నారు. ఎడ్ల గుర్తులమీద ఆధారపడటంలో ఏమంత సొగసుంది? గుర్తుల్ని బర్తరఫ్ చేయించవచ్చు. గుణాల్ని ఫిరాయించగలశక్తి ఎవరికుంది?

ఉభయ కాంగ్రెసు మహాసంస్థలను గిరించిన ఉదంతాలు చాలా ఉన్నాయి. వీలైతే మరోసారి.

(13 జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**కాంగ్రెస్ మహా** సభలు రెండూ చాలా పట్టుదలతో పంతంతో జరిగాయి. రెండేళ్ళ తర్వాత రానున్న ఎన్నికల మానిఫెస్టోలుగా తయారయ్యాయి ఉపన్యాసాలు భారతదేశాన్ని పసిడి సీమ చేస్తామనీ, పవిత్రసీమ చేస్తామనీ ప్రతిజ్ఞలు. పూనాకు రాని కార్యక్రమాలకు సంబంధించిన ప్రకటనలు చేశారు.

వీరి సభలు వట్టి బూటకం అని ఒకరంటే వారి సభలు వట్టి నాటకం అని రెండోవారన్నారు. మెజారిటీ కాంగ్రెస్ మాదని ఒకరంటే సజావైన కాంగ్రెసు మాదని రెండోవారన్నారు. మీరు ఫలానా వారి మద్దతు కోరుతున్నారని ఒక పక్షంవారు ఆరోపణ చేస్తే మీరు మాత్రం ఊరు కున్నారా? ఫలానా వారితో పొత్తుకోసం ప్రయత్నించడం లేదా అని రెండోవారు ప్రశ్నించారు.

ఎంత చూసినా తప్పు ఒప్పుకునే వారెక్కడా కనిపించడంలేదు. తప్పులన్ని ఎదుటివారివి గొప్పతనమంతా మాది" అని మురిసిపోవడంతోనే సరిపోతుంది కాలం. ఏం కాలం? కాలానికే సిగ్గువేసి గడ్డకట్టుకుపోతోంది. ఎవరి విషయం ఆలోచించినా దొడ్డతనం మృగ్యమై దొడ్డిత్రోవ నడకలే కనిపిస్తున్నాయి. 'సబ్జెక్టు' లేని 'ప్రిడికెటీ'లలోలాగా ఈ సిండికేట్, ఇండికేట్‌లంటూ వెలిసినాయి. వీటిని ఏకం చేసేదెవరు? ప్రజానీకానికి మనశ్శాంతి కల్పించేదెవరు.

ఈ ఉభయ సమావేశాల పుణ్యమా అని బొంబాయి, అహ్మదాబాద్, యాత్రలు చేసే అవకాశం చాలామందికి లభించింది. కాంగ్రెస్ గోత్రీకులందరికి పిలుపులు వచ్చాయి. "తమరు సభలకు తప్పక దయచెయ్యాలి. సభల్ని జయప్రదం చెయ్యాలి. మీ సమక్షం అక్కడ స్వర్గంగా భావించబడుతుంది ఆశయాలన్నీ పోషించబడతాయి. మీ ఖర్చులన్నీ భరించపడతాయి" అని స్తోత్రం చేసి చాలామందిని తీసుకుపోవడం జరిగిందట.

ఒక కాంగ్రెస్ సభ్యుడు బొంబాయిలో నర్గీస్ ఉంది. ఆవిడ ఇంటికి తీసుకు వెడతానంటే తప్పకవస్తా. లేకపోతే అహమ్మదాబాద్ పోతా" అన్నాడట.

ఒకాయన మా అబ్బాయికి వచ్చే సంవత్సరం మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానంటే బొంబాయి వస్తానన్నాడట. ఇలా యీ సమావేశాలలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన కాంగ్రెసు వాదుల కోరికలు తీరినాయని చెప్పుకున్నారు మన రాజధాని నగరంలో.

ఒకాయన రెండు కాంగ్రెస్ సంస్థలు ఇద్దరు కాంగ్రెస్ అధ్యక్షులు, నలుగురు కార్యదర్శులు అన్న విషయాన్ని గురించి చర్చిస్తూ "ఇది నిజానికి చాలా తమాషాగా ఉంది. మన నాటకాలలో ఇద్దరు ముగ్గురు కృష్ణుల్ని చూడటం అలవాటు చేసుకున్నాం. అలాగ యిద్దరు అధ్యక్షులను కూడా చూస్తున్నాం.

అయితే నాటకంలో కృష్ణులు ఒకరి పోర్షన్ తరువాత రెండోవారి పోర్షన్ చెపుతారు. అంతగా అవసరమైతే వారికి వచ్చిన ప్రత్యేక విద్య ఏదో ఒకటి ప్రదర్శించి చక్కాపోతారు. ఇక్కడ అలా కాదు. ఒకే పోర్షన్ ఇద్దరూ వేరు వేరు విధాలుగా చెపుతున్నారు.

పైగా ఒకరి పాత్ర నొకరు ఖండిస్తున్నారు. అక్కడితో మనకి తెలిసిన సీనులుపోయి, క్రొత్త సీనులు బయలుదేరుతున్నాయి. చివరికిది కురుక్షేత్ర నాటక పక్కీలోకి వచ్చేలాగా ఉంది సుమా" అని విస్తుపోయారు.

"వీరు ఒకరకం ఇజాన్ని, నాలో మరోరకం ఇజాన్నీ ప్రచారం చేస్తున్నారు. మొత్తం మీద మూల సిద్ధాంతం ఒకటేనంటున్నారు. పైకి ప్రజానీకానికి కనిపించేది మాత్రం ఇద్దరి మధ్య "యాంటాగనిజం" (వైరభావం) అని ఒకాయన వివరించారు.

కొందరు ఇందిరాదేవి భక్తులు ఏది ఏమైనా తాం ఆమెనే బలపరుస్తామని వాగ్దానాలు చేయడమే కాకుండా, ఆమెనే దేవతగా కొలవడం ప్రారంభించారు. కొందరు భక్తులు తమ ఆడ సంతానానికి 'ఇందిరా ప్రియం వద' అనే నామకరణాలు కూడా చేశారట. "ఇండియా అంటే ఇందిరే, 'ఇందిర అంటే ఇండియా' అనే విశ్వాసం చాలామందిలో ప్రబలింది.

ఇదివరలో ఇతర దేశాలవారు "గాంధీజీ ఇండియా" అని "నెహ్రూజీ ఇండియా" అని చెప్పుకునేవారు. ఇప్పుడు మనదేశంలో వారే "ఇందిర ఇండియా" అని సగర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ రోజుల్లో కూడా వెనుకటి మహనీయుల పేర్లతోనే పిలవడం మాని వేయడం కూడా మంచిదే

ఆ వర్గానికి చెందినవారు చాలామంది ఒకరినొకరు కలుసుకున్నప్పుడు "రామ్, రామ్" వగైరాలు మానివేసి "ఇందిర జై" అనడం ప్రారంభించారట. నిజానికి మన ప్రధాని అంతటి పలుకుబడి, సంపాదించిందీనాడు. అసలామె ప్రధాని అనేమాట మాటున పడిపోయి "కాంగ్రెస్ రక్షకురాలు" "దేశరక్షకురాలు" అభ్యుదయమూర్తి" "అవతారమూర్తి" అనే భావనలతోనే పూజింపబడుతోంది. వ్యక్తి గతపూజకాదనుకోండి. ప్రజాభిమానమే అనుకోండి. అందునా ఆ పేరూ ప్రతిష్ఠా సంపాదించడం సామాన్యమా?

అయితే ఇండికేటు నాయకులలో కూడా అధిక ప్రభావం, ప్రాబల్యం గలవారు కొందరు లేకపోలేదు. వారిలో కామరాజు నాడార్ చెప్పుకో తగ్గవారు. ఆయనకు చాలామంది భక్తులున్నారు. వారంతా అహమ్మదాబాద్ కాంగ్రెస్‌కు వచ్చిన 'కామరాజు' బొమ్మలుగల చేతి ఉంగరాలు ధరించి వచ్చినట్లొక వార్త వెలువడింది.

ఇలా ఇరుపక్షాలకూ చెందిన భక్తులు వక్షస్థలాలు చీల్చి చూపడం సాధ్యంకాక తమ ఆరాధ్య దైవాల నమూనాలను ధరించి తమ భక్తి ప్రతిపత్తులను వెల్లడించుకోవడం జరిగిందట.

"పదిమంది తగ్గితే కాంగ్రెస్ ప్రతిభ తగ్గుతుందా?" అని ఒకరంటుంటే "ఒక వ్రేలు పోయినంత మాత్రాన చెయ్యిపోతుందా?" అని మరోపక్షం వారంటున్నారు. ప్రజలు తప్పనిసరిగా ఇరువురి మాట వింటున్నారు. భవిష్యత్తును గురించి అంతు చిక్కని వెర్రి కలలు కంటున్నారు.

"సిండికేట్ ప్రథమ అధ్యక్షుడు మరెవరోకాదు. జవహర్‌లాల్ నెహ్రూ ఆ సంస్థలో ఉన్నందుకు గర్విస్తున్నాను" అన్నారు సంజీవరెడ్డిగారు. దీంట్లో సత్యం లేకపోలేదేమో కానీ ప్రజలు గుర్తింపు సిండికేటు భక్తులుగా చేరాలిగదా తండోపతండాలుగా వచ్చి.

అందుకనే ఒకరన్నారు "సంఖ్యాబలం కాదు మనం చూడవలసింది. అది కావాలంటే పెరుగుతుంది. వద్దంటే తరుగుతుంది" అని కావాలనక ఎవరన్నా వద్దంటారా అందులో రాజకీయాలలో ప్రతినోటు ఒక పరంగా భావిస్తే గాని ప్రభుత్వంలో చోటు ఉండదని తెలుసుగా. నోట్లు లోటు లేకుండా చేసుకోవడం కోసమే అందరి ప్రయత్నాలు. అందరూ రాజకీయ వేత్తలే. ఇందులో ధర్మ ప్రభువులెవరు.

"రాజకీయవేత్తకూ, పరిపాలకులకూ భేదం ఉంది. రాజకీయ వేత్త వచ్చే ఎన్నికల్ని గురించి ఆలోచిస్తాడు. పరిపాలకుడు వచ్చే తరాన్ని గురించి ఆలోచిస్తాడు" అన్నాడు జేమ్స్ ఫ్రీమన్ క్లార్క్.

(3' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ముద్దులు** ఎంత ప్రేమ భూయిష్ఠాలో అంత ప్రమాదకరాలు కూడా. అక్రమమైన చుంబనాలు అతి విషాదకరమై పరిస్థితులకు దారి తీస్తాయని మిల్సు అనే ఆయన ఒక వ్యాసం వ్రాశాడిటీవల. ఆయన వ్రాసిన ఒక సంఘటన వినండి:

పశ్చిమ జర్మనీలో ఆలెన్ అనే పట్టణంలో పదమూడు సంవత్సరాల ఒక బడి కుర్రవాడు అదే వయస్సుగల క్లాస్‌మేట్. లుఫిఎన్ అనే అమ్మాయిని హఠాత్తుగా ముద్దుపెట్టుకున్నాడట. ఆ షాక్‌తో హృదయం ఆగిపోయి అమ్మాయి వెంటనే మరణించింది.

ముద్దు అలా తీసుకోవడం తప్పుడు చర్యగా భావిస్తూ ఉంటారు. జీవితంలో సిగ్గుపడవలసిన విషయంగా తలపోస్తారు. కానీ, కొన్ని కొన్ని సందర్భాలలో అది ప్రాణం కూడా తీస్తుందనే విషయం తెలియచేస్తున్నదీ పై సంఘటన.

బయటివాళ్ళ విషయంలోనేకాదు. దంపతుల విషయంలో కూడా ఒకప్పుడు హఠాత్తుగా పెట్టే ముద్దువల్ల చాలా వ్యయప్రయాసలేర్పడుతాయని మిల్సు మరో ఉదంతం తెలియజేసాడు.

హెన్రీ మూర్ అనే ఆయన సతీ సమేతంగా విమానంలో ప్రయాణం చేస్తున్నాడట అమెరికాలో. భార్యకు ఏం చాదస్తం పుట్టిందో అంత ముసలి భర్తనూ అమాంతంగా ముద్దుపెట్టుకున్నదట. ఆ సమయంలో ఆయ్యన కాక్‌టైల్ ఫలహారం చేస్తున్నాడు. ఒక ముక్క బుగ్గన ఉంది. భార్య హఠాత్తు చర్యవల్ల అది గొంతులోకి పోయి ఎంతో బాధ పెట్టింది.

ఆకాశ మధ్యంలో ఆ పురుష పుంగవుడు గొంతులో బొమిక గ్రుచ్చుకుని గోలపెట్టడం చూసి వైమానికుడు జాలిపడి ఒక చోట విమానాన్ని బలవంతంగా దింపి, హెన్రీ మూర్‌కు చికిత్స చేయించవలసి వచ్చింది. చికిత్స ఖర్చు ఎంత అయిందో తెలియదుగాని వైమానికునికి అలా విమానం దించడం వల్ల పదిహేనువందల గాలన్ల పెట్రోలు నష్టమైంది. ఈ ఘనకార్యానికి కారకురాలైన అతివ మిడిగ్రుడ్లు వేసుకుని అలా నిలబడి ఉందట. పాపం హెన్రీ ఎలాగో బ్రతికి బయట పడ్డాడుట. తర్వాత చెప్పివుంటాడు బహుశః ముందుగా నోటీసు యివ్వకుండా అలాంటి పిచ్చిపనులు చెయ్యవద్దని.

ముద్దులు యుద్ధాలకు కూడా దారి తీసిన సంఘటనలు చాలా ఉన్నాయి. మధ్య ప్రాచ్యానికి చెందిన కథలు "ముద్దుల యుద్ధం" అని ఒక కథవుంది. ఒక ప్రాంతంలో ప్రత్యేకించి స్త్రీలు నివాసమేర్పరచుకుని పురుషులతో సంబంధం లేకుండా కాలం గడుపుతూ ఉంటారు.

ఒకసారి ఒక పురుషుడు ఎలాగో వచ్చి ఆ రాజ్యంలో అడుగుపెడతాడు. అది చూసిన ఆడ పోలీసు అతణ్ణి వెంటనే వెళ్ళిపోవలసిందనీ, లేకపోతే ప్రాణాలు దక్కవని చెబుతుంది. అతగాడు ఒక్క ముద్దు బహుమతి యిస్తే వెళ్ళిపోతానంటాడు. అది గొప్ప నేరం ఆ దేశంలోని రాజ్యాంగం ప్రకారం అతణ్ణి వెంటనే పట్టుకోబోతుంది. కాని, అతడు సరిహద్దు దాటి పారిపోతాడు. ఆ తరువాత అటున్న పురుషులకూ, ఇటున్న స్త్రీలకూ యుద్ధం జరుగుతుంది. పురుషులు స్త్రీలమీద జాలితలచి పెద్ద పెద్ద ఆయుధాలు ఉపయోగించకుండా పళ్ళూ, పూలచెండ్లు విసరడం ప్రారంభిస్తారు. ఆడవాళ్ళు తమవద్ద బాణాలు వగైరా లేకపోవడంవల్ల కోడిగ్రుడ్లు, వెన్నముద్దలు, పిండిముద్దలు విసురుతారు.

ఈ యుద్ధం పదహారు రోజులు జరిగిందనీ, తర్వాత రాజీ జరిగిందనీ, దానిలో స్త్రీలు కోరందే పురుషులు ముద్దు పెడతామని ముందుకు రాకూడదనీ షరతు పెట్టారు. అక్కడితో ముగిసింది.

మూడు శతాబ్దాల క్రితం బవేరియా దేశాన్ని ఫర్డినండ్ అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతగాడు పొరుగుదేశానికి ఆహ్వానింపబడ్డాడు. అతి గొప్పగా స్వాగతమిచ్చారా దేశప్రజలూ, ప్రభువూ.

అయితేనేం బవేరియా రాజు ఒక పిచ్చిపని చేశాడు. అక్కడ ఒక తోటలో పువ్వులు కోస్తున్న అమ్మాయిని చూశాడు. దాసీపిల్ల అనుకున్నాడు. ఆమె అందం చూసి ఫర్డినాండ్ వివశుడై వెంటనే ముద్దుపెట్టుకున్నాడు. ఆమె ప్రియుడు చూశాడు ఆ దుస్సంఘటన.

ఫర్డినాండ్ అనుకున్నట్లు ఆమె దాసీకాదు. ఆ దేశపు రాకుమార్తె. ఇంకేముంది? కొంపమునిగింది. అతడు బవేరియా రాజు భరతం పట్టించడానికి వచ్చాడు. అతడు "పొరపాటున అలా జరిగిందని" ఎంతో మొత్తుకున్నాడు. కానీ, ఇలాంటి సందర్భాల్లో పొరపాట్లకు తావు ఎక్కడ ఉంటుంది?

రాజుకోసం కట్టిన స్వాగత తోరణాలు చించివేశారు. సన్మాన పత్రాలు చించివేశారు. బవేరియా రాజు ఎలాగో బ్రతికి బయటపడి తన దేశానికి పారిపోయాడు. ఉభయ రాజ్యాల మధ్యగల రాజకీయ సంబంధాలు తెంచివేయబడ్డాయి. అక్కడితో ఆగలేదు. రెండు రాజ్యాల మధ్య పెద్ద యుద్ధం ప్రారంభమైంది. ఎంతమందో ప్రాణాలు అర్పించాల్సి వచ్చింది. రాజు చేసిన చిలిపిచేష్టకింత రగడ జరిగింది.

నా చిన్నతనంలో మా ఊర్లో కాపు సుబ్బయ్యగారని ఒకాయన ఉండేవాడు. ఆయన వీధి నాటకాలు వేయిస్తూ ఉండేవాడు. కొన్ని తనే వ్రాసేవాడు. కొన్నిటిని ఇతరులచేత చెప్పి వ్రాయించేవాడు. అలాటివాటిలో కృష్ణలీలలు ఒకటి.

ఆ నాటకం మా ఊళ్ళో చాలాసార్లు వేయించాడు. ప్రజలు పొట్టచెక్కలయ్యేటట్లు నవ్వుకునేవారు. కృష్ణుడికి అతనికంటే పెద్దవాడు, కుంటివాడు అయిన ఒక మిత్రుడుండేవాడు. పైగా అతడు అతి స్థూలకాయుడు. కృష్ణుడు అక్కడక్కడ దొంగతనంగా తినివచ్చి ఆ సంతోషంతో ఆ స్థూలకాయుని చెంపను ముద్దు పెట్టేవాడు. పాప మా మిత్రుడు ఆ పెట్టే ముద్దు తన పెదవులమీద పెట్టమనేవాడు. కొంచెం కమ్మదనం ఉంటుందని. కృష్ణుడు 'ఛీ' అని పారిపోయేవాడు.

మళ్ళీ కృష్ణయ్యకే సలహా కావలసి వచ్చినా ఆ బొండాం మిత్రుని వద్దకే పరుగెత్తుకు వచ్చేవాడు. అతడు ఆరితేరిన వాడులాగా సలహాలు చెప్పేవాడు. కృష్ణుడు అతగాడి తెలివితేటలకి ఎంతో మెచ్చుకునేవాడు. ఒక సీనులో ఆ మిత్రుడు మొక్కజొన్నపొత్తు నములుతూ కూర్చునివుంటాడు. కృష్ణుడు పరుగుపరుగున వచ్చి అతడి దగ్గర కూలబడతాడు. భయంతో వణుకుతున్నట్లు నటిస్తాడు. మిత్రుడు 'ఏమిటి కృష్ణా? ఏమిటి? నువ్వు వణుకుతుంటే నాకూ వణుకు పుడుతోంది' అని పొట్టంతా కదిలేలాగా వణకడం ప్రారంభిస్తాడు.

కృష్ణుడు "నువ్వు వణుకుతావు దేనికిరా తప్పు చేసింది నేనైతే" అంటాడు. చివరకు తను చేసినపని తప్పో, ఒప్పో చెప్పమని మిత్రుణ్ణి అడుగుతాడు. కృష్ణుని వాగ్మూలం ఇదే

"రాధ అత్త పెరట్లో కూర్చుని పూలదండ కడుతోంది. నేను చాటుగా వెళ్ళాను. అల్లరి చెయ్యాలనిపించింది. చెప్పకుండా చెంపను ముద్దాడాను. ఆవిడ వెనక్కు తిరిగి చూసి వోరీ అంది. అక్కడితో పారిపోయి చక్కా వచ్చాను."

మిత్రుడది విని "మరి వోరీ అన్నప్పుడు నవ్వుతూ అందా, గుడ్లల్లో కుంకుడుకాయ రసం పోసినట్లు కోపం తెచ్చుకుని అందా?" అని ప్రశ్నించాడు.

"గుడ్లూ, ముఖం తెల్లగానే ఉన్నాయి. పెదవులమీద చిరునవ్వు కూడా ఉంది" అని కృష్ణుని జవాబు.

ఐఐఐ